

# నేటికాలపు కవిత్వం - తీరుతెన్నులు

తమ్మినేని యదుకుల భూషణ్

83777

CHEKURI RAMA RAO
Rtd PROFESSOR

# నేటికాలపు కవిత్వం - తీరుతెన్నులు

తమ్మినేని యదుకుల భూషణ్

# Neti Kalapu Kavitwam - Theeru Thennulu
*and other essays*

Trends in Contemporary Poetry

Literary Criticism

**By Thammineni Yadukula Bhushan**

C-128372

© Author

**Snow Storm**
**Turner (1775-1851)**

January, 2004

894.82709

**Rs. 65/- $13**

**For Copies:**

*Visalandhra Book House, Bank Street, Hyderabad & other branches.*

*Navodaya Book House, Opp: Aryasamaj Mandir, Kachiguda, Hyd.*

*Prajasakti Book House, Chikkadapalli, Hyderabad & other branches.*

*Vijeta Competitions, Shivam Road, New Nallakunta, Hyderabad-44.*

*BHUSHAN, 14 ASHLEY CT, SOMERSET, NJ-08873, USA*
*thammineni@lycos.com ; telupu.com, USA*

**Composed at**

Vijeta Graphics,

New Nallakunta, Hyderabad

**Printed at**

Kalajyothi Process Ltd.,

RTC X Roads, Hyderabad-20.

A C. No. 83777
హైదరాబాద్-500 044.

అంకితం

# చెట్లు

సూర్యాభిముఖంగానే -
నిర్యాణం చెందేదాకా,
చంద్రుని వెన్నెలంతా మాదే
మంద్రంగా వీచే గాలితో
మౌనంగా సంభాషిస్తాం
వినలేరు మీరెవ్వరూ -
గానమనీ, అవధానమనీ
ప్రాణం మీదికి తెచ్చుకొంటారు

పుడమిలోకి వేళ్ళు తన్ని
తడిమిచూస్తాం, లోతులన్నీ
నిలబడటం చేతగాక-
చలించిపోతారు మీరు!

వికసించిన పూవులతో
ఆకాశాన్ని, అలసిపోక
ప్రకాశించే తారలను,

తాకాలన్న కోరికతో-
శాంతంగా కదులుతాం
చెంత చేరిన ఛాయతో,
ఎంతో దూరం ఎగిరే
వింత పక్షుల గీతంతో.
ఆకాశాన్ని వదిలి
ఏ కిరణం తాకక
ఎద లోపల డొల్ల
ఎదగలేరు మీరు
గంతలు కట్టిన గాడిదల్లా
అంతా చూడలేరు
సంతలో పశువుల్లా
చింతిస్తూ గడిపేస్తారు.

- ఇస్మాయిల్
విస్మయ స్మృతికి

# నేటికాలపు కవిత్వం - తీరు తెన్నులు


| | | | |
|---|---|---|---|
| 1. | సదా బాలకుడు | ... | 1 |
| 2. | కవిత్వ మీమాంస | ... | 6 |
| 3. | నేటికాలపు కవిత్వం - తీరుతెన్నులు | ... | 9 |
| 4. | ఆకులో ఆకునై.. | ... | 18 |
| 5. | రెండు మాటలు | ... | 19 |
| 6. | ఆకురాలుకాలం - మహెజబీన్ కవిత్వం | ... | 21 |
| 7. | హాయిగొలిపే వేసవి వాన | ... | 29 |
| 8. | జయప్రభ - శబ్ద కవిత్వం | ... | 31 |
| 9. | జయప్రభ కవిత్వ విమర్శ - పరిశీలన | ... | 35 |
| 10. | జయప్రభ కవిత్వం - స్పర్శానురాగం | ... | 57 |
| 11. | యోగం - జెన్ - కవిత్వం | ... | 61 |
| 12. | కవిత్వం ఎందుకు చదవాలి? | ... | 64 |
| 13. | కొత్త కవులకు కొన్ని సంగతులు | ... | 69 |
| 14. | విమర్శాదర్శం | ... | 74 |
| 15. | కథనకుతూహలం | ... | 78 |
| 16. | కథ - వాతావరణం | ... | 80 |
| 17. | తొలకరి చినుకులు | ... | 82 |
| 18. | మా సారు | ... | 84 |
| 19. | అనువాదంలో మెలకువలు | ... | 86 |
| 20. | ఉమర్‌ఖయ్యాం - ఉదాహరణలు | ... | 90 |
| 21. | మాటన్నది జ్యోతిర్లింగం | ... | 97 |
| 22. | కొత్తకవులకు కొన్ని సంగతులు-2 | ... | 98 |
| 23. | టర్నరు - నేను | ... | 103 |
| 24. | Hibiscus on the Lake | ... | 108 |
| 25. | అనువాదంలో 'పద్యసమాధి' | ... | 111 |
| 26. | భరించలేని విశ్వంభర | ... | 117 |
| 27. | కవిత్వమంటే... | ... | 125 |
| 28. | అనువాదం - ఆత్మశోధన | ... | 130 |
| 29. | అనుభవాలూ - జ్ఞాపకాలూనూ | ... | 132 |
| 30. | మహాకవి మరణం | ... | 134 |

# సదా బాలకుడు

ఆ రోజులను మరువలేను. లేత ఎండకి, పక్షి అరుపుకి, ప్రియురాలి కళ్లల్లో మెరుపుకి ఏదో సంబంధం ఉందని తెలిసినా అది నిరూపించలేని అమాయకపు మనసు. అప్పటికి నాకు బాగా తెలిసిందల్లా బైరాగి, తిలక్, శ్రీశ్రీ ల కవిత్వం. జ్ఞాపకాల్లో పడి ఉన్న ప్రాచీన కవుల పద్యాల రవ్వలు, వల్లెవేసిన హిందీ కవిత్వం, ఆంగ్లకవిత్వం వాటి అంత్యప్రాసలు, శ్రమించి నేర్చిన అలంకార శాస్త్రాలు, అమరాది నిఘంటు సంచయం, ఆ ప్రభావంలో పడి రాసిన లయబద్ధమైన కవిత్వం, ఎడా పెడా చేసిన అనువాదాలు, అప్పుడప్పుడే వ్యావహారికంలో రాసిన వాల్ట్ విట్‌మన్, A.E. హౌస్‌మన్ లాంటి అమెరికన్ కవుల కవిత్వాలకు కళ్లు తెరుచుకుంటున్న దశ. give me the splendid silent sun with his beams full-dazzling అని విట్‌మన్ ఎంత బాగా అనగలిగాడు అని అబ్బురపడుతూ ఉండేవాణ్ణి. పుస్తకాల్లో కవిత్వమని నమ్మినదానికి, పత్రికల్లో వస్తున్న కవిత్వానికి పొంతన కుదిరేది కాదు. సమానంగా అన్ని పత్రికలు కరెంట్ అఫైర్స్‌నే కవిత్వంగా చలామణిచేస్తున్న రోజులవి. (ఈనాటికీ పరిస్థితిలో మార్పు లేదు, అది వేరే విషయం) ఎప్పుడో స్మైల్ లాంటి కవి పుంగవులు దయతో చేసిన కవిత్వానువాదాలు తప్ప కవిత్వం పథ్యమై కూచుంది చాలా పత్రికలకు. ఈ సంరంభంలో కవిత్వం అంటే ఏమిటి అని ప్రశ్నించి కనులు తెరిపించిన వాడు రష్యన్ కవి బ్రాడ్‌స్కీ. కానీ, అతని కవిత్వాలు మనసుకెక్కలేదు. అన్వేషణలో, చీకటిలో తడుముకుంటున్న రోజులవి.

**2**

ఎప్పటిలా ఆ ఏడాది జనవరిలో విజయవాడలో పుస్తక ప్రదర్శన, పట్టలేనంత సందడిగా నానా పుస్తకాలను కొని తెచ్చుకొన్నా.. ఒక నీలి కవరు పుస్తకం, నిరాడంబరంగా నన్ను ఆకట్టుకొంది. "రాత్రి వచ్చిన రహస్యపు వాన".. నిద్రబోతూ పుస్తకమంతా పూర్తిగా చదివేసి చాలా ఆనందపడ్డాను, కొత్త కవిత్వం- ఇదివరకు ఏ భాషలో చూడనిది కనుల ముందుకు వచ్చింది కదా! అని. ఇంచుమించు నేను ఎంచుకొన్న కవిత్వ మార్గం సరైనదే అన్న సంతోషం నిలువనీక, కవికి ఉత్తరం రాసి పోస్ట్‌చేసి ఆ విషయం మరచిపోయాను సంపూర్ణంగా.

కొన్ని రోజుల తర్వాత ఒక పోస్ట్‌కార్డ్ ఆకుపచ్చ ఇంక్‌తో రాసినది.. తేలుతూ వచ్చి పగటి వానలా ఆశ్చర్యపరిచింది.

"మనం ప్రపంచానికి ఏమిస్తామో దాన్నే వెనక్కు తీసుకుంటాం. మీలో కవిత్వం ఉంది కనకనే, అది నా రచనల్లో ప్రతిఫలించింది." -- ఎంత తాత్విక నిబ్బరం.. "మీ కవితలు పత్రికల్లో వచ్చాయా? పుస్తకం వెయ్యలేదా? కటింగులుంటే పంపించండి"అన్న వాక్యం మరీ ఆశ్చర్యపరిచింది. ఆయనకు

రాసిన ఒక పేజి ఉత్తరంలో ఎక్కడా నా గురించి చెప్పుకోలేదు. ఆ కొత్త కవిత్వాన్ని చూసి నేనుఎంత ఆనందించానో దాన్ని మాత్రం నిజాయితీగా వెల్లడించానంతే. గురువుగారి తత్వప్రజ్ఞ వేళ్లదన్ని ఎంత పాతాళంలో ఉన్న నీటి జాడనైనా అలవోకగా పసిగట్టగలదు.

## 3

వర్తమాన కవిత్వంపట్ల నాకు గల తీవ్ర అసంతృప్తిని తెలుపుతూ.. పత్రికలకు కవితలు పంపడంలో నాకు గల అనాసక్తిని వివరించాను.

"వాదాలనుండి, ఆధ్యాత్మికతలనుండి, పడికట్టు పదాలనుండి free గా ఉండటం మీకిష్టమని రాశారు. ఈ ప్రతిజ్ఞను మీ జీవితంలో ఎప్పుడూ మరవకండి" అని బదులిస్తూ నా అముద్రిత కవితలు మొత్తం పంపమన్నారు. అలాగే చేశాను.

"మీ పద్యాల్లో హైకూ లక్షణాలు వున్నాయి; అంటే అనుభవాన్ని అనుభవంగా అందించే గుణం వుంది" అంటూ తన తీర్పును ప్రకటించి, ఆయన ఎంపిక చేసిన కవితలను పత్రికలకు పంపమని పురమాయించారు. తు.చ తప్పకుండా ఆయన మాటలను ఆచరించాను. ఏమీ కాలేదు. "మీ పద్యాలు పత్రికలు వేసుకోలేదని నిరుత్సాహపడకండి, మొదట్లో నావీ వేసుకోలేదు". నా స్నేహితుడు రహీమ్ ఆయన ఉత్తరాలను చూసి సున్నితంగా స్పందించడం నాకింకా జ్ఞాపకం ఉంది.

ఇస్మాయిల్ గారితో ఆత్మీయ పరిచయమున్న వారికి ఇట్టే అర్థమయ్యేది "తన జూమ్ లెన్స్‌తో ఫోటో తీసే బావిలా" ఆయన ఇతరుల మనసుల్లో ఆవర్తమయ్యే భావాలను ఇట్టే పసిగట్టడం! భుజం తట్టడం. ఒక దశలో "కనులకు గంతలు కట్టి ఏ కాల తీరాన్నో వదిలివేసే నిష్ఠుర కవనమూ వద్దు" అని కవిత్వానికి చెల్లుచీటీ రాద్దామనుకొన్నాను. ఆయన నొచ్చుకొని, "కవిత్వం రాయడం మానకండి! అది అమృతాంజనం లాంటిది. చాలా రకాల తలనొప్పుల్ని నివారిస్తుంది" అని వారించారు. అదే ఉత్తరంలో "ఆశ్చర్యపోయే శక్తిని పోగొట్టుకోకండి. జాగ్రత్తగా కాపాడుకోండి. కవిత్వానికి కరెంటు సృష్టి చేసే డైనమో అది" అని సెలవిచ్చారు. మరోసారి నా అభిప్రాయాలకు ఊతాన్నిస్తూ-

"మీరు సూచించినట్లు కవిత్వమంటే ఒక వస్తువు గురించి మరో వస్తువు తాలూకు పదజాలంతో చెప్పగలగటం మృత్యువు గురించి మృత్యువుకి సంబంధించిన మాటలతోనే చెబితే అది కవిత్వమెలా ఔతుంది?"- "మీరనట్లు భాషకూ భావానికీ సమన్వయం సాధించడమే శిల్పం ఇది చాలామంది ఆధునిక కవులకు చాతకావడం లేదు". తర్వాత తర్వాత నా కవితలు వివిధ పత్రికల్లో వచ్చాయి ఓ మూడు నాలుగేళ్లు, నేను ఎప్పటిలా ప్రవాసం, ఏకాంత జీవితం మీది మక్కువ వల్ల పంపించడం మానుకొన్నాను.

## 4

అప్పటిలో సిద్దార్థ ఇంజనీరింగ్ కాలేజీలో ఇంగ్లీష్ ప్రొఫెసర్ రామచంద్రారావు గారి పుణ్యమా అని మంచి సాహిత్య వాతావరణం నెలకొని ఉండేది. ఆయన కఫ్కా నుండి ఖలీల్ జిబ్రాన్ దాకా ఎన్నో పుస్తకాలు సేకరించి కాలేజీ గ్రంథాలయాన్ని సంపన్నం చేశారు. నేను "సాహితి" అన్న పేరుతో లిటరరీ క్లబ్‌ను నడిపిస్తుండే వాణ్ణి. వంశీ,మధు, పవన్ ఇలా చాలామంది చక్కటి కవితలు రాసుకొచ్చేవారు. వీరందరికీ imagist సంప్రదాయాలు పరిపుష్టంగా తెలుసు. అందరూ ఇస్మాయిల్ గారి లేఖలు ఆసక్తిగా చదివేవారు. అంతేగాక, కవిత్వానికి చాలామంది శ్రోతలు ఉండటం, వారు ఇబ్బంది లేకుండా క్లుప్తంగా ఉన్న కవిత్వాలను అర్థంచేసుకోవడం నాకు చాలా ఆశ్చర్యాన్ని కలిగించేది. వారు ఆనాటి పత్రికల్లో వస్తున్న అంతూ పొంతూ లేని కవిత్వాలని అసహ్యించుకోవడం కూడా నా జ్ఞాపకాల్లో సజీవంగానే ఉంది.

ఈ నవ కవిత్వానికి మానిఫెస్టో లాంటి "కవిత్వంలో నిశ్శబ్దం" ఎన్నో పుస్తకాల దొంతరల నడుమ ఠాగోర్ లైబ్రరీలో చూడటం తటస్థించింది. ఆరోజు ఆ వ్యాసాలను ఎన్నిసార్లు చదివానో నాకే తెలియదు. తేలిక పడిన మనసుతో ఇంజనీరింగ్ కాలేజీ హాస్టల్ ఆలస్యంగా చేరడం నాకు ఇంకా గుర్తుంది.

## 5

ఒక నలభై రోజులు కాకినాడలో ఉన్నాను పనిమీద. తరచూ ఆయన్ను కలుస్తూ ఉండేవాణ్ణి. నా బండిమీద సముద్రం దగ్గరికి, వేసవి తాపం తీరేలా ఊరి చివరికి వెళ్లే వాళ్లం. దీప స్తంభం తిరుగుతూ ఉంటే, మామిడిచెట్లు చీకట్లో మునిగిపోతూ ఉంటే ఆయనను జాగ్రత్తగా ఇంటి దగ్గర దిగబెట్టే వాణ్ణి. పదేళ్లుగా ఆయన పరిచయమైన దగ్గరినుండి ఆయన చాలాసార్లు కవితలను పుస్తకంగా తీసుకురమ్మని చెప్పేవారు. ఎప్పటిలా నాలో ఒకవిధమైన అనాసక్తి, కవిత్వాన్ని అందరికీ చూపించడం పట్ల వైముఖ్యం ఎక్కువగా ఉండేది. వందలసార్లు మననంచేసిన తర్వాత కూడా వాటికి పరిపూర్ణత సిద్ధించిందా లేదా అని మధనపడుతూ ఉండేవాణ్ణి.

ఆయన చాలా కాలం పనిచేసిన పి.ఆర్. కాలేజీకి వెళ్లాం ఒకరోజు. ఆయన కాలేజీతో తనకున్న అనుబంధాన్ని తలచుకొన్నారు. తన కవిత్వం గూర్చి మరుపూరి కోదండరామిరెడ్డి చేసిన వ్యాఖ్యను- 'గోదావరి భాష నుడికారం ఈయన కవిత్వంలో కనిపిస్తుంది'- ఆత్మీయంగా తలచుకొన్నారు. ఇష్టులైన కృష్ణశాస్త్రి, చలాలను గుర్తుచేసుకున్నారు. ఇస్మాయిల్ గారి పాత ఇల్లు ఎంతో భావ గర్భితంగా ఉండేది. ఇంటి ముందు పెద్ద లోగిలితో. అరుగుమీద కూర్చుని మాట్లాడుకునే వారం. నేను నా వెంట కవితలేవీ పట్టుకురాలేదని తెలిసి మందలించారు. అన్నీ తలలో పదిలంగా ఉన్నాయని చెప్పి, ఆ మరుసటి రోజు రాసుకు వెళ్లాను. వాంగో మీద పద్యం బాగా వచ్చిందని చెప్పారు. చిక్కబడుతున్న చీకట్ల మధ్యసెలవు తీసుకొన్నాను.

6

నేను సింగపూర్ వెళ్లాకకూడా, తరచు కాకపోయినా మాటా మంతీ సాగుతుండేవి. సింగపూర్ నుండి వచ్చి వేశాక, ఆయన పుస్తకంగా తెమ్మని చెప్పిన ఒక దశాబ్దం తర్వాత ఆ పనికి పూనుకొన్నాను. ముందు మాట రాసివ్వాలి అని అభ్యర్థించాను. గురువు దగ్గర మహిమలు లేవు అని నవ్వుతూ అన్నారాయన. ఐతే నేను పుస్తకం వేయను అన్నాను. చివరికి ఎంతో వాత్సల్యంతో "భూషణీయం" అన్న ముందు మాటను సంతరించి పెట్టారు, ముత్యాల్లాంటి అక్షరాలతో!

అమెరికా వచ్చాక, అధ్వాన్నంగా పరిణమించిన అమెరికన్ కవిత్వాన్ని చదివి అవాక్కైపోయాను. అనువాదాల్లో తప్ప గొప్ప కవిత్వం లేదు. రాసిన వాళ్లు ఎక్కువ రాశారు. మనకు అవసరం గాని చెత్తంతా రాశారు. నిజాయితీగా రాసిన ట్రంబుల్‌స్టిక్నీ ప్రభృతులను తలచుకొనే వారే కరవయ్యారు. విట్‌మన్, ఎడ్గార్ ఎలాన్ పోల వారసత్వమింతేనా అనిపించింది. ఇస్మాయిల్‌గారి కవిత్వ విలువ ఇంకా బాగా తెలిసి వచ్చింది. రాసిన ప్రతి కవితా శిల్పంలా చెక్కగల గ్రీకు కవి కవాఫి, అర్జంటీనా కవి బోర్హెస్‌ను మినహాయిస్తే, ఇస్మాయిల్ అంత హాయిగా రాసేవారు ప్రపంచ కవితా చిత్రపటం మీద నాకెవరూ కనిపించలేదు.

7

ఆయనలో చేతనా సౌకుమార్యం (sensibility) అపారం. నా పుస్తకానికి నేను పెట్టదలచుకున్న పేర్లు ఆయనకు వినిపించాను. "కాల శిల్పం" అనగానే పెదవి విరిచారు, vague, abstract అంటూ. "తప్పక వస్తాను" అంటే సినిమా టైటిల్‌లా ఉందన్నారు. "చేవ్రాలు చేయలేను" అంత బాగా లేదన్నారు. చివరికి పేరుపెట్టే బాధ్యత ఆయనకే అప్పగించాను. నన్ను కవితల పేర్లన్నీ చదువుతూ వెళ్లమన్నారు. "నిశ్శబ్దంలో నీ నవ్వులు" అని చదవగానే- ఈ పేరు పెట్టెయ్ అన్నారు. ఆయన ఎంపిక నాకు చాలా ఆశ్చర్యం కలిగించింది. కారణం ఆ కవిత రాసినప్పుడు నాకు పట్టుమని పద్దెనిమిది సంవత్సరాలు! ఏదో తెలియని వియోగానికి, ఏకాంతానికి లోనయి, పైన చెప్పిన అన్ని ప్రభావాలు, పాత వాసనలు వదిలించుకొని సొంత గొంతుతో రాసిన తొలి కవిత ఇది. యవ్వనం తొలినాళ్ల తాజాదనాన్ని ఆయన ఆంటెన్నాలా గ్రహించారు.

సకల భాషల్లో వచ్చిన సకల కవిత్వాలను చదివాక నాకు అనిపించేది ఏమంటే ప్రపంచంలో ఆయన స్థాయికి చేరుకొన్న కవులు బహుకొద్దిమంది. హృదయాన్ని కబళించని తాత్వికత, సూక్ష్మ కవిత్వావగాహన దీనికి కారణం అని తోస్తుంది.

## 8

చాలామంది పాశ్చాత్య కవుల్లో అగుపించే అసంబద్ధత, ఉద్వేగాల మీద అదుపు కోల్పోవడం ఈయన కవితల్లో కలికానికి కూడా కనిపించవు. ఈయన కవిత్వంలో హాస్యప్రియత్వంకూడా పరిశోధక విద్యార్థులు సీరియస్‌గా పట్టించుకోవలసిన అంశం. కవిత్వ విమర్శలో ఆయన లేవనెత్తిన అంశాలు చాలా సూక్ష్మమైనవి. బషో లాంటి జపనీయ కవుల్లో భాష పట్ల అంతటి వివేచనను గమనించగలం. ప్రతి జీవితానుభవాన్ని సహజంగా కవిత్వంగా మార్చే తూర్పు ఐరోపా కవి హోలబ్ ప్రతిభ, కవితా నిర్మాణంలో కవాఫిలో కనిపించే శిల్ప మర్యాద, స్పానిష్ కవి బోర్హెస్ కవితాభివ్యక్తిలోని పారదర్శకత అన్నీ ఒకచోట కనిపించడం సృష్టి విచిత్రం. నాటకరంగంలో ఎందరో లేని లోటును తీర్చినవాడు గురజాడ; కవిత్వంలో ఆ పనిచేసి చూపించిన సదా బాలకుడు ఇస్మాయిల్.

స్మైల్‌కు...

# కవిత్వ మీమాంస

గద్యపద్యాల మధ్య విభజన రేఖ గతానుగతికంగా గజిబిజిగానే ఉంది. పద్యరూపంలో వెలువడినదంతా కవిత్వమేనా? కాదు అనే గట్టి సమాధానం దానికి నిదర్శనగా ఇంట్లో బూజు పట్టిన పుస్తకం (1930ల్లో ప్రకటితం), మనసులో మెదలుతుంది! అది విషకేసరి అన్న detective, మొత్తం పద్యాలతో నిండి ఉంటుంది. అందులో కవిత్వమన్నది కాగడా వేసి చూసినా, దుర్భిణి పెట్టి పరిశీలించినా మచ్చుకైనా కనిపించదు. రచయిత ఉద్దేశంలో కూడా అది కవిత్వం కాదు, అపరాధ పరిశోధక నవలే కాబట్టి మనకు సమస్యలేదు. మబ్బులు, మెరుపులు, చంద్రుని చుట్టూ గుడి కట్టడం ఇత్యాది వాతావరణ అంశాలు ప్రస్తావించే రెట్టమత శాస్త్రం, నానా గణిత సమస్యలను విపులీకరించే పావులూరి మల్లన గణిత సార సంగ్రహం, "టాటోటు, టకటొంకు, రవళికాడు" అని దొంగలకు కూడా పర్యాయపదాలు చెప్పే పైడిపాటి లక్ష్మణ కవి ఆంధ్రనామ సంగ్రహం, పద్యాత్మకమేనయినా, అందులో కవిత్వాన్ని వెదకడం, చీకటి గదిలో లేని నల్లపిల్లిని వెదకడం రెండూ ఒకటే. గ్రంథకర్తలు వాటిని కవిత్వాలుగా ఎక్కడా పేర్కొనలేదు కాబట్టి గొడవ లేదు.చరిత్రలో వాటి ఘనతకు వచ్చిన లోపం లేదు.

ఛందోబద్ధంగా ఉన్నంత మాత్రాన కవిత్వం కాదు అని చెప్పడానికే ఇదంతా! ఖద్దరు కట్టిన ప్రతివాడూ గాంధేయవాది కానట్టు, పద్యరూపంలో వెలువడ్డ అసంఖ్యాక రచనలు (శాస్త్రాలు, నిఘంటువులు) కవిత్వం కాదు. పద్యరూపంలో ఊదిన ప్రతీది కవిత్వం కానేరదు, ఏ భాషలోనైనా సరే! పద్యం కేవలం వాహిక, పాత్ర, లేదా చషకం. అందులోని ద్రవం మధువే కానక్కర్లేదు, ఉట్టి మంచినీళ్లు కావచ్చు. ప్రతీది పద్యరూపంలో పెట్టడం ఆనాటి అలవాటు, మౌఖిక సంప్రదాయానికి సంబంధించినది. ఈనాడు కంప్యూటర్, మిక్సీ ఎలా వాడాలోతెలిపే పుస్తకం ఎవరైనా పద్యరూపంలో పెడితే జడుసుకుంటాం.

## 2

ఇక గద్యం సంగతి. పద్యం కేవలం వాహిక ఐనప్పుడు ఇక గద్యం ఎక్కడ తలదాచుకొంటుంది? గద్యాత్మకమైతే కవిత్వమవుతుందా? వచనమే కవిత్వమా? ముమ్మాటికీ కాదనే సమాధానం. 'గద్యంనికషం కవీనాం వదంతి" అన్న ఉక్తి మనకు ఉండనే ఉంది. చలామణిలో ఉన్న ఛందస్సులను కాదని, స్వతంత్రంగా నడక నేర్చి, కొత్త పోకడలు పోయే కవుల గూర్చే ఆ అభిభాషణ. గద్యాన్ని పద్యంగా మార్చేది ఛందస్సు. అంతవరకే దానిపని. పేచీలేదు. ఛందస్సులో ఎక్కడా పద్యాన్ని కవిత్వంగా మార్చే పూచీ లేదు. "తెలుసుకొన్న జ్ఞానికి గంగంతా సారాయే ఐనట్టు", పద్యమంతా గద్యమే, అటుదిటు కూడా. భూమ్యాకర్షణ వదిలించి, శూన్యావరణంలోకి విసిరేయడం వరకే ఛందస్సు

పని. పద్యాన్ని కవిత్వ కక్ష్యలో ప్రవేశపెట్టడం దాని చేతుల్లో లేదు. సారాంశం ఏమంటే గద్యంనడుస్తుంది, పద్యం ఎగురుతుంది. పోతే ఎగిరేదంతా కవిత్వం కాదు విమానం పక్షి కాలేనట్టే. (కారణం అది నిర్జీవం కావడమే.)

మరి వచనమేమిటి? పద్యమేమిటి? వంధ్యమూ, వక్రమూ అయిన వచన పద్యం ఏమిటి? దాని జ్యేష్ఠ భ్రాత వచన కవిత్వం ఏమిటి? భూమి చుట్టూ సూర్యుడు తిరుగుతున్నాడు అనుకోవడం వెనుక ఉన్న అమాయకత్వానికి ఇదేమి తీసిపోదు.

Verselibre వచన కవిత్వం కాదు, దాని ముక్కస్య ముక్క అనువాదం "ముక్త కవిత" అంతకన్నా కాదు. పాత వాసనలు వదిలేసి, అవశేషాలను పాతేసి, సరళంగా కవిత, కవిత్వం అని పిలుచుకోవడం సులువు, సబబు కూడా. వచనం వచనమే, కవిత్వమెలా అవుతుంది. కింద పడి పల్టీ అన్నాడట వెనుకటి వాడెవడో!! చూస్తుంటే అలా ఉంది మన వ్యవహారం! కాబట్టి వచన కవిత్వమన్న సంకర జాతి వంగడం అవసరం మనకులేదు. నేలమీద తిరిగే జంతువు లాంటి వచనాన్ని, నింగిలో ఎగిరే పక్షి లాంటి కవిత్వాన్ని, కలిపేందుకు పరిణామక్రమంలో అంతరించిపోయిన Archeo T Rex లాంటి వచన కవిత్వం అవసరం మనకు లేదు prose ను వచనంగా, poetry ని కవిత్వంగా వ్యవహరించుకోవడమే హాయి. పద్యగద్యాలతో "చంపూ" కోకుండా!

గద్యమూ కవిత్వం కాక, పద్యమూ కవిత్వంకాక, మరేమిటి కవిత్వం? కవిత్వమన్న బ్రహ్మపదార్థ నిరూపణకు నేతివాదమే నేటి వాదమా? అది అనుభవైక వేద్యం. "నవా అరె జాయై కామాయ జాయా ప్రియా భవతి, ఆత్మనస్తు కామాయ జాయా ప్రియా భవతి"; ఆత్మవల్లే భార్య ప్రియంగా కనిపిస్తుంది, మరొక దానివల్ల కాదు, అన్న ఉపనిషద్ వాక్యం ఇక్కడ అక్కరకు వస్తుంది. కవిత్వం ఆత్మ! దానివల్లే కృతి శోభాయమానమవుతుంది!! ఇతరేతరాల వల్ల కాదు. దాన్నిపరిగణనలోకి తీసుకోని రూప చర్చ అంతా వృథా. పునరావృతమయే జీవితానుభవాలు కవితలుగా మారతాయి అంటాడు ఒక కవి. కవి మరచిపోలేనివి, మళ్లీ మళ్లీ ఏకాంతంలో తలచుకొనేవి, భాషలోని జవజీవాలను నింపుకొని, ఛందోబద్ధంగా, లయాన్వితంగా వెలువడతాయి!

వాటికి ఒక తక్షణ ప్రయోజనం కూడా ఉంది. రాసినవాడికి సాంత్వన చేకూర్చడం. ఆ అనుభవం విశ్వజనీనం కావడం, కేవలం యాదృచ్ఛికం. తమ ఆనందం కోసం సంసారంచేస్తే ముచ్చట గొలిపే పిల్లలు పుట్టుకొచ్చినట్లు.! జీవితమే ఒక పెద్ద paradox! కవి శోకిస్తూ రాసినదాన్ని చదివి జనం ఆనందించడం ఈ కోవలోనే వస్తుంది. జనాల చప్పట్లు కవన్న వాడికి అవసరం లేదు. వాడిలో ఊపిరి తీసుకొనే జగత్తు, ఊహలూ, ఉల్లంఘనలూ, ఎందరు ఆచూకీ తీసినా అంత తేలికగా అందేవికావు.

కొందరి కవితలు ఎక్కువ లయబద్ధంగా ఉండటానికి ఏమైనా కారణాలు ఉన్నాయా? అలా రాయడం వారికి స్వాభావికం కావచ్చు (ఉదా: శ్రీశ్రీ, బైరాగి); వారిలోని భావతీవ్రత వారిని అలా పురిగొల్పి ఉండవచ్చు. కొందరి కవితలు కోమలంగా ఉండటానికి ఇవే కారణాలు కావచ్చు. (ఉదా: కృష్ణశాస్త్రి, ఇస్మాయిల్)

ఒక్కొక్క సారి ప్రేరణ బయటినుండి కూడా రావచ్చు. పేరుపొందిన రష్యన్ కవులందరూ (బ్రాడ్ స్కీ, అఖ్మతోవా, మెండెల్‌స్టామ్) కవితా రచనలో చాలా జాగ్రత్తలు తీసుకొనేవారు. కారణం ప్రచురించబడితే ప్రభుత్వంతో తలనొప్పులు, కాబట్టి ప్రచురణ కాకముందే, ఎందరికో వారి కవితలు కంఠతా వచ్చేసేవి. ముఖ్యంగా మెండెల్‌స్టామ్ మరణానంతరం అతని భార్య, మననం చేసుకుంటూ నిలిపిన కవితలే ఇవాళ మన ముందు పుస్తకరూపంలోఉన్నాయి. అమెరికన్ కవులు- విట్మాన్, ఫ్రాస్ట్, కార్లోస్ విలియమ్స్ తదితరులు కొన్ని సడలింపులతో శ్రావ్యమైన కవిత్వం రాశారు. భాష విషయంలో ఫ్రెంచి **symbolist** కవుల పట్టుదల అందరికీ తెలిసిందే. రింబా, మల్లార్మే, వెరలైన్ అందరూ అచ్చమైన కవిత్వం కోసం తపించినవారే. ఇందులో వారు ప్రదర్శించిన అతి తర్వాతి కవులను దారి తప్పేలా చేసింది. ఆడెన్ కూడా ఎంతో శ్రద్ధ చూపేవాడు.

## 3

పోతే ఎన్నోరకాల కవిత్వాలు. స్మృతి కవిత్వాలు, అంటే గతాన్ని పునాదిగా చేసుకొని బయల్దేరేవి. ప్రసిద్ధ అమెరికన్ కవి Billy Collins, స్మృతి కవిత్వం మీద పెద్ద గ్రంథమే రాశాడు. మా తాతగారి భోషాణం పెట్టె: స్మృతి కవిత్వం పరిమితులు, అన్న వ్యాసంలో- "కవిత్వ చోదకశక్తి కల్పన; అది కరవైతే గతాన్ని అంటిపెట్టుకొని ఊహాకాశాల్లో రెక్కలు విప్పలేదు కవితా విహంగం!" అంటాడు. చరిత్రకారుడికి, జర్నలిస్టుకు, కవికి తేడా ఉంది. కల్పన లేనిదే కవిత్వం లేదు. ఉన్నది ఉన్నట్లు చూపేది చరిత్ర. జరిగినది జరిగినట్టు రాసేది జర్నలిజం. కవిత్వాన్ని గతం చుట్టూ తిప్పే గానుగెద్దులా మార్చరాదు. 'నేటి'తో ప్రమేయం లేని కవిత్వానికి ఊపిరాడదు! గింజుకుంటుంది. గతం కారాగారం. చెర కవిత్వానికి హాని చేస్తుంది, బొత్తిగా పనికి రాదు. స్మృతి కవిత్వం పేరిట గతమనే ద్వీపాంతరవాసంలో నెట్టివేయరాదు. వర్తమానం మీద దృష్టి పోగొట్టుకోరాదు. కాబట్టి స్మృతి కవిత్వం రాయడం కన్నా, చక్కని వచనంలో, స్మృతులు నెమరువేసుకోవడం చాలా సులువు.

చెట్లను, మిద్దెలను, టెలిఫోన్ స్తంభాలను క్షణకాలంలో వెనక్కి తోసివేస్తూ, గత వర్తమానాల మధ్య పరిగెత్తే రైలు స్మృతి కవిత్వం.

కొండచరియ విరిగి రోడ్డున పడ్డట్టు గతం వచ్చి వర్తమానాన్ని ఢీకొనాలి. ఎంత చేసినా స్మృతి కవిత్వం నిఖార్సైన కవిత్వం కావడం చాలా కష్టం. కావున అందులో "తరు చాపం వీడిపోయి గురి మరచిన బాణంలా తిరుగాడే పిట్టలు" (ఇస్మాయిల్, చెట్టు నా ఆదర్శం), "పసుప్పచ్చ కళ్లలో రాత్రి తాలూకు నాణేలు దాచుకొనే పిల్లులు" (నెరుడా, Ode to the cat)' కనిపించకపోవచ్చు.

9

# నేటి కాలపు కవిత్వం - తీరు తెన్నులు

'ఈ మాట' సంపాదకులు నేటి కవిత్వం గూర్చి రాయమని ఒకసారి సూచించారు. ఇండియా నుండి స్నేహితుడు వస్తుంటే, విశాలాంధ్రలో కనిపించిన ప్రతి కవిత్వ పుస్తకాన్ని పట్టుకురమ్మని కబురంపాను. ఓ పది పుస్తకాలు- మన తెలుగులో కవితా వ్యవసాయం బలంగానే జరుగుతుంది అనడానికి నిదర్శనంగా నా బల్లమీద ఆకలిగొన్న నసీరుద్దీన్‌గాడిదలా వేగంగా చదవడం మొదలెట్టాను.

మన కవులకు ఒక జబ్బు ఉంది. పగటి వేషగాళ్లలా రోజుకో వేషం వేయడం. జర్నలిస్టు, రచయిత, చరిత్రకారుడు, వేదాంతి/తాత్వికుడు - ఇలా అన్నీతానై అసలు తానెవరో మరచిపోతాడు. ఇక అక్కడినుండి సమస్య మొదలవుతుంది.

జరిగింది జరిగినట్టు చెప్పేవాడు జర్నలిస్టు. వాడికి యథాతథ కథనం ముఖ్యం. సాఫీగా, తాపీగా వచనం రాసేవాడు రచయిత. ఇందులో ఆలోచన ప్రధానం. గతాన్ని నానా ఆధారాలనుండి సంగ్రహించి ప్రదర్శించేవాడు చరిత్రకారుడు. వీడికి యథార్ధ దృష్టి ప్రాణం. అదిలేనిదే క్షణం మనలేడు. చివరిగా మిగిలిన వాడు వేదాంతి/తాత్వికుడు. చరాచర జగత్తును ఒక్క సూత్రంతో బంధించగలగడం వీడి ప్రత్యేకత. సదసద్వివేచన వీడికి ఆత్మ. చివరి వ్యాపకాలు అందరూ చేపట్టగలిగేవి కావు. అందరికీ అందుబాటులో ఉన్నవి, మిగిలిన తేలిక వేషాలు రెండు- జర్నలిస్టు, రచయిత. కవి వీరందరికన్నా ఏ రకంగా భిన్నుడు?

స్ఫటికానికి, గులకరాయికి ఉన్నంత తేడా ఉంది కవికి, ఇతరులకు. కవి భాష వేరు. అతను రూపు కట్టించే భావం వేరు. అతని పరంపరే వేరు. అందుకే మనం కవిత్వానికి అంత విలువ ఇచ్చుకుంటాము. నేను పేర్కొనని వేషం ఇంకొకటుంది. రాజకీయవాది/ఉద్యమకారుడు. కవిత్వాన్ని అధ్వాన్నపు ఎడారిలో వదిలేసి రాజకీయాన్ని/ఉద్యమాన్ని తలకెత్తుకోవడం వీడి పని. కవి వేయగల అన్ని వేషాల్లో అధమ వేషం ఇదే.

తెలుగు సాహిత్య వాతావరణాన్ని రాజకీయం ఎంత దిగజార్చిందో చెప్పడానికి మాటలు చాలవు. గతంలో మార్క్సిస్టులు సాహిత్యాన్ని చరిత్రకు కట్టుబానిసగా చేశారు. దానికన్నా హీనమైన పాపం కవిత్వ వటపత్ర ఛాయను వదిలేసి నానా రాజకీయ ఉద్యమ ఛత్రాలకింద, తమకంటూ సొంత అస్తిత్వం లేకుండా కవులు తలదాచుకోవాల్సి రావడం.

ఇక్బాల్ చంద్ అలవోకగా మంచి కవిత్వాన్ని రాశాడు. ఐతే సంకలనం పేరు "ఆరో వర్ణం". మళ్లీ అక్కరకు రాని రాజకీయ వాసన. పుస్తకంలో విస్తరించిన దట్టమైన కవిత్వానికి, "ఆరోవర్ణం" కవితలో వ్యక్తమైన అస్తిత్వానికి ఏమాత్రం సంబంధం లేదు. అతని కవితాత్మను అది ప్రతిబింబించడం లేదు.

ఇంత చక్కటి కవి తన సంకలనానికి అటువంటి పేరు ఎన్నుకోవడానికి కారణం? మన తెలుగులో భోపాల్ విషవాయువులా వ్యాపిస్తున్న రాజకీయ కాలుష్యం!

ఇకపోతే, ఇక్బాల్ చంద్ కవిత్వంలో అంతుపట్టని సంఘర్షణ, 'ఆత్మలోకంలో దివాలా', అన్వేషణ, వడపోతా, అరుదుగా ఆశా, అశాంతి అన్నీ ముప్పిరిగొని కనిపిస్తాయి. ఇతనిలో నన్నాకర్షించినది నిరాడంబర శైలి. అక్కడక్కడ పద్యకవుల్లో కనిపించే 'నిర్గమ్య' భాషాలౌల్యం, అసమతౌల్యం కొంచెం కుదిపినా, ఇటీవలి కాలంలో వచ్చిన కవిత్వంలో నిస్సందేహంగా ఇతనిది సొంత గొంతుక. అరుదైన అంతరంగ మధనం, నిజాయితీ నిలువెల్లా ఉన్నకవి. 'తళుకు బెళుకు రాళ్లు తట్టెడేల, నిక్కమయిన నీలమొక్కటి చాలు' అన్నట్టు ఇతనిదొక కవిత మచ్చుకి.

**దీపకాంతి**

*కనుచూపు మేరలో దీపకాంతి*

*బ్రతకడానికి ఒక నమ్మకం దొరికింది*

*సుదీర్ఘ జ్వరకాలం*

*పథ్యం తర్వాత ఆకలిలా-*

*ఒక విశ్వాసం భవిష్యత్తు పుష్పించింది.*

'మల్టీ నేషనల్ ముద్దు' కవయిత్రి కొండేపూడి నిర్మల ఫెమినిస్టుగా లబ్ధ ప్రతిష్టులు. ముప్పైకి పైగా కవితలున్న ఈ సంకలనంలో బలమైన కవితాంశ గల కవితలుగా నేను ఎంపిక చేయగలిగినది నాలుగే. (Seasonal love, పురుగులందు పుణ్య పురుగులు వేరయా, మేల్ వార్డ్ నెం.2, అలలెప్పుడూ తీరం మీదనే). ఇంకో ఐదు కవితలు (జాడ, పంటి బిగువున, చావుడప్పు, ఊపిరాడడం లేదు, హోమ్‌సిక్) ఫర్వాలేదనిపించినా, అనవసర కవిత్వేతర అంశాలు దూరి, కవిత్వాన్ని ఈనగాచి నక్కలపాలు చేశాయి. దీనికి కారణం తనలో కవికన్నా జర్నలిస్టు, రచయిత, రాజకీయవాది/ఉద్యమకారుడు బలపడటమే. క్లుప్తతను విస్మరిస్తే ఎలా? చైనా గోడలా అంతూ పొంతూ లేని భావావేశాలు ఇబ్బంది కలిగిస్తాయి. పేర్కొన్న కవితల్లో NRI ల శుష్క జీవితం, అసహాయ స్త్రీల వేదన, frigidity, గృహిణిగా స్త్రీ అంతరంగం- వ్యక్తంచేయడంలో కసి, వ్యంగ్యం ఇట్టే ఆకట్టుకొంటాయి.

**Seasonal love**

*అనువదిస్తే తప్పు*

*నా కల నీకర్థం కాదు*

*దుబాసి కావాలి*

*ఫ్రెంచి ముద్దే తప్ప*

*పెదవి మీది నిట్టూర్పు నీకర్థం కాదు*

*రెండు దేశాలు కరుణిస్తే తప్ప*

*తల్లి చావుకు రాలేని పరాధీనం పెళ్లికొడకా*

*ఐ వుడ్ లైక్ టు మిస్ యు!*

ఇంకో సంకలనం బైరెడ్డి కృష్ణారెడ్డి- "ఆర్తి". ఎక్కడో తప్ప కవిత్వ ఛాయలు కనిపించవు. ('నడిసంద్రపు అగాధాల బాహువులై' లాంటివి) కలగా పులగపు భావజాలం. కాపీ పుస్తకాల్లో వాక్యాలు. తెలుగు వ్యావహారికమే సరిగా రాయడం చేతగాకపోతే, కవిత్వం దాకా ఎందుకు?

**'ఒక వెళ్లిపోతాను'**- ఎమ్ఎస్ నాయుడు. 'మో' మార్కు కవి అని ఒక్క మాటలో తేల్చేయడం సబబుకాదు. 'కలల పాతాళం లోకి వెళ్లే గబ్బిలం', 'గోళ్లు గిల్లుకొనే పౌరుషాల్లో కుక్కకన్ను కోపాలు' , 'గేదెనీడ మనసుతో చేతులు కట్టుకొన్న ముఖంతో' ప్రత్యక్షమవుతాడు కవి. ఇతని ఊహా వైచిత్రికి పెదాల మీద నవ్వు మెరిపించేంత ఝటితిస్ఫూర్తి ఉంది. ఐతే అధివాస్తవికులకు నాదో ప్రశ్న- కవిత్వమంటే అంతేనా?

రమణజీవి **'నలుగురు పాండవులు'** లో కూడా అధివాస్తవిక వాసనలే తొంగిచూస్తాయి. రమణ కవిత్వం సజల గంధకికామ్లము (dilute Sulphuric acid) ఐతే నాయుడిది గాఢము. వీరిద్దరిలో ఇంకో సమాన గుణం సంకోచాలు (inhibitions) వదిలేసి రాయడం. చెప్పేదేదో క్లుప్తంగా చెప్పడం. కానీ ఎవరి ఊహా వైచిత్రి, కవితా నిర్మాణం వారిదే. వీరిద్దరూ గుర్తు పెట్టుకోవలసింది ఏమంటే, కవిత్వం చాలా 'organized acitivity', కావున అనియంత్రిత భావాల సమాహారమే కవిత్వం కానేరదు. అయోమయం ఇద్దరి కవిత్వాల్లో చోటుచేసుకున్నా, వీటి కేంద్రాలు వేరు. రమణలో నాయుడి తరహా నిర్మాణ జటిలత లేదు, మరి అయోమయ కేంద్రం ఎక్కడుంది. అనుభవాలను కాకుండా, వైయక్తిక ఊహా చమత్కారాన్ని ప్రవేశపెట్టడంలో ఉంది చిక్కంతా. అధివాస్తవిక దృష్టి నీలో కొత్త ద్వారాలను తెరవాలి!! ఆ దాఖలాలు ఏమీ కనిపించవు ముఖ్యంగా "నలుగురు పాండవులు" అన్న టైటిల్ కవితలో. పుస్తకం మూశాక మనకంటూ ఏ అనుభూతి మిగలకపోవడం ఎంత విచారకరం!! ఇతనిదో కవిత.

**"నాకు తెలిసినంత వరకు"**

*నాకు తెలిసినంత వరకు*

*రాత్రి నిలువుగా ఉంటుంది*

*పగలు త్రిభుజంగా ఉంటుంది*

*రోడ్డు గుండ్రంగా ఉంటుంది*

*భూమి బల్లపరుపుగా ఉంటుంది*

*నువ్వు సరళరేఖలా ఉంటావు*

*నీ మీదేగా నన్ను ఆరేసుకొనేది.*

"ఆమె నా బొమ్మ"లో అయిల సైదాచారి కవిత్వం obsessive గా స్త్రీ చుట్టూ పరిభ్రమిస్తుంది. అడపా దడపా తన నాయనను, వృత్తిని తలచుకొన్నా. స్త్రీ కేంద్రంగా వ్యక్తమయ్యే అనుభవం, బలం, బలహీనత, ఇంద్రియక సమ్మోహం అన్నీ కానవస్తాయి. ఇతని కవిత inhibitions తీసి అవతల పెట్టింది.

**Liberated Woman** *ని స్వప్నిస్తూ*

*వివాహితుడైన కవి*

*ఆమె రక్త సరస్సులో రెక్క విప్పుకొన్న పావురాయి*

*నా భుజమ్మీద వాలుతుంది.*

*ఆమె కళ్ల ఇంద్రనీలాల్ని ముక్కున కరచుకొని.*

*సొంతంగా ఏమీ మిగలని అమూర్త అస్తిత్వం నేను*

*ఎవరి సొంతం కాని విముక్త సౌందర్యం ఆమె.*

*ఆమె నా మోహాన్వేషణ మజిలీ.*

శ్రీధర్‌బాబు - అనేక వచనం పక్కదారులు తొక్కకుండా సూటిగా ప్రవహించే కాలువలా మనసును తాకుతుంది. 'తాడి చెట్ల మధ్య ప్రత్యూష నక్షత్రాలను పట్టుకు వేలాడే' భావుకుడు. ఇతని కవితా దృష్టి ప్రసరించిన మేరకు ప్రకృతి వింతకాంతులతో గోచరిస్తుంది, ఈతని ఏకాంతపు తీక్షతకు లోబడి. తిలక్ తరహా భావుకత్వం దర్శనమిచ్చినా, శైలి మాత్రం అతనికన్నా నిరలంకారం. కానీ అది లోపం కాదు. ఇతని హైకూలు కూడా సారవంతమైనవే! మచ్చుకి ఓ రెండు

*తల్లి ఒడిలో*

*ముద్దొచ్చే కవల పిల్లలు*

*ఒకరికొకరు అద్దం*

*చెదిరిన ముంగురుల్ని*

*తనే సవరించుకొంది*

*నాకెందుకో బాధ*

**వేడన్ తాంగల్ అన్న అందమైన కవితలో**

*రకరకాల రంగురంగుల పక్షులు*

*ఆకు పచ్చగా పరచుకొన్న చెట్లన్నీ*

*హృదయాల్ని ఆరబోసుకొన్నట్టు...*

*నేనొక్కడినే అందరిలో ఒంటరిగా*

*కాసేపటికి ఆ ఒక్కడు జాడలేడు.*

ముకుందరామారావు గారి **"మరో మజిలీకి ముందు"** చాలా నిరాడంబరంగా, సాంధ్య తారలా సున్నితంగా ఆకట్టుకొంటుంది. తన చుట్టూ ఉన్న ప్రపంచం, పూలు, వర్షం, ఆకాశం, సంబంధ బాంధవ్యాలు- అన్నీ ఒద్దికగా ఒకచోట నిలిచి చేర బిలుస్తాయి. అనుభవజ్ఞుడైన గృహస్థులా ఈయన దేన్నీ దుబారా చేయడు. మాటలు, భావాలు, పదచిత్రాలు అన్నీ సరిగ్గా అమరుతాయి. తనకు తెలిసిన ప్రపంచాన్ని మనముందు దృశ్యమానం చేస్తాడు.

**ఏకాంత వేళ**

*గతాగతాలు*

*ఊహాతీత ఉదయాలు*

*ఆలోచనంతా పాకిన*

*అల్లకల్లోల ప్రశాంతం*

*దినాంతపు ఏకాంతం చీకటి.*

**వెంటాడే కలాలు** (వెనుకబడిన కులాలు) దీని వెనుక ఓ ఇరవై ముగ్గురు ఉన్నారు. రెండువందల పుటల మేరా విస్తరించి. పరిశీలనకు ముందుగా-

## కవిత్వమంటే ఏమిటి??

అభిప్రాయాలు వెల్లడించడం కాదు.

రాజకీయాలు తలకెత్తుకోవడం కాదు.

తాత్త్విక వాక్యాలను పేర్చడం కాదు.

కేవల వైయక్తిక వేదనను వెళ్ళగ్రక్కడం కాదు.

అర్థంకాని సిద్ధాంతకబళాన్ని వెదజల్లడం కాదు.

భాషాడంబరం కాదు, భావ తిమిరం అసలు కాదు

మరేది కవిత్వం??

సంక్షుభిత హృదయాకాశంలో అరుదుగా మిరుమిట్లు గొలిపే మెరుపుతీగ. దానికి శుష్క తర్క ప్రజ్ఞ అవసరం లేదు. తాత్త్విక చర్చలతోపనిలేదు. దాని జాడ సోకినంత మేర బుద్ధి జనిత జాడ్యాలు తేరిపార చూడలేవు. మన్నూ మిన్నూ ఏకమయే ఒక గాఢానుభూతి.. తీవ్ర సంవేదన ఒక ఆకృతి తీసుకోవడం సప్తవర్ణ చాపాన్ని వేయడం అదీ కవిత్వం.

మన తెలుగు కవులు తరచూ ఎందుకు దారి తప్పుతున్నారు? సాయంత్రం చిక్కబడి రాత్రిగా మారి దిగంతాల్లో వెలిగే దీపాలను కనులకు చూపినట్టు కవిత్వాన్ని ఎందుకు రాయలేకపోతున్నారు? దీనికి కారణాలు Politics లో లేవు. Poetics లో ఉన్నాయి.

మొట్టమొదటి కారణం గతానుగతికంగా వస్తున్నదే-

గద్యాన్ని, పద్యాన్ని వేరుచేయలేని, వేరుగా చూడలేని అసమర్థత

కవన్న వాడికి ఏది శుద్ధ కవిత్వం, ఏది శుష్క వచనం తెలియకపోతే ఎలా?

వాడికి తెలియదే అనుకుందాం. విమర్శకుడు కలుగజేసుకోవలసింది అక్కడే!!

గాడి తప్పుతున్నప్పుడు కఠినంగానైనా సరిచేయవలసిందే!!

'బుద్ధి చెప్పువాడు గుద్దితే నేమయా' అని మన వేమన అనానే అన్నాడు.

ఇక వెంటాడే కలాల్లోకి ప్రవేశిద్దాం!

'సహస్ర వృత్తుల సమస్త చిహ్నాల' చుట్టూ ఎడం ఎడంగా తిరిగారే తప్ప ఒకరిద్దరు మినహా ఎవరూ కవిత్వం రాయలేకపోయారు. దీనికి కారణం వీరు Politics ను నమ్ముకొన్న వారు, Poetics ను కాదు. తెచ్చి పెట్టుకొన్న ఆవేశాలు పెట్టుడు మీసాల్లా ఎక్కువసేపు నిలవవు. గుండె గొంతుకతో

కొట్లాడని సందర్భాలే ఎక్కువ. రాళ్లపల్లి వారు ఏనాడో శలవిచ్చారు తన వేమన ఉపన్యాసాల్లో. అందరికీ భావాలు ఉంటాయి. కవన్నవాడు వ్యక్తపరిస్తే అది కవిత్వం మనం ఉద్యమిస్తే అది భవ్యమైన నత్తి అవుతుంది అని. ఆ చందానే తయారయ్యాయి అధికశాతం రచనలు.

వివరాల్లోకి పోతే-- ఇరవై ముగ్గురిలో కవిత్వం రాసింది ముగ్గురే. మిగిలిన వారంతా వచన కవిత్వంలోని మొదటి పదాన్ని వదలకుండా పట్టుకొన్నారు. "మంచి అన్నది పెంచుమన్నా" అని వారి జోలికి పోకుండా ఈ ముగ్గురు రాసింది ఎందుకు కవిత్వమైంది? ఇతరులు రాసింది వచనం లేదా అంతకన్నా హీనం ఎందుకైంది? అని వివేచిస్తే వీరి వేదన వైయక్తికమే.. సార్వత్రికం కాలేకపోయింది. అంతేకాదు హృదయ కవాటాలకు బుద్ధి భూతంలా కాపలా కాసి కవిత్వాన్ని దూరం చేసింది.

అంబటి వెంకన్న రాసిన ఆరు కవితల్లో చిత్తశుద్ధి, చేస్తున్న పనిలో మమేకం కావడం కనిపిస్తుంది. అతని ఊహలు, భావాలు, కవిసమయాలు ఏవీ పరాయి కావు. "జిల్లేడు పూవు" అన్నకవితలో మొదటి పంక్తులు.

ఏటి చివర మనసు ఎరవేసి కూర్చున్న

ఒడ్డెంట నీసుకంపుతో నువ్వొస్తున్నప్పుడు

ఏరొస్తున్న అలజడితో

నీటిబుడగల్లాంటి ఆనందం నాది.

నీ ఒంటిపై

నా ఒండు పెదాలతో పెట్టిన ముద్దు

వాగై ఎన్ని వంకలు దిరిగిందో..

ఈ కవితలు రాయడానికి కారణం అతను మత్స్యకారుల కుటుంబంలో పుట్టడం కాదు, అతను కవి కావడమే!

తర్వాత వెంకట్ రాసిన ఆరు కవితల్లో (వెనకబడ్డ కల మినహాయించి) రమారమి పై నేపథ్యమే కనిపిస్తుంది. ఏది కృతకంగా లేదు, జాలరి సముద్రం మీదికి పోయినంత అనాయాసంగా కవితా మీనాలను పట్టుకొస్తాడు. "గంగమ్మ" అన్నకవితలో

చేపల తట్ట మోస్తూ అమ్మ

వంటినిండా నీసు నింపుకొని

ఉప్పుచారలతో మెరుస్తూ

*తీరం వెంట నడుస్తుంది సముద్రంలా*

పులిపాటి గురుస్వామి రాసిన నాలుగు కవితల్లో

తనదైన బలమైన గొంతుక వినిపించాడు.

"అయ్యా మల్లెప్పుడొస్తవే" అన్న కవితలో

అడవులు పట్టిన నాన్నను గురించి పసిదాని

ఆవేదనలు, ఆలోచనలు. చక్కటి narrative poem

మరో కవిత "ద్రవ పురుషుడు" మంచి ఎత్తుగడతో మొదలవుతుంది. అన్నీ అమరిన పద్యమిది.

*అతడెవరు మిత్రుడా*

*స్వచ్ఛమైన నీటికింది నాచులా కళ్లు*

*కళ్లల్లోని సముద్రం*

*దాని అంచులవెంట ఒంటరి ప్రయాణము*

ఈ ముగ్గురు తెలంగాణా మాండలికాన్ని ప్రతిభావంతంగా వాడుకొన్నారు. "కుక్క పని గాడిద చేసినట్టు" ఏ రాజకీయాన్ని తలకెత్తుకోరు. రసాభాస చేయరు. కవి శబ్ద వాచ్యుడు చేయవలసింది కవిత్వం రాయడం ఇతర వేషాలను కట్టిపెట్టడం. వీరు చేసిందదే.

ఇక కడగా వచనానికి వస్తే--

నాళేశ్వరం శంకరం- "శవం ముందు శంఖం", బాణాల శ్రీనివాసరావు "కుంపటి", జుగాష్ విలీ "కొన్ని వాక్యాల్లో" కొన్నివాక్యాలు ఆర్తితో కదిలిస్తాయి.

**KVS కు...**

## వ్యాస రచనలో సంప్రదించిన పుస్తకాలు అకారాది క్రమంలో

1. అనేక వచనం - పసునూరి శ్రీధర్‌బాబు
2. ఆమె నా బొమ్మ - అయిల సైదాచారి
3. ఆరో వర్ణం - ఇక్బాల్ చంద్
4. ఆర్తి - బైరెడ్డి కృష్ణారెడ్డి
5. ఒక వెళ్లిపోతాను - ఎమ్.ఎస్.నాయుడు
6. నలుగురు పాండవులు - రమణజీవి
7. మల్టీ నేషనల్ ముద్దు - కొండేపూడి నిర్మల
8. మరో మజిలీకి ముందు - ముకుంద రామారావు
9. వెంటాడే కలాలు - (సం) - జూలూరి గౌరీశంకర్, ప్రసేన్

# "ఆకులో ఆకునై"

"ఆకులో ఆకునై" కాలమ్‌గా "ఆంధ్రప్రభ దినపత్రిక"లో వచ్చిన వ్యాసాలను సంకలించి అందమైన పుస్తకంగా తీసుకువచ్చారు వీరలక్ష్మీదేవిగారు. ఇందులోని వ్యాసాలు మల్లెపూవుల మీద నిలిచిన వాన చినుకుల్లా సుగంధభరితాలు. సంప్రదాయ ప్రియత్వం, అరుదైన భావుకత్వం, అమాయకత్వం ముప్పేటా కలిసిపోయి పుస్తకమంతా కనిపిస్తాయి. ఆత్మీయానుభవాలు, భాషపట్ల ప్రేమ, మారుతున్న విలువలు- ఒకటేమిటి సకల విషయాలను, అనునయ స్వరంతో వ్యక్తంచేశారు. కృష్ణశాస్త్రి, కాళిదాసు, శ్రీశ్రీ, మధురాంతకం, ఇస్మాయిల్- ఇలా తన హృదయాన్ని తాకిన సాహితీ మూర్తులను సాదరంగా తలచుకొన్నారు. భావుకత నిండిన అలనాటి సినీ గీతాల గురించి స్వయానా గాయని అయిన రచయిత్రి మక్కువతో ప్రస్తావించారు.

వ్యాసాలన్నీ రచయిత్రి కోమల మనస్తత్వానికి దర్పణాలు. మనం మరచిపోయిన సంగతులను మాతృవివేకంతో మనసుకు పట్టేలా చేయడంలో ఉంది వీరి గొప్పతనమంతా. ఒక్కమాటలో చెప్పాలంటే "పూలబాస" తెలియాలంటే ఈ పుస్తకం తెరవండి.

పోతే "ప్రమాదో ధీమతామపి", కొన్ని స్ఖాలిత్యాలు. బియ్యపు గింజల్లో వడ్లగింజలు. "ప్రాచీనంలో నవీనత, నవీనంలోని ప్రాచ్యం తెలుసు" అని రాస్తారు ఒకచోట. ప్రాచ్యం దిశా సూచి గాని, కాలసూచి కాదు. వాక్యోద్దేశానికి ఈ పదం పొసగదు. ఇంకొకచోట "సైకాలజీలో మానవుని మనసుని నాలుగు భాగాలు చేసి, నాలుగో భాగాన్ని unknown అంటారు" అని పేర్కొన్నారు. కానీ Freudan Psychology లో మనసు id, ego, superego గా భాగింపబడినదన్న విషయం సర్వవిదితం.

"పోస్ట్ మాడర్నిజం" గురించి పుస్తకంలో ఒకటి రెండు చోట్ల ప్రస్తావన ఉంది. త్రికాలాబాధితమైన ఈ పదానికి కొంత వివరణ అవసరం. 1926 నాటి నుండి విమర్శకులు ఈ పదాన్ని ప్రయోగిస్తూ వచ్చారు. ఆ కాలంనాటి Impersonal Poetry కి భిన్నంగా వచ్చిన కవిత్వ పాయను post modern గా వ్యవహరిస్తారు. సదరు కవిత్వాన్ని ఉత్తరాధునికం (post modern) అన్నారు.

ఇప్పటికింతే.

# రెండు మాటలు

ఈ వాదాలను ఎంత తొందరగా పాతేస్తే అంత మంచిది, తెలుగు కవిత్వం బ్రతికి బట్టకట్టాలంటే. కవయిత్రులను పట్టి పీడిస్తున్న స్త్రీ వాదం, కవులను పీల్చిపిప్పి చేస్తున్న నానా వాదాలు. కవిత్వమంటే బహు క్లుప్తమని, సంక్షిప్తమని మన కవులు ఎప్పుడు తెలుసుకుంటారు? ఎకరాల మేర విస్తరించడమే కవిత్వమై కూచుంది. ఆవేశాల మీద అదుపు, మాటల్లో పొదుపు లేకుండా రాసేది ముమ్మాటికి అకవిత్వమే. నీ అనుభవాన్ని నీవు వ్యక్తంచేయి; వార్తాకథనాల్ని జర్నలిస్టులకు వదిలేయి. విప్లవ భ్రమలని, అరువుగొంతులను తగలేయి. నీ చుట్టూ ఉన్నజీవితాన్ని నిండుగా అనుభవించి, చెప్పడానికి నిజంగా ఏమైనా మిగిలుంటే, అప్పుడు వ్రాయి.

'నేను కనిపించే పదం' (కల్పన రెంటాల), 'వలస' (అఫ్సర్) కవితా సంకలనాలు చదువుతుంటే, statement కి, figurative language కి తేడా తెలుసుకోలేని confusion పొగచూరినట్టు దట్టంగా పుస్తకాల నిండా కనిపిస్తుంది. బహుశా వీరికి కవిత్వం రాయడం ఒక accident; event కాదు అనిపిస్తుంది. చాలామంది కవులతో వచ్చే చిక్కే ఇది. సంతోషం కలిగించే విషయం ఏమిటంటే, అలాంటి ఆక్సిడెంట్లు ఈ రెండు పుస్తకాల్లో, సాలెగూడు మీద మెరిసే ప్రభాతహిమంలా అందంగా దర్శనమివ్వడం.

ముందుగా కల్పనా రెంటాల పుస్తకం; ముప్పై ఒక కవితలు; అందులో ఎంపిక చేయదగిన చక్కటి కవితలు ఒక నాలుగు (నది సప్తపది, క్రీడాభిరామం, రాలిపడ్డ జ్ఞాపకాలు, ఒక్కమాట) మాత్రమే. ఇంకో నాలుగు మామూలు కవితలు (నిన్ను మరవని పాట, ఇద్దరి మధ్య, మృగయా వినోదం, రహస్యవాన); ఈ ఎనిమిదింటిలో కవయిత్రి ప్రతిభ గొప్పగా వ్యక్తమయింది, statement, figurative language చక్కగా అమరాయి. ఇదిలా ఉండగా, తాలిబాన్, ముల్లాలు, దేశ విభజన, ఒకటేమిటి నానా విషయ పరిజ్ఞానం కలిగిస్తుంది ఈ కవయిత్రి. ఇన్ని లంపటాల మధ్య ఆణిముత్యాల్లాంటి నాలుగు కవితల్ని రాల్చడం నిజంగా గొప్పే. "రాలిపడ్డ జ్ఞాపకాలు" అన్న కవితలో..

"స్నానం
*దేహం మీంచి జారిపోయే నీటి బిందువులు*
*జ్ఞాపకం ఘనీభవించి దేహమైంది...*
*..నీకోసం విచ్చుకున్న పెదవి*
*పొగడపూల పరిమళంతో..*
*..నిలువెత్తు పూలచెట్టులా నేను*
*రాత్రి కౌగిలిలో నలిగి*
*రాలిపడ్డ జ్ఞాపకాల పూలు."*

ఇక అఫ్సర్ వలస. ఇదీ వరస.. ఈ స్మశానాలేమిటో, శవాలేమిటో, రక్తం ఏమిటో, బొత్తిగా అంతుపట్టదు. కల్పన "గాయం" అన్నపదాన్ని తుత్తునియలుచేస్తే, అఫ్సర్ శవాన్ని తొక్కి వదిలేశాడు. అఫ్సర్ పుస్తకంలో 80 కవితలు. నాలుగో వంతు మాత్రమే కవితా గీటురాయి మీద నిలిచేవి. తెచ్చిపెట్టుకొన్న పరాయితనాలు, అరువుగొంతులు కవిత్వానికి చేటుచేశాయే తప్ప, స్వీయానుభవానికి ప్రత్యామ్నాయం కాలేకపోయాయి. నది మీద, వాన మీద, కవిత్వం, స్వప్నం ఇలా తను ఎరిగున్న వాటి మీద రాసిన కవిత్వం "పెళుసు బంగారు గాలి తీగల మీదుగా" అద్భుతంగా తోస్తుంది. ఐనా వడ్లగింజల్లో బియ్యపు గింజల్ని ఏరినట్లు, ఇన్ని పుటల్లో కవిత్వాన్ని వెదకాల్సిరావడం.. మన "కవిత్వ పటుత్వ సంపద"ని ఎత్తి చూపుతుంది! కొలంబస్‌లా దారి తప్పుతూనే ఉన్నాడు తెలుగు కవి.

**"ఒక వానా కాలం"** అన్న కవితలో

*కొండల మధ్య*
*ఎక్కణ్ణించో*
*వినిపించే రహస్య జలపాతం*
*ఇవాళ*
*నా చుట్టూ*
*వానాకాలం...*

------

*ఇసుక దేహం మీద*
*అలవచ్చి వెళ్లిపోయాక తడిజాడ!*
*లేత రెక్కలతో ఆర్పనా వద్దా అన్నట్టు*
*సంశయిస్తున్న ఒట్టి మెరుపెండ*
***("కురిసీ కురవనీ")***
*ఇరుక్షణాల ద్వైధీ భావంతో*
*హొరుసుకు పోతున్న నాకు*
*మహా ప్రళయఘోష తప్ప*
*అలవోకగా జారుతున్న నిశ్శబ్దం వినిపించదు*
*మెలికలు తిరుగుతున్న ఉద్రిక్త దేహాల మధ్య*
*నలిగిపోతున్న ఆత్మల బలహీన స్వరం వినిపించదు.*
**("ఇవాళ")**

# ఆకురాలు కాలం - మెహజబీన్ కవిత్వం

## ఒక విమర్శ

*"ఏరకుమీ కసుగాయలు" అన్నాడు సుమతి శతకకారుడు*

*కానీ ఏరవలసిన అగత్యం ఉంది- ఈ ఆకురాలుకాలంలో!*

*కొత్త వసంతానికి దారి సుగమం చేయవలసిన అవసరం ఉంది.*

మెహజబీన్ గత శతాబ్ది చివరి దశకంలో గొంతు విప్పిన కవయిత్రి. సమకాలీన కవుల, విమర్శకుల మన్నన పొందినవారిలో అగ్రగణ్య. ఆకురాలు కాలంలో ఇరవై ఆరు కవితలు ఉన్నాయి. శివారెడ్డి గారి ముందుమాట, "ఈ దశాబ్దపు మరో వాగ్దానం జబీన్" అని పుస్తకం చివరన చే.రా. గారి ఉవాచ.

శివారెడ్డి గారి ముందుమాట "A Lyrical Beauty" నుండి మొదలెడదాం, మన విమర్శా ప్రస్థానం. శివారెడ్డిగారు 'A Lyrical Beauty" అని లోతుగా వివేచించి రాశారో, పై పై పరిశీలనతో అన్నారో నాకు తెలియదు. మరోచోట ఆయనే విశదీకరించారు. "ఆమె కవిత్వంలో ఒక ఆప్తత ఉంది. అనుభవసాంద్రత ఉంది. ఆత్మీయ వ్యక్తీకరణ ఉంది ఒక lyrical touch– ఒక రూపశ్రద్ధ ఉంది". ఈ మాత్రం చాలు!! lyric ను మూలార్థంలోనే ప్రయోగించారాయన; రూపశ్రద్ధ అనడంలో అది స్పష్టమవుతోంది. దానికంటే ముందు "జబీన్‌లో కనిపించే ముఖ్య లక్షణం- ఒక lyrical voice–quite lyrical voice" అని వ్రాక్రుచ్చి రష్యన్ కవయిత్రి అన్నా అఖ్మతోవా తో పోలుస్తారు. దానితో తప్పవలసిన తోవా తప్పారు.

గతంలో ఐరోపా, అమెరికాల్లో తీవ్రమైన భావోద్వేగాలను స్వేచ్ఛగా వెల్లడించిన కవులను lyric poets అన్నారు. dramatic poetry, epic poetry లకు భిన్నంగా ఉన్న సదరు కవిత్వాన్ని lyric poetry అన్నారు. ఇది మన భావకవిత్వానికి ఖచ్చితంగా సరిపోతుంది శిల్పరీత్యా కాలరీత్యా. కృష్ణశాస్త్రిని మించిన lyric poet మన తెలుగులో ఆ రోజుల్లో ఎవరూ లేరు. కీట్స్, షెల్లీ తదితర రొమాంటిక్ కవులు, రిల్కే లాంటి ప్రతిభావంతులు, ఎమిలీ డికిన్సన్, ఎడ్నా మిల్లే లాంటి అమెరికన్ కవయిత్రులు తమ odes, sonnets తో ఆ సంప్రదాయాన్ని పరిపుష్టం చేశారు. మన శ్రీశ్రీ "నీ గళ గళన్మంగళ కళాకాహళ హళాహళిలో కలిసిపోతిని" అని ప్రస్తుతించిన స్విన్‌బర్న్ ప్రభావానికి లోనయిన కవయిత్రి ఎడ్నా అంటే తన భాషా నైశిత్యాన్ని అంచనా వేయవచ్చు.

అన్నా అఖ్మతోవాది పూర్తిగా భిన్నమైన తోవ. ప్రపంచంలో సింబాలిస్టుల గూఢతా, క్లిష్టతలకు వ్యతిరేకంగా 20వ శతాబ్ది మొదట్లో వచ్చిన ఉద్యమాలు రెండు. రష్యాలో గుమిలేవ్ ఆరంభించిన Acmeism; అక్కడి అణచివేత విధానాలయ్యాల్ల, గూఢార్థాల్లో బాహ్య ప్రపంచానికి దీని

సుందరయ్య విజ్ఞాన కేంద్రం
A C No. 8 3777

పుట్టుపూర్వోత్తరాలు తెలిసి రాలేదు. రెండవది బహుళ ప్రాచుర్యం పొందిన imagism. ఎజ్రా పౌండ్, కార్లోస్ విలియమ్స్ తదితరులు దీన్ని విశ్వవ్యాప్తంచేశారు. పై రెండింటికి ప్రధాన సామ్యం "concrete imagery" లో ఉంది. అంటే కవిత్వం మూర్తిమంతంగా ఉండాలి!! అయితే ఒక చిన్న వ్యత్యాసం కూడా ఉంది. imagist లు తమ కవితల్లో వ్యావహారిక రీతిని మన్నించారు. తమ కవిత్వానికి సరితూగే సొంత నడకను కూర్చుకున్నారు. acmeist లు తద్భిన్నంగా సంప్రదాయాన్నే ఆశ్రయించారు. ఛందోనియమాలను వదలలేదు. అందునా అఖ్మతోవా కవితలు చాలా క్లుప్తంగా, ఛందోబద్ధంగా శబ్ద గుణాలతో అలరారుతుంటాయి.

ఇంత చర్చ ఎందుకు చేయవలసి వచ్చిందంటే నేటికాలపు తెలుగు కవులకు లేనిదే రూపశ్రద్ధ. దానికి మహెజబీన్ మినహాయింపు కాదు. రూపశ్రద్ధ కవిత్వ అవగాహనకు భిన్నమైనది కాదు. దాని లోనిదే. కాబట్టి స్థూలంగా మన కవులకు కవిత్వావగాహన లేదని సారాంశం. ఒకవేళ ఉన్నా అది గాఢమూ, గహనమైనది కాదు.

పూర్వం చెప్పినట్టు imagist, acmeist సాహిత్యకారులు, సింబాలిస్టులకు భిన్నంగా కవిత్వంలో స్పష్టత కోసం తీవ్రంగా పరితపించారు. దానికి సాధనం concrete imagery గా గుర్తించారు. అమూర్త భావాలను తీసి గట్టుమీద పెట్టారు. సకలేంద్రియాలతో మనం అనుభవించే లోకం- అవిరళంగా ప్రవహించే కాంతీ, సూర్యచంద్రులు, వేడీ వెన్నెలా, తరంగితమయ్యే సముద్రం, నీలాకాశం, బలంగా తాకే గాలి- కవిత్వంలోకి ప్రవేశపెట్టారు. పదచిత్రాలను అంటే imagery లను అర్థసంపన్నం చేశారు. అంతేకాదు వాటికి అర్థబాహుళ్యాన్ని సంతరించి పెట్టారు. అంటే అనుభవాన్ని అనుభవంగా అందించడానికి సరైన రంగం సిద్ధంచేశారన్న మాట. ఈ ప్రాతిపదికన సహజంగా లోతైన అనుభవాన్ని అనుభవంగా అందించేదే గొప్పకవిత.

సకలవర్ణ సమ్మేళనాన్ని సాధించగలిగిన వాడు చిత్రకారుడు. అనంత ప్రకృతి పద్ధతిగా, ఒద్దికగా ఒదుగుతుంది అతని కాన్వాసు మీద. కవి కూడా మెలకువ గల చిత్రకారుడిగా రూపెత్తి పదచిత్రాలతో (imagery) ప్రదర్శిస్తున్నాడు తన అంతరంగం లోతులను, అగాధానుభవాలను.

అనంత వర్ణాలలో చిత్రకారుడు ఎంచుకొనే రంగులు కొన్నే. అలాగే కవికూడా పదాలను పొదుపుగా సంగ్రహిస్తాడు. అనవసర పదం వచ్చిపడిందంటే, రావలసిన రంగు రానట్టే, ఎక్కువ పదాలు పడ్డాయంటే రంగు వలికిందే. చాలా సంయమనం, లాఘవం అవసరం; కవిత్వంలో మరీనూ, కారణం అది అన్నిటికన్నా లలితమైన కళ కావడమే. చూసేకొద్దీ కొత్త కోణాలు వ్యక్తమయ్యే చిత్రంలా, తరచి చూసేకొద్దీ కొత్త లోతులు అనుభవంలోకి రావాలి. అదీ గొప్ప కవిత్వం!!

విడిపోయే క్షణాల్లో ప్రియురాలి చూపులో వ్యక్తమయ్యే అనేక భావాలు, మరణశయ్య మీద మాతృమూర్తి ఎదలో తిరుగాడే ఆవర్తాలు, కాందిశీకుని మనోకాననంలో నిలిచిన ఊహలు.. అన్నీ వ్యక్తంకావాలి.

గొప్ప కవిత్వానికి ఒకటికన్నా ఎక్కువ dimensions ఉండటం సహజమే.

మహెజబీన్ కవిత్వం రెండుగా చీలుతుంది. ఒక పాయ స్త్రీ వాద దృక్పథంతో రాసిన కవిత్వం. మరొకటి విప్లవ స్వానుభూతితో కరిగి రాసిన కవిత్వం. స్త్రీ వాద దృక్పథంతో రాసినవి కొన్ని తేలిపోగా, కొన్ని పేలవంగా మిగిలిపోగా, ఒక వ్యక్తిగా సాంద్రమైన అనుభూతితో రాసిన కవితలు మిరుమిట్లు గొలుపుతూ కనిపిస్తాయి- అతని సమక్షంలో, జావళి, జ్ఞాపకం, elegy, ఆకురాలు కాలం, నైసర్గిక స్వరూపం.

**"అతని సమక్షంలో"** రెండు dimensions గల కవిత.

*"సరిగ్గా అప్పుడే*

*కవిత్వీకరిస్తున్న క్షణాల్లో*

*అతను ముద్దు పెట్టుకుంటాడు.*

*అతని అడుగుల సవ్వడిలో*

*ఛందస్సు వెదుక్కొంటూ*

*నేను అలవోకగా కళ్లు మూసుకొంటాను"*

**Double Flame** అన్న గ్రంథంలో ఆక్టావియో పాజ్

The relationship between erotism and poetry is such that it can be said without any affectation, that the former is a poetry of body and the latter an erotism of language.

కవిత్వానికి, శృంగారానికి సంబంధం ఉందంటాడు పాజ్. ఇంకా కొంచెం ముందుకుపోయి శారీరక కవిత్వమే శృంగారము, భాషాగత శృంగారమే కవిత్వము అని వక్కాణిస్తాడు. తికమక ఏమీ లేదు, రెండింటికీ కల్పన ప్రాణం. కలయిక అవసరం. ప్రగాఢమూ, నిగూఢమూ అయిన అనుభవ తీవ్రతతో భాషాదేహాలు, కొన్నిప్రత్యేక క్షణాల్లో ఆనంద శిఖరాల్లో విహరించేలా చేస్తాయి.

"అక్షరాలను వదిలి కవిత్వం

మమ్మల్ని పెనవేసుకుంటుంది" అన్నప్పుడు వ్యక్తమయ్యే భావమిదే. కవిత్వానికి, శృంగారానికి అభేదం చెప్పిన సున్నితమైన కవిత! ఇతర కవితల్లో లేని కాల్పనికత ఇందులో ప్రశస్తంగా కనిపిస్తుంది. జావళిలో imagery వర్ణోజ్జ్వలం, కాంతిమంతం!

*flame of the forest*

*దానిమీద పరచుకొన్న వెన్నెల*

*కోనిఫర్ వృక్షాల నీడలు*

*అన్నీ అలానే ఉన్నాయి*

*నీవు మాత్రం లేవు.*

కానీ కవితారంభంలోని మూడు వాక్యాల్లో ప్రొసాయిక్ భావం పంటికింద రాయిలా ఇబ్బంది పెడుతుంది. భాషకు చెర విడిపించడమే కవిత్వం చేయగల పని కాబట్టి వచన ఛాయలు చెంత చేరకుండా జాగ్రత్తపడాలి.

తొలిపొద్దు చీకట్లో మొదలయ్యి "జ్ఞాపకం" తీయగా, అలవాటుగా సందిగ్ధంగా, అతను లేక చేదుగా, అయినా ఆత్మవిశ్వాసంగా తొలి సంధ్య కాంతిలో ముగిసే ఈ కవిత జ్ఞాపక పరిణామాన్ని చాలా బలంగా వ్యక్తీకరిస్తుంది. ఎక్కడా తడబాటు, తప్పటడుగు లేకుండా సూటిగా తాకే కవిత. ఒక శకలం మచ్చుకు-

*"తొలిఝాము వెలుతురులో*

*కోడి పాడే ప్రభాత గీతాన్ని వింటూ*

*మనం ఊపిరితో చలికాచుకొన్న జ్ఞాపకం."*

ఇందులో imagery వైరుధ్యాలు లేకుండా కలగలిసిపోయి ఒక వాతావరణాన్ని, గొప్ప అనుభూతిని మిగిలిస్తుంది.

స్నేహితుడు త్రిపురనేని శ్రీనివాస్ మరణించినప్పుడు నిస్సహాయతలోంచి ఉబికిన కవిత- elegy. సారళ్యంతో గుండెను చుట్టుకొంటుంది. "రేపు ఫోన్ చేస్తానన్న మాట అబద్ధమేనా" అని జాలిగా ప్రశ్నిస్తూ.

**ఆకురాలుకాలం** - టైటిల్ కవిత మొదటి సగం అద్భుతంగా ఉంటుంది.

*అతనెప్పుడూ అంతే*

*ఒంటరిగా రమ్మంటే వసంతాన్ని వెంట తెస్తాడు.*

*ఆరుబయట ఆకుల నిశ్శబ్దంలో*

*చెట్లు కవాతు చేస్తున్నాయి*

*ఆ సెలయేటి నీళ్లలో*

*ఆకాశచిత్రం ఘనీభవించింది*

*చుక్కలు కరిగి రాలుతున్న దృశ్యం*

*లీలగా గుర్తుంది.*

*వద్దు..*

*నాకు వెన్నెలా వద్దు, పున్నమీ వద్దు*

*సూర్యుడొక్కడే చాలు*

*అతని నిరీక్షణలో ఈ నల్లని రాత్రి అలా గడవనీ*

రెండవ సగంలో దృశ్యం పలుచబడుతుంది. బాల్యం తిరిగి ప్రవహించడం, శరీరం అనుభవాల పాఠశాల కావడం అంత concrete expressions కాకపోవడమే దీనికి కారణం. ఉజ్వలమైన ఆరంభాన్ని కవిత మధ్యలో సాదా వాక్యాలు దెబ్బతీశాయి.

"నైసర్గిక స్వరూపం" మంచి ఎత్తుగడతో, మొదటి పదివాక్యాలు మంత్రించి వేస్తాయి.

*కాలడం ఖాయమని తెలిశాక*

*ఒకే ఒక్కసారి సూర్యుణ్ణి*

*కౌగలించుకోవాలనుంది.*

*చిన్నప్పటినుండీ అంతే*

*నిషిద్ధం మీదే నా గురి*

*సరిహద్దులన్నీ చెరిపేసుకొన్నాక*

*ఆకాశమొక్కటే నాకు హద్దయింది.*

*నీలి సముద్రాల అలలపరదాలు తెరిచి*

*తరంగాలలో స్వేచ్ఛను*

*అధ్యయనం చేసాను.*

ఇమేజరీలు చక్కగా కుదిరాయి. సూర్యుడి నుంచీ మొదలయి, తన స్వభావాన్ని పరిచయం చేసుకొని, ఆకాశమే హద్దని తేల్చి, సముద్ర తరగల తత్వాన్ని తెలుసుకొని-

*"ప్రవాహానికి ఎదురెళ్లి*

*సాగర సరిహద్దుల్లో జరిగే కెరటాల*

*యుద్ధంతో చేతులు కలిపాను"* అనడంలో పై ఇమేజరీలతో పొత్తు కుదరడం లేదు

అందునా సాగర సరిహద్దులనడం కూడా బాగా లేదు. ఏది ఏమైనా ఆత్మవిశ్వాసాన్ని ప్రోదిచేసిన కవిత ఇది.

**ఇకపోతే ఇంకో పార్శ్వం:**

ఏ జర్నలిస్టయిన రాయగల కవితలు ఇందులో ఒక ఏడున్నాయి.

లోయ, మేఘం రాల్చని వాన, నవస్మృతి, సరిహద్దు రేఖలు, స్ట్రీట్ చిల్డ్రెన్, డాటర్స్ కింగ్‌డమ్, ఆధునిక సామాజిక సిద్ధాంతం.

కవిత్వం- అలవాటైన వార్తాపత్రిక కథనానికి ఆమడ కాదు, సహస్రయోజనాలు దూరం. నిపుణమతి ఐన కవి ఏ వస్తువుని పడితే ఆ వస్తువుని తాకడు. కారణం పేలవమైన వచనమై తేలిపోయే ప్రమాదం అడుగడుగునా పొంచి ఉంది కనుక. కొండ ప్రాంతాల్లో ఉన్నచిత్రకారుడు, తను చూడని సముద్రాన్ని చిత్రించలేడు. ఒకవేళ చిత్రించాలని బయల్దేరినా ఆ వ్యవసాయం వికటిస్తుంది.. రంగులూ, కాన్వాసు వ్యర్థమవుతాయి! మధ్యాహ్నం ఉబుసుపోక ఏ కాస్త సాహిత్య స్పర్శగల గృహిణైనా రాయగల కవితలు: ఖిల్వత్, అజ్నబీ. ఇవికాక ఫర్వాలేదనిపించే కవితలు మరో నాలుగు: ఒక పచ్చని జీవితం, బతికిన గోడలు, సన్నిహిత సంబంధం, ముందుజాగ్రత్త చర్య ఎక్కువ పదాలను వాడేసుకొని నీరసించిన కవిత: అమ్మకళ్లు.

జీరో అవర్, చిన్నతల్లి, ఛాయాచిత్రం కవితల్లో కొన్ని కవిత్వ స్ఫురణ కలిగించే వాక్యాలు ఉన్నాయి. కత్తిరించడం (pruning) మొక్కలకే కాదు కవితలకు కూడా చాలా అవసరం. ఎవరో పాత కవి చెప్పినట్టు, నాకు గుర్తున్నమేరకు

**"hundred times consider what you say**

**sometimes add but often take away"**

అనురాగస్మృతి, చీకట్లోంచి వెలుతురులోక్కి, స్పర్శ, కొంత pruning, పునరాలోచన అవసరమైన కవితలు. కవయిత్రి ఇంకా వాటిమీద దృష్టి నిలపవలసి ఉంది.

స్పర్శలో కవిత్వ స్ఫురణ ఉన్న భాగం మచ్చుకు.

*ఆకాశం అమృతగింజల్ని*

*రాల్చుతున్న ఆ చలిరాత్రి*

*నిన్ను నేను కప్పుకొని పడుకున్నాను*

*ద్రవీభవిస్తున్న యవ్వనం*

*పరవశత్వాన్ని కానుకిచ్చింది*

*వేగుచుక్కల జావళిగీతం*

*తొలకరి పగటిని మోసుకొచ్చింది*

*నేస్తం శతాబ్దాల కొత్తది మన స్పర్శ.*

అమృతగింజల్ని అనడం ఎబ్బెట్టుగా ఉంది. భాషా సౌష్ఠవం లోపించింది. లేదా అమృతాక్షతలను అనవచ్చు, కొంచెం నయం. అలాగే పరవశత్వం; పారవశ్యం, లేదా పరవశం అని వాడవచ్చు. తొలకరి పగటిని కొరుకుడు పడదు. centuries old ఫాయా లోని పదబంధం "శతాబ్దాల కొత్తది" పొసగలేదు. ఇదే కవితలో ఇంకొకచోట నిశ్చలన చిత్రం అని ఉంది, నిశ్చల చిత్రం సరిపోతుంది.

విమర్శ ప్రస్థానం ఆదిలోనే ఆకురాలు కాలం లోని కవిత్వాన్ని lyric poetry అనడం, అన్నా అఖ్మతోవా తో పోల్చడం తప్పన్నది ఇందుకే. lyrical temperament ఉన్న వారు ఇన్ని తప్పులు చేయరు. భాషాపరంగా చాలా మెలకువతో వ్యవహరిస్తారు. భాషా సౌష్ఠవాన్ని, భావగీతాన్ని (lyric) రెండింటినీ విడదీసి చూడలేము. కవన్న వాడికి భాషమీద పట్టు చాలా అవసరం. కారణం అది వాడి పనిముట్టు. ఇక అఖ్మతోవా విషయానికొస్తే ఆమె చాలా పొదుపరి. ఒక పదాన్ని కాదుకదా ఒక అక్షరాన్ని కూడా వృధా చేయదు. అంతేకాక అవి మననానికి ఉద్దేశించినవి. రష్యన్ కవులు కాగితం మీద పెన్ను పెట్టినా ప్రమాదంలో ఇరుక్కొనే రోజులవి. ఆ పరిస్థితులకు తగ్గట్టు అఖ్మతోవా పద్యాలు గొప్ప శబ్ద సౌందర్యంతో, అంతకుమించి అనితరసాధ్యమైన సంయమంతో అలరారుతుంటాయి. వస్తువు ఎంపికలో తప్పులు చేసేంత స్థాయి కాదు ఆమెది.

మన ప్రాచీన కవులు బాగా రాశారు. కానీ చిక్కల్లా బాగా రాయడం వేరు, కవిత్వం రాయడం వేరు. ఏది ఏమైనా వారు తెలుగు నుడికారాన్ని బాగా పట్టుకున్నారు. తర్వాతి కాలంలో వచ్చిన పద్యకవులు నన్నయాదులను మిమిక్రీ చేయబోయి చేతులుకాల్చుకొని చతికిలబడ్డారు. దీనికి కారణం చరిత్ర. ముఖ్యంగా భాషా చరిత్ర వారికి తెలియకపోవడమే. ప్రాచీన కవుల రాతల్లో లెక్కకుమిక్కిలి వ్యావహారిక ప్రయోగాలు ఉన్నాయని గిడుగు పిడుగు సోపపత్తికంగా నిరూపించి, చాచి లెంపకాయ కొట్టేదాకా మనవారు మొద్దునిద్ర వదలలేదు. ఛందోబందోబస్తులన్నీ తెంచేశాం! దానివల్లమంచే జరిగింది. కానీ చెప్పుకోదగినంత చెడుకూడా. "అక్షర క్రమం రాగానే మనవాళ్లు కవులైపోయే" కాలం

వచ్చింది. ఠాగోర్ తనని చూడ వచ్చినవారికి పదే పదే చెప్పేవాడు. కొన్ని పుస్తకాలు భాషకోసం, కొన్ని పుస్తకాలు భావం కోసం చదువుతాం. తేడా తెలిసి మసలండి అని!! పాతరోజుల్లో పాండిత్యం ఉన్న, కవిత్వం సున్న ఐన అరసిక రచనలు చదివి డస్సిపోయేవారు. ఇప్పుడు కవిత్వం కానరాదు. పాండిత్యం ఊసు లేదు. సున్నకు సున్న హల్లికి హల్లి. సరిపోయింది. ఇక జాలింతును!!

# 'హాయి గొలిపే వేసవి వాన'

ఒక శతాబ్దం క్రిందట, తన ఇరవైతొమ్మిదవ ఏట 29 కవితలతో, 'కుండీలో మర్రి చెట్టు 'తో అప్పటి తెలుగు కవితా ఊసరక్షేత్రంలో ఊడలు దించుకొన్నకవి విన్నకోట రవిశంకర్, తన 'వేసవి వాన'తో మిత్రానుభూతులను పంచుతున్నాడు. ఒక కవి జీవితంలో ఒక దశాబ్ద కాలం తక్కువ కాదు. అనుభవ పేటిక వింతమణులతో కాంతిమంతం కావచ్చు. 'తరువులతిరస ఫలభారలగుచు 'కొంచెం వంగినట్లు ప్రసాదగుణం కవిలో పెరగవచ్చు లేదా 'ఇంచుక బోధ శాలి 'కావడం మూలాన తన ప్రపంచదృష్టి పదునుదేరి ఉండవచ్చు.

పోతే, ఈ సంకలనంలో నలభై కవితలు.

అరవం లాగా, జర్మన్ లాగా కవిత్వం కూడా ఒక ప్రత్యేకమైన భాష. భేదమల్లా అది ఎవరి మాతృభాషా కాదు, అలా అని అది మృతభాష కాదు. సకలానుభూతులను వెల్లడించగల సమర్థ భాషయే. ఒక పర భాషను పరిపూర్ణంగా నేర్చుకోవడం కన్నా ఇది మరీ జటిలం. ఏ భాషలోనైనా హేతుబుద్ధి, ఉద్వేగ ప్రవృత్తి కలగలిసే వుంటాయి, విడదీయలేనంతగా. భాషకు ఏది సహజమో, సుందరమో పోల్చుకోవచ్చు. ఆంధ్రానికి అక్షరమైత్రి, అలాగే ఆంగ్లానికి అంత్యప్రాస.. అదే విధంగా కవిత్వానికి వజ్రాభరణం క్లుప్తత.

ఇంకొకటి కవిత్వం పిల్లల భాష. అంటే రంగుల భాష.. అమూర్త భావాలకు అందులో చోటు లేదు. అంత సరళం మరొకటి లేదు, కానీ అంతు పట్టని లోతులెన్నో అందులో ఉండి తీరతాయి. సారాంశం ఏమంటే కవిత్వంలోని క్లుప్తత, దట్టమైన అనుభవ సాంద్రత వల్ల కలిగినదే గాని తద్భిన్నంగా ఆలోచనా తీవ్రతవల్ల లభించినది కాదు. అటువంటి క్లుప్తతతో ప్రకాశించే కవితలు. ఇందులో మచ్చుకి.. హాలోవిన్, ఒక ఎడారిపూవు, జలస్నేహం, ఉద్వేగాలు, మూడు పువ్వులు.

ఎంత సరళమైన రంగుల ఊహలు!!

*'రాలే ఆకురంగు మార్పుడం*

*చెట్టుకు మాత్రమే తెలిసిన చిత్రమైన కళ*

*రాలిన ప్రతి ఆకు ఆకాశంలో తలపెట్టి*

*రాత్రంతా అది కన్న రంగుల కల'* (హాలోవిన్)

*పువ్వు వాడిపోయినా*

*వాడని జ్ఞాపకాలతో*

*నువ్వు నిరంతరం నన్ను ప్రేమించేలా*

ఒకమధురానుభవాన్ని చవి చూపిస్తావు.' (ఒక ఎడారి పూవు)

'అంతా సంశమయే, శరీరఘటనంబంతా విచారంబె 'అని ధూర్జటిలో తళుక్కుమనే ఒక తలపోత ఈ సంకలనంలో చాలా కవితల్లో (మార్పు, ఒంటరితన, వ్యక్తిగతం, వయస్సు, గత చిత్రం..) కనిపిస్తుంది.

*'ఎన్ని రకాల ప్రమిదల్లో నింపినా*

*అవే కన్నీటి వాన నీళ్ళు*

*అవే ఆత్మలు ధరించిన*

*రంగురంగులు శరీరాలు '(మార్పు)*

పాపతో తన అపురూప బాంధవ్యాన్ని చిత్రించిన కవితలు కొన్ని, ముఖ్యంగా దాగుడుమూతలు, అద్వైతం .. ఆహ్లాదం కలిగిస్తాయి-అప్పుడే విరిసిన ముద్ద మందారాల్లా. అనివార్యమైన జీవిత దశను తండ్రులుకొడుకులు అన్న కవిత లలిత గంభీరంగా ప్రదర్శిస్తుంది.

ఎగిరే పక్షుల మధ్య, ఎగరని పూవుల మధ్య వర్ణాప్తతను కనుగొనడం లాంటి చోట్ల కవి కల్పనా నైశిత్యాన్ని గమనించవచ్చు.

తెలుగు కవిత్వానికి ఇది సంధి దశ

నానావాదాలతో, ఉద్యమాలతో కునారిల్లుతున్న సూచనలు ఒకవైపు. మనోహరమైన ఊహానుభావాలతో వికసిస్తున్న దాఖాలాలు మరొకవైపు. వట్టిపోయిన వాతావరణంలో, ఈ వేసవి వాన, హాయిగొలిపే గట్టి దాఖలా!

# జయప్రభ - శబ్ద కవిత్వం

కవిత్వం శబ్దమయమే కదా.. మరి శబ్ద కవిత్వం అనడంలో ఔచిత్యమేముంది? అని కాస్త చదువుకున్న పాఠకుడు ఆక్షేపించవచ్చు. కవిత్వం శబ్దమయమే కాదు, నిశ్శబ్దమయం కూడా. నిశ్శబ్దాన్ని పసిగట్టలేని వారికి కవిత్వం కేవలం శబ్ద స్వరూపంగా గోచరించవచ్చు. ఏనాడో శతాబ్దాల కిందట కవిత్వంలో నిశ్శబ్దాన్ని గౌరవించిన తూ ఫూ, లీ పో లాంటి చైనా కవులు, బషో, ఇస్సా, బుసన్‌లాంటి జపనీస్ కవులు నేటికి మన దృష్టిపథం నుండి కనుమరుగు కాలేదు. అనువాదాల్లో సైతం చెడని వారి కవిత్వ గాఢతకు ప్రపంచం విస్తుపోయింది. ఉజ్వలమైన ఈ అనువాదాల వల్ల ఆంగ్ల కవిత్వం చాలా లాభపడింది. ఈ తూర్పు కవిత్వాల అనువాదాలతో ఎంతో పేరు పొందిన ఎజ్రాపౌండ్ నూతన కవిత్వ ప్రవక్తగా అవతరించాడు. అతని ఆలోచనలను గౌరవించి ఆ దారిలో ఎందరో ఆంగ్ల, అమెరికన్ కవులు నడిచారు. ఆంగ్లం విశ్వవ్యాప్త భాష కావడం మూలాన, ఈ నిశ్శబ్ద కవిత్వం.. చిన్న తుంపరలా మొదలై, తుదకు వర్షమై.. ఇంద్రధనూవర్ణాలతో అందరినీ ఆకర్షించింది - అతి సహజంగా!

భాషను కవిత్వవాహకంగా మాత్రమే వాడుకోవడంలో నిశ్శబ్ద కవులు ఎంతో శ్రద్ధ చూపుతారు. కవిత్వధర్మాలేవో వారి ఎముకల్లో ఇంకి ఉండటం చేత వారు ఎక్కువ మాట్లాడరు. 'కొండ అద్దమందు కొంచమై ఉండదా' అన్నట్లు ఎంత గొప్ప జీవిత సత్యాన్నైనా తగుమాటల్లో చెప్పి, కొంత మౌనానికి, ధ్యానానికి ఆస్కారమిస్తూ పక్కకు తప్పుకొంటారు. భాష అంటే వీరికి గిట్టదా? అన్న అనుమానం పొడసూపవచ్చు అంతగా తెలియని చదువరికి. భాషా సౌందర్యాన్ని దర్శించి అక్కడితో ఆగిపోకుండా, దానికంటే ఉన్నతమైన లక్ష్యం వైపు సాగిపోవడం వల్ల అలవడ్డ సరళత ఇది. సూర్యుని కిరణాలు సోకిన మేర ప్రకృతి అంగుళమంగుళం పులకించినట్లు.. ఈ సారళ్యస్పర్శతో ఉజ్వలమై ప్రకాశించింది కవిత్వం!

తెలుగు కవుల్లో, విమర్శకుల్లో ఈ ఎరుక - కవిత్వంలో నిశ్శబ్దం అవసరమన్న సూక్ష్మావగాహన-ఎవరికైనా ఉందా? నార్ల లాంటి పాత్రికేయుడు కవిత్వాన్ని, పాండిత్యాన్ని వేరు చేసే ప్రయత్నం చేయడం ఆశ్చర్యం గొలిపే విషయం. ఇస్మాయిల్ గారి కవిత్వ మానిఫెస్టో అనదగ్గ "కవిత్వంలో నిశ్శబ్దం" అన్న పుస్తకంలో ఈ తరహా కవిత్వానికి కొన్ని బలమైన తాత్విక ప్రాతిపదికలు ఏర్పరచడం అందరూ ఎరిగిందే. కాని వాటి విలువను ఎవరైన గుర్తించారా? అన్నది అసలు ప్రశ్న !! విప్లవాలు, వీరంగాలు డీలా పడ్డాయి, ఎన్ని రోజులని ఊరకే నినదిస్తూ కూచుంటారు, విసుగు పుట్టదూ, సహజంగా అదే జరిగింది. ఈ నేపథ్యంలో, ఎనభైల్లో గొంతు విప్పిన చాలా మంది కవుల్లాగే జయప్రభ కూడా కవిత్వంలో నిశ్శబ్ద ప్రసక్తిని గుర్తించినట్లు తోచదు. స్త్రీవాద సంరంభంలో శరీర ధర్మాలన్నీ కవిత్వాలై కూర్చున్నాయి. "చీరకు, కవిత్వానికి భేదం గుర్తించలేని" విమర్శకమ్మన్యుల పుణ్యమా అని, వీధిగొడవ స్థాయికి దిగింది ఈ కవిత్వం.

జపనీస్ యుద్ధ విద్యల్లో ఒక నానుడి ఉంది. తన లోపాలు, ప్రత్యర్థి లోపాలు తెలుసుకోలేని వాడు పదే పదే ఓడతాడు. మన తెలుగు కవులు ఈ కోవకే చెందుతారు. తమ లోపాలు తెలుసుకోరు; భాష పరిమితులు ఎరగరు. ఫలతః పాఠకున్ని కలవరపెట్టే కొండవీటి చాంతాడు కవిత్వాలు; ఎంత చేదినా ఒక్క గుక్క నీరు ఉండదు, దాహం తీరదు. భాష దగ్గరే ఆగినవాడు శబ్దకవి. ఆగిచూసుకోవడం అలవాటు లేదు. పరిగెత్తి పాలు తాగడమే. భాషను దాటిన వాడు నిశ్శబ్ద కవి.. నిలబడి నీళ్లుతాగే నింపాది తరహా.

భాష పరిమితులను గుర్తించడం లేదంటే ఆ మేరకు విచక్షణ లోపించినట్టే. విచక్షణ లేని కవి విలక్షణ కవిత్వం సృష్టించిన దాఖలాలు విశ్వసాహిత్యంలో లేవు. విచక్షణలేని వాడి కవిత్వం, పిచ్చివాడి చేతిలోని రాయి రెండూ ఒకటే. కాబట్టే భావనా ప్రపంచంలో ఇంత రక్తపాతం!

పదాల బలహీనత గూర్చి వాపోయిన ఆధునిక కవి బైరాగి. ఐనా అతని మార్గం శబ్ద మార్గమే. అంతటా ఆవరించి వున్న అస్తిత్వవేదనను అందుకొని కృతార్థుడైనా, అతని కవిత్వంలో నిశ్శబ్ద ప్రసక్తి లేదు. తన కవిత్వంలోకి అతను నిశ్శబ్దాన్ని ప్రవేశపెట్టలేదు. అది అలా ఉండనిస్తే..

భాషా విచక్షణ కొరవడిన వాడు పద్య గద్యాల విభజన రేఖను పరిగణించడు కాబట్టే కవితా ప్రపంచంలో ఇంత అయోమయం. మసిపూసి మారేడు కాయ చేసినట్లు, వ్యాసం కాదగ్గ విషయాన్ని కవిత్వం చేయాలన్న వృథా ప్రయాస. ఇన్ని జంజాటాలతో సతమతమవుతుంటే సుతీ మతీ లేని వాదాలు. (నాది చూడు మధ్యలో బుడంకాయ తొక్కు అని ఇటీవలి postmoderns, language poets!) వాటికి విచ్చుకత్తులతో కాపు గాసే వీరభటులు; పుష్కరానికోసారి ఇలాంటి వాదాలచెత్త పుష్కలంగా జమపడి, దాని అడుగున కవిత్వం భీతిగా బిక్కుబిక్కుమంటూ తల్లడిల్లవలసిందే.

పూసగుచ్చినట్టు చెప్పడం, వివరణా బాహుళ్యం, వచనంలో రాణిస్తాయేమో గాని కవిత్వానికి మేలుచేయవు. సమగ్రంగా చెప్పబూనడం వ్యాసకర్త లక్షణం. కవికి వన్నె తెచ్చే గుణం కాదది. వచనం మీద, తర్కం మీద అపనమ్మకమే మనిషిని కవిత్వం చెంత చేర్చింది. వ్యావహారిక బుద్ధికి సత్యం అందని మాని పండు అన్న ఎరుకే కవిత్వాన్ని అగ్రస్థానంలో నిలిపింది. ఇంతటి విశిష్ట ప్రక్రియలో, వెనుకటి గుణం మానని కవిగణాలు - బుద్ధికి పట్టం గట్టే వాదాల రొంపిలో మొలకంటా దిగబడుతూనే ఉన్నాయి. అంతలావు గుమ్మడికాయ కత్తిపీటకు లోకువ అన్నట్టు పదునెక్కిన కవి మనసు ఎంతటి భావాన్నైనా నిశితంగా ఛేదిస్తుంది. పాడిన పాటే పాడటం కవి చేయలేని పని. వాడి అన్వేషణ.. గమ్యం.. నవ్యత!

అశ్వ పరీక్ష కన్నా రత్న పరీక్ష కష్టమన్నారు మన ప్రాచీనులు. కారణం గుర్రాల్లాగా ఎక్కడపడితే అక్కడ కనిపించవు రత్నాలు. వాటిని దొరికించుకోవడం దుర్లభం, కావున విలువ కట్టడం దుష్కరం. రత్న పరీక్ష కన్నా కవిత్వ పరీక్ష మరింత కష్టం. ఏ దేశంలోనైనా ఈ ధాతువు బహు సకృతు. చుక్క రాలిపడ్డట్టు, అకస్మాత్తుగా తారసపడుతుంటారు కవులు; అంతేవేగంతో అదృశ్యమవుతుంటారు కూడా.

భూగర్భంలో మగ్గి, మసలి దీర్ఘ నిరీక్షణ అనంతరం చేతిలో పడి మెరిసే వజ్రానికి, కవిత్వానికి అట్టే భేదం లేదు. అనుభవజ్ఞుడే ఇన్ని రాళ్ళ మధ్య దాని పోలిక పట్టగలడు. మిడి మిడి జ్ఞానం గలవాడు రంగురాళ్ళనే రత్నాలుగా భ్రమిస్తాడు, భ్రమింపచేస్తాడు. ఒక్కసారి మెరుగులు దిద్దుకొన్న వజ్రం పగటికాంతితో బయటపడిందా దాని అనేక తలాలు ప్రతిఫలించే కాంతిని చూసి ముగ్ధులు కాని వారు అరుదు. మామూలు గద్యం కాలినడకన వెళుతుంటే, బొటనవేలికి తగిలే రాయిలాంటిది. హృదయ గర్భంలో మగ్గి, మసలి ఘనీభవించిన భావాన్ని కఠోర పరిశ్రమతో బయటికి తీసి, సానబెట్టి, దాని మిరుమిట్లకు కనులు బైర్లు కమ్మి, మూర్ఛిల్లి, నిదానంగా తేరుకొని అనాసక్త ప్రపంచం ముందు.. కవి దాన్ని వేయిరెట్లు అనాసక్తితో ప్రదర్శిస్తాడు. వజ్ర కాఠిన్యం లాంటిదే కవిత్వ కాఠిన్యం. అన్ని తలాలను.. అన్ని కోణాలను సర్వసమగ్రంగా నిశ్చల ఏకాగ్రతతో పరిశీలిస్తే గాని వజ్రతత్వం బోధపడదు. రాయిని పరిశీలించడానికి ఇంత శోధన అవసరం లేదు. ఆ పరిశీలనలో గొప్ప కుతూహలం, ఆనందం కూడా ఉండవు. కారణం అవి ఎక్కడపడితే అక్కడ కాళ్లకు తగులుతూ ఉండటమే. పోతే రాయి - వచనం, గద్యం; వజ్రం - కవిత్వం, పద్యం!!

కవిత్వ పరిశీలనలో విస్మరించకూడని అంశాలు: సదరు రచన కవిత్వమా? కాదా? ఐతే, గీతే ఎంత స్థూలం.. లేదా ఎంత సూక్ష్మం.. భూమి అడుగుపొరల్లో దీర్ఘ ఘనీభవనానికి (condensation) లోను కావడం వల్ల వజ్రానికి విశిష్టాకృతి, పారదర్శకత సిద్ధించినట్టు సదరు కవితలో ఆకట్టుకొనే కాంతిగుణాలేవి? చుట్టూ ఉన్న లోకాన్ని, క్షణం క్షణం మారే కాంతిని అది ప్రతిఫలించగలుగుతోందా? కొంపదీసి మనం వజ్రంగా భావిస్తున్నది అరకు లోయలో దొరికే అణాకాణీ రంగురాయా? భ్రమావరణంలో బయటపడలేనంత బలహీనత ఆవరించలేదు కదా? ?

ఇంత చర్చ ఎందుకు చేయవలసి వచ్చిందంటే.. కవిత్వం కేవలం శబ్దమయం అన్న భావన ప్రబలి ఉండటం వల్ల. కొండ మీదికి ఎక్కాకే ఊరు సరిగా కనిపించినట్టు, నిశ్శబ్ద శిఖరాన్ని అధిరోహించాకే అవలీలగా శబ్ద జగత్తు ఆనవాలు పట్టగలము. జయప్రభ శబ్దకవిత్వాన్ని సమీక్షించడానికి తగిన ప్రాతిపదిక, మానసికరంగం సిద్ధమైనట్టే.

ఇంతవరకూ శబ్దకవులను, నిశ్శబ్ద కవులను వేరుపరుస్తూ ఏకరువు పెట్టిన దుర్లక్షణాలన్నీ ఇబ్బడిముబ్బడిగా జయప్రభ కవిత్వంలో కనిపిస్తాయి. వజ్రసదృశ కవిత్వ సౌష్ఠవాన్ని, ఆకృతిని సిద్ధించుకోలేక పొలమారిన సందర్భాలు కోకొల్లలు. భాషా విచక్షణ కొరవడిన కారణంగా అర్థం గొడ్డుబోయిన సమయాలు లేకపోలేదు. దీర్ఘకాల ఘనీభవనం లేని కారణంగా భూమి పైపొరల్లో పెచ్చులుగా రాలిపడే రంగురాళ్లలా కవితలు అనేకం పాఠకుడి ముందు కాంతివిహీనంగా నిలుస్తాయి.

ప్రేమలో, కవిత్వంలో భాషకు రెక్కలు మొలుస్తాయి. ప్రియురాలితో ఎవడూ ఉపన్యసించడు. పారదర్శకమైన ప్రియురాలి చూపును ఉపేక్షించడు. ప్రతి పదానికి విలువ ఉందన్న సత్యాన్ని మరువడు. అతి కష్టంతో, వినయంతో సకలభావాలకు లోనవుతూ-ఆ ఒత్తిడితో, రాపిడితో పడినలిగిన పదాలను-నక్షత్రాలుగా ఊహాకాశానికి అతికిస్తాడు. వెంటనే ఆ పదాలు మెరవడం చూసి ఆశ్చర్యానికి లోనవుతాడు.. ఇంతప్రేమ.. నీ కవిత్వంలో, నీ భాషలో ఉందా? సున్నితమైన మనసులో జనించే ప్రేమ

నీలో ఉంటే నీ కవిత్వంలోకి నిశ్శబ్దం ప్రవేశిస్తుంది - అనవసర శబ్దాలను చీకట్లో కలుపుతూ.. భాషకు చరమ రూపం అదే. సాదా కర్బనం యుగాల వత్తిడిలో వజ్రాకృతి దాల్చడం అంటే అదే. వేమన వాడి రాగి బంగారమవునన్నా అదే!

శబ్ద కవిత్వమంతా అకవిత్వమా? ఖచ్చితంగా కాదనే సమాధానం దాన్ని మించిన కవిత్వానికి కళ్లు తెరిపించే ఒక  ప్రయత్నమే ఇదంతా!

స్త్రీలకు ప్రకృతిపరంగా సహజంగా ఎన్నో గుణాలు సంక్రమించాయి. ప్రకృతిలో, పిల్లలతో అలవోకగా మమేకమైపోవడం, చిన్న వయసులోనే విపరీతమైన భాషా పాటవాన్ని కలిగి ఉండటం, ఎంపికలో మంచి విచక్షణ, సున్నితత్వం, ఎదుటివారి భావాలను ఇట్టే పసిగట్టడం; మగవాడికి ఇవేవీ అబ్బలేదు. ఇలాంటి విషయాల్లో చాలా మొద్దుగా కనిపిస్తాడు. ఇవన్నీ నిదానంగా పాదుగొల్పుకొని వృద్ధిచేసుకొంటాడు. తమాషా ఏమంటే తనకు సహజమైన ఆదిమ వేటగాడి లక్షణం - స్థలకాలాదుల ఊహాకల్పనకు ఇవి తోడై గొప్ప కవిత్వం పుట్టుకొస్తుంది. ఊహాకల్పనను స్త్రీలు నేర్చ వలసి ఉంటుంది. వారికి అది సహజంగా అబ్బేది కాదు. ఈ లోపమే కవయిత్రుల కవితలు కొంచెం ఎక్కువ దీర్ఘంగా తయారు కావడానికి కారణమేమో అనిపిస్తుంది. కొరడా ఝుళిపించినట్టు క్లుప్తంగా రాసే కవయిత్రులు అన్నా అఖ్మతోవా, కొంత వరకు మాయా ఏంజెలొ, విస్లావా జింబొస్కా తప్ప ఎవరూ కనిపించడం లేదు. కవిత్వానికి మూలభూతమైన ఉద్వేగాలను అనుభవించే తీరు కూడా దీనికి కొంచెం కారణమా? ఇవన్నీ చర్చనీయం.

అమెరికన్ కవిత్వంలో ఎన్నో వివాదాలకు కేంద్ర బిందువైన ఎడ్నా మిల్లేతో పోల్చవచ్చు జయప్రభను. మోహానికి శబ్దాకృతి ఇవ్వడంలో వీరు ఎంతో ఎత్తుకు ఎదిగారు. భాషతోటే వీరి పని. ఆవల ఏముందో గ్రహించగల ఓపిక, తీరిక వీరికి లేవు. ఎందరికో ఎడ్నా మిల్లే ఇష్టురాలు. ఆమె కవిత్వంలోని లయను ఎందరో విమర్శకులు గుర్తుపెట్టుకొన్నారు. ఐతే ఆధునికులు ఆమెను పెద్దగా చదవరు. చాలా ముందుకు వచ్చేశామనుకొంటారు, కానీ అప్పుడప్పుడు ఎడ్నా మిల్లే కవితా సౌధం మీది వింత వెలుతురు వారిని ఆకర్షిస్తూనే ఉంది. శబ్ద జలపాతాలలో ఉక్కిరిబిక్కిరి కావాలనుకొన్న వారు అక్కడ చేరుతూనే ఉన్నారు. ఎడ్నా మిల్లే కన్నా ఎక్కువ ఎన్నదగింది మన కవిత్వప్రభ!

35

# జయప్రభ కవిత్వ విమర్శ-పరిశీలన

రెండు దశాబ్దాలుగా కవిత్వ సేద్యం వెలిగిస్తున్న జయప్రభ.. కవిత్వం పేరిట వట్టి మాటల ఊబిలో కూరుకుపోతే, బొడ్డూడని కవుల గురించి చెప్పుకోవడానికి ఏముంది?? ఈ వైపరీత్యం తెలుగుకవులకే ఎందుకు దాపురించినట్టు?? కవితా నిర్మాణం, భాషా దృష్టి, ప్రతిభాలేశం ఏవీ కనిపించవు వీరి కవితల్లో. దీనికి కారణం ఆత్మవ్యామోహమా (narcissism) ? ఏ రంగంలోనైనా ఇది అక్కరకు వస్తుందేమోగాని సాహిత్యంలో.. అందునా కవిత్వంలో కాదు. ఆత్మ వ్యామోహితుడు ప్రకృతితో, పరిసరాలతో తాదాత్మ్యాన్ని సాధించలేడు. కాళ్లులేని వాడు నడవలేనట్టే, కళ్లులేని వాడు చూడలేనట్టే, తన్ను తాను మరచి తాదాత్మ్యం చెందనివాడు కవికాలేడు. మన కవులకు ప్రక్రియా భేదాల పరిజ్ఞానం బహుసకృతు లేదా శూన్యం. లేదంటే వారు కరపత్రాల సరుకుని, దినపత్రికల మోతను కవిత్వంగా ఎలా చలామణి చేస్తారు? ఎలుగెత్తి అరవడమే రాగం, ఎగిరిదూకడమే నాట్యం! కళకు కావలసిన క్రమశిక్షణ ఏ కోశానా లేదు మన కవివృషభాలకు.. ఏ చేలోపడితే ఆ చేలో అడ్డంగా మేయడమే.. అది గుణమా, దోషమా అన్న ఎరుక, ఇంగితం లేవు. సంగీతము, నాట్యమూ, శిల్పమూ, చిత్రలేఖనము - ఎన్నో ఏళ్ల అభ్యసించి గట్టి సాధన చేస్తేనే గాని ఆయా రంగాల్లో ఎవరినీ మెప్పించలేము. మరి అలాంటిది లలితకళలకు తలమానికమైన కవిత్వంలో నూతన సృష్టి చేయడానికి ఎంతటి పరిశీలన, భాషాశోధన, రస హృదయం అవసరమవుతాయి?? ఎవరూ ఏవీ గుర్తుపట్టినట్టు లేరు. అందుకే ఏ "ప్రముఖ" కవి పుస్తకాన్ని నాలుగు పుటలు తిరగేసినా మనకు అడుగడుగునా ఎదురయ్యేవి స్ఖాలిత్యాలు, భేషజాలు.. కవిత్వం తప్ప మనకందులో ఇతరేతరాలు అన్నీ కనిపిస్తాయి. ఫలానా సంఘటనకు స్పందన అనో, సదరు దురాగతానికి నిరసన అనో, మరొకరి మీద పగ అనో ద్వేషం అనో.. తెలుగు కవికి ఎంతసేపూ పక్కచూపే కానీ, లోచూపు బొత్తిగా లేదన్నమాట. ఈ పాపంలో విమర్శకుల పాలుతక్కువేమీ కాదు. ఉమాకాంతులు, రాళ్లపల్లి, రా. రా లాంటి ఉద్దండులు గతించాక విమర్శ వృక్షం కాసినవన్నీ కుక్కమూతి పిందెలే. కావున నంగిచేష్టలు, నత్తి మాటలే విమర్శగా చలామణి కావడంలో పెద్ద ఆశ్చర్యమేముంది? "ఇది జీవద్భాష.. ఇది సత్కవిత్వం" అని మీమాంసించే నాథుడే లేకుండాపోయాడు. విమర్శలో "ఇది నా దృష్టి. ఇది నా మార్గం - అథ కవిత్వానుశాసనం" అని వాక్రుచ్చే కవిత్వ వైయాకరణుడే కనపడడు.

**ఇక జయప్రభ కవిత్వాన్ని పారజూస్తే..**

**"యుద్ధోన్ముఖంగా"** (1986), ఎండు ఎనభైల్లో వచ్చిన సంకలనం.. ఆ దుర్లక్షణాలన్నీ "వీకంబోవక" దర్శనమిస్తాయి. "పోరాటం, అరుణోదయం, సాయుధ ఉగాది" కొన్ని కవితల పేర్లు మచ్చుకు, కొంత సున్నిత హృదయుడు తారుకొని చావడానికి ఇవి చాలు. నినాద ప్రియత్వం, ఆవేశ ప్రదర్శన, మిమిక్రీ.. ఇత్యాదులు తప్ప - ఇన్ని గొడవల మధ్య - నాకు కవిత్వం అన్న పదార్థం సంతలో తప్పిపోయిన మేకలా ఎంత వెదికినా కనిపించలేదు; ఇసుక తోలగానే ఇల్లు కట్టినట్టు కాదు. మాటలు

పొగుచేయడమే కవిత్వం కానేరదు. ఇందులో కవిత్వానికి అవసరమైన దీర్ఘ నిరీక్షణాలేదు.. తీవ్ర ఘనీభవనం లేదు. మాటలు కోటలు దాటడమే తప్ప కవిత్వాన్ని సృజించిన పాపాన పోలేదు. "శ్రీ శైలం లోయలో" ఆరు పేజీల మేరా విస్తరించిన "వచన" కవితలో కవయిత్రి సొంతగొంతు వినిపిస్తుంది - ముందు ముందు ప్రేమానుభవాలు అందించబోతోంది అన్న దానికి సూచనగా.. ఐతే ఉదహరించవలసిన స్థాయికి చెందిన కవితలు ఇందులో లేకపోవడం.. చింతనీయం!

"వామనుడి మూడో పాదం" (1988), పేరు చూడగానే కవయిత్రికి పురాణ ప్రతీకలంటే విపరీతమైన మోజు అని తెలిసిపోతుంది. ముందు ముందు అది ఎలా వికటించిందో అర్థం చేసుకోవడానికి ఈ మాత్రం ప్రస్తావన చాలు. ఇందులో మొత్తం 36 కవితలు. వజ్రంలా గట్టిపడి.. కొనదేలిన కవిత మచ్చుకు కనిపించదు. పఠాభి లాంటి వారు ఎంపిక చేసిన "చూపులు, పైట తగలెయ్యాలి, స్వర్గానురాగాన్ని ఆలపిస్తూ" కవితల్లో కూడా వాచ్యగుణం కవిత్వాన్ని పూర్తిగా కృంగదీసింది. పూసగుచ్చినట్లు చెప్పడం, వివరణా బాహుళ్యం వచనంలో రాణిస్తాయేమో గాని కవిత్వానికి మేలు చేయవు. ఇక్కడ జరిగిందదే.. పాఠకుల అవగాహనాశక్తిని తక్కువ అంచనా వేసి వారి ఊహకు ఏమీ వదలకపోవడం.. ప్రధానలోపం.. "పైట తగలెయ్యాలి" అన్న కవితను విశ్లేషిద్దాం..

నీ కనుల ముందు కనిపిస్తున్నది పైట, కనిపించనిది - దాన్ని కల్పించిన సమాజం లేదా వ్యవస్థ. కనిపించే వస్తువు మూర్తం (concrete); కనిపించని వస్తువు అమూర్తం (abstract). కాబట్టి వ్యవస్థను తూర్పారబట్టడానికి చేతుల్లో ఉన్న సాధనం పైట. ఇంకొక విషయం, ఒక వస్తువు తాలూకు పదజాలంతో మరొక వస్తువు గూర్చి చెప్పడమే శిల్పం (technique). కళ్లకు కనిపించే పైట తాలూకు పదాలతో, కనిపించని వ్యవస్థను విమర్శించాలి. పైట తన స్వేచ్ఛను ఎలా కొల్లగొడుతుందో చెబుతూ, దాని పట్ల కోపాన్ని, అనిష్టాన్ని వాచ్యంగా వెల్లడించవచ్చు, అంతేకాని పైటవాడకానికి కారణమైన వ్యవస్థను మాత్రం వాచ్యంగా దూషించరాదు, కారణం - అది వ్యంగ్యంగా వెల్లడి కావలసిన అంశం. పైట మీది వ్యతిరేకత, వ్యవస్థ మీది వ్యతిరేకతగా వ్యక్తం కావాలి. అంతేగాని ఎక్కడా కనిపించని సమాజం లేదా వ్యవస్థ మీద Don Quixote లా కత్తులు దూస్తే లాభం లేదు. అది శిల్ప పరిజ్ఞానంలో ఓనమాలు తెలియని వారు చేయవలసిన పని.

పైట గురించి అభిప్రాయాలు వెల్లడించడానికి ఇది సందర్భం కాదు, దానికి విడిగా - అలనాటి శాతవాహన పట్టణం పైఠాన్‌లో బయల్దేరిన వస్త్ర నాగరికతలో భాగంగా పైట (పైఠాన్ నుండి పుట్టినది, కాబట్టి పైట), ఏలుబడిలో వున్న అన్ని ప్రాంతాలను ఎలా ఆకట్టుకొందో, అవసరమైన ప్రాకృతాధారాలతో - ఒక వ్యాసం లిఖించవచ్చు.

*పైటని తగలెయ్యాలి*

*పైట కొంగును చూస్తే*

*నాకెందుకో*

పాతివ్రత్యం గుర్తొస్తుంది!
భుజాలనించి కిందికి వేలాడే
గుదిబండలా అదెప్పుడూ నా స్వేచ్ఛని హరిస్తూనే ఉంటుంది!
నన్ను
నిటారుగా నిలవనివ్వక
పైట
నా గుండెలపై తన అంచుల చేతులాన్చి
నన్ను వంగదీయాలని చూస్తుంది
నాకు అలవాటు లేని
సిగ్గును మప్పుతుంది
ఏదో కంగారు పిట్టలా
నా చుట్టూ తిప్పుతుంది
నువ్వు ఆడదానివంటూ
హిప్నటైజ్ చేస్తుంది
నేనూ మనిషినన్న భావాన్ని
నా చేత మరిపిస్తుంది
నా చేతులతో
రెండు భుజాలనీ చుట్టి
ఈవిడ మహాపతివ్రత సుమా
అంటూ రెపరెప లాడుతుంది
కాదంటూ అరవాలనుకుంటాను
కానీ గొంతు పెగలదు
దాని ముందు నేనెప్పుడూ

ఓడిపోతూనే ఉన్నట్లుంటుంది

పైట

ఊబిలా నన్ను గుంజేస్తూ ఉంటుంది

పైట

సుడిగాలిలా నన్ను తోసేస్తూ ఉంటుంది

నా మీద

తరాల నుంచీ మోపిన

అపనింద పైట

నన్ను అబలని చేసిన

పితృస్వామ్యపు అదృశ్యహస్తం పైట

దోపిడీ సంస్కృతి

నా వ్యక్తిత్వాన్ని శవంగా చేసి

దానిపైన కప్పిన తెల్లదుప్పటీ పైట

నేను నడిచే శవాన్ని కాకుండా ఉండాలంటే

ముందుగా పైటని తగలెయ్యాలి

పైటని తగలెయ్యాలి

"పైటకొంగుని చూస్తే / నాకెందుకో / పాతివ్రత్యం గుర్తొస్తుంది" అని మంచి వ్యంగ్యంతో మొదలై, పైట / ఊబిలా నన్ను గుంజేస్తూ ఉంటుంది, పైట / సుడిగాలిలా నన్ను తోసేస్తూ ఉంటుంది" అన్న వాక్యం దాకా సమర్థంగా నడిచి

"నా మీద

తరాలనించి మోపిన

అపనింద పైట

నన్ను అబలను చేసిన

పితృస్వామ్యపు అదృశ్యహస్తం పైట

దోపిడీ సంస్కృతి

నా వ్యక్తిత్వాన్ని శవంగా చేసి

దానిపైన కప్పిన తెల్లదుప్పటి పైట "అని వాచ్యంగా తేలిపోతుంది.

ఈనగాచి నక్కల పాలు చేయడం అంటే ఇదే.. understatement లోని అందాన్ని, anti climax లోని లోతునీ తెలిసిన ఎవరూ మంచి ఎత్తుగడను ఇలా కొల్లగొట్టుకోరు. ఈ వాచాలత (talkiness) ఐదు పుస్తకాల్లో ఇబ్బడిముబ్బడిగా కనిపిస్తుంది. కవి అన్నవాడు కంసాలిలా సున్నితపుత్రాసులో తూకంవేసుకొని మాటలను బహు జాగ్రత్తగా, బంగారంలా వాడుకోవాలి. అంతేగాని, బొగ్గుల్లా చల్లేసుకోకూడదు. మాంసం తిన్నంత మాత్రాన పేగులు మెడలో వేసుకొని తిరగాలా? పితృస్వామ్యపు భావజాలానికి వ్యతిరేకంగా వ్రాసినంత మాత్రాన ఆ భావాన్ని వాచ్యం చేయవలసిన పని లేదు. ఇదో పెద్ద శిల్ప దోషం..

ఈ సంకలనంలోదే మరొక్క కవిత

స్పర్శానురాగాన్ని ఆలపిస్తూ

స్పర్శ ప్రవహించిన ప్రాంతమంతా

అణువులన్నీ అరవిచ్చుకొంటాయి

నెమ్మది నెమ్మదిగా

ఒకదానితో ఒకటి సంభాషించుకుంటాయి.

మాఘమాసపు చలిలో కూడా

కవోష్ణ కేంద్రాలౌతాయి.

స్పర్శ ప్రవహించిన మేర

జీవనదీ జలాలౌతాయి

ఒక్కోసారి

నీ స్పర్శలో

నాకు మాత్రమే తెలిసే

సంకేతాలుంటాయి

ఏ యుగాల నాటివో తెలియని

లిపి సముదాయాలుంటాయి
స్పర్శ
నిశ్శబ్దంలో మోగిన నాదంలా ఉంటుంది
శూన్య నిశీధిన వ్యాపించిన
చుక్కల సమూహంలా ఉంటుంది
అడవిపూల వాసనలో తేలివచ్చే
గుర్తు తెలియని పక్షి పాటలా ఉంటుంది
స్పర్శతో నిండిన శరీరం
అలల రాగాలు ఆలపించే సముద్రంలా ఉంటుంది
స్పర్శ ప్రాణమై నాలో కదిలేవేళ
ఎప్పుడూ నేను ఒంటరిగానే ఉంటాను
నాలో నేనై
సమూహంలో నేనై
సమస్త విశ్వమూ నేనై
స్పర్శానురాగాన్ని ఆలపిస్తుంటాను
రాత్రిలో కూడా
నీపెదవులానిన ప్రాంతమంతా
తూర్పులా ఉదయిస్తుంది
నీ కొనగోరు తగిలిన శరీరం
తీగలా కంపిస్తుంది
నేను అలా నిన్ను పిలుస్తూ ఉంటాను
స్పర్శానురాగాన్ని ఆలపిస్తూంటాను
అయినా
ఎందుకో మరి

నీ స్పర్శలో దీపించే నేను

నా స్పర్శలో జ్వలించే నీవు

ఎప్పుడూ దూరంగానే ఉంటాము

పృథ్వీ ఆకాశాలమై!

స్పర్శ గురించిన వివరణ, వ్యాఖ్యానం, ప్రియస్పర్శాశ్రేష్ఠత, అలా ఉంటుంది, ఇలా ఉంటుంది అని నానా పోలికలు. చివరి పద్యాల్లో అసలు విషయం. మొదటి నాలుగు పద్యాల్లో చాలా భాగం లేకపోయినా అర్థస్ఫురణకు వచ్చిన చిక్కేమీలేదు. కవిత్వమంటే లంబాడా నృత్యంలా కాస్త ఘనంగా ఉండాలన్న తత్త్వజ్ఞానం తలకెక్కడం వల్ల గాబోలు.. ఇంత అవస్థ. కవిత్వానికి ఒక రూపు, నిర్మాణం ఉంటాయన్న స్పృహ లేకపోవడం, పాఠకుల యుక్తిని తక్కువ అంచనా వేయడం ప్రధాన లోపాలు. చైనీస్ జపనీస్ కవుల నుండి మనవారు క్లుప్తతా పాఠాలను నేర్వవలసినదే.. లేదంటే మన పాలిట అపర భిషక్కులై కూచుంటారు. ఇదే కవితను క్లుప్తతా ప్రమాణాలను పాటించే (జపనీస్ కవితా సంప్రదాయాలను వంటబట్టించుకున్న) కవి రాయవలసివస్తే? వివరణలు, వ్యాఖ్యలు ఉండవు, విసుగు తెప్పించే పోలికలు, వర్ణనా ఉండవు. అమూర్త భావనా ఉండదు. భాష ఇంత వదులుగా కూడా ఉండదు.

శస్త్రధారి అర్జునుడికి కొట్టవలసిన పక్షికన్ను మాత్రమే దర్శనమిస్తే, ఇతర కురుపాండవులకు చెట్టూ, పక్షి, సమస్తమూ అగుపించాయి. అర్జునుడిలా ఒక్క ఉదుటున ఆలోచనకు తావీయకుండా కొట్టడం కవి అన్న వాడు చేయదగిన పని. లేదంటే నీవు చేసే అలజడికి పిట్ట పారిపోతుంది, నీకు దక్కవలసినది దక్కదు!! కవిత్వం ఆపాత మధురం కాదు, ఆలోచనామృతమే, పాఠకుడు మళ్లీ మళ్లీ తరచి తరచి చదివి లోతు లెరగాలంటే, కవిత ఇతరేతరాల ప్రమేయం లేకుండా క్లుప్తంగా ఉండటం ముఖ్యం.. కాబట్టి మొదటి నాలుగు పద్యాలు అందులో కనిపించవు, కేవలం చివరి రెండు. ఒక ఘట్టం.. ఒక దృశ్యం.. మిగిలిన గొడవంతా పాఠకుడికే వదిలేయడం.. వాడి ఊహ పారిన మేర వాడుకవితను అనుభవిస్తాడు. అరటిపండు వలిచిపెట్టే ధోరణి ఏ రంగంలోను పనికి రాదు. మొత్తం కవితంతా ఇంతే.. రెండు పద్యాలే..

(అప్పుడు కవిత ఇలా ఉంటుంది)

రాత్రిలో కూడా

నీ పెదవులానిన ప్రాంతమంతా

తూర్పులా ఉదయిస్తుంది

నీ కొనగోరు తగిలిన శరీరం

తీగలా కంపిస్తుంది

నేను అలా నిన్ను పిలుస్తూ ఉంటాను

స్పర్శానురాగాన్ని ఆలపిస్తుంటాను

అయినా

ఎందుకో మరి

నీ స్పర్శలో దీపించే నేను

నా స్పర్శలో జ్వలించే నీవు

ఎప్పుడూ దూరంగానే ఉంటాము

పృథ్వీ ఆకాశాలమై!

ఈ సంకలనంలో, చెట్టు గుండెలో కొంగలు, స్త్రీవాద స్వరాన్ని వినిపించే చూపులు ఏ కత్తిరింపులు (pruning) అవసరం లేని కవితలు. మైదానంలోకి వెళ్లమంటాను, ఇసుకలో పారేసుకున్న ఉంగరం, తొలకరిలో ఒకరాత్రి, అనుభవం ఎంత ప్రాచీనం, ఎప్పుడూ ఒంటరిగా, చాలా కత్తిరించవలసిన కవితలు. ఉదాహరణకు ఒక విశ్లేషణ..

**మైదానంలోకి వెళ్లమంటాను**

ఎవరైనా నన్నడిగితే

ఒక్కసారి

మైదానంలోకి వెళ్లమంటాను

చిన్న చిన్న రాళ్లగుట్టల్లో

జ్ఞాపకాల నిధులను

పదిలపరచుకోమంటాను

మట్టిరోడ్ల పక్కనే

పొదల్లోని ఆకులు

పలికే రాగాలని

ఒకసారైనా వినమంటాను

అవును

ఒక్కసారైనా,

ఒకే ఒక్కసారైనా
మబ్బుల నీడలుపరుచుకొన్న
మైదానంలో నిలిచి
స్వేచ్ఛగా పెదవులని
పెనవేసుకోమంటాను
ఏవో మాట్లాడే కళ్లకి
పెదవులతో
మౌనాన్ని నేర్పమంటాను
ఎన్ని వేల విద్యున్మాలికలను
నరాలు ధరించగలవో
ప్రయత్నించి చూడమంటాను
ఎందుకంటే
ఎప్పుడైనా అన్పిస్తుందేమో
ఇక బతకలేనని
పోరాడలేనని
కానీ
సముద్రం లాంటి జీవితం లాగే
పోరాటమూ అవిశ్రాంతమే
ఒంటరిగా
జీవితాన్ని ఈదటానికి
మనిషికి నమ్మకం కావాలి
ప్రేమ కావాలి
జ్ఞాపకాలు కావాలి
మట్టిలో రేణువుగా మారేటందుకు

మళ్లీ మొలకెత్తేటందుకు

ఏ మనిషికైనా

*మైదానాలు కావాలి!*

మైదానంలోకి వెళ్లమని మొదటి ఐదు పద్యాల్లో బలంగాను, ప్రియంగాను చెప్పి - ధర్మతత్వజ్ఞుని స్వరంతో "ఎందుకంటే" అని మొదలుపెట్టి, ఇంతలో మళ్లీ "కానీ" అని కప్పదాట్లు కొట్టి.. ఏమి కావాలో ఏకరువు పెట్టడం, చివరగా పాలమారిన మార్క్సిస్టు గొంతుకతో "ఏ మనిషికైనా మైదానం కావాలి" అని ముక్తాయింపు. జయప్రభ కవిత్వంలో చిక్కంతా ఇక్కడే ఉంది. "మైదానంలోకి వెళ్లమంటాను" అన్న తర్వాత మొదటి నాలుగు పద్యాలైనా ఉండాలి, నీవు భావాన్ని పదచిత్రాలతో (imagery) పేర్చదలచుకొంటే. (అప్పుడు కవిత ఇలా ఉంటుంది)

**మైదానంలోకి వెళ్లమంటాను**

*ఎవరైనా నన్నడిగితే*

*ఒక్కసారి*

*మైదానంలోకి వెళ్లమంటాను*

*చిన్న చిన్న రాళ్లగుట్టల్లో*

*జ్ఞాపకాల నిధులను*

*పదిలపరచుకోమంటాను*

*మట్టిరోడ్ల పక్కనే*

*పొదల్లోని ఆకులు*

*పలికే రాగాలని*

*ఒకసారైనా వినమంటాను*

*అవును*

*ఒక్కసారైనా,*

*ఒకే ఒక్కసారైనా*

*మబ్బుల నీడలు పరుచుకొన్న*

*మైదానంలో నిలిచి స్వేచ్ఛగా పెదవులను*

*పెనవేసుకోమంటాను*

ఏవో మాట్లాడే కళ్లకి
పెదవులతో
మౌనాన్ని నేర్పమంటాను
ఎన్నివేల విద్యున్మాలికలను నరాలు ధరించగలవో
ప్రయత్నించి చూడమంటాను
లేదా చివరి నాలుగు పద్యాలైనా ఉండాలి, నీవు భావాన్ని సాదావాక్యాలతో *(statement)*
వేల్పరిచుకొంటే. (అప్పుడు కవిత ఇలా ఉంటుంది.)
ఎవరైనా నన్నడిగితే
ఒక్కసారి
మైదానంలోకి వెళ్ళమంటాను
ఎందుకంటే
ఎప్పుడైనా అన్పిస్తుందేమో
ఇకబతకలేనని
పోరాడలేనని
కానీ
సముద్రంలాంటి జీవితం లాగే
పోరాటమూ అవిశ్రాంతమే
ఒంటరిగా
జీవితాన్ని ఈదటానికి
మనిషికి నమ్మకం కావాలి
ప్రేమ కావాలి
జ్ఞాపకాలు కావాలి
మట్టిలో రేణువుగా మారేటందుకు
మళ్ళీ మొలకెత్తేటందుకు

*ఏ మనిషికైనా*

*మైదానాలు కావాలి !*

అంతేకాని, ఒకే కవితలో రెండూ పొసగవు. figurative language కి, statement కి తేడా తెలియని confusion అంటే ఇదే మరి. పైన పేర్కొన్న కవితల్లో ఇవే తరహా చిక్కులే !! 'చిత్ర గ్రీవుడా రా,చిట్లిన గాజుల మౌనం, ఆ ఒక్క నిమిషం' అన్న కవితలు ఎన్నదగినవే. కానీ శాబ్దికత (Verbosity) వల్ల డీలా పడినవి. ఇలా ఒక 36 కవితల్లో కవిత్వం గీటురాయి మీద నిలువగలిగినవి.. ఒకటి రెండే అని తేలడం మన తెలుగులో కవితా నిర్మాణ ఉపజ్ఞకు నిదర్శనం !!

**ఇక్కడ కురిసిన వర్షం ఎక్కడి మేఘానిది ??**

ఇందులో ఒక నలభై కవితలు, కవయిత్రి అమెరికాలో ఉన్నప్పుడు రాసినవి. ఇందులో చక్కటి కవితలు ఒక నాలుగు-మోహాలకీ ప్రవాహాలకీ వేగం లేదు, యోగనిద్ర, నీడల నుండి తప్పుకొంటాను, ఉమా నీ పుట్టినరోజు. వీటన్నిటిలో చలించే పాదరసంలాంటి మనసు గతులను పట్టుకోవడంలో మంచి నేర్పు కనిపిస్తుంది. సబ్బు నురగల్లా దృశ్యానికి మబ్బులు అడ్డుపడితే, మిసిసిపి ఓడరేవు, కల, పార్టీ, మకరముఖం, ఆ అమ్మాయి, సాయంత్రం - నేను - ఏడు కవితల్లో మంచి వాతావరణ కల్పన కనిపిస్తుంది. 'నేనుకూడా బయటికి పొగలిగితే, గాజు నేలమీద దొర్లిపోయిన పగడాన్ని' గడుసుదేరిన స్త్రీవాద స్వరాన్ని వినిపిస్తాయి. ఇక్కడ కురిసిన వర్షం ఎక్కడ మేఘానిది, నువ్వునిజంగా సౌమిత్రివి, నేను ఈ నాటిదాన్ని, శరీరమంటే సరాగాలనుకొంటారు, వంగిన నల్లరేగడి భూమి అదేక్రమంలో అధికంగా కత్తిరింపు అవసరమైన కవితలు. ఇవికాక మిగిలిన ఇరవై కవితలు మోతబరువు. మనకు కొంత జనరల్ నాలెడ్జి, జర్నలిజం పట్ల ఆసక్తిని పెంచుతాయి; అంతేగాని కవిత్వగుణాలకోసం ఎన్నదగినవి కావు. నాకు చూడగా జయప్రభ కవిత్వంలో ప్రధాన లోపం వాచాలత. చెప్పేదేదో బలంగా చెప్పాలన్న ఆత్రుతతో శిల్పాన్ని విస్మరించడం..ఒక విశ్లేషణ..

**ఇక్కడ కురిసిన వర్షం ఎక్కడి మేఘానిది?**

*సరిహద్దులు గీసుకొన్నవి*

*మనుష్యుల స్వార్థాలు కాని*

*దూకే సెలయేళ్ళు కావు*

*అడవులూ,జలపాతాలు కావు*

*ఇక్కడ కురిసే వర్షం*

*ఎక్కడి మేఘం మోసిందో*

*గుర్తించగలిగిన వాళ్లుంటే రండి*

*భూమి విశ్వరూపాన్ని*

*ముక్కలు చెక్కలు చేస్తున్నవి*

*మతాలు మంత్రాంగాలూను*

*నిజంగా సరిహద్దులు చెరిపేయగలిగితే*

*ప్రపంచానికి*

*నేలా నీరుగాలీ అందరివీ గానీ*

*ఏడు ఖండాలుగా విడిపోయిలేవు..*

'సరిహద్దులు గీసుకొన్నవి దూకే సెలయేళ్ళు గావు, అడవులూ జలపాతాలు గావు' అని చెప్పడం figurative language లో భాగం. 'మనుష్యుల స్వార్థాలు కాని' అన్నవాక్యం (statement) ఇక్కడ పొసగదు. మన ముందున్నవి రెండు.. మనిషి ప్రకృతిని కీర్తిస్తే చాలు, సూచనప్రాయంగా మనిషి అల్పత్వాన్ని చెప్పినట్టే. అలాగే మనిషి అల్పత్వాన్ని ఆనవాలుపడితే, ప్రకృతి అనంతత్వాన్ని గౌరవించినట్లే. 'ఇక్కడ కురిసే వర్షం ఎక్కడి మేఘానిది గుర్తించగలిగే వాళ్ళుంటే రండి' ఇదేదో మూర్తంగా (concrete) ఉంది అని మురిసిపోతుంటే -- 'భూమి విశ్వరూపాన్ని ముక్కలు చెక్కలు చేస్తున్నవి మతాలు మంత్రాంగాలూనూ' అన్న లాయర్ గొంతు.

చిత్రకారుడు ఏదైనా వస్తువుని ఒక కోణంలో చూస్తూ ఒక చిత్రాన్ని గీస్తాడు. ఒక కోణంలో నచ్చకపోతే ఇంకొక కోణం. ఒకే వస్తువుని వివిధ కోణాల్లో దర్శించి వివిధ చిత్రాలు గీస్తున్నాడు. ఫొటోగ్రఫీ అయినా అంతే. అభిప్రాయాలను, అమూర్తభావాలను తొలగించి వీలైనంత కళ్ళకు కట్టినట్లుగా అంటే మూర్తంగా (concrete) రాయడం కవి అభ్యసించవలసిన విద్య. ఇది అలవడకపోవడం వల్ల కలగా పులగంగా, మూర్తా మూర్తాలను (concrete-abstract) కలిపిరాయడం శిల్ప పరమైన పెద్ద దోషం. జయప్రభ కవిత్వమంతటా వ్యక్తమయ్యే ప్రధాన శిల్పదోషమిదే.

పైన పేర్కొన్న వాక్యాలను తొలగించి చదివితే.. అదే కవిత..

*సరిహద్దులు గీసుకొన్నవి*

*దూకే సెలయేళ్ళు కావు*

*అడవులూ, జలపాతాలూ కావు*

*ఇక్కడకురిసే వర్షం*

*ఎక్కడి మేఘం మోసిందో*

*గుర్తించగలిగిన వాళ్లుంటే రండి*

*నిజంగా సరిహద్దులు చెరిపేయగలిగితే*

*నేలా నీరుగాలీ అందరివీ గానీ*

*ఏడు ఖండాలుగావిడిపోయలేవు..*

జయప్రభ మంచికవితల్లో కనిపించే శిల్పం గురించి ఒక్కమాట. సరితూకం గల పదాలను ఎంచుకొని మంచి లయను సాధించడంలో గొప్ప నేర్పు కనిపిస్తుంది.

**ఉమా నీ పుట్టిన రోజు**

*మంచు రాత్రీ.. మల్లెమొగ్గా*

*మొగలి రేకు.. మందార పువ్వు*

*జలపాతం.. చంద్రకాంతం*

*వెండి ఎండా.. వెన్నెల వాకా*

*సాగరతీరం.. చందనగంధం*

*ఉషస్సంధ్యా.. తొలకరి జల్లూ*

*ఉమా ! నీ పుట్టినరోజు!*

స్త్రీల పాటల్లో, జానపద గీతాల్లో ఇటువంటి లయనే గమనించవచ్చు. ఈ శిల్పంలో ప్రమాదం లేకపోలేదు, శబ్దం దగ్గరే పాతుకుపోయి కవిత్వంలో నిశ్శబ్దాన్ని గుర్తించలేకపోవడం. పదాల పోహళింపే కవిత్వం కాదు కదా - ఏ భాషలోనైనా..

**యశోధరా వగపెందుకే**

ఎడ్నా మిల్లేతో పోలుస్తూ 'మోహానికి శబ్దాకృతి ఇవ్వడంలో ఎంతో ఎత్తుకు ఎదిగారు' అన్న నా వాక్యానికి బలం చేకూరుస్తూ.. ఆణిముత్యాల్లాంటి కవితలు ఐదు.

జీవితంలో ఏదో జరగబోతుందన్న ఆశని..

*'అష్టదళ పద్మంలాగో అమృతంలాగో*

*సంధ్యాకాశంలాగో వింధ్యా శిఖరంలాగో*

*సజల నయనం లాగో సాప్తపదీనంలాగో*

*జీవితం మారుతుందని ఎదురు చూడటం ఒకందుకే*

*ఒక మనోహర దృశ్యానికి*

*ఒక సంచిదానందానికి..' (సంచిదానందానికి)*

జయప్రభ కవితల్లో రాత్రికి గొప్ప స్థానం ఉంది. ఆశ్చర్యం లేదు భావుకత్వానికి మూలం రాత్రి !!

'.. ఏవో అతిపురాతన ఆత్మలని ఆవాహన చేస్తే
అవి లక్షల మిణుగురుపురుగులై వచ్చి
వృక్ష శాఖల్లో దూరి ప్రతి రెమ్మ చివరా
తళుకు తళుకు తళుకున మెరిసిన
భయద సౌందర్యమో ?.. (బహుళ చతుర్దశిరాత్రి)

అతి సున్నితమైన ప్రేమానుభవం

'..ధ్వజస్తంభపు చిరుగంటలో
నీ చిరునవ్వులూ కలిసి
నా చెవుల్లో లీలగా వినిపిస్తాయి..' (గుండెలో పొగమంచు)

జలపాత స్నానపు హోరు వినిపించే కవిత..

'..కోమలం కాదు
మలయ పవన రాగం కాదు
హాయి కాదు ఆహ్లాదం కాదు
అయినా ఆనందమే..' (జలపాతస్నానం)

ఇన్ని మోహాల మధ్య దిగులు సహజమే

'.. తెరచాటు మోహంలా
దిగులు
ఎత్తైన రెండు కొండల నడుమ
వింధ్యాటవీ శాఖల్లో
నీలకాంతిలా దిగులు ..' (నీలకాంతిలా దిగులు)

అలాంటప్పుడు వేసవి పగళ్ళే నయం !!

'ప్రజ్వరిల్లిన పొద్దుతిరుగుడు పూవు
నీ దిక్కుగా తిరిగి తిరిగి

ప్రాణం పసివాడుతుంది' (ఈ వేసవి పగళ్ళే నయం కదా)

**Feminist** గొంతుతో రాసిన అంతా అంతే, అమ్మమ్మ స్వగతం, యశోధరా వగపెందుకే, ఫరవాలేదనిపిస్తాయి. 'నాన్న లెందుకు రారు?' ఆవేశాల కుమ్మరింతలో క్లుప్తత హుళక్కి. వలసపోనని పక్షి వాగ్దానం చేయదు కదా, బొత్తిగా లేడి కూనలమైపోయి, మంచి కవితలైనా ముగింపు శిల్పం కొరవడింది. విశ్లేషణలోకి వెళితే-

*వలసపోనని పక్షి వాగ్దానం చెయ్యదు కదా?*

*ఎక్కడో ఆకాశంలో అల్లంత ఎత్తున*

*కన్పిస్తూ కనుమరుగౌతూ*

*పక్షి ప్రదక్షిణలు చేస్తుంది*

*సంధ్య వేళ*

*ఒక్కరూ అయిపోయి*

*నది మధ్యలో రెల్లుదుబ్బూ*

*ఆకురాలిన చెట్టూ కలిసి తాళలేక*

*పక్షి కోసం పాడతాయి*

*అలా ఎగిరిపోతే మళ్ళా*

*వసంతం దాకా రాదేమోనని వాటి బాధ*

*వలసపోనని పక్షి వాగ్దానం చెయ్యదు కదా !*

*ఎత్తుకి ఇంకా ఎత్తుకి పోతుంది*

*నేనే ఎగరగలనని పెద్ద బడాయి దానికి*

*ఏం చేద్దాం చెప్మా ? ఎంత పిలిచినా రాదు .. ! !*

*గూట్లో జాంపండు మగ్గిపోతోంది*

*గూట్లో పక్షికూన ముడుచుకుంటోంది*

*ఒసేయ్*

*ఆ గడుగ్గాయి పడుచుపిల్లని గాలిపడగ నెగరెయ్యమను*

*రివ్వు రివ్వున పైకి పోయి*

దాని రెక్క పుచ్చుకు చక్కా వస్తుంది !

ఆకాశంలోని చిన్నగా కనిపిస్తూ ఎగిరే పక్షి, ఎండు పరిసరాలు, చెట్లు, ఆహా చిత్రకారుని ప్రజ్ఞ కనిపిస్తుంది కదా కవయిత్రిలో అని ఒక్క క్షణం ఆనందం, అంతే.. వడగాలి వీచినట్టు ఇబ్బంది.. వెంటనే అలవాటైన వాచాలత ! !. వలసపోనని పక్షి వాగ్దానం చేయదు కదా.. ! (11వ లైను) అన్న వాక్యంతోటి కవిత ముగిసిపోయింది, చాలామంది అజ్ఞానులకు కానీ కవయిత్రికి కాదు, కాబట్టి ఆ పక్షి మనసులోని రహస్యాలు, దాన్ని క్రిందికి తీసుకువచ్చే అద్భుతమైన గాలిపటం టెక్నాలజీలను ఏకరవు పెడుతూ మరో 10 పంక్తులు వృధా (పక్షి శాస్త్రజ్ఞుడు, డా. అలీ, చచ్చి ఎక్కడున్నాడో పాపం, మహానుభావుడు బ్రతికి ఉంటే ఎంత ఆనందపడేవాడు, రవి గాంచనిచో కవి గాంచును కదా).

దీర్ఘ నిరీక్షణ, తీవ్ర ఘనీభవనం కవిత్వానికి ప్రాణం అని మన కవులకు అర్థమయిన రోజు - రాయగానే అచ్చొత్తించే ప్రలోభం, ప్రతి ఊరకుక్క అరుపుకు స్పందించే బలహీనత - వదులుకొని మృత్యువును, కాలాన్ని హేళన చేసే కవితా ఖండాలు సృష్టించలరు. లేదా రాను రాను రాజగుర్రం గాడిదైనట్లు, అందం, పొందికా లేని అర్భకరాతలు వెలయిస్తూనే ఉంటారు.

ఇలా 42 కవితల్లో ఎన్నదగినవి ఒక్క పది! మిగిలినవన్నీ షరా మామూలే - కేవలం శబ్దాలు కవిత్వంగా చలామణీ కాలేవు. క్లుప్తతకు మారుపేరు అనదగ్గ పోలిష్ కవయిత్రి అన్నా స్విర్జిన్స్కా వాక్కు.

'మొదలు, నీ కంటూ ఒక శైలి నిర్మించుకోవాలి, రెండు దాన్ని ధ్వంసం చేయాలి రెండవది చాలా కష్టం..' శైలి ఉందనడానికి నిదర్శనం. తిరుగులేని క్లుప్తత.

ఒక దశలో కవి తన శైలిని పాతిపెట్టి, దాన్నుండి మొలకెత్తే ఇంకో శైలిని పసిబాలుడిలా తిలకిస్తాడు.. మన ప్రముఖ కవుల్లో చాలా మందిలాగే జయప్రభ ఇంకా మొదటి శైలి లోనే రాటుతేలవలసి వుంది.

చివరిగా **చింతల నెమలి** (1997) ఇందులో 88 కవితలు. మోహోద్వేగ కవితలు ఒక ఐదు. పూలదారుల పార్థివాకృతి, ఆందోళనా భ్రమర గీతం, ఈ కోరిక, వెన్న చిలికినంత వడిగా, మళ్ళీ ఇది కొత్త చిత్రమే. ముందు ప్రస్తావించిన కవితల స్థాయిలో ఉన్నది 'పూలదారుల పార్థివాకృతి' మాత్రమే.

పట్టుబట్టే పైరుగట్టున
నిత్యమల్లీ నీడచాటున
పూలదారుల పార్థివాకృతి
పొంచినదెవరో

సుందరయ్య గ్రంథాలయ
A.C. No 83777
హైద...బాద్-500 044.

మిగిలిన కవితలు వాచాలత కారణంగా అంత ఉజ్జ్వలంగా లేవు. ఈ పుస్తకంలో గమనించదగ్గ మార్పు, పాత రోజుల స్త్రీల పాటలు, రోకలి, దంపుళ్ళ పాటలకు సాటిరాగల ఐదు లయబద్ధమైన

గీతికలు - శివుడి నెరజాణ, పాపాయి జోల, నవధాన్య సీమ, నువ్వెగిరి వచ్చిన ఉద్యానపు ఊరేమిటి?, గాలి గుర్రము జాలు పట్టుకొని మొదటి నాలుగు గానయోగ్యం గాన, మును ముందు పిల్లల పాఠ్యపుస్తకాల్లో చేర్చినా ఆశ్చర్యం లేదు. ఈ లయబద్ధతే జయప్రభను ఎడ్నా మిల్లే (పులిట్జర్ పురస్కారం పొందిన మొదటి కవయిత్రి) సరసన నిలబెట్టేది.

*'.. పొగమంచు తొలిఝాము*

*చలిమంట వాకిలి*

*పొదరింట నిదురించు*

*నెలవంక జాబిలి ..' (పాపాయి జోల)*

'తెలిసీ తెలియని చిట్టడవుల్లో' టీనేజి అమ్మాయిల మనసునుతెలిపే కవిత. వ్యక్తి చిత్రణ (Portraits) గురించి చెప్పి తీరాలి. కుంతిని మొదలుకొని, తస్లీమా దాకా ఒక పదిమంది portraits. ఎందుటా రాణించలేదు. కారణం శిల్పదోషం.. వాంగో portrait లో తననే చిత్రించినా, లేదా తన postman ను చిత్రించినా, కేవలం అక్కడితో ఆగిపోలేదు; వ్యక్తి పరిధిని దాటిన చిత్రాలవి. జయప్రభ చిత్రించినవేవీ ఈ రకమైన స్వేచ్ఛను పొందలేక పోయాయి. కాబట్టి ఉట్టి వచనాల్లా మిగిలిపోయాయి, కవిత్వం కాలేదు. మానవ స్వభావపు లోతులెరిగి తనలో ఇతరులను ఇతరులలో తనను దర్శించగలవాడే portraits గీయగలడు, మాధ్యమం ఏదైనా సరే - చిత్రకళో, కవిత్వమో..

స్త్రీ వాద కవితలు ఒక పది.. ఈ వాదాల బరువును దించుకోవలసిన ప్రబలావసరాన్ని నొక్కి చెబుతాయి. అర్థం గొడ్డుబోయిన అనేక సందర్భాలలో ! పురాణ / కావ్య / చారిత్రక ప్రతీకలను విపరీతంగా వాడేసుకొని నీరసించిన సంకలనం ఇది. చిన్న కొడుకు మీద రాసిన కవితలో కూడా, పండిత రాయల అంశ, కౌటిల్యుడి కూన కనిపించడం హాస్యాస్పదం.

నానా ఇతిహాస స్త్రీ పాత్రల విలాపాలను స్త్రీ వాద దృక్పథంతో తవ్విపోయడం వల్ల కవిత్వానికి కలిగే ఉపకారం లేదు. వాద స్థాపనకు ఉపయోగపడే అంశాలు కవిత్వాభివ్యక్తిని వికలం చేస్తాయి. దాదాపు ఒక 30 కవితలు ప్రస్తావనార్హాలు కూడా కావు. అవన్నీ ఉట్టి మాటల పోగులు, శబ్ద పంజరాలు. పాప నిద్రలేవడం, ఆ పసి చిలకే వాలకపోతే, ఎంత పాతది ఈ శీతగాలి, తేరు వెళ్ళిపోయింది, ఆవిడ ఆలోచనల్లోకి లాంటి కవితలు ఒక 10-15కు మించవు. కవయిత్రికి ఇష్టమైన కుకవి, కువిమర్శక నిందలతో మనకు పనిలేదు. అవి కవిత్వానికి మేలు చేసేవి కాదు. ఇంకో విశేషం.. పరిశీలించిన (దాదాపు) 250 కవితల్లో పది పన్నెండు వాక్యాలతో ముగిసిన చెప్పుకోదగ్గ కవిత ఏదీ లేకపోవడం. 'అల్పాక్షరముల అనంతార్థ రచన' తిరగబడిందన్న మాట.

'ఒక కవి వాడే విశేషణాలు పట్టిస్తాయి వాడి పనివాడితనాన్ని' అన్నాడో మహాకవి. కాబట్టి విశేషణాల విషయంలో చాలా జాగ్రత్త వహించమని హెచ్చరిస్తాడు మరోసారి. ఉమా కాంతుల వారు భావ కవుల 'మంజుల, మంగళ' విశేషణాల వాడుకను ఎద్దేవా చేస్తూ, వారి కావ్యాల్లో అరిగిపోయిన

పదప్రయోగాలను తీవ్రంగా అధిక్షేపించాడు. పురాణ / కావ్య / చారిత్రక సమయాల్లో చిక్కుబడకుండా విశాలమైన ప్రకృతి నుండి, ఉజ్వలమైన జీవితం నుండి ఎన్నో విషయాలు గ్రహించాలి కవి. భాషను శుభ్రం చేయడం కవి అదృశ్య బాధ్యతల్లో ఒకటి. కవి ప్రయోగాలు పలుకుబళ్లలో కలిసిపోవడం పరిపాటి. ఒకప్పటి వేమన, ఇప్పటి శ్రీశ్రీల ప్రయోగాలు–ఎన్ని ప్రజల వాడుకలో పడుగుపేకలా కలిసిపోయాయో గమనించవచ్చు. ఇక్కడే కవిత్వం సకల ప్రక్రియలతో భేదిస్తుంది. వచనం, జర్నలిజం కవిత్వం నుండి ఎంతో గ్రహిస్తాయి. కవిత్వమే వచన స్థాయికి, జర్నలిజం బాణీకి దిగజారకూడదనేది అందుకే.. 'తెల్లవాళ్ళ స్కూళ్ళలో తెలుగు పద్యాల మీద ఖాతరీ లేదండి, ఎంతసేపు జాగ్రఫీ, గీగ్రఫీ హడలేసి చెబుతారు' అంటాడు గిరీశం కరకట శాస్త్రులతో, పద్యానికి ప్రతిపదార్థం చెప్పలేని వెంకటేశాన్ని వెనుకేసుకొస్తూ. మన కవులది వెంకటేశం మార్గమే, దొరల చదువే.. పద్యాల మీద ఖాతరీ లేదు, ఎంతసేపు ఇజం గిజం హడలేసి చెప్పడమే. దీనివల్ల పూడ్చుకోలేని నష్టం జరిగింది కవిత్వానికి - కంటికి చెవికిఇంపైన అలవాటు పదప్రయోగాలు గుప్పించడం, పులుముడు విశేషణాలతో ఊపిరి ఆడకుండా చేయడం ! ! భాషకూ, భావానికీ, ఆ రెంటికీ కవిత్వానికి గల సంబంధాన్ని గూర్చిన అవగాహన కవిత్వ తత్వానికి, భాషా తత్వానికి సంబంధించినది. అది మన కవి వరాహాలుపడిదొర్లే నానా వాదపంకాల్లో దొరికేది కాదు. మిగుల శ్రమించి ప్రోది చేసుకోవలసిన పన్నీరు లాంటిది. అందుకే ఏనాడో మన యోగి వేమన అననే అన్నాడు - 'పంది పన్నీరు మెచ్చునా, బురద మెచ్చునా ! !' తథ్యము సుమతీ !

జయప్రభ కవిత్వంలో పదేపదే పునరావృతమై, ఏ అర్థబోధ చేయక పాఠకున్ని డస్సిపోయేలా చేసే విశేషణాలు, పదబంధాలు మచ్చుకు కొన్ని.

విమల, అనంత, అనేక, భీకర, అరుణారుణ, నిశిరాత్రుల, ఆపాత మధురము, చింతాక్రాంతము, చిన్మయానందము, బాహాహోరాలు,

ముగ్ధ మోహన రూపము, దుర్గంధ పంకిలము, నిర్జీవ అలంకరణ, జీవన బీభత్స చిత్రాలు, కఠోర సత్యాలు, క్షతగాత్ర శరీరం, ఆచంద్ర తారార్కం, అజ్ఞాన తిమిరం..

ఇలా .. అలవాటుమీద, కొన్ని పాతకవుల ప్రయోగాలు ముక్కున గరచుకొని వాటినే గుప్పిస్తూ ఉండటం. దీన్నే భేషజం అంటారు. పాత రోజుల్లో కొందరు భిషక్కులు (Doctors) రోగి నాడీ పరీక్ష చేసి, ఆయుర్వేద గ్రంథాల్లోనివి తమ నాలుకమీద ఉన్నవి, సంబంధంలేనివి, తమ అవగాహనలోనికి రానివి.. వల్లించేవారట. అదే భేషజమంటే.. రోగికి ఆ దేవభాష అర్థం కాదు, కాబట్టి తప్పకుండా అది గొప్ప విషయమే అయివుంటుంది అని నమ్మిక. గిడుగు రామ్మూర్తి పంతులు అప్పటి భాషా భిషక్కులను ఆక్షేపించేవాడు ఇలాంటి విషయాల్లోనే. ఇప్పుడు మన కవిత్వ భిషక్కులను తప్పు పట్టవలసి వస్తోంది. భూమి గుండ్రంగానే ఉంది !

ఇకపోతే వికటించిన పురాణ ప్రతీకలు. ప్రతీకలుమంచివే.. కరివేపాకు మంచిదే.. కానీ చారుకు రుచినివ్వడానికే దాన్ని వాడతాము. అంతవరకే దాని పాత్ర. ఒకవేళ అది లేకపోయినా చారుకు వచ్చిన

నష్టం లేదు. కరివేపాకే చారు అనుకునేంత పైత్యప్రకోపం.. హానికారకం. 21వ శతాబ్దంలో ఒక ఆధునిక (?) కవయిత్రి హరిదాసులా రాయడం.. వింతలేని ఆవులింతుందా ??

ప్రజాపతులు

*ఆవిడ దాస్య విముక్తికి*

*గరుత్మంతుడైతే తప్ప అమృతం తేలేడు*

*అండవిచ్ఛేదనం చేసిందని*

*పైగా అనూరుడి శాపం*

*ఇంతకీ ఉచ్ఛైశ్రవం తోక నల్లనిదా ? తెల్లనిదా ?*

*యుగయుగాల సందేహం*

*అయినా.. ఏ గెలుపైనా*

*వినతా కద్రువులది కాదు*

*సంగ్రామం కోసం తన్నుకు చావమని*

*పాముల్నీ, గద్దల్నీ పుట్టించిన*

*కశ్యప ప్రజా 'పతుల' ది ! !*

కవిత్వమంటే 'మద్వయం, భద్వయం, బ్రత్రయం, వచతుష్టయం, అనాపాద్లిం కూస్కాని పురాణాని పృథక్పృథక్.' అని వల్లించి పాఠకులని ఝడిపించి జ్వరం తెప్పించడం కాదు.. కొసవెర్రి కాకపోతే.. చివర feminist వ్యాఖ్యానాలు.. ప్రజాపతులలో పతుల మీద చమత్కారం.. తెలుగు కవిత్వ స్వాస్థ్యం మీద అనుమానాలు రావడంలో పెద్ద ఆశ్చర్యం లేదు. 'ఇంతకీ ఉచ్ఛైశ్రవం తోక నల్లనిదా ? తెల్లనిదా ?' ఏదైనా వచ్చిన నష్టం లేదు, దానికి అసలు తోక లేకపోయినా పాఠకుడికి కొంచెం బాధ తప్పును. గుర్రపు తోక 'యుగయుగాల సందేహం' - ఎన్నటికీ కానేరదు, ఆధునిక జీవితంలో అలవికాని అస్తిత్వ సమస్యలు ఎన్నో ఉన్నాయి. పురాణాలు వాటిని వ్యాఖ్యానించగల వారి చేతుల్లో ప్రాణం పోసుకుంటాయి. కవులు కాళ్ళు, చేతులు కడిగేసుకోగల మైదానాలు కావవి. అంత ఉత్సాహం ఉంటే electronic journal of vedic studies లేదా హార్వర్డ్ సంస్కృత గ్రంథాలు చదువుకోవచ్చును.. అనో భద్రాఃక్రతవో యంతు విశ్వతః ! ! !

పద్యకవిత్వానికి రోజులు చెల్లాయి అన్న విషయం మీద వ్యాసం రాయవచ్చు, కవిత కాదు. పిడుక్కి, బియ్యానికి ఒకటే మంత్రం - ఒకర్ని తిట్టవలసి వచ్చినా, అభిప్రాయాలు వ్యక్తం చేయవలసి వచ్చినా, తాత్విక చర్చలకు, వాదాలకు.. అన్నిటికీ కవిత్వమే ! మన కవులెవరూ ఆధునికులు కారు

అని చెప్పడానికి ఇదొక్కటి చాలు. ప్రక్రియా భేదం తెలియని వారి కవిత్వావగాహన ఏ మాత్రం ? వస్తువు ఎంపికలో తప్పటడుగులు వేసే మన కవుల స్థాయి ఏ పాటిది? విజ్ఞాన సంపాదనకు encyclopaedia లు ఉన్నాయి, రోజువారీ కథనాలకు వార్తాపత్రికలు లెక్కలేనన్ని. వీటిని ఆశించి ఎవరూ కవి చెంత చేరడు. దగ్ధం చేసే అనుభవాలను అక్షరబద్ధం చేయడం కవిధర్మం. 'తోటకూరకునైన దుగ్గలాకుకునైన, తాలుతప్పలకైన తవుడుకైన కవిత్వము చెప్పు గాడిదలారా' అని వేమన అననే అన్నాడు. కావున లేనిపోని భేషజాలకు పోకుండా నానా వాదాలను కవిత్వేతరాలను చెత్తకుప్పల్లో పడవేసి, దీర్ఘ నిరీక్షణతో, తీవ్ర ఘనీభవనంతో కవిత్వం రాయడం కవిశబ్ద వాచ్యుడు చేయదగిన పని.

పుస్తకారంభంలో 'చెప్పవలసిన నాలుగు మాటల్లో' కవయిత్రి 'నా తాత్విక దృక్పథం కూడా చాలా మార్పులకు లోనయింది, నా కవిత్వ వ్యక్తీకరణలోనూ ఆ పరిఛాయ ప్రసరించింది. రూప పరంగాను, వస్తు పరంగాను ఆ వైవిధ్యం మీరు ఈ చింతల నెమలిలో చూడొచ్చు' నా సందేహం అసలు మన కవులకు ఒక తాత్విక దృక్పథం వుందా? ఏదో కాస్త ఫాషనబుల్‌గా ఉందామని దాని గురించి మాట్లాడుతున్నారా? వీరు దేన్ని తత్వంగా భావిస్తున్నారు? తత్వం వస్తురూపాలను ఎలా ప్రభావితం చేస్తుందో వీరికి తెలుసా? ఈ సందర్భంలో ఒక మాట చెప్పుకోవాలి, శాస్త్రవేత్త పాస్కల్ తన స్నేహితునికి ఉత్తరం రాస్తూ, 'అట్టే సమయం లేదు, లేదంటే ఇంకా క్లుప్తంగా రాసే వాడిని' అని నొచ్చుకున్నాడట. అది తత్వం తెలిసిన వాడి ఆలోచనా ధోరణి.

రూప పరంగా, వస్తు పరంగా, శిల్పపరంగా ఇన్ని తప్పులు చేస్తున్న వారి తాత్విక దృక్పథాన్ని ఊహించడం పెద్ద కష్టం కాదు. తాత్విక దృక్పథం ఉన్నవాడి రచనలో ప్రస్ఫుటమయ్యేది క్లుప్తత. వ్యాసంగా తయారయ్యే విషయాన్ని కవిత్వంగా మార్చాలనే వృథా ప్రయాసపడే కవిగణాలకు తాత్విక దృక్పథం ఉండటం కలలో మాట.

స్పష్టత, క్లుప్తత, ఖచ్చితత్వం - ఇవి తర్కాన్ని తద్వారా తత్వాన్ని పరిపాలిస్తాయి. కవిత్వపరంగా వీటిని సాధించడం ఎలా ?? జపనీస్ / చైనీస్ కవులను పరిశీలిస్తే ఈవిషయం తేటతెల్లమవుతుంది.

ఏది మూర్తము (concrete), ఏది అమూర్తము (abstract) అన్న విషయంలో స్పష్టత ఉంది. క్లుప్తత కోసం వారు మౌనాన్ని ఆశ్రయించారు. కారణం వారికి శబ్ద పరిమితులు తెలుసు. శబ్దాలతో ఎంత చెప్పినా, చెప్పనిది మిగిలిపోతూనే ఉంటుంది. కావున అనుభవాలను అనుభవాలుగా - ఏ అరమరికలు లేకుండా ఖచ్చితంగా వ్యక్తం చేశారు. వాటికి అభిప్రాయాలను, ఆలోచనలను, వాదాలను, నినాదాలను జోడించలేదు. వారికి తత్వ ప్రజ్ఞ ఉంది కనుకనే తమ అనుభవాలను - క్లుప్తంగా, స్పష్టంగా, కచ్చితంగా-ఏ ప్రలోభాలకూ లోనుకాకుండా వ్యక్తం చేశారు. మనవారికి ఇవన్నీ తెలుసనుకోను. జయప్రభ దీనికి మినహాయింపు కాదు. కారణం - పరిశీలించిన ఆమె కవితల్లో పదిశాతం కూడా కవిత్వం కాకపోవడమే ! !

## రచనలో ఉపకరించిన పుస్తకాలు

జయప్రభ కవిత్వం

1. యుద్ధోన్ముఖంగా
2. వామనుడి మూడో పాదం
3. ఇక్కడ కురిసిన వర్షం ఎక్కడి మేఘానిది
4. యశోధరా వగపెందుకే
5. చింతల నెమలి

**Chinese, Japanese literature**

1. The selected poems of Tu Fu
2. The selected poems of Li Po
3. Women poets of China
4. Women poets of Japan
5. The essential Haiku

**Zen books**

1. An Introduction to Zen Buddhism - D.T. Suzuki
2. The Zen way to Martial Arts - T. Deshimaru

**Edna Millay**

1. Edna St. Vincent Millay collected lyrics
2. The Atlantic Monthly - (Articles on Edna)
3. Newyork Review of Books - (On Edna)

**Others**

1. Postwar Polish Poetry - Czeslaw Milosz
2. The narrow Road to North - Basho
3. కవిత్వంలో నిశ్శబ్దం - ఇస్మాయిల్
4. ఆంధ్ర భిషక్కుల భాషా భేషజం - గిడుగు

# జయప్రభ కవిత్వం - స్పర్శానురాగం

కేవలం దోష నిరూపణ విమర్శ కాదు, గుణ నిర్ధారణ కూడా అందులో భాగమే. నాణేనికి రెండో పార్శ్వం తెలియనిదే దాని విలువను అంచనా కట్టలేము, అందునా కవిత్వం లాంటి అరుదైన గుప్తుల కాలం లాంటి నాణేన్ని.

మోహానికి శబ్దాకృతినివ్వడంలో వీరు ఎంతో ఎత్తుకు ఎదిగారు. ఎడ్నా మిల్లే తన జీవితకాలంలో గొప్ప సంచలనం సృష్టించిందని ఆమెతో పోల్చడం తప్పు, పోలిక వల్ల పెద్ద ఒరిగేదేమీ ఉండదు. తెలుగును Italian of East అన్నట్లే ఉంటుంది - రెండూ అజంత భాషలే అయినా, ఇటాలియన్ కవిత్వాల్లో అంత్యప్రాసే అధికం. తెలుగు లాగా సంస్కృతం లాగా అది అంత సౌష్ఠవమైన సంగీత భాష కాదు. కావున తెలుగు తెలుగే, ఇటాలియన్ ఇటాలియనే. అలాగే జయప్రభ ఎడ్నా మిల్లే కన్నా మిన్నగా ఎన్నదగినది.

కవిత్వంలో వ్యక్తం కావలసినవి మోహాలు, ఉద్వేగాలు, అనుభవాలే. వాదాల బురద వాటినంటదు. ఆలోచనల ఎండుగడ్డి, అభిప్రాయాల ముళ్ళకంపను వీడి మనసు రహస్య ఉద్యానవనంలో అడుగుపెడుతుంది. జలపాతాలు, మహావృక్షాలు, దివారాత్రాలు, సూర్య తాపం, చంద్రజోత్స్న, లతలు, ఆకులు, పరిమళ పుష్పాలతో నిండిన భూగోళం అరచేతిలో అమరి, స్వీయానుభవం విశ్వానుభవంగా పరివర్తన చెందే ఘడియలవి.

ఇంకో చిక్కు ప్రశ్న. ప్రియురాలి భావాలు ప్రియుడు ఆమె మాటల ద్వారానే తెలుసుకొంటాడు. చూపులు, శరీరం ఇందులో సహకరించినా మాటలు మనిషి ప్రేమలో పెద్ద భాగాన్ని ఆక్రమిస్తాయి. ప్రియురాలు తన ఎదుట లేనప్పుడు ప్రియుడు ఆ మాటలనే తలచుకొని ఆనందిస్తాడు.. ఇక్కడే చిక్కు ప్రశ్న తలెత్తుతుంది. ప్రియుడు ప్రేమలో పడింది ప్రేయసితోనా లేదా మాటలతోనా?? మాటలు లేనిది ప్రియురాలి జ్ఞాపకాలే లేవు.. ప్రేయసికి, భాషకు అభేదం ఉంది అని తెలుసుకుంటాడు కవి.. ప్రేయసీ ప్రియులు నశించినా మాటలు అదే ప్రేమను వెదజల్లుతుంటాయి. భాషా మూలాలు ఉద్వేగాల్లో ఉన్నాయి కాబట్టే మన ప్రాచీనులు శృంగారానికి రసాధిపత్యాన్ని కట్టబెట్టారు. కాబట్టి విశ్వసాహిత్యంలో ఏ భాషలోనైనా ప్రేమ కవిత్వానికి గురుతర స్థానం ఉంది.

జయప్రభ మోహకవిత్వాన్ని పొగడవలసి వచ్చినపుడు రిల్కే కవిత్వంలోని మూడు జర్మన్ పదాలు అక్కరకొస్తాయి - "Ruhmen, das ists' (వినుతించడమే అసలంతా)! ! ప్రేమలో - శరీరాలు మామూలు అర్థాన్ని కోల్పోయినట్లే - నిత్యమూ వాడే పదాలు కూడా నూతన అర్థాన్ని సంతరించుకొంటాయి. అందుకే అవి ..

'కోమలం కాదు

మలయపవన రాగం కాదు

హాయి కాదు ఆహ్లాదమూ కాదు

అయినా ఆనందమే ! '

అంతేకాదు .. అది అద్వైతస్థితి.. సకల సృష్టి నీలో ఉంది, సృష్టిలో నీవున్నావు.. అందుకే.

'నేనే నీరై.. నీరు నేనై ప్రవహించడం విశ్వమోహనం

విశ్వమోహనం ! అది ఖడ్గచాలనం !

జలపాత స్నానం ! జలపాత స్నానం !'

ఇదొక గొప్ప భావగీతం.. (అజంతా బ్రతికి ఉన్న రోజుల్లో ఎంపిక చేసిన కవిత ఇది)

గుండెలో పొగమంచు, జలపాతస్నానం లాంటి భావగీతం (lyric) కాదు. ఇందులో ప్రేమ అతి సున్నితంగా వ్యక్తమయింది. కథల్లో కనిపించే గొప్ప వాతావరణ కల్పన తుదకంటా కనిపిస్తుంది. కవయిత్రి దేన్నీ వదలలేదు..

ధ్వజస్తంభపు చిరుగంటలూ

నీ చిరునవ్వులూ కలిసి

నా చెవుల్లో లీలగా ధ్వనిస్తాయి

అన్నిటికీ అర్థం ఉంది ప్రేమలో. ఏదీ వదలివేయదగింది కాదు కవిత్వంలో లాగే.. బహుళ చతుర్దశి రాత్రిలో, Walter de la mare పేరు పొందిన listeners కవితలా వాతావరణం, భావప్రవృత్తి (lyrical temperament) సమ పాళ్ళలో కనిపిస్తాయి. Walter కవితలో ఉన్నది కేవలం భయద సౌందర్యమే.. మోహం, ఉద్వేగ తీవ్రతా లేవు.. అంతే కాదు భాష వచనబంధాల నుండి విముక్తమై..

'వింతగా ఆకాశం చుక్కల బరువుని ఓపలేక

ఒకింతగా నేలపైకి వొరిగిన దృశ్యమో?'

'మన కళ్ళలో

చేతి కొనవేళ్ళ

మాట పెగలని ఉద్రేకమో ?శాంతమో ?'

ఉద్రేకమూ శాంతమూ కలగలసి ద్వంద్వాతీతమై

'తలపై కెత్తి చూస్తే చీకట్లో

రెండు పనసచెట్ల కొమ్మలు ఒరుసుకుంటూ

గాఢంగా పెనవేసుకుపోయున్నాయ్

నా నుదిటి మీద వానబొట్టు నీ పెదవిలోకి జారింది !

మోహనంగా నీ నవ్వొక్కటి మైకంలో సాగింది !"

మనసు, పరిసరాలు మమేకమై పోయిన కౌగిలి, సమాగమం. లోపల వెలుపల ఏకం చేసే తీవ్ర మోహలిపి జయప్రభ స్వంతం. . ఇటువంటి ప్రవాహశైలి లో సిద్ధహస్తుడు. . Edgar Alan Poe ! మరచిపోకూడని విషయం ఇది బహుళ చతుర్దశి రాత్రి. .

**నీలకాంతిలా దిగులు,** ఈ కవితలో కూడా గొప్ప తాదాత్మ్యం, మోహోద్వేగాలు ఋతువర్ణాలు కలిసిపోయి ఏవో విచిత్రలోకాలు. . .

"అయినా అదేమిటో

హత్తుకునే ఎదురురొమ్ముల మధ్య

హాయిగా చైత్ర వైశాఖాలు!

ఆశ్చర్యం

అరణ్యాల్లోంచి సముద్రాల్లోకి

అలా ఉంటుందేమిటో దారి

ఏవో విచిత్ర లోకాలు. . ."

అంతే కాదు జీవననిఘంటువు తెరిచే సాహసం కూడా. .

"నిఘంటువులో అర్థాలు అర్థాలు కావు

జీవన వేదాలకు భాష్యాలు లేవు"

చివరికి సర్వాన్ని ఏకం చేసే సమ్మోహలిపి

"పవనమై

*కౌగలించుకోనన్ను గాఢంగా గాఢంగా*

*చిగురాకు మధ్యంగా!"*

**సంచిదానందానికి,**

ఇది భాష కాదు మోహమే. . ఇది మోహం కాదు భాషే . "గాఢాలింగనం లాగే పరిచుంబనంలాగే జీవితం కూడా విభ్రమమే!" అంటూ ఈ కవిత ఎక్కడా ఆగదు. . ఈ మనోవేగమే. . భాషకు స్వేచ్ఛని ప్రసాదించేది. . నిత్యజీవితంలో ఉత్సవకోలాహలాన్ని నింపేది. ఈ మోహరేఖా గణితంలో ఆలోచనలు, అనుభవాలు పరస్పరం ఖండించుకోవు. . వృత్తంలో వృత్తంలా అవలీలగా అణుగుతాయి.

# యోగం - జెన్ - కవిత్వం

ఆలోచన నిరోధించడమే యోగమన్న దురభిప్రాయం ప్రబలివుంది. పతంజలి వాంఛితమదేనని అనుకోవడం పరిపాటి. పతంజలిని దీక్షగా పఠించని వారి మాటలను పట్టించుకోనవసరం లేదు. వ్యాస ఉద్దేశం యోగ పరామర్శ కాదు. పరమ గహనమైన పతంజలి సూత్రాలను మళ్ళీ ఒక్కసారి నెమరువేసుకోవడం, కవిత్వమూలాలను వెదికి పట్టుకోవడంలో సహాయకారి అవుతుందని భావించడమే. జెన్ కు (సంస్కృత "ధ్యానం" చైనీస్ లో చాన్‌గా, అదే జపనీస్‌లో జెన్‌గా పరిణమించింది.), కవిత్వానికి అవినాభావ సంబంధం ఉందని అందరూ ఎరిగినదే.

జెన్‌లో మాటల కోసం మాటలు కాదు. . మౌనం వైపు పరుగులు తీసేందుకు అవి సాధనాలు. ప్రపంచంలో వ్యాపించిన బౌద్ధానికి, ఆంధ్రావనికి గల సంబంధాల గురించి నేడు తిరుగులేని సాక్ష్యాధారాలు లభ్యమవుతున్నాయి. పలు ఆసియా దేశాల లిపులు కూడా మన లిపివ్యవస్థ దన్నుతో ఈనాడు ఈ స్థితికి వచ్చాయన్నది అందరూ అంగీకరిస్తున్నదే. అదలా ఉండనిస్తే . . మళ్లీ పతంజలి దగ్గరికి. . "యోగః చిత్తవృత్తి నిరోధః" అని పతంజలి ఏ క్షణాన అన్నాడో ఆనాటి నుండి లెక్కకు మిక్కిలి దుర్వ్యాఖ్యానాలు, దౌర్బల్య చింతన మొదలైనాయి. ఆంగ్లవిద్య వల్ల మనకు తెలిసిన mind (బుద్ధి) గురించి కాదు పతంజలి మాట్లాడున్నది. వేమన పద్యాల్లో అక్కడక్కడా కనిపించే "చిత్తం" గురించి. (చిత్తశుద్ధి లేని శివపూజలేలరా, చీకటికి తొలగు చిత్తశుద్ధి వగైరా పద్యపాదాలు మచ్చుకు). పాత సినిమాల్లో బంటు తలవంచుకొని "చిత్తము" అనడము గమనించే ఉంటారు. ఆ చిత్తము అన్నమాట.

చిత్తము బుద్ధి కన్నా ఏ విధంగా భిన్నం? నాలుగు ఏకకేంద్ర వృత్తాలను ఊహించుకొండి. వెలుపలివృత్తము మనసు, తర్వాతి వృత్తాలు వరుసగా బుద్ధి, చిత్త, అహంకారాలు. మనసు ఉద్రేక ఉద్వేగ సంబంధి. బుద్ధి అంటే తర్క సంబంధి. ఆలోచన బుద్ధికి చెందినది. చిత్తమన్నది ఉద్వేగ ఆలోచనా మూలాలను మించినది. దీన్ని మించినది అహంకారం. . వాడుకలో రూఢి అయిన అర్థం అహంకారం అంటే గర్వం వేరు ఇది వేరు, ఇంకా సూక్ష్మమైనది. నేను అన్న భావనకు సంబంధించినది. (సంస్కృతంలో "అహం" అంటే "నేను" అన్న అర్థం, విదితమే).

పతంజలి సరిగ్గా ఇక్కడే గురిపెడుతున్నాడు. చిత్తవృత్తిని నిరోధించడమే యోగమంటున్నాడు పాతరోజుల్లో ఎన్నో వృత్తులు ఉండేవి కదా . . అదే అర్థంలో వృత్తిని వాడుతున్నాడు. మళ్ళీమళ్ళీ నిరంతరాయంగా చేసే పని వృత్తి.

చిత్తానికి ఐదు వృత్తులు ఉన్నాయని నిష్కర్ష. అవి వరుసగా

1. ప్రమాణము (ప్రత్యక్ష అనుమాన ఆగమాః ప్రమాణాని)

2. విపర్యయం (విపర్యయో మిథ్యాజ్ఞాన మతద్రూప ప్రతిష్ఠమ్)

3. వికల్పం (శబ్ద జ్ఞానానుపాతి వస్తుశూన్యో వికల్పః)

4. నిద్ర (అభావప్రత్యయాలంబనా వృత్తిర్నిద్రా)

5. స్మృతి (అనుభూత విషయా సంప్రమోషః వృత్తిః స్మృతి)

చిత్తము నిరంతరం ఈ ఐదు వృత్తులను లోనవుతుంది. పతంజలి సూత్రాలను యథాతథంగా ఇవ్వడం వాటి మీద గౌరవం తో తప్ప పాఠకులను భయపెట్టడానికి కాదు. సూత్రమంటే క్లుప్తతకు చరమ స్థాయి. మన ప్రాచీన శాస్త్రాలన్నీ సూత్రబద్ధాలే. జ్ఞాపకం పెట్టుకోవడానికి, మననం చేసుకోవడానికి వీలుగా ఉంటాయి.

వ్యావహారిక ప్రయోగాల్లో మనసు, బుద్ధి, చిత్తాలను అటూఇటుగా వాడినా, శాస్త్ర చర్చల్లో కూడదు. ఒక పదాన్ని అదే అర్థంలో చివరి వరకువాడతాము. అది శాస్త్ర మర్యాద. ఈ సూత్రాలకు ఉన్న ఆదరణ అంతా ఇంతా కాదు, నానా ప్రపంచ భాషల్లో అనువాదాలు వచ్చాయి. కొంత ప్రవేశం, ఆసక్తి ఉంటే సంస్కృత సూత్రాలను వల్లె వేయడమే శ్రేయస్కరం.

ప్రపంచంలో మనసు అగాధాలను తడిమి చూసే ప్రథమ ప్రయత్నాన్ని మీరు చదువుతున్నారు. (పతంజలి వేల సంవత్సరాల వెనుకటివాడు. బుద్ధుడు తన శిష్యులకు పతంజలి అష్టాంగ మార్గాన్ని సిఫారసు చేశాడంటే అతని స్థాయిని చూచాయగా అంచనా వేయవచ్చు.) కాబట్టి మీ గురించి మీకు ఒక X - RAY దృష్టి కలగాలంటే కొంచెం శ్రమించక తప్పదు. మళ్ళీ సూత్రాల్లోకి వస్తే..

పొగను చూసి మంట ఉందనుకొంటాం. ఇది అనుమాన ప్రమాణం. హేతుబద్ధంగా శాస్త్రాల్లో రాసిన దాన్ని గౌరవిస్తాము ఇది ఆగమ ప్రమాణం. కనులకు ప్రత్యక్షంగా కనిపించే దానిని (లేదా ఇంద్రియాలకు సూటిగా అనుభూతమైన దానిని) స్వీకరిస్తాం. ఇది ప్రత్యక్ష ప్రమాణం.

చిత్తానికి గల ఐదు వృత్తులలో ఇది మొదటిది.

ఆధారాలను బట్టి ఉన్నది లేనట్టుగా, లేనిది ఉన్నట్లుగా భావించడం విపర్యయం. రాత్రి పూట తాడును చూసి పాము అనుకోవడం లేదా పామును చూసి తాడు అనుకోవడం (రజ్జు సర్పభ్రాంతి) మిథ్యాజ్ఞానం వల్ల చిత్తానికి సంక్రమించే వృత్తి విపర్యయం.

ఇకపోతే వికల్పం. . చిన్న నాటి నుండీ మనకెన్నో పదాలు తెలుసు. వాటి అర్థాలు తెలుసు. ఇది శబ్దజ్ఞానం, దాన్ని బట్టే ఊహ పారుతుంది. శైశవ దశను ఊహించుకొండి. ఆ దశలో పిల్లలు అప్పుడప్పుడే మాట్లాడటం నేర్చుకొంటారు. సంగీత రత్నాకరంలో శిశువు ఎన్నో నెల నుండి సంగీతాన్ని గ్రహించగలదుఅన్న దాని మీద పెద్ద చర్చ ఉంది,. కానీ అది అప్రస్తుతం. పదాలు తెలియని దశలో పిల్లలు వస్తువుల గురించి ఏమనుకొంటారు? వస్తువులు ఉన్నా వాటిని మెదడుతో లంకె పెట్టే పదాలు లేకపోతే అవి లేనట్టే. అది వస్తుశూన్యం. శైశవంలో మన మందరం అనుభవించిన దశే అది. శబ్ద జ్ఞానం లేని దశ అది. కాబట్టి దాన్ని అనుసరించే వికల్పం లేని దశ. కానీ త్వరితగతిని ఆదశనుదాటతాం. . శిశువు తేట వదనం వెనుక ఎంత రహస్యం దాగి వుంది! ! కవిత్వానికి మూలాలు సరిగ్గా ఇక్కడ ఉన్నాయి. జెన్‌గురువులు పదాలను వదలండి అన్నప్పుడు వారుమాట్లాడేది ఈ దశ

గురించే. శబ్దజ్ఞానం లేక కవి గాడు; కానీ దుర్లభమైన పదాల మోతలే కవిత్వమని మనల్ని నమ్మించి రోత పుట్టిస్తాడు కవి శబ్ద వాచ్యుడు. చివరగా తాత్పర్యమేమంటే పదాలను ఆధారంగా చేసుకొని చిత్తము అనుభవించే దశ వికల్పం.

నిద్ర మీద నానా పరిశోధనలు వచ్చాయి. నిద్రకు ఇంత క్లుప్తమైన వ్యాఖ్యానం నేను ఎక్కడా చూడలేదు. అహమహమికతో త్రుళ్ళిపడే మానసిక శాస్త్రవేత్తలు తమ అల్పత్వాన్ని ఇక్కడ తెలుసుకోగలరు. అభావమన్న ప్రత్యయాన్ని ఆధారంగా చేసుకొని కలిగే చిత్తవృత్తి నిద్ర. మనతర్క శాస్త్రాల్లో నాలుగు రకాల అభావాలు ఉన్నాయి. ఆ చర్చ ఇప్పుడు అప్రస్తుతం. భావానికి ఏ ఆంగ్లానువాదం సరిపోదు. (భావ తీవ్రతే మన స్వభావం) ఏ భావము లేని చిత్తవృత్తి నిద్ర! మీకు నిద్ర పట్టక దొర్లిన రాత్రులను గుర్తు తెచ్చుకొండి. ఏదో ఒక భావం. మెదులుతూ వుంటే నిద్ర పట్టదు. కొందరికి పడుకోవడం, నిద్ర పట్టడం వేరు కాదు. కారణం వారికి ఇబ్బంది పెట్టే భావాలు ఏమీ లేవు. అభావం వారికి సత్వరమే లభ్యమవుతోంది. సారంశమేమంటే అభావాన్ని ఆలంబనగా చేసుకొని కలిగే చిత్త వృత్తి నిద్ర.

చివరగా స్మృతి. అనుభవించిన దాన్ని ఆధారంగా చేసుకొని కలిగే చిత్తవృత్తి. అమ్మ చేతి వంట, ప్రియురాలి ముద్దు, చిన్న పాప పలుకరింపు . . . ఇలా అనుభవించినవి మళ్ళీమళ్ళీ మనలోకి నెట్టుకు రావడమే స్మృతి. అనుభవంలేనిదే స్మృతి లేదు. స్మృతికి ఆధారం పూర్వానుభవం. అనుభూతించిన విషయాలనూ ఆధారంగా చేసుకొని చిత్తంలోనయ్యే వృత్తి స్మృతి. . .

ఈ ఐదు చిత్తవృత్తులను నిరోధించడమే యోగమన్నాడు. యోగమంటే కలుపుకుపోవడం. మరి నిరోధం, యోగం ఒకేసారి ఎలా పొసగుతాయి. అడ్డగించడంలో కలుపుకుపోవడం ఎక్కడుంది? నిద్రపోకుండా ఉండటం యోగం కాదు. అలా అని విపర్యయాలకు లోనుకాకపోవడం, వికల్పాన్ని పొందకపోవడం, సకల ప్రమాణాల్లో కొట్టుకుపోకుండా ఉండటం, స్మృతికి లోబడకుండా ఉండటం కూడా యోగం కాదు. మరి యోగమంటే?? ఈ ఐదు చిత్తవృత్తులను ఏక కాలంలో, త్రుటిలో నిరోధించడం! అది యోగం! !

బుర్ర వేడెక్కే చర్చను ఇంతటితో ఆపుదాము. ఇంత చర్చ ఎందుకు చేయవలసి వచ్చిందంటే కవికి భాషకు, భావానికి వెరసి ఆ రెంటికి మనసుకు గల సూక్ష్మాతి సూక్ష్మమైన సంబంధం తెలిసితీరాలి. కవిత్వం అంటే బుద్ధి వ్యాపారం కాదు, కేవలం మానసిక చర్య కాదు. నానా శాస్త్ర విషయాలను, ఆలోచనలను వల్లించడం కాదు. స్మృతులను ఏకరువు పెట్టడం కాదు. ఉట్టి కల్పనా చాతుర్యం కాదు. విపర్యయ చింతనకాదు. అభావ ప్రత్యయం కానే కాదు. మరి కవిత్వం అంటే ?? వీటన్నిటికీ అతీతంగా కలిగే ఒక విచిత్ర సంయోగం. కవిత్వం.

జెన్‌గురువులు నిరంతర ధ్యాన నిమగ్నులు. జెన్‌లో కూడా దర్శనం ప్రధానం. చూపుకు విలువ ఎక్కువ. వాగుడు నిషిద్ధం. బుద్ధి మార్గంలో పడి అంట కాగిపోరు. తర్క పరిమితిని, పదాల పరిమితిని తెలుసుకోమంటారు. ఇవన్నీ కవిత్వానికి అక్కర కొచ్చే సంగతులు. కాబట్టే జెన్ మార్గాల నుయాయులు తలస్పర్శి ఐన కవిత్వ సృష్టి చేయగలిగారు. అంతిమంగా, అందుకే నేనంటాను "కవిత్వం..... పవిత్రం.... విచిత్రం!!"

# కవిత్వం ఎందుకు చదవాలి?

**Joseph Brodski (1940-1996):**

*కమ్యూనిస్ట్ పాలనలో, కాన్సంట్రేషన్ కాంపుల్లో ఎంతో వేదన అనుభవించాడు బ్రాడ్స్కీ. ప్రభుత్వం "పరాన్న భుక్కు"గా జమకట్టి వెలివేస్తే అమెరికాలో ప్రవాస జీవితాన్ని గడిపాడు. పిన్న వయసులోనే నోబెల్ వరించింది. మంచి రూపసి, మాటకారి, వక్త వెరసి పదహారణాల కవి. సకల సాహిత్య ప్రక్రియల్లో కవిత్వస్థానం పరమోత్కృష్టమైనదని మనసా, వాచా, కర్మణా నమ్మినవాడు.*

నీషే మతి పోగొట్టుకొన్న ఈ నగరంలో పుస్తక ప్రదర్శన నిజంగా ఈ నగరానికి పెట్టని నగ. ఖచ్చితంగా చెప్పాలంటే ఒకలాంటి విషవలయం! చాలా దుకాణాల్లో జర్మన్ తత్వవేత్త పుస్తకాలు! అనంతం- ప్రచురణ రంగం బాగా పసిగట్టగల అంశమే, ఎందుకంటే అది కీర్తిశేషుడైన ఒక రచయిత అస్తిత్వాన్ని అతని పరిమితులను మించి పొడిగిస్తుంది కనుక. మనమనుకొనే తెంపులేని భవిష్యత్తును బ్రతికున్న రచయిత కళ్లముందుంచుతుంది.

మొత్తానికి, పుస్తకాలు మనకన్నా తక్కువ పరిమితమైనవి. వాటిలో అన్నిటికన్నా చెత్త అనుకొన్నది కూడా రచయితను మించి బ్రతుకుతుంది. ముఖ్యకారణం దాని రచయిత కన్నా అది ఆక్రమించే స్థలం చాలా తక్కువ. పిడికెడు మట్టిగా మారిన రచయితకన్నా, అరల్లో మట్టిగొట్టుకుపోయి, ఇవి ఎక్కువ కాలం జీవిస్తాయి. మిగిలిన బంధుమిత్రుల జ్ఞాపకాల (అంతగా ఆధారపడలేము) కన్నా ఈ తరహా భవిష్యత్ చాలా నయం. ఈ తరహా మరణాంతర దృష్టి కవి కలాన్ని కదిపే శక్తి.

నలు చదరంగా ఉన్న వీటిని అటూ ఇటూ తిప్పుతాం మన చేతులతో- చిన్నవి, పెద్దవి, మరీ పెద్దవి- అస్థి శకలాలను కదుపుతున్నాము అనుకోవడంలో తప్పేమిలేదు. ఒక పుస్తకం- నవల, తత్వగ్రంథం, కవితా సంకలనం, ఆత్మకథ, రోమాంచకి- ఏదైనా సరే చివరికి అది మనిషి ఏకైక జీవితమే; మంచో, చెడో, కానీ ఎప్పుడూ పరిమితమే. తత్వ వివేచన మృత్యు సమక్షంలో మనిషిచేసే పని అని ఎవరన్నారో అది అక్షరాలా నిజం. రచిస్తూ ఎవడూ యువకుడు కాలేడు.

అలాగే, చదవడం వల్ల ఎవడూ యువకుడు కాలేడు. అదిలా ఉండబట్టే మనమందరం మంచి పుస్తకాలు చదవడానికి సహజంగా అంత ప్రాధాన్యతనిస్తాం. సాహిత్యంలోనే కాదు ఎందులోనూ, మంచి అన్నది సొంతంగా నిలబడేది కాదు. చెడునుండి విడదీస్తూ మనం దాన్ని నిర్వచిస్తాము. ఒక మంచి పుస్తకాన్ని రాయడానికి రచయిత నానా చెత్తంతా చదవాల్సి ఉంటుంది. లేనిపక్షంలో ఇదమిత్థమని తేల్చుకోలేడు. ఈరకంగా చెడు సాహిత్యానికి కూడా చివరికి ఒక విధమైన సమర్థన దొరుకుతుంది.

మనమందరం చనిపోతాముకాబట్టి, పుస్తకాలు చదవడానికి చాలా సమయం పడుతుంది కాబట్టి, మనమేదైనా ఒక ఉపాయం కనుక్కోవాలి- మన సమయం ఆదా చేసుకోవడానికి. లావాటి నవలనొకదాన్ని ముందేసుకొని, హాయిగా పేజీలు తిరగేస్తూ పోవడంలో ఆనందం ఉంది, కాదనను. కానీ, అలా ఎక్కువకాలం గడపలేము. చివరికి, ఏదో ఒకనాడు చదవడం చదవడం కోసమే కాకుండా ఏదో కొంత నేర్చుకోవడానికి చదువుతాము. కావున క్లుప్తత, సంక్షిప్తత, సమ్మేళనాల అవసరం- అన్నిరకాల మానవ యాతనను దేదీప్యమానంగా ప్రదర్శించడానికి- ఇంకోలా చెప్పాలంటే ఒక అడ్డదారి అవసరం ఉంది. అటువంటి అడ్డదారి ఒకటి ఉందా? (ఉంది, దాని గురించి తర్వాత) అన్న మన అనుమాన ఫలం- అక్షర సముద్రాన్ని తరించడానికి ఒక దిక్సూచి అవసరం.

సమీక్షకుల పుణ్యమా అని సాహిత్య విమర్శ దిక్సూచి పాత్ర వహిస్తుంది. అయ్యో ఈ ముల్లు విపరీతంగా ఊగిసలాడుతుందే. ఒకరికేది దక్షిణమో మరొకరికి అది ఉత్తరం! తూర్పు పడమరల విషయంలో ఈ తతంగం మరీ దారుణం. సమీక్షకులతో వచ్చిన చిక్కల్లా (అధమపక్షం) మూడు రకాలు.

1. వాడు దివాలాకోరు కావచ్చు. అతనూ మనలాంటి అజ్ఞానే కావచ్చు.

2. కొన్నిరకాల రచనలపట్ల పక్షపాతం ఉండవచ్చు; లేదా ముద్రాపకుల కోసం పనిచేస్తూ ఉండొచ్చు.

3. అతడు గొప్ప రచయితే ఐతే- (బోర్హెస్‌లా) తన సమీక్షనే గొప్ప కళాఖండంలా మలచవచ్చు. ఆ సమీక్షలో పడిపోయి మనం మూలాన్ని వదిలేయవచ్చు.

ఏది ఏమైనా, ముంచుతుందో, తేలుస్తుందో తెలియని ఒక దుంగను అంటిపెట్టుకొని, నీవు సముద్రంలో కొట్టుకుపోతూనే ఉంటావు. అన్నిదిక్కులా పుటలు తిరగేస్తున్న సవ్వడి. దీనికి ఒక ప్రత్యామ్నాయం, నీ సొంత అభిరుచిని నీవు పెంపొందించుకోవడం, నీ దిక్సూచిని నీవు తయారుచేసుకోవడం. బాగా ప్రకాశించే, మిణుకుమిణుకుమనే, కొన్ని తారలతో, నక్షత్ర మండలాలతో పరిచయాన్ని పెంచుకోవడం. కానీ ఇవన్నీ చేయడానికి లెక్కకుమిక్కిలి ఎక్కువ కాలం పట్టవచ్చు. ఈలోపు తలనెరిసి ముసలివాడవైన తర్వాత కూడా- ఏదో పుస్తకం చేబూని.. రోజులు లెక్కబెట్టుకుంటూ ఉండవచ్చు. పోతే, మరో మార్గాంతరం- ఇందాక అనుకున్నట్టుగానే.. ఎవరో ఒకరి మాటను నమ్మడం- స్నేహితుడి సలహా, నీవు బాగా ఇష్టపడే పుస్తకంలోని ఒక ఉట్టంకింపు- ఏ రకంగా వ్యవస్థీకృతం కాకున్నా, ఈ తరహా పద్ధతులు మనం బాల్యం నుండి అలవాటుపడినవే. కానీ, దీన్ని నమ్మకోలేం. కారణం సాహిత్య సముద్ర మట్టం దినదినం పెరిగిపోతూ ఉండటమే. (ఈ పుస్తక ప్రదర్శన దీనికి నిరూపణ; ఇది మరో పెను ఉప్పెన సుమా!)

మరి ఎక్కడ కాలు మోపడానికి గట్టి నేల? అది నివాస యోగ్యం కాని ద్వీపం అయినా సరే!

నాలుగు మాటలు చెప్పదలిచాను.

నా సూచన- సాహిత్యంలో ఉత్తమ అభిరుచిని ఏర్పరచుకోవడానికి నాకు తెలిసిన ఒకే ఒక మార్గం- మీకు తెలియజేసే ముందుగా- ఈ పరిష్కార మూలం గురించి.. అనగా ఏ గొప్పతనం లేని నా గురించి- అహంకారానికి లోనై కాదు, ఒక భావం విలువ అది జనించే సందర్భానికి సంబంధించి ఉంటుందని నమ్మడంవల్ల- నేనే ప్రచురణకర్తనైతే, పుస్తకం అట్టమీద రచయిత వివరాలతో పాటు, ఆ రచన చేసేనాటికి ఖచ్చితంగా అతని వయసు ఎంతో ముద్రిస్తాను. వయసులో తమకన్న అంత చిన్న లేదా అంత పెద్ద రచయిత మాటలను పట్టించుకోవాలా వద్దా అన్న విషయాన్ని పాఠకులే తేల్చుకొంటారు.

నేను చేయబోయే సూచన ఒక వర్గానికి (నేను తరం అన్న పదం అని వాడలేను. కారణం అది ఒక బరువునూ, ఐకమత్యాన్ని సూచిస్తుంది) చెందిన మనుషులకు చెందినది. వారికి సాహిత్యం సహస్ర నామాలతో సాక్షాత్కరిస్తుంది. అడవి మనిషి కూడా నాగరిక సమాజంలో వారిని ఎగాదిగా గమనిస్తాడు. వీరు సమూహాల్లో ఇబ్బందిగా కదులుతారు. పార్టీలో గానా బజానాలో వీరు పాలు పంచుకోరు. అక్రమ సంబంధాలకు తాత్విక ప్రాయశ్చిత్తాలను వెదుకుతారు. రాజకీయాల చర్చల్లో ఒక పట్టాన ఒప్పుకోరు. తమ గురించి చెడు ప్రచారం చేసే వారిని మించి తామ్మే తాము ఈసడించుకుంటారు. గంజాయి, భంగు కాకున్నా పొగ, తాగుడుతో సరిపెట్టుకుంటారు. అటువంటివారు అప్పుడప్పుడు జైలుగదిలో తమ రక్తంలో తాము ఈదుతున్నట్టు లేదా వేదికనెక్కి మాట్లాడుతున్నట్టు కనిపిస్తారు. వారు తిరగబడుతున్నది (సరిగ్గా చెప్పాలంటే నిరసిస్తున్నది) కేవలం అన్యాయానికి ప్రతిగా కాదు, ఏకంగా ప్రపంచ మార్గం మీద! తమ ఆలోచనలు, భావాలు నిక్కచ్చి అన్న భ్రమలు వారికి ఏ కోశానా లేవు. క్షమించరాని ఆత్మాశ్రయత్వం మీదే ఆదినుండి వారి పట్టుదల. దాడికి గురి కాకుండా తమ్మే తాము కాపాడుకోవటానికి వారలా చేయడం లేదు. వారి భావాలు, వాటిని పదిలపరిచే స్థానాలు ఎంత తేలికగా దెబ్బతినగలవో వారికి బాగా తెలుసు. డార్విన్ సిద్ధాంతానికి వ్యతిరేకంగా దెబ్బతినడమే జీవలక్షణమని వారు భావిస్తారు.ఐతే ఒక విషయం ఆత్మపీడనకు, దీనికి ఎటువంటి సంబంధం లేదు. ఇటీవలికాలంలో స్వతంత్ర ధోరణిలో రాసిన ప్రతి రచయితకు దీన్ని అంటగట్టడం ఒక ఆనవాయితీ అయిపోయింది. కళలో మూసపోతను (cliche) అరికట్టే సాధనాలు- తీవ్రమైన ఆత్మాశ్రయత్వం, దురభిప్రాయం, అమిత ఇష్టాలు అన్న వారి సహజాతానికి లేదా స్వతస్సిద్ధమైన ఎరుకకి సంబంధించినదిది. మూస ధోరణికి (cliche) వ్యతిరేకతే కళను జీవితం నుండి వేరుపరుస్తుంది.

నేను చెప్పబోయే దాని నేపథ్యం మీకు కొంతవరకు తేటతెల్లమైందనుకొంటా, సరే చెప్పి వేస్తాను. సాహిత్యంలో ఉత్తమాభిరుచిని పెంపొందించే ఏకైక సాధనం కవిత్వం, కవినన్న పక్షపాతంతో, ఏదో ప్రయోజనాలనాశించి నేనిలా చెబుతున్నానని మీరనుకొంటే. అది శుద్ధ తప్పు. అందునా, నాకు ఎటువంటి సంఘాలతో ప్రమేయం లేదు. కవిత్వం మానవ అభివ్యక్తికి చరమ రూపం. కవిత్వం బహుక్లుప్తమే కాదు, మానవ అనుభవాన్ని వ్యక్తం చేసే సంక్షిప్త మార్గం. భాషాగత కార్యకలాపాలకు సాధ్యమైనంత ఉన్నత ప్రమాణాలను నిర్ణయిస్తుంది.. ప్రత్యేకించి వ్రాతలో!

కవిత్వాన్ని పఠించేకొద్దీ - రాజకీయ, తాత్విక గ్రంథాలు,చరిత్ర, సామాజిక శాస్త్రాలు నవలలు - ఎందులో కూడా శబ్దాడంబరాన్ని (verbosity) బొత్తిగా భరించలేరు. ఈ కవిత్వ శబ్దాల్లోని (poetic diction) తీక్షమైన క్లుప్తత, వేగం, ఖచ్చితత్వాలకు లోబడే ఉంటుంది వచనంలో మంచి శైలి కూడా. మరణ శాసనానికి, పరమ సూక్తికి జన్మించిన కవిత భావింపదగిన ఏ విషయానికైనా బహు దగ్గరి దారి; గద్యానికి పద్యం క్రమశిక్షణ గరపుతుంది. ప్రతి పదం విలువ, పాదరసంలా జారిపోయే మానసిక గతులు, దీర్ఘపంక్తులకు మార్గాంతారం, అనవసర వివరాలను, తేలికగా అర్థమయే దాన్ని విసర్జించే ఒడుపు, ముగింపు శిల్పం - గద్యానికి తెలిసివచ్చేలా చేసేది పద్యమే. . కవిత్వమే. సాధారణ రచనని, అపూర్వ కళని వేరుచేసే తాత్వికకాంక్షను గద్యంలో రగిలించేది కవిత్వమే. ఈ విషయంలో గద్యం, పద్యం కన్నా చాల మందమతి.

దయచేసి, నన్ను తప్పుగా అర్థం చేసుకోవచ్చు. నేను గద్యాన్ని కొట్టిపారేయడం లేదు. నిజానికి, పద్యం, గద్యం కన్నా బహు ప్రాచీనం. సాహిత్యం కవిత్వంతోనే మొదలయింది. గుహవాసి చిత్రించిన బొమ్మకన్నా, దిమ్మరి పాడిన పాట బాగా పురాతనమైనది. వెనుకట, ఎప్పుడో నేను పోల్చినట్లు, గద్యం - కాల్బలం, పద్యం - వాయుసేన. పైవాటి ద్వారా నేను నిరూపించదలచుకొన్నవి కవిత్వ అధికారశ్రేణి, అనాది మూలాలు అంతకన్నా కావు.

ఆచరణీయమైన విషయాలు నాలుగు చెప్పి, అచ్చుపడిన ప్రతిపుస్తకాన్ని చదివే శ్రమకు లోను కాకుండా, మీ దృష్టిని, మెదడుని కాపాడే యత్నం. కవిత్వం ఖచ్చితంగా ఆ ఉద్దేశంతోనే కనిపెట్టబడింది. కారణం అది క్లుప్తతకు పర్యాయపదం! కొన్ని సహస్రాబ్దాల ఈ ప్రక్రియను సూక్ష్మంగా సింహావలోకనం చేసుకోవాలి. నీవనుకొన్న దానికన్నా ఇది సులువే, పద్యం గద్యం కన్న తక్కువ బరువు కాబట్టి. కేవలం సమకాలీన సాహిత్యం మీదే దృష్టి నిలిపావా. . ఇక నీ పని నల్లేరుపై బండినడక. ఓ రెండు నెలలు శ్రద్ధగా నీ మాతృ భాషలో వచ్చిన కవుల రచనలను సంపాదించు, ముఖ్యంగా ఈ శతాబ్ది ఆదిగా . . ఓ డజను పుస్తకాలు సమకూరుతాయి! ఈ వేసవి ముగిసేసరికల్లా నీ ప్రయత్నానికి మంచి రూపు వస్తుంది.

కవిత్వ పఠనం తర్వాత అలమరాలో అలవాటైన గద్యాన్ని తీసి అవతల గిరవాటేస్తావు. అది నీ తప్పుకాదు. నీవంతా వదలకుండా చదువుతున్నా వంటే అది ఆ గద్య రచయిత ఘనత. మన అస్తిత్వానికి సంబంధించిన నిజాలను, కవుల్లాగే, అతనూ వెల్లడిస్తున్నాడు. ఇది ఆ గద్య రచన ఏమాత్రం భారం కాదని నిరూపిస్తుంది. అంతేగాక అతని భాషలో జవజీవాలు పుష్కలంగా ఉన్నాయి. లేదా నీవు పఠన వ్యసనానికి గురయ్యావు. ఇతర వ్యసనాలతో పోలిస్తే ఇదేమంత చెడ్డదేమీ కాదు.

నన్నొక వ్యంగ్య చిత్రాన్ని (caricature) గీయనివ్వు. కారికేచర్లు అవసరమైన దాన్ని బలంగా ఎత్తి చూపుతాయి. నా కారికేచర్‌లో చదువరి రెండు చేతులా పుస్తకాలు. ఎడమ కవిత్వం, కుడి వచనం. దేన్ని ముందు పడవేస్తాడో చూద్దాం. అతని రెండు చేతుల్లో గద్యమే ఉండే అవకాశం లేకపోలేదు. కానీ అది ఆత్మ తిరస్కారానికి దారి తీస్తుంది. మీరు అడగవచ్చు మంచి, చెడుకవిత్వాలను ఎలా వేరు చేయాలి అని. అతని ఎడమ చేతిలో ఉన్నది చదవ దగ్గదే అనడానికి భరోసా ఏమిటి? అని.

ఒకటి ఎడమ చేతిలో ఉన్నది, కుడిచేతిలో ఉన్న దానికన్నా తేలిక అవడానికి ఎక్కువ అవకాశం. రెండు. కవిత్వం - ఇటాలియన్ కవి మొంటాలే చెప్పినట్టు అర్థకళ! అందులో బుకాయింపుకు అవకాశాలు బొత్తిగా తక్కువ. మూడవ పంక్తి చదవగానే పాఠకుడికి తన ఎడమచేతిలో ఉన్నది ఏపాటి పుస్తకమో అర్థమై పోతుంది. కవిత్వం త్వరగా గ్రహింపు కొస్తుంది, దానిలోని భాషాసౌష్ఠవం భావాన్ని ఇట్టే అందేలా చేస్తుంది. మూడు కవితా పంక్తులు తేరిపార చూశాక అతను కుడి చేతివైపు దృష్టి సారించవచ్చు.

ముందు చెప్పినట్లు ఇది కారికేచర్‌మికు తెలియకుండా మీరు ఇదే భంగిమలో నిలిచి పుస్తకాలు పరిశీలిస్తూ ఉండవచ్చు. వివిధ సాహిత్య ప్రక్రియలను పుస్తకాలను ఎంచుకోండి. కుడి వేపు, ఎడమవేపు మార్చి మార్చి చూడాల్సి రావడం మతి పోగొట్టే పనే, ఒప్పుకొంటాను. టూరిన్‌వీధుల్లో గుర్రబ్బండ్లు ఇప్పుడు లేవు. ఈ ప్రదేశాన్ని వదిలి వెళ్ళాక బగ్గీ వాడు తన గుర్రాన్ని చర్నా కోలాతో బాదే దృశ్యం నిన్ను ఇబ్బంది పెట్టదు ఒకప్పటిలా. ఈ పుస్తక ప్రదర్శనలో ఉన్న అన్ని పుస్తకాల్లోని అక్షరాలను మించి పెరిగే ఈ గుంపులకు, ఒక వందేళ్ళ తర్వాత ఎవరి పిచ్చి, అంతగా పట్టక పోవచ్చు. సరే, నేను ఇందాక చెప్పిన చిట్కాను నీవు అమలులో పెట్టు.

*(ట్యూరిన్, ఇటలీ లో తొలిపుస్తక ప్రదర్శన (మే, 1988) సందర్భంగా చేసిన ప్రసంగం)*

# కొత్తకవులకు కొన్ని సంగతులు

కొత్తగా కవిత్వం రాస్తున్న వారిలో అన్నీ సందేహాలే.. తాము రాస్తున్నది అసలు కవిత్వమేనా అని తంబళ అనుమానం.. కొంపదీసి కాకపోతే దాన్ని ఆ బ్రహ్మపదార్థంగా ఎలా మార్చాలి అని మధన పడటం సహజమే. కాలం చెల్లిన కమ్యూనిజం వగైరా పాతచింతకాయ పచ్చడి బూజు దానికి అద్దడం వల్ల ఏమైనా ప్రయోజనం ఉంటుందేమోనని, దూరం ఆలోచించే ప్రబుద్ధుల సంఖ్య తక్కువేమీ కాదు. పోనీ పోస్ట్మోడర్న్ కళ్ళజోళ్ళు తగిలిస్తే.. ఏమైనా రూపురేఖలు మారతాయేమో.. ఎవరికి తెలియని ఆర్థిక శాస్త్రరహస్యాలు కొల్లగొట్టి మన కవితల్లో రాశులుగా పోస్తే.. ? సంశయాలతో.. నానా అలజడి చెలరేగడం అందరికి అనుభవంలోనిదే! !

## ఏమి చదవాలి? ?

ఏ తెలుగు వాచకంలోనో భట్టీ వేసిన పూవు గుర్తున్న పద్యమో, పత్రికలో ఉబుసుపోక చదివిన కవితలోని కొన్ని పాదాలో మనసును పట్టుకొని మరి వదలవు..

గొప్ప కవిత్వం రాయాలంటే ఏమి చదవాలి? సూటి జవాబు గొప్పకవిత్వం.. అదికాక ఏమి చదవాలి అంటేనే వస్తుంది చిక్కు.. ఏమి చదివినా తొలినాళ్ళలో మాతృభాషలోనే చదవాలి.. బౌద్ధంలో భిక్షువు కావడానికి ముందు అర్హతుడివి కమ్మని ప్రబోధిస్తుంటారు.. అంటే ఏమీ కాదు నిర్వాణానికి కావలసిన అర్హత సంపాదించమని తాత్పర్యం.. అలాగైతే కవిత్వ నిర్వాణానికి కావలసిన అర్హతలేమైనా ఉన్నాయా?

పదాలతోటే కవికి పని.. కాబట్టి కవిగా రాణించదలచుకొంటే పదాలవేటలో నిమగ్నం కావాలి.. అందు నిమిత్తం కేవలం కవిత్వ పుస్తకాలే చదివితే లాభం కాదు.. గులాబీ పూలు పూయించాలంటే నేలస్వభావం, నీటి వాడకం అన్నీ తెలియాలి. సకల విషయాల గురించి వచ్చిన సకల పుస్తకాలు చదవాలి.. పోగా పోగా కుదురైన వాక్య నిర్మాణం నీకు తెలిసివస్తుంది.. కావ్యంలో బలానికి, పేలుసుదనానికి స్పందించడం అలవడి.. అలవోకగా శైలీభేదాలను గుర్తు పడతావు.. అది రచనాకళకు తొలిమెట్టు.. నీవు వచన రచన చేయడానికి అర్హత సంపాదించుకొంటావు.. కవిత్వం నీకింకా ఆమడదూరంలో వుంది అని మరువకు.

వృత్తి రీత్యా నీవు ఉపాధ్యాయుడివో, ఇంజనీరువో.. మామూలు వర్తకుడివో కావచ్చు.. కానీ నీ అధ్యయనం కేవలం నీ శాస్త్రపరిధికే పరిమితం కారాదు. లెక్కలు తెలిసిన వాడికి కొంచెం బోటనీ తెలియాలి.. ప్రతి శాస్త్రంలో కనీస పరిజ్ఞానం కలగాలి.. మరీ ముఖ్యంగా తత్వశాస్త్రాలను ఒక పట్టు పట్టాలి. సైకాలజీతో లోతైన పరిచయం అవసరం.. ఏది చదివినా విన్నా అమాంతం నమ్మక, దానికి పుటం పెట్టి నిగ్గు తేల్చాలి.. లేదంటే చాలా ప్రమాదం.. ఫ్రాయిడ్‌ప్రతిపాదనలన్నీ తిరగదోడుతున్నారిప్పుడు. ఒకప్పటిలా 'కాకికేమి తెలుసు సైకో ఎనాలిసిసు' అని ఎంత మాత్రం

కొట్టివేయలేము.. పుస్తకాలలో ఉన్నదే సత్యం అన్న రోజు.. నీ జీవితమే ఒక చెరసాలగా మారుతుంది.. కాబట్టి దేన్నీ గుడ్డిగా విశ్వసించకు, అది మధ్య యుగాల మౌఢ్యానికి దారి తీస్తుంది.. బుద్ధుడంతటివాడు తన శిష్యులను వివేచించకుండా తనమాటలు గ్రహించవద్దని ఆనతినిచ్చాడు. తత్వ శాస్త్రాలను ఒక చూపు చూడమంటే పాశ్చాత్య తాత్వికులను పరమ పూజ్యభావంతో పఠించవద్దు.. ఇంటగెలిచి రచ్చగెలువు అన్న సామెత ఉండనే ఉంది. ముందు మొదలు పెట్టవలసింది మన తర్కం, తత్వం.. దీని వెనుక పెద్ద కారణం వుంది.. నాగరికత పరంగా చైనీయులకు లభించిన వరం కవిత్వం.. అలాగే మనకు సంక్రమించినది తత్వం.. కాబట్టి వారు తమ కవులు తూ ఫూ, లీ పో ల లను చదవకుండా చాసర్, షేక్స్పియర్ అంటే కుదరదు. అలాగే నీషే, హెగెల్అని నీరు కారిపోక, ముందు మన తత్వంతో ఆరంభించడం సులువైన పద్ధతి.

తర్వాత మన అలంకార శాస్త్రాలు, ముఖ్యంగా రసం, ధ్వని, స్థాయీభావాలు, పలు అలంకారికుల సిద్ధాంతాలు తేటతెనుగులో చదివి వంటబట్టించుకోవాలి.. తత్వాధ్యయనానికి కొంత గణితం జోడిస్తే.. వెంట్రుకను చీల్చే తర్కానికి తోడుగా దేన్నైనా భేదించే మెలకువ సొంతమవుతుంది. చదువుతున్నది తలకెక్కక పోయినా, త్వరపడక నిదానంగా జీర్ణించుకోవాలి. ఆంగ్లంలో ఏదీ చదవవద్దు-ముందుముందు ప్రత్యేకించి ఆ భాషలోనే చదవదగ్గ విషయాలు వేరే ఉన్నాయి..

బుద్ధికి, హృదయానికి గల సూక్ష్మభేదం గ్రహించడానికే ఈ గవేషణ.. ఈ శిక్షణతో సమకూరిన పదజాలం వల్ల, పరిజ్ఞానంవల్ల, దేనికి తుడుముకోకుండా అకస్మాత్తుగా తల ఎత్తే కవిత్వాన్ని మాటల్లోకి వంపుతావు.. దానికోసమే ఈ నిరీక్షణ.. తపస్సు..

భాష నేర్చుకోవడానికి ఇంకో సాధనం.. భిన్న ప్రాంతాల్లోని, భిన్న ప్రజలను కలవడం.. మనదేశంలో బంధుత్వాలకు కొదవ లేదు కనుక కలివిడిగా తిరిగే ప్రతి ఒక్కరికి కొద్దోగొప్పో సజీవభాషా పాండిత్యం దఖలు పడుతూనే ఉంది..

ప్రతి పలుకుబడిలోని అందాన్ని, సౌష్ఠవాన్ని గమనించాలి. కేవలం బిర్ర బిగుసుకుపోయిన పత్రికాభాషకు పరిమితం కాకుండా ఏ ప్రాంతం వాడివైతే ఆ ప్రాంతంలో బహుళప్రచారంలో వున్న సామెతలను, పలుకుబళ్ళను పట్టుకోవాలి. నీవు వెదుకుతున్న పెన్నిధి పెరట్లోనే దాగుందని తెలిసి నిశ్చేష్టుడవవుతావు.. భాషలోని శక్తి, జీవము నిక్షిప్తమైవుంది వీటిలోనే..

## కవిత్వజ్వరం

'మీసాలొచ్చేటప్పుడు దేశాలు కనిపించవు' అని రాయలసీమలో ఒక నానుడి ఉంది.. తమాషా ఏమంటే అప్పుడే కవిత్వజ్వరం ఆవహించి మనిషిని తీవ్రంగా వణికించేది..! ఈ వ్యాసం యుక్తవయస్కులు చదవాలని నా కోరిక. బలవత్‌ఝురవత్ పరివర్తన కలిగించే కవిత్వాలన్నీ పాతికలోపు వయసులోనే సాధ్యం. వయసు మీద పడుతుంటే వచ్చేది నీరసం కానీ వివేకం కాదు. ప్రపంచంలో గొప్పకవిత్వాలన్నీ వృద్ధులు రాసినవి కాదని గుర్తుంచుకోవాలి. కీట్స్, షెల్లీ, మూడుపదులు నిండకుండానే మరణించారు.

ఫ్రెంచి మహాకవి రింబా 19 ఏళ్ళకే కవిత్వరచన మానుకొని దిమ్మరిగా మారాడు. మన శ్రీశ్రీ గొప్ప కవిత్వం కూడా పాతిక లోపే వచ్చింది. యవ్వనాన్ని గౌరవించాలనేది అందుకే.. అంతమాత్రాన పాతికేళ్ళ తర్వాత కవిత్వసృష్టి జరగలేదని కాదు సారాంశం ఆలస్యాదమృతం విషం కావచ్చునని చిన్న సూచన..

## పరభాషా వ్యామోహం..

మనజాతిని పట్టుకొని పీడిస్తున్న మాయారోగం పరభాషా వ్యామోహం.. శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఆంగ్లభాషాధిపత్యాన్ని అంగీకరించవలసిందే.. కానీ అక్కడితో ఆగిపోవడం లేదు.. మన పాలిట అరబ్బీ ఒంటెలా మారి పోయింది.. ఒకదానితోనే నరకయాతన పడుతుంటే మన నెత్తి మీదికి ఇంకో లొట్టిపిట్ట వచ్చిపడింది పాలిసెట్టి సర్కారు పుణ్యమా అని.. అదే హిందీ.. ఇన్ని లంపటాల మధ్య తెలుగు, భారతాన కర్ణుడిలా అఘోరించవలసిందే..

ఆంగ్లేయులు పరిపాలిస్తున్న రోజుల్లోనే మనవారు చాలామంది ఆంగ్లకవిత్వాలనీ, అట్లకాడలనీ చేతులు కాల్చుకున్నారు. సరోజినీ నాయుడు, తోరుదత్, భూషణ్‌లని మనం చదువుకోవలసిందే తప్ప ఎవరూ సీరియస్‌గా తీసుకోరు. పుట్టపర్తి వారికి ఆంగ్లం నేర్పిన దొరసాని, ఆంగ్లాన్ని ఔపోసన పట్టు, కానీ తెలుగులోనే కవిత్వం కట్టు" అని బోధించిందట. అలాగే శంభూచంద్ర ముఖర్జీ గురజాడకు పథనిర్దేశం చేయబట్టే మనకు కన్యాశుల్కం దక్కింది. ఎవరి మాతృభాషలో వారు వ్రాసుకోవడమన్నది చాలా సహజమైన విషయం, జాతి ఇంగితానికి సంబంధించినది. నోబెల్‌గ్రహీత పోలిష్‌కవి మిలోష్" నీ బాల్యానుభవాలతో పెనవేసుకొన్నదే అసలు సిసలు సాహిత్యభాష. తర్వాత నేర్చిన భాషలకు ఆ సామర్థ్యం లేదు" అని అభిప్రాయ పడతాడు. గత ఐదు శతాబ్దాలుగా అమెరికాలో నివసిస్తున్నా ఒక ముక్క ఆంగ్లంలో రాసింది లేదు.. నక్కపుట్టి నాలుగు ఆదివారాలు కాలేదు అని మన కుర్రకారు.. ఆంగ్లంలో తంటాలు పడటం మానలేదు.. మాతృభాషా ప్రాశస్త్యాన్ని గుర్తించని జాతికి.. బానిసత్వమే నుదుట బిగ్గరగా లిఖించబడివుంది.. అయినా భాషా పాండిత్యం వేరు.. భాష కవిత్వం కావడం వేరు..

## పేరు తెచ్చుకోవడం

ఇంకొకటి పేరు తెచ్చుకోవడం.. టీనేజిలో Identity crisis లో భాగంగా గుర్తింపు కోసం తహతహలాడటం అందరిలో కనిపించేదే.. ఆ కుర్రతనం ఎంత తొందరగా వదిలిదే అంతమేలు.. విఖ్యాత తాత్వికుడు షోపెన్‌హావర్ పుస్తకాలు ఆయన జీవితకాలంలో పది పన్నెండు కన్నా ఎక్కువ అమ్ముడుపోలేదు. అలాగే ఆకలితో అలమటించి, ఆత్మహత్యకు పాల్పడ్డ మహాచిత్రకారుడు వాంగో చిత్రాలు రెండు మూడు కూడా ఖర్చు కాలేదు.. పేరు రావడానికి, కళలో సత్తాకి ఏమి సంబంధం లేదు.. ఎందరో సాదాసీదా రచయితలను కూడా నోబెల్‌వరించింది ఇతరేతర కారణాలవల్ల; వారి రచనలను ఎవరూ తాకి ఎరుగరు. మహా కవులకు చాలా దేశాల్లో మిగిలింది కేవలం మట్టి. అంత దూరం ఎందుకు మన తెలుగులో, కవిత్వంలో ఓనామాలు తెలియని కవులను నానా పీఠాలు గౌరవిస్తున్నాయి. కాబట్టి కవి అన్న వాడు.. ఈ చెత్తకు ఎంత దూరంగా వుంటే అంత శ్రేయస్కరం.

ఒక్కసారి కవిత రాశాక అది నీది కాదు.. దాని జీవితం దానిది, కవిగా నీ ప్రమేయం రాయడం వరకే..తర్వాత నీవు కల్పించుకొనే అవసరం లేదు.

ప్రకృతికి నీకు గల అనుబంధాన్ని తెలిపేది కవిత్వం. రోజువారీ ధరవరల గూర్చి, పుచ్చు వంకాయల గురించి, పుల్లగూర గురించి రాయడానికి చాలా ప్రక్రియలే ఉన్నాయి. కవిత్వాన్ని ఒక జ్ఞానసాధన లేదా ఒక జీవితవిధానంగా కాకుండా తాత్కాలిక ప్రయోజనాలకు తాకట్టు పెట్టడం.. కొరివితో తలగొక్కోవడం రెండూ ఒకటే.. కవిత్వవిశిష్టతను గుర్తెరగని వారి చీకటికి అంతులేదు..

## ఎటువంటి అనుభవాలు పొందాలి?

కవి ఎటువంటి అనుభవాలు పొందాలి? తలపండినవారు, కవిత్వానికి, మౌనానికి బెత్తెడు ఎడం ఉండేలా చూసుకో అని సెలవిచ్చారు. ఆ లెక్కన కవి జీవితాన్ని అర్థవంతంగా మార్చుకోవడానికి చాలా కృషి చేయవలసి వుంది. జీవితంలో మోహం (lust) కవిదృష్టిని కురుచబరుస్తుంది.. తద్భిన్నంగా ప్రేమ ఉన్నత శిఖరాలకు చేరుస్తుంది.. కావున ప్రేమానుభవాలు కవిత్వానికి ఆయువు పట్టు. మోహం, ప్రేమల గురించి విచికిత్స పడనవసరం లేదు.. మోహం దేహం నుండి మొదలైతే.. ప్రేమ కు జన్మస్థానం ఉన్నతమైన హృదయం. ధవళగిరులనుండి పారే కవిత్వగంగను తిలకించి మురిసిపోనిదెవరు?? వివేచించి చూస్తే.. మోహం నుండి పుట్టే ప్రేమకన్నా, ప్రేమనుండి జనించే మోహం గొప్పది.. జీవితంలో మోహానుభవాలకు, ప్రేమానుభవాలకు వ్యత్యాసం గుర్తించని కవి తబ్బిబ్బుకు లోనై కళను పాడు చేసుకొంటాడు.. ప్రేమలేని దేశంలో కవిత్వం లేదు.. మానవ సంబంధాల్లో మోటు మోహాలదే పైచేయవుతే.. బహు సున్నిత ప్రాణి ప్రేమ నశిస్తుంది.. విట్మాన్, పో ల కాలం నాటి అమెరికా గొప్ప కవిత్వాన్ని సృష్టించిందంటే.. ఎక్కడో ఇంకా మోహావేశాలకు అందనంత ఎత్తులో ప్రేమ, లవలేశమైనా మిగిలి వున్నదన్నమాట. నేటి అమెరికన్ కవిత్వం వారి జీవితాల్లో ప్రేమలేని మోహానికి నిలువెత్తు దర్పణం.. కాబట్టే లాటిన్ అమెరికా కవుల స్పానిష్ కవిత్వాలకు ఇక్కడ అంత విలువ..

కవిత్వం ఉష్ణోగ్రతా భేదాలను ఖచ్చితంగా నమోదుచేసే థర్మామీటరు.. దాన్ని చూసి సమాజాన్ని అంచనా వేయవచ్చు.. కవిత్వంలేని జాతి డస్సిపోతుంది.. ఎండుగా తయారవుతుంది.

## కవిత్వం అర్థకళ!

ఎప్పుడైతే కవిత్వాన్ని అర్థకళగా (Semantic Art) గుర్తించామో.. ఆ క్షణాన్నే దానికి అర్ధణా కాసులు కూడా రాలవని అర్థం చేసుకోవాలి. కవిత్వాలు, తత్వాలు ఎవరికీ పట్టవు.. స్పినోజా లాంటి తాత్వికుడు కటకాలు బాగుచేస్తూ బతికాడు.. కాబట్టి జీవిక కోసం కవిత్వం అన్న పురుగు దొలిచిన ప్రతిఒక్కరు, ఇతర రంగాల్లో కాలూని నిలదొక్కుకోవలసిన అవసరం ఉంది. కవికి అజ్ఞాతజీవితం ఎంతో మేలు చేస్తుంది. వీలయినంత వరకు ఇతరుల దగ్గర కవిత్వాలు, కరక్కాయల గురించి మాట్లాడకపోవడమే మంచిది. నీవు చెప్పదలచుకొనేదేదో కవిత్వమే చెబుతుంది.. కవిత్వం కన్నా బలమైంది ఏదీ పుట్టలేదు కనుక, దాని బాగోగులను దానికే వదిలేయడం సబబు

అనిపించుకుంటుంది. కళను గౌరవించే వాడు.. అప్రమత్తంగా మెలగాలి లేదా తేలిక ఉద్రేకాలకు లొంగిపోయి ఏకాంతానికి దూరమవుతాడు. కవిత్వానికి జీవగఱ్ఱ ఐన ఏకాంతమే కరువైతే కవి ఎక్కడ తలదాచుకోగలడు?

## సంకలనాల మోజు

కవిత్వాన్ని సంకలిద్దాం అని చాలా మోజు పడతారు అందరూ, దాన్ని తప్పు పట్టలేము, కానీ వేసే ప్రథమ సంకలనం బలంగా ఉండేలా చూసుకోవాలి.. రాసిన ప్రతి ఒక్కటి జతపరచ రాదు.. నిశితంగా విమర్శించుకోవాలి.. ప్రతి కవితకు ఖచ్చితమైన స్వభావం ఉంటుంది.. గణిత మేధావి రామానుజం కు వరుసగా పది పదిహేను వేల అంకెల పలు లక్షణాలు గుర్తుండేవట.. దానికి కారణం ఆయన వాటితో నెరపిన సఖ్యత, సహవాసం.. వినమ్రంగా తలవంచితేనే పిల్లలైనా, ప్రియురాలైనా, కవితలైనా మన మాట వినేది.. నీలో భాగం కాని కవితను అవతల గిరవాటు వేయవచ్చు.. ఎంపిక చేసిన ప్రతి కవిత నడత, నడక స్పష్టంగా నీకు తెలిసి తీరాలి.. ఇక్కడ వడ్రంగం నుండి కవి గ్రహించ వలసినది ఎంతో ఉంది.. అనుకొన్న ఆకారం సిద్ధించనిది వడ్రంగి.. చెక్కను వదలడు.. చెక్కలో లోపం ఉంటే పారవేయడానికి బాధపడడు.. పూర్వులను మించిపోయే ప్రయత్నం చేయడంలోనే కవి ప్రతిభ దాగుంది.. పోల్చుకోవలసింది తిలక్, ఇస్మాయిల్, అజంతా, బైరాగి, శ్రీశ్రీ లాంటి కవులతో తప్ప "అక్షరక్రమం రాగానే కవులయిపోయామనుకొనే" అర్భకులతో కాదు. ప్రతి కవిత విజయనగర శిల్పకళలా తీర్చిదిద్దినట్టు ప్రస్ఫుటంగా ఉట్టిపడాలి.. కవితలు రాయడానికి అప్పడాలు వేయడానికి చాలా తేడా వుంది.. భారీ ఎత్తున కవితా సృష్టి ఆషామాషీ పని కాదు. అది తెలుసుకొని నడచుకోవాలి.

విమర్శలు, సమీక్షలకు జంకరాదు.. అందరి అభిప్రాయాలను సాదరంగా ఆహ్వానించాలి, సద్విమర్శను తప్పక గౌరవించాలి.. కవిత్వం, విమర్శ పడుగుపేకలా కలిసిపోతేగాని సాహిత్యమన్న కలనేత అందగించదు..

## చివరి మాటలు

చివరిగా ఒకమాట.. పుస్తకాల్లో పడి సోమరికారాదు.. మనసుకే కాదు శరీరానికి కసరత్తు అవసరం లేదంటే ఏదో ఒకరోజు మొరాయిస్తుంది.. కవిత్వం.. శరీరం.. భావం ఏదైనా సరే బలంగా ఉండాలి.. తరచి చూస్తే కవిత్వానికి, కరాటేకి అట్టే తేడా లేదు.. శరీరానికి వేగం, బలం, లాఘవం నేర్పడం ఇందులో ప్రధానం.. భాషకు అదే శిక్షణ గరపితే అది కవిత్వవాహకం అవుతుంది.. అందుకే జపాన్లో వీటిమధ్య అట్టే భేదం లేదు.. యుద్ధగురువులు కవితాధ్యానంలో కాలం గడుపుతారు..

# విమర్శాదర్శము

ప్రపంచంలో ప్రతి సజీవభాష కాలానుగుణంగా తనకు కావలసిన విమర్శకులను తయారుచేసుకొంటూనే వుంది. కవిత్వంలాగే విమర్శ కూడా అతిసహజం. అది స్వభావానికి సంబంధించినది. పండితులందరూ కవులూ విమర్శకులు కాలేరు, కానీ సిసలైన విమర్శకుడు పండితుడై తీరతాడు. విమర్శకుడు ఎగబాగే ఎత్తులకు, తరచి చూసే లోతులకు పాండిత్యమన్నది అల్ప విషయం. నరనరాన వివేచన, సదా మేలుకొని వుండే రసహృదయం.. ఇవీ విమర్శకుడిని పట్టి ఇచ్చే గుణాలు. రసహృదయం కవిలక్షణం.. భావసౌకుమార్యానికి సంబంధించినది.. దీనికి స్త్రీ సంకేతం. వివేచన పండిత లక్షణం.. అవి భావ పటుత్వానికి సంబంధించినది.. దీనికి పురుషుడు ప్రతీక. ఈ రకమైన స్త్రీ పురుషుల మేలుకలయికే విమర్శకు వన్నె తెచ్చేది.. ఈ అర్ధనారీశ్వరత్వమే విమర్శకుడిని అజరామరం చేసేది. ఏది తప్పినా అణాకాణీలకు ఆశపడి శివుడిలా నటించే పగటివేషగాడవుతాడు.. ఆబోరు దక్కదు..

### ఎవడు విమర్శకుడు?

వివేచన, రసహృదయం ఉన్న ప్రతి ఒక్కడు విమర్శకుడైపోతాడా? కాదనే సమాధానం విమర్శ స్వభావానికి సంబంధించినది.. అది కవిత్వం లాగే ఒక జ్ఞానసాధన లేదా జీవిత విధానం. కావున కేవలం పుస్తకాల పురుగులు, యూనివర్శిటీ పండితులు విమర్శకులైపోరు. మనసా వాచా నమ్మినదాన్ని ఆచరించే నిజాయితీ, స్వపర భేదాలు లేని నిష్కల్మష వర్తన, సాహిత్యానికి కట్టుబడి ఉండటం, రాతలో నిర్మొహమాటం, నిష్కర్ష.. ఇవీ స్థూలంగా విమర్శకుడి లక్షణాలు.. సూక్ష్మంగా ఆలోచిస్తే నమ్మిన దాన్ని ఆచరించే నిజాయితీ నుండే మిగిలినవన్నీ పుట్టుకొస్తున్నాయి. నిజాయితీ లేని వాడు.. సాహిత్యరంగంలో నియ్యోగప్రభువు రామప్పంతులుగానో, లేదా నెపోలియన్ ఆఫ్‌ఆంటి నాచ్ - గిరీశంగానో మిగిలిపోయే ప్రమాదం ఉంది.

### మన విమర్శక త్రయం

మనకు కవిత్రయంలా విమర్శక త్రయం ఉంది. రాచమల్లు రామచంద్రా రెడ్డి, రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మ, అక్కిరాజు ఉమాకాంత విద్యాశేఖరులు.. వీరు ముగ్గురు సాహిత్యంలో భిన్న కాలాల్లో వచ్చినా నిజాయితీగా తాము నమ్మినదాన్ని శషభిషలు లేకుండా నిష్కర్షగా వ్యక్తం చేశారు.

### రా.రా

రా.రా మార్క్సిజాన్ని మనసా వాచా నమ్మిన వాడు. కానీ ఒక సిద్ధాంతంగా దాని పరిమితులను చక్కగా ఎరిగిన వాడు కాబట్టే ఎక్కడా పాఠకులతో ఇనుపగుగ్గిళ్ళు నమిలించలేదు. ఎవరికి ఇవ్వవలసిన గౌరవాన్ని వారికిచ్చాడు. తనతో భావసారూప్యం గల శ్రీ.శ్రీ, కొ.కుల దగ్గరే ఆగిపోకుండా

తిలక్, చలాల లోతులను తరచి చూశాడు విలువైన విషయాలు వెల్లడించాడు. భావసారూప్యం గల మహీధర, రావిశాస్త్రి రచనల్లోని లోపాలను క్షమించి వదిలివేయలేదు. రచయిత మేల్కొలపవలసింది హృదయాన్ని కానీ బుద్ధిని కాదు అంటూ మహీధర రచనల్లో దోషాన్ని నిష్కర్షగా చెప్పాడు అలాగే రావిశాస్త్రి వర్ణనా లౌల్యాన్ని ఎత్తిచూపాడు. శ్రీశ్రీ లోని తాత్వికాంశని నిరూపించినా, తిలక్ సౌకుమార్యాన్ని ప్రశంసించినా, గురజాడ కొ.కుల అభ్యుదయ చింతనను కీర్తించినా, రావిశాస్త్రి మహీధర శిల్పదోషాలను బట్టబయలు చేసినా వాటి వెనుక ఉన్నది జీవితంలోని ఒక నిజాయితీ. శ్రమించి ప్రోది చేసుకొన్న అభిరుచి పట్ల నిబద్ధత. అందుకే ఈనాటికీ ఆయనకు సాహిత్య గౌరవాన్ని ఆపాదించేది.

## రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మ

సంప్రదాయ పండితుడు.. సంగీతంలో ధురీణుడు.. భాషా కోవిదుడు.. ఈ మాత్రం చాలు ఆయన రూపు కట్టించడానికి. సంప్రదాయాన్ని విమర్శించడానికి ఇవేవి ఆయనకు అడ్డుకాలేదు.. సరికదా ఉపకరించాయి. సాంప్రదాయికులందరూ బహిష్కరించిన వేమనను మహాకవిగా నిరూపించడానికి ఆయన చేసిన సాహిత్యోపన్యాసాలు విజయనగర శిల్ప కళలా చెక్కు చెదరలేదు. అప్పటి సంప్రదాయ పండితుడిలా అనాలోచితంగా ప్రతి ప్రాచీన కవినీ ఆకాశానికెత్తే ప్రయత్నం ఎన్నడూ చేయలేదు. చక్కగా వివేచించి తన హృదయాన్ని తాకిన దాన్నే కవిత్వమన్నాడు. రాయలనాటి రసికత మీద మక్కువ పెంచుకొన్నా, మనుచరిత్రలోని మొత్తం పద్యాల కన్నా, రాయల మరణాంతరం అల్లసాని పెద్దన చెప్పిన "ఎదురైనచో.. మదకరీంద్రము డిగ్గి.." పద్యంలోనే రసస్ఫూర్తి, కవితావేశం ఉన్నాయని కుండబద్దలు కొట్టాడు. అలాగే నాచన సోమనాథుని కన్నా పలు భావగతులను తేటతెల్లం చేసే ఎఱ్ఱన కవిత్వం ఎలా మేటి కాగలిగిందో - వ్యతిరేకతలకు జడవకుండా - తన తీర్పును వెల్లడించాడు. స్వానుభూతి లేక శాస్త్రవాసనచే రధంలాగే వారినుద్దేశించి - వంకాయ తన వంటికి పడుతుందా లేదా అన్న విషయాన్ని ఎవరో చెబితే తెలుసుకోవడం కాదు స్వయంగా ఆరగించి తెలుసుకోవాలి అని చురక అంటించే వారు.

## అక్కిరాజు ఉమాకాన్త విద్యాశేఖరులు

తర్క సంగ్రహం రాసిన అన్నంభట్టు ఆంధ్రుడే అని సంబరపడటం తప్ప తర్క సంపన్నంగా ఈయనలా విమర్శ రాసిన వారు అరుదు. నవద్వీపంలో కావ్యతర్క శాస్త్రాలను వల్లె వేసిన దిట్ట. అలా అని నవీన పద్ధతులు ఎరుగని వాడేమీ కాదు. తన విమర్శ గ్రంధానికి సంస్కృతాంధ్రాంగ్లాలలో పీఠికలు రాసుకొన్నారు.. ఇంత హంగామా చూశాక ఈయన పాతనంతా తలకెత్తుకొని ఊరేగుతారని భావించవచ్చు.. అటువంటి చాదస్తాలు ఏవీ ఆయనకు అంటలేదు.. నన్నయాదుల నుండి భావకవిత్వం దాకా వచ్చినది కవిత్వమే కాదుపొమ్మన్నాడు. (వేమన దీనికి మినహాయింపు) చారిత్రకంగా దారితప్పాము సరళమైన తెలుగు ఛందస్సుల్లో రాసుకోక ఎందుకీ ఏనుగుమోత అని వాపోయాడు.. చివరికి తనే పూనుకొని ముత్యాలసరాలు కూర్చడం ఆరంభించారు. పలనాటి

చరిత్రను పటుసుందరంగా పరిష్కరించి విపులపీఠిక సంతరించి పెట్టారు.. పలువిషయాల్లో ఆయనతో ఏకీభవించని వారు కూడా ఆయననుండి స్ఫూర్తిపొందుతారు..

నిలువెల్లా నిజాయితీ.. ఎదురీదే సాహసం.. ఉమాకాన్తులకు పెట్టని ఆభరణాలు..

## నేటి విమర్శకుల్లో ఏమి లోపించింది??

అభిరుచి!! అతి చవగ్గా అంగట్లో దొరికే సరుకు కాదు.. జీవితానికీ, విలువలకూ సంబంధించినది. పట్టుమని పదిభాషల్లో కవిత్వాలను, విమర్శలను సరిగా చదివి సారసంగ్రహణ చేయకుండానే మేము విమర్శకులమని, పథనిర్దేశకులమని జబ్బ చరచుకొనే కూపస్థమండూకాలను నిత్యమూ చూస్తూనే ఉన్నాము. దోషరహితంగా రాయడంతోటే వీరి పాండిత్యం సరి. దొంగలు పడ్డ ఆర్నెళ్లకు కుక్కలు మొరిగినట్టు, అడపా దడపా నాలుగు వ్యాసాలు వెలిగించి, గడియకో పేరు చెప్పే సిద్ధాంతిలా భూమండలం బద్దలు చేశాము అనుకొనే వారి సంఖ్య తక్కువేమీ కాదు. నిజాన్ని అబద్ధం, అబద్ధాన్ని నిజం చేసే కన్యాశుల్కంలోనే బైరాగే చాలా నయం. దూలానికి, ద్వారానికి తేడా తెలియని కవిత్వ మాయాబజారులో తెచ్చి పడేశారు.. మన విమర్శక సిద్దులు.. అదీ ఖేచరీ గమనమ్మీద.. ఇప్పుడు ఏది కవిత్వమో ఏది అకవిత్వమో బోధపడక కవులు, పాఠకులు గగ్గోలెత్తిపోతున్నారు.

## ఏది పాండిత్యం??

పాండిత్యాన్ని నైఘంటుకార్థంలోనే తీసుకొనే వెంకటేశాలతో మనకు పేచీ లేదు. అంతకు మించి ఎదగనందుకు జాలి తప్ప. పాండిత్యమన్నది స్వభావానికి సంబంధించినది.. పుట్టి పుస్తక పాండిత్యం కాదు.. దాన్నే కబీర్‌నిరసించాడు.

*“పోథీ పఢి పఢి జగ్‌ముఆ పండిత్‌బయాన కోయ్*

*ఢాయీ అక్షర్ ప్రేమ్‌కా పఢేసు పండిత్ హోయ్”*

(ప్రేమను, హృదయాన్ని పెంపొందించుకొమ్మంటున్నాడు.. భారతంలోని ప్రశస్త రత్నాల్లో ఒకటైన విదురనీతిలోను ఈ తరహా పాండిత్య చర్చ విపులంగా వుంది.. స్వభావాన్ని, సమాజాన్ని తేటతెల్లం చేసే ఒక నిజాయితీ.. ప్రేమతో నిండిన పాండిత్యం.. శుష్క వాగ్ధాటి కాదు. మన విమర్శకత్రయంలో ఈ పాండిత్యమే మనసుకు ఆహ్లాదం కలిగించేది.. దృష్టికి పదును చేకూర్చేది.. తతిమ్మా కాలేజి పాండిత్యాలవల్ల ఒరిగేదేమీ లేదు.. తైల నష్టం తప్ప!!

## విమర్శకుడు కవి కానవసరం లేదు!

మనభాషలోని మహావిమర్శకులు ముగ్గురూ కవులు కారు.. దాని వల్ల వారి విమర్శలకు వచ్చిన లోపం లేదు. కవి కాలేక విమర్శకుడు అన్న వాదం చాలా పాతది.. విమర్శ వల్ల ఒక కావ్యం

అంతరిస్తుంది అన్న వాదంలాగే.. కావున గణించనవసరం లేదు.. "వంకాయ కూర బావుందో లేదో చెప్పడానికి వంటవాడు కానవసరం లేదు" అని ఇటువంటి సందర్భంలోనే శ్రీశ్రీ చమత్కరించాడు.

కరేబియన్ కవి డెరిక్‌వాల్కాట్, కవిత్వం గూర్చి, కవి రాయకూడదంటాడు.. ఆ రాతలు ఆత్మ సమర్థకాలని ఆయనకు గట్టినమ్మకం.. అది అలా ఉండనిస్తే పౌ, బ్రాడ్‌స్కీ, పాజ్‌లాంటి మహాకవులు గొప్ప విమర్శలు వెలయించారు. వారు కలం పట్టకపోతే ఎన్నో సత్యాలు మరుగున పడిపోయేవి.. వారి కవితా శక్తి విమర్శనా పాటవానికి దోహదపడిందే తప్ప ద్రోహం చేయలేదు.. మన తెలుగు లో ఇస్మాయిల్, శ్రీశ్రీ ఇదే కోవకే చెందుతారు.

## కొత్తపాతల మేలుగలయిక

మన విమర్శకులకు తెలిసిన విషయాలు రెండు నింద, స్తుతి. (కవులకు అదే వర్తిస్తుంది, ఏదో సామెత చెప్పినట్టు తల్లి చేలో మేస్తుంటే దూడ గట్టున మేస్తుందా?) ఆధునికులు విధిగా నన్నయాదులను నిందించి పరవశిస్తే, సాంప్రదాయికులు ఆధునికులలో తప్పులెన్నుతారు. రెండు వాదాలు అతివాదాలే. మధ్యే మార్గం ఏర్పరచు కోవలసిందే.. నిందాస్తుతుల వల్ల సత్యం వెలికిరాదు..

ప్రాచీన కవిత్వాలు ఏ భాషలోనైనా శ్రమకోర్చి ప్రత్యేకంగా అధ్యయనం చేయవలసిందే.. ఆంగ్లకవిత్వాన్ని తీసుకొంటే ఛాసర్‌కాలం నాటి స్పెల్లింగ్, ఉచ్ఛారణ వేరు. కాబట్టి, ఆధునిక స్పెల్లింగ్‌కు అనుగుణంగా తిరగరాసి కొత్తపాఠకులకు సుబోధకం చేయడం జరుగుతూనే ఉంది.. మన భాషలో వ్యవహారం ఇంత సులువుగా లేదు. ప్రతి పదార్థ తాత్పర్యాలు లేదా కావ్యాన్ని వచనంలో తిరగరాయడం ఈ రెండూ కావ్యం అందాన్ని పూర్తిగా అందించలేవు.. ఈ లోపు ప్రాచీన కావ్యాల పట్ల గుడ్డి వ్యతిరేకత, దురభిమానం రెండూ మంచివి కాదు. హేతుబుద్ధి, రసహృదయాలలో అంచనా వేయాలి దేన్నైనా!!

గ్రీకులోను, ఇటాలియన్‌లోను ఏ భాషలోను ఇంత గొడవ లేదు. ఆధునికులైన ఒడిస్సస్ఎలిటస్, సెఫెరిస్, కవాఫీల గొప్పతనం తెలుసుకోవాలంటే వారిని ప్రాచీన గ్రీకు కవులు శాఫో, హోమర్‌లతో పోల్చనవసరం లేదు. అలాగే డాంటే గొప్పతనం తెలుసుకోవాలంటే ఇటీవలి కాలపు ఇటాలియన్ కవి మొంటాలే తో పోల్చనవసరం లేదు. అసలు ఎవరూ అలా ఆలోచించరు.. కవిత్వం చారిత్రకంగా ఎలా పరిణమించింది అన్న ఏకైక దృష్టితో చర్చిస్తారే తప్ప. పది తరాల కవులను ఒక గాటన కట్టేసే పనులు ఏ దేశంలోనూ ఎవరూ చేయరు.

## సమన్వయం

సాకల్యంగా పరిశీలించిన పిమ్మట- విమర్శకుడు పెంపొందించు కోవలసింది.. సమన్వయ దృష్టి అని తెలుతుంది.. అంతేగాక అనేక కపాలాలను పరిశీలించి మానవ పరిణామాన్ని విశదీకరించే శాస్త్రజ్ఞుడిలా విమర్శకుడికి కావలసినది నిరపేక్ష దృష్టి. అది నిజాయితీగా జీవితానికి, సాహిత్యానికి కట్టుబడటం వల్ల మాత్రమే సాధ్యమవుతుంది.. వైయక్తిక స్థాయి దాటి ఎదగలేని వారు సమన్వయ కర్తలు కాలేరు.

# కథన కుతూహలం

కథకు వాతావరణ కల్పన ప్రాణం. పాత్రలు ఆ వాతావరణంలో జీవించాలి. ఆ వాతావరణం నుండి బయటపడకుండా చేసేదే కథనం. వీటన్నింటికన్నా ముఖ్యం కథలో శిల్పం కనిపించాలి. శిల్పం అంటే వివరించలేని బ్రహ్మపదార్థం కాదు. కథనం, వాతావరణ కల్పన పాత్ర చిత్రణ వీటన్నిటి మధ్య సమతూకమే శిల్పం. ఒకరకమైన organic unity (వెనుకట ఎవరో ఈ పదాన్ని సేంద్రియ ఏకత అని అనువాదం చేసి రా. రా తో ముక్క చివాట్లు తిన్నారు రారా. సజీవ ఏకత్వం అంటాడు) ఉండాలి.

నా మట్టుకు నేను వాతావరణ కల్పన లేని కథను ఊహించలేను. కథ చదివాక ఏదో కొంత నీ మనసులో మిగలాలి, ఎంత మతిమరపు ఆవహించినా. కథకు ఈ గుణం వాతావరణ కల్పన వల్లే వస్తుంది.

ఇంకొక విషయం కవితల్లో లాగే కథల్లో కూడా ఉద్వేగాలకు చాలా ప్రాధాన్యం వుంది. ఒక formula మీద కథలు రాసే వాడికి, వీధి చివరన బజ్జీలు వేసే వాడికి అట్టే తేడా లేదు బజ్జీలు అమ్మే వాడే నయం వీడికన్నా, బజ్జీలు వేయడంలో వాడికి శిల్ప పరిజ్ఞానం జాస్తి. ఉద్వేగాలు కథకుడిలో లేకపోతే అది చదివాక పాఠకుడిలో ఎలా కలుగుతాయి? కథకుడి ఉద్వేగంలోనే వుంది కథారచనలోని కిటుకంతా; ఉద్వేగం లేనిదే వాతావరణ కల్పన బలంగా ఉండదు. చలం గారి కథలు ఊహించుకోండి.

చాలా మంది సంఘటనలను తిరగరాయడమే కథ అనుకొంటారు. ఆ లెక్కన నడక కూడా గొప్ప నాట్యం అవుతుంది. ప్రతి పిచ్చి గీత గొప్ప కళా ఖండం అవుతుంది. ఉన్నది ఉన్నట్లు రాసే వాడికి చాకిరేవుకు బట్టలు మోసే గాడిదకు పెద్ద తేడా లేదు. చాలా రెట్లు అదే నయం ఉద్వేగమొచ్చినప్పుడు అన్నీ అవతల పారేసి మనస్ఫూర్తిగా ఓండ్ర పెడుతుంది.

సంఘటనలు కథలో భాగం కావాలి, సంఘటనలే కథ కాదు తెచ్చిపెట్టుకొన్న ఉద్రేకాలు కథలకు కవిత్వానికి సమానంగా హాని చేస్తాయి. నా స్నేహితుడు ఒకడు ఉండేవాడు- నవలా రచనకు ఉపక్రమించి నాలుగు పేజీల్లో ముగించే వాడు. ఏమిట్రా అంటే నేను సృష్టించిన పాత్రలన్నీ చంపేశాను, ఏం చేయాలో పాలుపోవడం లేదు అనేవాడు. కొత్తలో ఇలాంటి పరిస్థితులు చాలా మందికి ఎదురవుతాయి, కావలసినంత జీవితానుభవం లేకపోవడం వల్ల ఇంచుకబోధ శాలి అయ్యాకే కథ ఐనా కవిత్వమైనా! చాలా మంది తమకు అనుభవంలోకి వచ్చిన ఏమాత్రం సత్తాసారం లేని సంఘటనలను కథగా మలుస్తుంటారు. లేదంటే ఇతరుల్లో తమకు ఇష్టం లేని గుణాలను విమర్శిస్తూనో రాస్తుంటారు. కథా రచనలో అర్భకులు చేయవలసిన పనులివన్నీ, ఉద్దండుడు

సలక్షణమైన శిల్పంతో విశ్వజనీన భావాలను వెల్లడిస్తాడు తాను దర్శించిన జీవితాన్ని ఆధారంగా చేసుకొని, current affairs మీద specialize చేసే మహానుభావులు కథలు, కవిత్వం జోలికి రాకపోవడం జాతికి ఎంతో మేలు. వారు శుభ్రంగా ఏ పత్రికలోనో columns వెలిగించుకోవచ్చు.

మళ్ళీ మొదటికి ఒక వాతావరణాన్ని కల్పించాలంటే ముందు నీలో ఆ వాతావరణం ఏర్పడి ఉండాలి. అదే కాగితం మీదికొస్తుంది. ఆ వాతావరణం నీలో ఏర్పడాలి అంటే నీలో బలమైన తపన, ఉద్వేగం, నిజాయితీ ఉండాలి. ఇవన్నీ ఉన్నప్పుడు కథలు కథకుడు రాయనవసరం లేదు అవే రాయించుకొంటాయి!!

అంతరంగం ఆకాశం కలిస్తే గాని మంచి కథ పుట్టదు!!

# కథ-వాతావరణం

ఎక్కడ నివసిస్తున్నా మనందరి చుట్టూ ఒక వాతావరణం వుంటుంది. అది మనం గమనించవచ్చు, గమనించకపోవచ్చు. క్రమేణా అది మనలో విడదీయరాని భాగంగా మారిపోతుంది.

మన రాష్ట్రాన్నే తీసుకొంటే - మెట్టపొలాలు, దూరాన కనిపించే కొండలు, అప్పుడప్పుడు పారే నీర్లు.. ధగ ధగ లాడే ఎండ ఇవన్నీ రాయలసీమ వాతావరణంలో భాగం. కోస్తా ప్రాంతాల్లో పచ్చని మాగాణి, పారే నదులు, కాలువలు.. ఆ వాతావరణం వేరు. మన దేశంలోనే కాశ్మీర్‌లోని వాతావరణం వేరు, రాజస్థాన్‌లోని వాతావరణం వేరు. ఇది శుద్ధంగా భౌగోళికం (geographical). పోతే ఇవన్నీ అక్కడ పుట్టి పెరిగిన వారి అంతరంగాల్లో విడదీయరాని భాగాలు. సుఖదుఃఖాల్లో, మారే ఋతువుల్లో, వెలుగునీడల్లో.. అంతరంగాన్ని పెనవేసుకొని ప్రభావాన్ని వేస్తూనే వుంటుంది వాతావరణం.

మనమెవ్వరూ శూన్యంలో జీవించడం లేదు. మన చుట్టూ వాతావరణం వుంది. అలా అని కేవలం పరిసరాల్లోనే మమేకమైపోవడం లేదు. మనలో మనం నిరంతరం జీవిస్తాం. అది అచ్చంగా మానసికం (psychological).

నేను చెప్పే వాతావరణం కేవలం భౌగోళికం (geographical) కాదు. అలా అని కేవలం మానసికం (psychological) కాదు. మన అంతరంగం, మన చుట్టూ వున్న పరిసరాల సంకర్షణ (interaction) వల్ల మనలో జనించిన అద్భుత ప్రపంచం అది. వాతావరణం మనందరిలో ఉంది. అది ఆవిష్కరించినవాడు గొప్ప రచయిత. తతిమా వారి రచలన్నీ మోత బరువు, సిరా నష్టం. ఈ ఎరుక ఉన్న వాడు రాసే కథల్లో జవజీవాలు, ఒక వింత ఆకర్షణ కనిపించి తీరతాయి.

రావిశాస్త్రి మహారచయితల్లో ఒకడు. వాతావరణ వర్ణన (వాతావరణ కల్పన కాదు) మీద ఆయన అభిప్రాయాన్ని (కథలో పాత్ర మూడ్‌కి సూచనగా వాతావరణ వర్ణన ఉండాలి) మన్నిస్తూనే మనం రా. రా ఆయన మీద చేసిన విమర్శను మరచిపోరాదు.... దాదాపు చలసాని గారి విమర్శనే ("వాతావరణ వర్ణనలు కథను అడ్డేస్తాయి. చంపేస్తాయి") రావి. శాస్త్రి మీద చేసేవాడు రా. రా. చాలా చోట్ల అది నిజం కూడా. రావిశాస్త్రిలో వర్ణనా లౌల్యాన్ని పాఠకులు గమనించే ఉంటారు.

వాతావరణ కల్పనకు, వాతావరణ వర్ణనకు హస్తిమశకాంతర భేదం ఉంది. వాతావరణ కల్పన అని నేను అంటున్నప్పుడు నా దృష్టిలో చప్పున మెదిలేది, తెలుగులో ఈ అద్భుతాన్ని ఆవిష్కరించిన గురజాడ. గురజాడ మహాశిల్పి. హెచ్చు తగ్గులు, కథను అడ్డే, చంపే వాతావరణ వర్ణనలు ఆయనలో కలికానికి కూడా కనిపించవు. ఈ సందర్భంలో మనం గుర్తుంచుకోవలసినది వర్ణన యాంత్రికం, కల్పన సహజం. నగర వర్ణన, పురవర్ణన లాగా వాతావరణ వర్ణన అని నేను వాడటం లేదు. అసలు వాతావరణ "వర్ణన" అన్న పదబంధాన్నే వాడటం లేదు.

నేను వాడుతున్నది, పైన చెప్పిన రూఢి అర్థంలోని వాతావరణ కల్పన అన్న పదాన్ని.

వాతావరణ కల్పన అన్నది కరివేపాకులా కథ నుండి వేరు చేయగలిగినది కాదు. వంటకం అయిపోయేదాకా ఆవరించి ఉండే వాసన లాంటిదది. దాన్ని మళ్లీ మళ్లీ కేవలం భౌగోళిక స్థాయికి దించడం వల్ల, అదీ నగర వర్ణన, పుర వర్ణనకు దగ్గరి చుట్టం అనుకోవడం వల్ల ఈ పొరపాటుజరుగుతున్నదని తోస్తోంది. కాబట్టి noice level చర్చలోకి వస్తున్నదనిపిస్తోంది. అక్కడ కథ ఉన్నది అంటే దానికి సరిపడ ఒక వాతావరణం కల్పించబడినదనే అర్థం. ఆ వాతావరణం ద్వారానే అది వ్యక్తమవుతోంది. కవిత్వానికి రూపం లాంటిది కథకు వాతావరణం. ప్రతి కవితకూ ఒక రూపం ఉన్నట్టే ప్రతి కథకు ఒక వాతావరణం ఉంటుంది. కవితకు ఒక నిర్దిష్ట ఆకృతిని ప్రసాదిస్తుంది దాని రూపం, అలాగే కథ రూపురేఖలను నిర్ణయించేది దాన్ని వ్యక్తపరుస్తున్న వాతావరణమే. వాతావరణ కల్పన కథా శరీరానికి అంగం కాదు, అది ప్రాణం అని లోగడ వెల్లడించాను. కాబట్టి విషయి, విషయ, లేదా అంగ, అంగి (whole & part) చర్చకు ఇందులో ఆస్కారం లేదు. వంటకం రుచికి కారణమైన నాలుగు ఐదు దినుసుల్లో ఇది ఒకటి కాదు. దినుసులన్నింటిని చివరి దాకా పట్టి వుంచే ఒక విచిత్రపాత్ర లాంటిదిది. కవిత్వంలో రూప సారాలను (form & content) విడదీసి చూడటం సులభం కానట్టే, కథ నుండి వాతావరణాన్ని వేరు చేసి చూడటం, విమర్శించడం కూడా అంతే కష్టంతో కూడుకొన్నది. వాతావరణ కల్పన మీద ఈ ఎరుక చాలు.

# తొలకరి చినుకులు

**జూ**లై మొదటి వారంలో ఆటా సమావేశాలు ముగిశాయి. ఈ సందర్భంగా వారి సాహిత్య సంచిక 'తొలకరి' వెలువడింది. ఈ సంచికలో కథలు చెప్పుకోదగినంత స్థాయిలో ఉండటం విశేషం.

ప్రవసాంధ్ర రచయితల మీద ప్రధాన విమర్శ ఏమంటే వారికి తెలిసిన అరకొర జీవితాన్ని, అణాకాణీ అనుభవాలను, అల్లాటప్పా ఆలోచనలతో రాసి విసిగిస్తారని. ఈ విమర్శను దాటిన రచనలు అధిక సంఖ్యలో ఉండటం ఆనందం కలిగించే విషయం.

మరో మాట ఎన్నారైలతో వచ్చిన చిక్కేమిటంటే కలలో కూడా తమ్ముడ తాము మరచిపోలేకపోవడం. ఎంతసేపూ కుడితిలో ఎలుకలా అక్కడి - ఇక్కడి విలువల వ్యత్యాసాలు, డాలరు రూపాయి మారకాన్ని బట్టి మారే ప్రేమలు తప్ప వీరికి వేరే లోకం ఉన్నట్టు తోచదు. ఈ ఆత్మ వ్యామోహం (narcissism) ఇతర రంగాల్లో ఏమైనా ఉపయోగపడవచ్చేమో తెలియదు కాని, సాహిత్యానికి చెప్పలేనంత కీడు చేస్తుంది. సంకుచిత వ్యక్తిపరిధిని దాటని వాడెవడూ గొప్ప రచనలు చేసిన దాఖలాలు విశ్వసాహిత్యంలో లేవు. ఆత్మ వ్యామోహి ప్రపంచంతో, ప్రకృతితో తాదాత్మ్యత సాధించలేడు. అది లేనిదే కథా లేదు, కవిత్వం లేదు; ఒక వేళ వున్నా ఆ కవితకు ఒక రూపం సిద్ధించి వుండదు, కథకు ఒక వాతావరణం ఏర్పడి ఉండదు. కవిత ఒక రూపం ద్వారా వ్యక్తమవుతుంది, కథ ఒక వాతావరణం ద్వారా వెల్లడి అవుతుంది. కావున వాతావరణం లేని కథ, రూపం లేని కవిత మృతప్రాయాలు.

ఈ సంచికలో ఊపిరి పీల్చుకొనేలా చేసిన మంచి కథలు కొన్ని. ముఖ్యంగా 'ఒయ్యారం' (సాయిలక్ష్మి), పాప (కన్నెగంటి చంద్ర), అతిథి భాగోతం (చిట్టెన్‌రాజు), కేశవా (కనకప్రసాద్), ముఖ్యంగా ఒయ్యారం కథలో రచయిత్రి ఒక సగటు తెలుగువాడు, అమెరికా భామను పెళ్లాడితే ఎలా ఉంటుందో ఒడుపుగా చిత్రీకరించారు. కథ మొత్తం కెరొలిన్ దృష్టి కోణంలో నడపడం ఉంది నేర్పంతా. స్త్రీ ముగ్ధ మానసానికి భాషాభేదం లేదని చెప్పే కథ. అక్కడక్కడ కొంచెం ఉపన్యాస ధోరణిని పరిహరిస్తే ఇంకా మంచి కథగా రాణించేది. ఏది ఏమైనా NRIల శుష్కానుభవాలను దాటి, ప్రేమావరణంలో అడుగుపెట్టి కథను విశ్వజనీనం చేయడంలో రచయిత్రి ప్రతిభ శ్లాఘనీయం.

కన్నెగంటి చంద్ర 'పాప' కథలో కొడుకును చూడ వచ్చిన గుంటూరి రైతు, పక్కవాటాలో ముద్దొచ్చే అమెరికా పాపాయితో స్నేహం నెరపడం కథావస్తువు. వృద్ధాప్యానికి, బాల్యానికి విడదీయరాని లంకె. ఒకరి భాష మరొకరికి తెలియకపోయినా ఉద్వేగ ప్రవృత్తుల ఆసరాతో తాత, పాప ఎలా చేరువయింది తగినంత కాన్వాసులో చిత్రించాడు చంద్ర. ఇతనిలో మరో మంచిలక్షణం. మాండలికాన్ని పొల్లుపోకుండా పట్టుకోవడం!

హాస్య రచయితగా పేరుపొందిన చిట్టెన్‌రాజు అతిథిభాగోతం తుదకంటా నవ్వించే చక్కని కథ. ఈయన ప్రత్యేకత బిగువు సడలకుండా హాస్యాన్ని నిర్వహించడంలో ఉంది. 'మీ విరాళ స్థాయి సరే మా ఊళ్లో రిక్షా వాడు అంతకన్నా చాలా నయం' ఇండియా నుండి వచ్చిన అతిథితో NRIల మీద మెత్తటి చురకలు వేయిస్తారు.

కనక ప్రసాద్ ఒక విశిష్ట రచయిత. ఈయనది కేవలం రావిశాస్త్రి పంథా అని చెప్పడం అన్యాయం. ఇతని కథ కలదు. అలాగని విసుగు తెప్పించదు. అన్ని వివరాలను ప్రదర్శించేది photography. కావలసిన మేరకు చూపేది కళ (art). ఈ రెంటికీ మధ్యేమార్గంగా ఉంటుంది ఈయన తోవ. పోతే విశాఖ మాండలికం మీద ఎనలేని పట్టుగల అరుదైన రచయిత. ఇతనితో ఇంకో సౌలభ్యం - అమెరికా బురదను బూటుకాలితో సైతం అంటకుండా హాయిగా కథను 'ధిమ్మసా కొట్టిన హైరోడ్డు' మీదికి మళ్లించడం.

ఇవికాక,

రామలక్ష్మి గారి 'నాకు విశ్రాంతి కావాలి' సీరియస్‌గా మొదలై అంతే వేడితో ముగిసిన కథ. వస్తువు-చచ్చే దాకా తల్లితో చాకిరీ చేయించుకొనే సంతానం. సుజాత శ్రీనివాస్ 'నిలువుదోపిడీ' అయిన వారికి కల్పవృక్షంలా కనిపించే NRI మనోగతాన్ని నగ్నంగా బయటపెడుతుంది. పేరుగీత (శ్యామసుందర్) అమెరికాలోని అధునాతన కుటుంబాల పాట్లను వ్యంగ్యంగా వ్యాఖ్యానిస్తుంది. అద్వైతం (విష్ణుభొట్ల లక్ష్మన్న) - కథ, గల్పిక ఎందులోకి ఇమడకపోయినా కవుల అల్పత్వాన్ని సూక్ష్మంగా విమర్శిస్తుంది. ఆంధ్ర రచయితలైన - వివినమూర్తి కథలో మంచి శైలీ విన్యాసం, నరేంద్ర కథలో అధోజగత్తుకు చెందిన బుడబుక్కల వాని ఆత్మీయ చిత్రణ, కేతువిశ్వనాథరెడ్డి కథలో రాయలసీమ పెద్దామె అమెరికావాసం-ఆకట్టుకొంటాయి.

ఆంగ్ల రచనల్లో 'తెలుగు వీర లేవరా' అని అమెరికాలో పుట్టిపెరిగిన ఆంధ్ర యువకిశోరం, ఆత్మన్యూనతా భావంతో identity ని కోల్పోతున్న వెధవాయ తెలుగువాడి మీద విమర్శ, అలాగే prof. వేల్చేరు వారి వాక్కు - అమెరికాలో తెలుగు నిలవాలంటే రెండవ భాషగా తెలుగును విశ్వవిద్యాలయాల్లో బోధించడానికి కావలసిన వనరులను సమకూర్చడం నేటితరం బాధ్యత - గొప్పగా ఉన్నాయి. చివరిగా కవి ఎండ్లూరి సుధాకర్ ఆంధ్రోళనా లేఖ హృద్యంగా ఉంది.

# మా సారు

నాకు గుర్తున్నదల్లా పెన్నా నదీ తీరం... లలితంగా ప్రవహించే నీరు... పక్షుల అరుపులతో కమ్ముకొనే చీకటి... ఉత్తరాన కిరణం మెరుపులో వెలిగే విజయనగరపు ఆనవాలు శిథిల దేవాలయం... చల్లగా మారే ఇసుక... జామ తోటల మీదుగా వీచే గాలి అనాది ఏకాంతం! నాకున్న స్నేహమల్లా నదితోనే... గిలిగింతలు పెట్టే కెరటాల స్పర్శ... మెత్తని ఇసుకలో దిగబడే కాళ్ళు... రాత్రీ, పగలు, నదీ నేను... రూపం విషయంలో సందేహం రానివ్వని ప్రాచీన శిల్పాలు... తీవ్ర అధ్యయనం, అలవాటైన అమాయకత్వం, యవ్వనపు తొలినాళ్ళ అలజడి అంతా ప్రశాంతంగా ఉంది!

కొత్తగా వచ్చిన ఇంగ్లీష్ లెక్చరర్, పొడుగరి, స్ఫురద్రూపి, కరుణతో నిండిన కంఠస్వరంతో "కాలేజీ మాగజైన్‌లో శ్రీశ్రీ మీద వ్యాసం వ్రాసింది నీవేనా"? అన్నాడు నేనందులో వాడిన నిదాఘమన్న పదం అయనను ఆకట్టుకొంది. చాలా ఆసక్తిగా నా అభిరుచులను అడిగి తెలుసుకొన్నాడు. అలా మొదలైంది మా పరిచయం...

ఆయన అప్పుడే పాలగుమ్మి పద్మరాజు "గాలివాన" కథ అనువాద పద్ధతుల మీద సునిశిత పరిశీలన గ్రంథం వ్రాసి పట్టా పుచ్చుకొని, ఆరోగ్యకరమైన హేతువును విమర్శలో జొప్పించే ప్రయత్నంలో ఉన్నారు. తనదైన ధోరణిలో ఇంగ్లీషు పాఠాలు మొదలు పెట్టారు. కవితను కానీ, కథను గానీ చదవడంలో ఆయనది ఇంపైన బాణీ, ఎంతో కరుణ కనిపించేది. తన ఆలోచనలను ఎవరి మీదా ఎప్పుడూ రుద్ది ఎరుగడు. తాను అందుకొన్నది మాకు అందించాలన్న తపన తప్ప.

"What is empty in creation?" అని నేను రాసిన పద్యాన్ని ఆకర్షణీయంగా, అంత్యప్రాసల అందం మనసుకు పట్టేలా చదివి వినిపించారు... నేనేనా రాసిందీ పద్యాన్ని అనిపించేలా... జంతువులు, చెట్లు, ఇసుకలో దాదాపు లీనమైపోయి మనుషుల పొడగిట్టనంత ఏకాంతం నాది. గొంతు విప్పితే గానీ సంగీతం రాదు... కాబట్టి ఎవరైనా పాడితే ఎలుగులా, కలుగులో ఉడుతలా ఆశ్చర్యంగా గమనించడం నాకు అలవాటు!

వారింట్లో Keats కవిత్వం చదివి వినిపించారు... "Of leaden eyed despairs" అని సున్నితంగా చదివి "ఎన్ని ఇంద్రియాలను ప్రేరేపిస్తున్నాడు కీట్సు, గమనించావా?" అన్నాడు. ఆ భావం నాలో పాతుకుపోయి, అకస్మాత్తుగా ఒకరోజు నాలో తలెత్తిన కవితే 'నిశ్శబ్దంలో నీ నవ్వులు'!

నేను అనువాదాలు చేస్తానని తెలుసుకొని చాలా సంతోషించారు. ఆయనకు అభిరుచి ఉన్న రంగం అది. Catford, Lida తదితరుల అనువాద సిద్ధాంతాలను అయన దగ్గరే చదివాను. హిందీ బందీఖానా నుండి పూర్తిగా బయటపడినా, నాకు నచ్చిన జయశంకర్ ప్రసాద్ (హిందీ విశ్వనాథ!) "ఆకాశదీప్ కథను తెలుగు చేశాను! ఉధృతంగా బెంగాలీ నేర్చుకొంటున్నాను... పక్కనే కడపలో పుట్టపర్తి వారి పాండిత్యం తాలూకు వేడి బాగానే సోకుతుండేది. కానీ ఆయన నాలోని ఈ

ధోరణిని అరికట్టారనే చెప్పాలి. "ఈ బహుభాషా పాండిత్యాలు సభల్లో హంగామా చేయడానికి పనికి వస్తాయి కానీ, కవిత్వానికి అక్కరకు రావు" అన్నాడు. రోమాదాస్ (అస్సామీ) రాసిన కథను నా ముందుకు తోసి "పెళ్ళికి ముందు ప్రేమను అందరూ రాయగలరు, పెళ్ళి తర్వాత ప్రేమ ఎవరూ ఇంత బాగా రాయగా నేను చూడలేదు" అన్నారు. (ఆ క్షణాన మా ఇద్దరికీ తెలియని విషయం అది అస్సామీలో "ప్రథమరాగిణి" చిత్రంగా రూపొంది పలు విమర్శకుల మన్ననలు పొందింది). ఆ పుస్తకం పట్టుకు వస్తుంటే వీధి చివరి మెరుపుతీగ ఎదురై జిగేల్మనిపించింది. రాంబాణం పూవులా నిటారుగా, నిర్మలంగా ఉండేది... "oh! brighty are you child of beauty!" అని ఆంగ్ల కవుల అరువు గొంతుకతో ఆ భామిని గురించి ఏదో రాసినట్టు గుర్తు. ప్రేమంటేనే ఏమో తెలియని వయస్సు. సౌందర్యం విద్యుదాఘాతంలా తాకి తల్లడిల్లి పోయే రోజులవి.

రోమాదాస్ "చెల్లని నాణెం" నాకు ఎంతగా నచ్చిందంటే రోజంతా అందులో మునిగి దాన్ని తెనిగించాను - అస్సాము కొండల పూలపుప్పొడి, జలపాతాల చల్లదనం హృదయాన్ని తాకి ఏదో కలవరం. సాయంత్రం దాన్ని చూసి ఆశ్చర్యపోవడం సారు వంతయింది. పత్తి గింజలా తేలిపోయే మనసు అని నేను రాస్తే, దూది పింజలా అని ఆయన సరిచేయడం నాకు గుర్తుంది. అలా మొదలైంది అనువాద పరంపర... తకఝీ శివశంకర పిళ్ళై (మలయాళం) "వరద"లో కొట్టుకుపోయాను. యజమాని వదిలేసి పోయిన కుక్క దీనావస్థ... ఆ కరుణలో... వర్షంలో పడి ముద్దగా మారాను. కథనంలో లోతులు నిజంగా అర్థమైంది అప్పుడే... అదే ఊపుతో Jerome K Jerome– Uncle Podger hangs a picture హాస్య కథను అనువదించాను. సాకల్యంగా అన్నీ చదివి "ప్రతి కథలో కథకు తగ్గ శైలి ఎన్నుకొన్నావు... ఎక్కడా పట్టు తప్పలేదు. అనువాదాలు ఆపవద్దు" అన్నారు. తమాషా ఏమంటే R.K.Narayan-Talkative man, మరో ఆంగ్లకథ conjurer's revenge కథానువాదాలు... సారు నేను ఇద్దరం మరచిపోయాము. నేను విజయవాడ, సారు వేరే ఊరు వెళ్ళిపోయారు!

ఇంజనీరింగ్‌లో నా ప్రపంచం మరింత విశాలమైంది! ఒక రాత్రంతా కూర్చుని శ్రీశ్రీని అనువదించాను. పోతే మా ఇంగ్లీష్ ప్రొఫెసర్ ఒప్పుకోలేదు! సెలవుల్లో కలిసినప్పుడు, నేను "వచ్చాను' ' అంటే నవ్వి "వచ్చినాను, వచ్చాను అయిపోయిందా" అన్నారు. నిశిత పరిశీలన. నా అనువాదాలు చూసి, ఇస్మాయిల్ గారి కవిత్వానువాదాలు చేసే కేశవరావు గారి అభిప్రాయం కనుక్కొందాం అన్నారు. ఆయనలో నచ్చే అంశం అదే. హేతుబుద్ధి... ఆరోగ్యకరమైన హేతువు, పాండిత్యాన్ని మించిన రసవివేచన-సదా మేలుకొని ఉండటం వల్లే, లేని గొప్పలు ఆపాదించుకోకపోవడం, గాలిపటంలా ఎగిరే ఆవేశాన్ని హేతుసూత్రంతో బంధించి స్వేచ్ఛావాయువుల్లో మరింత ఉల్లాసంగా ఎగిరేలా చేయడం... ఆయనకు సాధ్యమైంది. ఇంత దూరం వచ్చాక ఆయన గుర్తున్నారంటే "విత్తనంబు మర్రి వృక్షంబునకునెంత" అన్న వేమన వాక్యం సత్యం కావడమే. ఈ విత్తనం ఆయనదే... అందుకే దీన్ని - చిన్ననాటి వింత రంగుల జీరంగిని - అగ్గిపెట్టెలో పెట్టి భద్రంగా అప్పగిస్తున్నాను!!

*(టి. శ్రీనివాసరెడ్డి కి)*

# అనువాదంలో మెలకువలు

అనువాదంతోనే ఆంధ్ర సాహిత్యానికి అంకురార్పణ జరిగింది. మన ప్రాచీన కవుల్లో చాలా మంది అనువాదంలో నిష్ణాతులు. 'నీ డు ము వు లు నీవు తీసుకొని మా సంస్కృతాన్ని మాకివ్వు' అని శ్రీనాథుడంతటి వాడిని ఎకసెక్కం ఆడారంటే, అనువాదం ఎంతగా పాతుకుపోయిందో అర్థం చేసుకోవచ్చు. కవయిత్రి మొల్ల, అనువాదానికి పూనుకొనే ముందు వెలిబుచ్చిన అభిప్రాయాలు కూడా ఆమె పరిశీలనకు అద్దం పడతాయి. అనువాదం ప్రత్యేక కళ. మన గిరీశం మాటల్లో "సివిలైజేషన్‌కు నిగ్గు" అనువాదమే. హరప్పా ముద్రలు అనువాదాలకు లొంగనందునే మన నాగరికత ఆనవాళ్ళు గూఢంగా ఉండిపోతున్నాయి. మన సున్న ఎల్లలు దాటింది అనువాదాల వల్లే అని మరువరాదు. ఇక్కడ, మన చర్చా విషయం కవిత్వానువాదం.

## అనువాదం మాతృభాషలోనే సాధ్యం

కవిత్వం లాగే అనువాదం కూడా సృజనాత్మక ప్రక్రియ. మూలం ఉందికదా చెలరేగి పోవచ్చు అనుకొంటే అది శుద్ధతప్పు. నీకు చాలా పరిమితులున్నాయి. కవిని మించిన ప్రజ్ఞ అవసరం. నీ ఫాయాలో నీవు కవివే. కవిత్వం మాతృభాషలోనే సాధ్యం (చాలా ఎక్కువసార్లు) అన్న సంగతి అందరూ ఎరిగిందే. కాబట్టే మనం ప్రపంచంలో ఏ భాష నుండైనా తెలుగులోకి అనువదించి ఒప్పించవచ్చు. కానీ తెలుగు నుండి పరభాషల్లోకి తెలుగువారే చేబడితే వస్తుంది చిక్కు. దానికి గల కారణాలు అనేకం. నీ బాల్యం, గతం పెనవేసుకొన్నది మాతృభాషతో అంటే.. తెలుగుతో. నీ అనుభవాల వేళ్ళు తన్నింది దానిలోనే. మన పరభాష ఆంగ్లం అనుకొందాం. మనం దాన్ని నేర్చుకొంది బుద్ధిమార్గంలో, నానా వ్యాకరణాలను భట్టీయం వేసి. తెలుగులో వ్యాకరణం అంటే ఏమిటో తెలియకముందే మనకాభాష కంఠదఘ్నంగా వచ్చు. కాబట్టి ఇతర భాషల్లోకి మనం చేసే అనువాదాలు నానాటికి తీసికట్టు నాగంభొట్లు తరహాలో లేదా రాను రాను రాజుగుర్రం గాడిదైన చందానో ఉంటాయి. ఇది ఎరిగిన వారు కాబట్టే, ప్రపంచవ్యాప్తంగా పండితులు పలు భాషల్లోంచి తమ మాతృభాషల్లోకి అనువాదాలకు పూనుకొన్నారే తప్ప, తమభాష లోంచి ఇతర భాషల్లోకి కాదు. ఈ వాదానికి ఎప్పుడో ఎక్కడో మినహాయింపులు ఉండవచ్చు, కానీ, ఖగోళ ఘటనల్లా అవి బహు అరుదు.

## అనువాదం పాండిత్యప్రదర్శన కాదు

చాలామంది అనువాదం అనగానే నడుం బిగించి, ఎంత అర్థం కాని భాషలోకి వికటింప చేస్తే అంత గొప్ప అన్నట్టు బయల్దేరతారు. పాఠకులు అనువాదం అనగానే 'ఎన్ని కష్టాలు వచ్చాయిరా

నాయనా' అని అన్యమనస్కంగా వాటిని చదవడానికి ఉద్యుక్తులవుతారు. "అనువాదం ఇంకా బావుండవలసింది" అని ఖర్మకాలి ఎవరైనా గొణిగారో ఇక పని ఖాళీ, "ఠాట్! ఇది మూలంలో బహు దుష్కరము, అరటి పండు వలిచి పెడితే ఇల్లా అంటారు" అని విరుచుకు పడవచ్చు. మొత్తానికి అనువాదాలు అంటే జనాలు పిక్కబలం చూపేదాకా వచ్చింది వ్యవహారం. అనువాదం బహు సున్నితమైన విషయం. అభిరుచి ఉన్నవాడు చేబడితే వాటికి విలువా, అందం; పాండిత్య ప్రదర్శన ఎలా కవిత్వం కాదో, అలాగే అనువాదం కూడా కాదు.

## ఏది మంచి అనువాదం?

మొదలు అనువాదకుడు "జగద్ధితంబుగా" చేస్తున్నాడో, జనాలు ఠారుకొని చావడానికి చేస్తున్నాడో నిర్ణయించుకొంటే ఉత్తర క్రియ సులభంగా వుంటుంది. మూలభాష నుండి ఒక కవిని ఆంధ్రీకరిస్తున్నావే అనుకో.. ఆ భాషలో ఆ కవి ఎప్పటి వాడు? ఎంత ప్రాచీనుడు? తన కవిత్వాన్ని ఏ ఛందస్సులో నడిపాడు? దాని వల్ల కావ్యసౌందర్యం ఏ రకంగా ఇనుమడించింది? కావ్యం మొత్తం అదే ఛందస్సులో ఉందా? ఇటువంటి విషయాలు కూలంకషంగా విచారించుకోవాలి.. ఆంగ్ల ప్రపంచంలో ఉమర్‌ఖయ్యాం రుబాయీల కున్నంత ప్రశస్తి అంతా ఇంతా కాదు. రుబాయీ అంటే ఫారసీలో పద్యం అని అర్థం. ఐతే అంత్య ప్రాస ఉంటుంది (చాలా స్థార్లు మూడవ పాదం తప్పించి) ఫిట్జ్‌గెరాల్డ్‌దాన్ని బీరు పోకుండా, మూల విధేయంగా పట్టుకొచ్చాడు. మన భాషకు అంత్యప్రాస అంత సహజం కాదు. ఉమర్‌ఖయ్యాంను తెలుగు చేస్తే మన గతి ఏమిటి? ఆటవెలదిలోకి లాగాలా?? శార్దూల మత్తేభాలను ఉసిగొల్పాలా? లేదా హాయిగా free verse లో చలం లా తెనిగించాలా?

దువ్వూరి ఏకంగా ఫారసీ నుండి తెనిగించారు. Fitz Gerald లాగే. కానీ ఛందస్సు విషయంలో అతను చూపినంత ఉపజ్ఞ చూపలేదనిపిస్తుంది. ఫారసీలో, ఆంగ్లంలో సూటిగా, సరళంగా ఉన్న భావాలు భారీ ఛందాల్లో పడి ఇబ్బందిగా కదులుతున్నాయి అనిపిస్తుంది. ఆశ్చర్యకరంగా ఆదిభట్ల వారు ఫారసీ నుండి సంస్కృతంలోకి చేసిన అనువాదాలు, బహు పొందిగ్గా ఉన్నాయి (అవును, Fitz Gerald కు ధీటుగా!). దువ్వూరి వారు ఏ ఆటవెలదినో లేదా మాత్రాబద్ధఛందస్సునో ఎంచుకొని ఉంటే వాటి భాగ్యం ఇంకోలా వుండేదేమో! నిస్సందేహంగా సరళ ఫారసీ ఛందానికి, బరువు సంస్కృత వృత్తం సరిజోడీ కాదు. వీటికి భిన్నంగా సజీవభాషలోకి, చలం చేసిన అనువాదాలు, వాటి కవిత్వ తీవ్రత వల్ల అద్భుతంగా ఉన్నాయి.

## సజీవభాషను స్వీకరించు

గురజాడ, గిడుగు జీవితం ధారపోసింది సజీవ భాషకోసమే. ఆ క్రమంలో మనకు దక్కినదే కన్యాశుల్కం, సాహిత్యంలో సజీవభాషకు గల స్థానాన్ని స్థిరపరచింది. ఇదిలా ఉండగా, మనకు భారత రామాయణాల్లా, పాశ్చాత్యులకు హోమర్ విరచిత ఇలియడ్, ఒడిస్సీలు. వాటికి వందల కొద్దీ అనువాదాలు వచ్చాయి. ఇంకా వస్తున్నాయి. ఎందుకివన్నీ? వెనుకటి అనువాదాలు చాలవనా? పనికిరావనా? భాష మారుతూ ఉంది. మారుతున్న భాషకు అనుగుణంగా కొత్త అనువాదాలు! పాత

అనువాదాలు కావలసినవారు పాతవిచదువుకొంటారు. ఏది ఏమైనా అనువాదాల్లో సజీవభాషకు పట్టం గట్టిన కవే ఆదరణకు నోచుకొంటాడు. మన విషయమే తీసుకొంటే భర్తృహరికి చాలా అనువాదాలే వచ్చాయి. ఏనుగు లక్ష్మణకవి ఎందుకు అందరినీ మించాడంటే ఛందస్సు ఎంపిక లోను, సజీవభాషాప్రయోగంలోను గొప్ప వివేకాన్ని కనబరచడం వల్లే. శ్రీనాథుడి పద్యాలు మిరుమిట్లు గొలుపుతూ ఉండటానికి కారణమిదే, అతను సజీవభాషను తన పద్యాల్లో అలవోకగా ఒప్పించగలిగాడు. మనం చలాన్ని చదివి పరవశించడానికి కారణం ఇదే. కాబట్టే చలం రుబాయీలు అందరినీ అంతగా ఆకట్టుకొనేది!!

## కాళిదాసు కవిత్వం కొంత..

ఆపై తన పైత్యం కొంత! అనువాదకుడి స్వంత పైత్యానికి కొంత స్థానం వుంది. ఎటొచ్చీ, అది మితిమీరకుండా జాగ్రత్త వహించాలి. అసలుకు ఎసరు పెట్టే పనులు ఎవరికీ మంచివి కావు. కొన్ని అనువాదాల్లోకి రావు. ఎంత భీష్మించుక్కూచున్నా లాభంలేదు. ఎంతవరకు అవి అనువాదయోగ్యాలో ఆలోచించాలి. చైనీస్ కవిత్వాన్ని ఎజ్రా పౌండ్ ఆంగ్లంలోకి చక్కగా పట్టుకొచ్చాడు. కొంతవరకూ దాని క్కారణం వాటిలోని concrete imagery. Polish అనువాదాలకు సంకలిస్తూ, జెస్వావా మిలోష్ (90వ పడిలో, ఈయనక్కూడా మాతృభాషలోనే రచించాలి అని గట్టి పట్టుదల) ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తాడు. అనువాదానికి పరిమితులున్నాయి. భారతీయ భాషల్లో, ఒక భాషనుండి మరొక భాషలోకి అనువాదాలు భావం చెడకుండా పట్టుకురావచ్చు. ఇదే విధంగా ఆంగ్లం, ఫ్రెంచి, స్పానిష్ తదితర Romance/Germanic భాషల్లో పరస్పరానువాదాలు అంత కష్టం కావు. దేశకాలాలు మారితే అనువాదకుడి శ్రమ అధికమవుతుంది.

## సాధకబాధకాలు

అనువాదాలెప్పుడూ మాతృభాషలోకే, నీరుపల్లమెరుగు అన్నంత సహజంగా.. తొలుత గద్యంతో మొదలుపెట్టి, కొంచెం చేయి తిరిగాక కవిత్వం వైపు కన్నెత్తి చూడటం మంచిది. లేడికి లేచిందే పరుగు, ఇక్కడ సరిపోదు. భాష లోతులు తెలియాలంటే పలు మునకలు వేయాలి. ఆనుపానులు తెలిశాక ఎలా ఈదినా ప్రమాదం లేదు. కేవలం శుష్క పాండిత్యంతో శూలం తిప్పితే ఒరిగేదేమీ లేదు. సజీవభాషలోని లఘువు బిగువులను ఒడిసి పట్టుకొని ప్రయోగించ గలిగినప్పుడే అనువాదాలు రాణించేది. పరభాషలో మనకింత వెసలుబాటు-అనగా సజీవభాషలోని తూగునూ, ఊనికనూ, కాకువునూ హృదయతం చేసుకొని ప్రయోగించగలిగే సామర్థ్యం - లేదు కాబట్టి, మనం ఆంగ్లంలోకి చేసే అనువాదాలు తరచూ తడి తక్కువ తపన ఎక్కువ అన్న నానుడిని నిజం చేస్తూ ఉంటాయి.

అనువాదం అందరివల్లా అయ్యే పని కాదు. కవిత్రయం మొదలుకొని, శ్రీనాథుడి నుండి శ్రీశ్రీ దాకా డొక్కశుద్ధిగలవారే ఇందులో ఆబోరు దక్కించుకొన్నారు. శ్రీశ్రీ అనువాదాలు మూలవిధేయంగా ఉంటూనే, మూలానికి ధీటుగా ఉంటాయి. పాల్‌ఎల్వార్, ఎలిటస్, స్విన్‌బర్న్, డైలాన్‌థామస్

తదితరులందరూ తెలుగులోకి వచ్చి స్థిరపడ్డారు. ఇస్మాయిల్‌గారి పుణ్యమా అని ప్రపంచ కవుల్లో ముఖ్యులు-దర్జాగా మన వసారాలో పీఠం వేసుకొని కూర్చున్నారు. స్మైల్ కవిత్వానువాదాలు అంతే ఖ్యాతి గడించాయి. అనువాదకుడికి ఇరుభాషల్లో కవిత్వం పోకడలు క్షుణ్ణంగా తెలిసి ఉండాలి. లేని పక్షంలో కాలు జారడం ఖాయం. రిల్కే విషయంలో Robert Bly (ఈయన ఇటీవల గాలిబ్ అనువాదాల్లో పాలు పంచుకొన్నారు) లాంటి గొప్ప కవుల అనువాదాలు తేలిపోయాయి. జర్మన్ కవిగొథే రచించిన Faust నాటకానికి పలు అనువాదాలు లభ్యమవుతున్నా, కొందరివే ప్రమాణంగా భావిస్తారు. కావున మన శక్తి సామర్థ్యాలను బేరీజు వేసుకొని ముగ్గులోకి దిగడం శ్రేయస్కరం.

## చివరి మాటలు

అనువాదాలు కత్తి మీద సాము. వ్రతమూ చెడుతుంది.. ఫలమూ దక్కదు. వీటికి మంచి సాధన, గొప్ప ఓర్పు కావాలి. కేవల నిఘంటు పరిచయం నీకు లాభించదు. సజీవ భాషలోని సౌందర్యం, నుడికారం మీద నీ పట్టు - ఇవీ నీ ఆయుధాలు. అనువాదం ద్రవిడ ప్రాణాయామం కారాదు. కుప్పుస్వామయ్యర్ మేడ్డీఫికల్టీ చేయవద్దు. సదరు కవి అచ్చంగా తెలుగులో కవిత్వం చెప్పినట్టు ఉండాలి, కింద పడి పల్టీ అన్నట్టు కాదు. మూలంలోని శైలినీ, పదప్రయోగాన్నీ, తూగునూ తీవ్రంగా పరిశీలించిన పిమ్మటే ఉద్యమించాలి. సంగీత గుణం మరీ అధికమైన వాటిజోలికి పోకు; కారణం, సంగీతం అనువాదానికి లొంగదు.

# ఉమర్‌ఖయ్యాం-ఉదాహరణలు

అనువాదంలో మెలకువల్లో భాగంగా - ఏది మంచి అనువాదం? అయితే ఎందుకు? - గత శతాబ్దంలో వచ్చిన ఉమర్‌ఖయ్యాం తెలుగు అనువాదాలను తరచిచూడటానికి ముందుగా కొంత చరిత్ర. ఉమర్‌ఖయ్యాం (1048-1122) కొంచెం అటూ ఇటుగా నన్నయకాలం వాడు. అప్పటి ప్రపంచంలో పేరుపొందిన గణితశాస్త్రజ్ఞుడు. మన గణిత శాస్త్రవేత్త భాస్కరాచార్యుడు, గణిత సార సంగ్రహం రాసిన పావులూరి మల్లన ఈయన తర్వాతి వారు. పారశీకులకు వేమన లాంటివాడు. కాలపరీక్షకు తట్టుకొని, బహుళప్రాచుర్యం పొందిన రుబాయీలను Edward Fitzgerald (1809-1883) ఎంతో శ్రమకోర్చి అనువదించాడు. తర్వాత నాలుగుసార్లు తిరగరాశాడు. Swinburne, Rosetti లాంటి గొప్ప కవుల ప్రశంసలు లభించే సరికి ఈ అనువాదాలకు తిరుగులేకుండా పోయింది.

ఇకపోతే, నాకు చూడగా అనువాదంలో పరికించి చూడవలసిన లక్షణాలు నాలుగే నాలుగు!

1. సజీవ భాష

అనువాదాలు చదివేది ఇప్పటి ప్రజలు; నీకు సమకాలీనులు; వారికోసమే ఈ అనువాదం, నీ బాహు బలప్రదర్శన కోసం కాదు. అనువాదం సజీవభాషలో ఉండి తీరాలి. డాబు పదాల వాడకం అనువాదకుడి అసమర్థతను సూచిస్తుంది.

2. ఉద్వేగాలు

భావ తీవ్రత లేనిది కవిత్వమే కాదు. దీనివల్లే కవితకు ఒక అందం, ఆకృతి సమకూరుతున్నాయి. ఏ ఉద్వేగం లేని రచనకు చాకలిపద్దుకు పెద్ద తేడా లేదు.

3. పదప్రయోగం

కవిత్వం అంటే మూర్తంగా ఉండాలి. మూలంలో కవిత ఎంత మూర్తంగా (concrete) ఉందో గమనించాలి. నీ అనువాదం కూడా దాదాపు అదేవిధంగా వుండాలి. నీ ఇష్టం వచ్చినట్టు దున్నేయరాదు.

4. తన పైత్యం

తనపైత్యం ఎక్కువైతే మూలంలో కవి చెప్పనివన్నీ చెబుతాడు అనువాదకుడు. ఇది చాలా ప్రమాదకరం.. అనువాద ఉద్దేశం దెబ్బతింటుంది. అనువాదకుడు ఎక్కడా కనిపించరాదు, పరకాయ ప్రవేశం చేయాలంతే!

ముందు పారసీ మూలాన్ని పరిశీలిద్దాం.

తంగీ ఈ మైలాల్‌ఖాహం దీవానీ

సద్దీ రమ్‌కీ బాయద్‌వనస్పీ నానీ

వాంగ్‌హమన్‌వత్‌నిష్టీడర్‌వీరానీ

ఖుష్టర్‌బూద్‌ఆజ్‌ముమ్లూ ఖటీ సుల్తానీ

అంత్య ప్రాస అన్ని పాదాలకు ఉంది. సాధారణంగా రుబాయిల్లో మూడో పాదానికి అంత్యప్రాస ఉండదు. (fitz gerald దీన్ని విధిగా పాటించాడు). ఒక్కసారి చదవడంతోటే లఘువుల కన్నా గురువులు ఎక్కువ ఉన్నాయని తెలిసిపోతుంది. చివరి పాదం కొంచెం దీర్ఘం, లేదంటే అన్ని పాదాలు దాదాపు సమంగా ఉన్నాయని చెప్పవచ్చు.

ఇక ఆంగ్లమూలాన్ని పరిశీలిద్దాము-

**A Book of Verses underneath the Bough,**

**A Jug of Wine, a Loaf of Bread-and Thou**

**Beside me singing in the Wilderness-**

**Oh, Wilderness were Paradise enow!**

3వ పాదాన్ని వదిలి ఎప్పటిలా అంత్యప్రాస పాటించాడు. భాష చాలా మూర్తంగా వుంది. మద్యం, పద్యం, ప్రేయసి, రొట్టె, చెట్టు వేటి ముందు ఒక్క విశేషణం కూడా లేదు.. విశేషణాలు చేసే పని వస్తువు గురించి చెప్పడం. కవిత్వానికి నామవాచకాలతో పని, విశేషణాలతో కాదు. వస్తు వర్ణనను పూర్తిగా పాఠకుడికే వదిలివేస్తున్నాడు. అరటిపండు వలిచిపెట్టే పని చేయడం లేదు. దీనివల్ల క్లుప్తతకు క్లుప్తత, కవిత్వ ప్రక్రియలో పాఠకునికి భాగస్వామ్యం ఒనగూరుతున్నాయి.

భావతీవ్రత (lyrical tension) ఉంది. తను.. ప్రేయసి.. ఏకాంతం, నిర్జనారణ్యం.. క్లుప్తంగా ఉంది. మూలంలోని నడక, పొందిక, బిగువు దాదాపు అనువాదంలో వున్నాయి..

ఇంకోసారి, అనువాదంలో చూడవలసిన లక్షణాలు నాలుగు.

1. సజీవభాష 2. ఉద్వేగాలు 3. పదప్రయోగం 4. తన పైత్యం

సజీవభాషలోనే ఉద్వేగాలు సవ్యంగా వ్యక్తమవుతాయి. వేటి ద్వారా? -మూర్తపదాల ద్వారా! కాబట్టి సజీవభాష, ఉద్వేగాలు, పదప్రయోగం ఒకే వస్తువుకు మూడు ముఖాలు. లోపలికి వెళితే వాటి మధ్య అసలు భేదం లేదు. ఈ మూడు ఉంటే చివరి లక్షణం తనపైత్యం లేనట్టే. తన పైత్యం ఉందంటే, ఆ నిష్పత్తిలో ఈ మూడింటికి అనగా కవితాభివ్యక్తికి హాని, నష్టం వాటిల్లుతాయి.

ఇక అనువాదాల్లోకి ప్రవేశిద్దాము. మొదట కరుణశ్రీ.

**1. కరుణశ్రీ - 1987**

కరమునపాన పాత్ర బిగి కౌగిట చేరి చకోరనేత్ర అం

బరమున చంద్రరేఖ, ఇటుపక్కన చక్కని పూలతోట అ

ద్దరిసెలయేరు ముందరిసుధామధుకావ్యముకందళించుసుం

దర సుషమా సుఖంకరదినంబులు మాకు క్షణంబులైచనున్

అనువాదంలో పైన పేర్కొన్న లక్షణాల్లో చివరిది అనగా తనపైత్యం హిమాలయాలను తాకుతుందని చెప్పవచ్చు. కాబట్టి కవిత్వం అటకెక్కింది. మూలాన్ని మూలన తొక్కి "ఇంతింతై" అని విస్తరించింది అనువాదం.. మూలంలో పానపాత్ర చేతిలో ఉందని ఎక్కడా చెప్పలేదు. సరేదాన్ని వదిలేద్దాం. ప్రేయసి (అందునా, చకోర నేత్ర! మూలంలో ఆమె గురించి పల్లెత్తు మాట లేదు) బిగికౌగిట చేరింది. ఇది ఖచ్చితంగా పైత్యమే. బరితెగించాక హద్దూ ఆచారాలు ఎవడిక్కావాలి? వెంటనే అంబరమున చంద్రరేఖ ప్రవేశించింది. ఖయ్యాం, అది రాత్రని, పగలని చెప్పిన పాపాన పోలేదు. ఇటుపక్కన చక్కని పూలతోట (అది కరుణశ్రీ obsession, కాబట్టి అదీ ఉండవలసిందే). ముందరి సుధా మధు కావ్యము (అనవసర విశేషణాలు, ఉమాకాన్తం గారి మాటల్లో దండుగ్గణాలు). కందళించు సుందర సుషమా సుఖంకర దినంబులు (మళ్ళీ, దండుగ విశేషణాలు); మాకు క్షణంబులై చనున్. నాకు ఇక్కడికి వచ్చేసరికి అనిపిస్తుంది, అసలీయన అనువదించింది ఉమర్‌ఖయ్యాం నేనా? లేదా ఏదో పోనీలే పాపం అని ఆయన బోర్డు తగిలించుకొని తనే ఉచితవైద్యం చేసినట్టుంది! ఊరూరా పేరు మారుమోగిన వారి అనువాదాలు (?) ఇలా అఘోరిస్తే, ఇక తెలుగులో అనువాదసాహిత్యం ఏ గంగలో కలవను? అలవాటు మీద అవధానిలా ఏదో కూర్చడం తప్ప, అనువాదానికి/కవిత్వానికి కావలసిన పరిణతి భూతద్దం పెట్టి చూసినా కనిపించడం లేదు. ఈ పద్యంలో సజీవభాష హుళక్కి అని వేరే చెప్పాలా?

**2. ముద్దుకృష్ణ - 1968**

చెట్టునీడుండి రుచియైన రొట్టె ఉండి

దివ్యమైనట్టి శృంగార కావ్యముండి

పరవశము చేయగల మధుపాత్ర ఉండి

పాడుచును హాయిగా నీవు పక్కనుండ

వట్టిబయలున స్వర్గమే ఉట్టిపడును.

(రుచియైన) రొట్టె, (దివ్యమైనటువంటి శృంగార) కావ్యం, (పరవశము చేయగల) మధుపాత్ర; ఇవి ఈయన పదప్రయోగాలు. బ్రాకెట్లలోనివి విశేషణాలు; మూలంలో రొట్టె రుచిగా ఉందని, కావ్యం శృంగారమని అందునా దివ్యమని, మధుపాత్ర పరవశం చేయగలదని (ఐనా వేరే చెప్పాలా, ఇది ఇంకో సూక్ష్మదోషము) ఉమర్‌ఖయ్యాం ఎక్కడైన చెప్పాడా? లేదు. మరెలా ప్రవేశించాయి? (ఈయనకు గానీ కర్ణపిశాచి ఏమైనా ఉందా??). మనకు తెలిసిన చివరి లక్షణం అనగా తనపైత్యం వల్ల. పైత్యం వుంది అంటే మిగిలిన మూడు లక్షణాలు లేనట్టే. సజీవభాష, ఉద్వేగాలు, పదప్రయోగాలు అన్నీ బంగాళాఖాతంలోకి.

### 3. ఎం.ఆర్. బలరామాచార్య-1962

దట్టమైన చెట్టుకొమ్మ తలపై గొడుగును పట్టెను

కాళ్ళకిందుగా పచ్చని గడ్డి తివాసీ పరచెను

మధుపాత్రిక చంకలోన, ఎదుట గ్రాసమొక్క రొట్టె

హస్తమ్మున సరసకావ్య మన్నింటిని మించినీవు

బలరామాచార్యులు సామాన్యులు కారు. ఇంకా ఒకడుగు ముందుకేసి తలపై గొడుగు పట్టిస్తున్నారు. గడ్డి తివాసీ పరిపిస్తున్నారు. కరుణశ్రీ పానపాత్ర కరమున ఉందంటే, ఈయన ఏకంగా "చంకలోన" ఇరికిస్తున్నారు. మూలాన్ని గాలికొదిలేసి రాయడమంటే ఇదే. సరే దానివల్ల కవిత్వానికి లాభం కలిగిందా అంటే అదేమీలేదు. రెండవతరగతి పిల్లవాడి ఎక్కాలపుస్తకంలా ఉంది పద్యనిర్వహణ. దీనికి కారణం చివరి లక్షణమే..

### 4. మేకా రంగయ్యప్పరావు-1958

ఈ చెట్టు నీడలో ఆద్రాక్షారసముతో

నా చేతి పండ్లతో నీ గొంతుపాటతో

తీ తేనె కావ్యమ్ముతో వనమెల్ల నందనమె

ఓ ప్రేయసి! ఓ ప్రేయసి! ఇది స్వర్గమె! ఇది స్వర్గమె!

మొదటి పాదము ఫర్వాలేదు; చేతిపండ్లు, గొంతుపాట వికారం కలిగిస్తున్నాయి. మళ్ళీ తీ తేనె కావ్యము. చివరి పాదంలో మామూలుగా చెబితే ఎక్కదని పునరావృతి! నిర్జీవభాష.. ఉద్వేగాలు నట్టేట కలిసిపోయాయి. ఇందులో వలపుకన్నా తిండి చింత ఎక్కువగా ఉంది.

**5. కనకమేడల - 1957**

దట్టమైన చెట్టునీడ, రొట్టెముక్క మధుపాత్ర

పాటపొత్తం పక్కనీవు పాడుతుంటే అడవే స్వర్గం

కనకమేడల ఉమర్‌ఖయ్యాంని మించి సారాంశాన్ని రెండు వాక్యాల్లో చెప్పివేశాడు కదా అని ఎవరైనా తుంటరి ప్రశ్న వేయవచ్చు. ఈ రెండు వాక్యాల్లో అవే తప్పులు. (దట్టమైన) చెట్టునీడ, (పాట) పొత్తం; మూలంలో ఎంత జాగ్రత్తగా ఉన్నాడు కవి. అటువంటి కవిత్వాన్ని "దాగుడు మూత దండాకోర్‌పిల్లీ వచ్చే ఎలకాభద్రం" స్థాయికి దించివేశారు. దీనిక్కారణం కేవలం పైత్య దోషం కాదు. వీరెవరూ కవులు కారు. పోనీ కవిత్వాన్ని, కవిత్వభాషనీ గుర్తించగల పరిజ్ఞానం లేదు. పద్యాన్ని నడపడమే కవిత్వమనుకొంటున్నారు. అందునా ఉమర్‌ఖయ్యాం లాంటి కవిని తెలిసీ తెలియని తనంతో అనువదించబూనుకోవడం చాలా సాహసం. కవిత్వానికి చాలా హృదయ పరిపాకం, ఉద్వేగప్రవృత్తి, క్లుప్తత కావాలి. ఇవన్నీ కేవలం పుస్తకాల్లో మునిగిపోయే జడప్రాయులకు అబ్బవు. చివరిగా చలం అనువాదం.

**చలం-1960**

చెట్టునీడలో కూచున్న మనకేం కావాలి

ఓ రొట్టె ఓ కావ్యం మధువు

నా పక్కన కూచుని నీవు పాడుతో

ఎడారి స్వర్గమవుతుంది

అనవసర విశేషణాలు లేవు. సూటిగా వుంది. సజీవభాషలో; ఇందులో మనకు అర్థం కానిదేమీలేదు. డాబు, దర్పం లేవు. సరళంగా, నిజాయితీగా ఉంది. ఇదీ కవిత్వ లక్షణం. సజీవభాష, ఉద్వేగాలు, పదప్రయోగం, అన్నీ ముద్దగా కరిగినటువంటి అనువాదం. ఇక్కడ పైత్యానికి ఆస్కారం లేదు. దీనివల్ల తెలిసివచ్చేది ఏమంటే గొప్పజీవితం నుండే గొప్ప కవిత్వం, గొప్ప అనువాదం పుట్టుకొస్తాయి.

ఖయ్యాంను వీరందరికంటే ముందుగా పారసీ నుండి అనువదించిన ఆదిభట్ల వారిలో ఇవే లక్షణాలు కనిపించడం ఆశ్చర్యకరం.

**ఆదిభట్ల నారాయణదాసు (1864-1945)**

ఇక్షుచ్ఛాయే స్వాదుష్టాన్నం

అభీష్టం మధు పుస్తకం

త్వమత్ర యదీ గాయంతి

నూనం స్వర్గాయతే మహీ

ఆయన ఒకడుగు ముందుకేసి "స్వాదుష్టాన్నం" అన్నారు. కారణం ఖయ్యాం రొట్టె మన రొట్టె ఒకటి కాదు. మక్కీకి మక్కీ అలాగే చేయనవసరం లేదు. పైన పేర్కొన్న పద్యాల్లోన్ని బలహీనత ఇందులో మచ్చుకైనా కనిపించదు. వృధాగా విశేషణాలు వాడలేదు. పైత్యప్రకోపం లేదు. సంస్కృతానికి, సజీవమా, నిర్జీవమా అన్న గొడవలేదు. పదప్రయోగం బహుక్లుప్తం, మూర్తం కూడా. ఇది పండితలక్షణం..

పోతే చివరిగా హరివంశరాయ్‌బచ్చన్ (అమితాబ్ తండ్రి). ఈయన కూడా మనసోదర కవులు (?) చేసిన తప్పులన్నీ మరింత పైలా పచ్చీసుగా చేశాడు.

**హరివంశరాయ్‌బచ్చన్**

ఘనీ సిర్‌పర్‌తరువర్‌కీ డాల్

హరీ పావోంకే నీచే ఘాస్

బగల్‌మే మధుమదిరాకా పాత్ర్

సామ్నే రోటీకే దో గ్రాస్

సరస్‌కవితాకీ పుస్తక్‌హాథ్

ఔర్‌సబ్కే ఊపర్‌తుమ్‌ప్రాణ్

గా రహీ చేఢ్‌సురీలీతాన్

ముఝే అబ్ మరు నందన్‌ఉద్యాన్

ఆ ఘరానా దోషాలు, పాఠకుడి మీద జాలిపడి వివరణకు పూనుకోవడం. మూలంలో నాలుగుపాదాలు - అనువాదంలో రెట్టింపు.. కవితాస్ఫూర్తి ఘోరంగా దెబ్బతింది..

ఉరామరికగా అనువాదం కేవలం భావం తెలియడానికి

దట్టం తలపైని చెట్లకొమ్మలు

పచ్చగా పాదాలకింది గడ్డి

పక్కన మధుమదిరా పాత్ర

ఎదుట రెండు రొట్టెముక్కలు

చేతిలో సరసకవితాపుస్తకం

అన్నింటినీ మించి నా ప్రాణమా

సురగీతం పాడుతూ ఇపుడు

నాకు మరునందన ఉద్యానం.

మూలంలో లేనివన్నీ కల్పించి కూర్చాడు బచ్చన్. విశ్వనాధ సత్యనారాయణ జ్ఞానపీఠ్ ఉత్సవంలో హిందీకవులకు చేసిన హితబోధ గుర్తుకొస్తుంది "మీరు అనువాదాలు చేస్తున్నప్పుడు. అంత్యప్రాసల ఢమఢమలు కాస్త తగ్గిస్తే బాగు. లేనిచో ఇతరభాషల కవిత్వం. అగ్గిలో గుగ్గిలం' (యధాతధంగా ఆయన మాటలు కావు భావం మాత్రమే). స్వస్తి.

## References:


**1. The Original Rubaiyyat of Omar Khayyam - Robert Graves, Omar Ali shah** ఇందులో పైన పేర్కొన్న పార్సీ రుబాయీకి పాఠాంతరం కనిపిస్తుంది. దీనికి కారణం Fitzerald, 1859 అనువాదాలు 15 శ.రాత ప్రతిని (ఆదిభట్ల వారి అనువాదాలకు ఇదే మాతృక అనిపిస్తుంది) ఆధారంగా చేసుకొంటే, దానికి Graves-Alı, 12 శ. ప్రతిని ఆధారంగా గ్రహించారు.

**2. Rubaiyat of Omar Khayyam - Edward Fitzerald. (EF)** బహుళ ప్రచారంలో ఉన్న దిదే. అనువాదకులు ఎక్కువ స్వేచ్ఛను తీసుకొన్నాడు అని పై రచయితల ఆరోపణ ఏది ఏమైనా, ఉమర్‌ఖయ్యాం ఇతని (EF) వల్లే జీవం పోసుకొన్నట్లు తోస్తుంది.

**3. The Rubaiyat of Omar Khayyam - Peter Avery & John Heath Stubbs** ఉమర్ ఖయ్యాం రచనలు, అప్పటి చారిత్రక పరిస్థితులు మీద చక్కని పుస్తకం. ఇతని కవిత్వాన్ని సూఫీ పరంగానే వ్యాఖ్యానించకపోతే అన్యాయం జరిగిపోతుంది, అని సాంప్రదాయికుల వాదం. ఖయ్యాం అప్పటి కాలపరిస్థితులకు ఎదురీదిన సంశయ వాది, శాస్త్రజ్ఞుడు కవి - కాబట్టి ఏకపక్ష అధ్యాత్మిక వ్యాఖ్యానాలు అసలుకు ఎసరు పెడతాయి అని ఆధునికుల అభిప్రాయాలు. ఈ గ్రంథ రచయితలది, రెండవ మార్గం, కాబట్టి EF ని Graves-Ali ల్లా కాకుండా సమాదరించారు. వీరి అనువాదమూలవిధేయం.

**4. ఉమర్‌ఖయ్యాం రుబాయీలు - చలం,** 1960 EF ఆధారంగా మన భాషలో వచ్చిన ఉత్తమ అనువాదం.

**5. పానశాల - దువ్వూరి రామిరెడ్డి (1926)** EF లాగే కవికోకిలది కూడా స్వేచ్ఛానువాదమే. దీనికి కారణం ఫారసీ మూలంలోని పునరుక్తి బాహుళ్యం.


కృతజ్ఞతలు - పార్సీ మూలం చదివి పెట్టిన ఖైర్‌కు; 'సమయానికి తగు మాటలాడిన' - వి ఎ కె రంగారావు, మద్రాసు గారికి.

97

# "మాటన్నది జ్యోతిర్లింగం"

అనువాదం ప్రాముఖ్యం తెలియని జాతికి విమోచన లేదు. దీవి సుబ్బారావుగారు శ్రమకోర్చి, బసవ, అక్క మహాదేవి, అల్లమప్రభు, తదితర కన్నడ వచన కవులను (12వ శతాబ్ది) అనువదించడం గొప్పగా ఉంది. వీరశైవానికి భావ వినిమయ కేంద్రం శ్రీశైల క్షేత్రం కావడం, తదాదిగా పాల్కురికి బసవ పురాణ రచన చేపట్టడం విజ్ఞులైన పాఠకులు తెలుసుకోవలసినదే. చక్కటి అనువాదాలు. "తాళ్లపాక వారిది కొంత ఆపై తన పైత్యం కొంత" అన్నట్టు కాకుండా సరళంగా, ఎక్కడా భావాన్ని సడలనీయక నిగ్రహంగా సాగిన రచన.

పోతే పుస్తకం పేరు విషయం కొంచెం ఆలోచించవలసింది రచయిత. "మాటన్నది జ్యోతిర్లింగం' ' అనగానే ఇదేదో భక్తి పుస్తకమని పొరబడే అవకాశం ఉంది. ఇందులో భక్తి లేదని కాదు, అది కవిత్వమవడం మనకు కావలసినది. క్లుప్తంగా "కన్నడ వచనాలు" అంటే సరిపోయేదేమో.

కవి స్థల చరిత్రాది వివరాలతో విపులపీఠిక సంతరించి పెట్టారు రచయిత. ఈ గ్రంథం అవశ్యం పఠనీయం. స్థాలీపులాకన్యాయంగా ఒక వచనం.. అక్క మహాదేవి రాసినది.

కాయదింపిన తర్వాత
చెట్టు ఆకులు ఎవరు దులిపితే ఏమిటి?

నీకు అక్కరలేని స్త్రీ
ఎవరితో ఉంటే ఏమిటి?

నీవు వదిలేసిన పొలం
ఎవరు దున్నితే ఏమిటి?

దేవుడు తెలిశాక
దేహం కుక్క తింటే ఏమిటి

నీళ్లలో ఊరితే ఏమిటి?

# కొత్తకవులకు కొన్ని సంగతులు - 2

కవిత రాయడం తోటి కవి బాధ్యత తీరిపోదు.. రాసిన ప్రతి ఒక్కటి కవిత ఐపోదు. ఇదో జీవసంకటం! రాసిన కవితకు ఎలాంటి మార్పుచేర్పులు అవసరం? కవిత ఎప్పుడూ అసంపూర్ణమే. అపరిపూర్ణమే అనే అతివాదులతో పనిలేదు.. అలాగే అశువుగా వెలువడిన ప్రతి శబ్దం కవిత్వమే అన్నది కూడా అతివాదమే. మధ్యే మార్గం తొక్కాలి బ్రతికి బట్టకట్టాలంటే!

ప్రేమ విషయాల్లో సలహా ప్రమాదకరం.. కవిత్వం దీనికి భిన్నం కాదు. నీలో కవిత్వం తలెత్తిన సందర్భం గురించి నీకే ఎక్కువ తెలిసివుంటుంది.. కాబట్టి మార్పుచేర్పుల్లో తుది నిర్ణయం మటుకు నీదే. ఇతరుల సలహాల కోసం, మెప్పుకోసం ఎదురుచూడటం.. సరైన పద్ధతి కాదు. ఏదో సామెత చెప్పినట్టు ఒకరు పెట్టిన గోచీ ఎంతసేపు నిలుస్తుంది? ? నీ వల్ల కొద్దీ నీవు కట్టుకోవడం సముచితం. అలాగని అనుభవజ్ఞుల అభిప్రాయాన్ని పెడచెవిన పెట్టడం అవివేకం..

## పదం కోసం పడిగాపులు

"సత్కవులు సరైన పదం కోసం పడిగాపులు పడతారు" అంటాడు ఇండో ఆంగ్లియన్‌కవి నిస్సిమ్ ఎజెకిల్ అది నిజం కూడా. కవిత్వరచనలో భిన్నకవులవి భిన్న మార్గాలు. బ్రాడ్స్కి - కృష్ణశాస్త్రి అజంతాల్లా - ఒకపట్టాన కవిత్వాన్ని అచ్చుకిచ్చేవాడు కాదు.. ఏళ్ళూ, పూళ్ళూ అలా గడుస్తూ ఉండవలసిందే.. ఆంగ్లకవి ఆడెన్‌తన చిన్న నాటి కవితలను కూడా తిరగరాస్తూ ఉండేవాడు.. అదంత మంచి అలవాటు కాదని వేరేచెప్పనవసరం లేదు. కాలం గడిచే కొద్దీ, భాష పట్ల అవగాహన పెరిగే కొద్దీ, అంతగా బావోలేని తన పూర్వ కవితల మీద ఏవగింపు కలగడటం సహజమే.. కానీ ఆనాటి అవగాహనకు మైలురాయిలా వెనుకటి కవితల మీద చేయి వేయక పోవడమే సబబు. డైలాన్‌థామస్ "అలా పాతవే పట్టుకొని కూచుంటే ఇక కొత్తవెల్లా రాయను" అని ప్రశ్నించేవాడు. స్పానిష్‌కవి హిమనెస్ తన కవితల పరిపూర్ణత విషయంలో ఒక తరహా ఉన్మాదాన్ని ప్రదర్శించేవాడు. ఎక్కడెక్కడి పూర్వకవితలను తెచ్చి గుట్టలుగా పోసి తగుల బెట్టి ఇల్లు పీకి పందిరేసినంత పని చేసి.. ప్రాణాంతకమైన obsession తో తనబాధను సర్వుల బాధగా మార్చే వాడు. పలువురి అనుభవాల వల్ల తెలిసి వచ్చేది ఏమిటంటే కవిత్వం అన్నిసార్లు సద్యోభవం కాదు.. భవ్యకవితావేశం కొరవడిన అనేక పర్యాయాలు కవి కలుగచేసుకొని ముడి వజ్రాన్ని సాన పెట్టవలసి వుంటుంది..

## కవితావేశం

అంతలావు "కవిత ఓ కవితా" పద్యాన్ని పెన్ను ఎత్తకుండా రాసి వేశాను అని శ్రీశ్రీ స్వయంగా చెప్పుకొన్నాడు. అయితే "మరో ప్రపంచం" కవితకు చాలా దిద్దుబాట్లే ఉన్నాయి. దీన్ని బట్టి కవి సర్వవేళలా కేవలం కవితావేశాన్నే నమ్ముకోడు అన్న విషయం తేటతెల్లం. కవిత్వం రాసేటప్పుడు కవి

మానసికస్థితి ఏమిటి? అదే మానసిక స్థితి కవితకు దిద్దుబాట్లు చేసేటప్పుడు అవసరమా? కవి తనకవితని వస్తుగత దృష్టితో పరిశీలించగలడా? లేదంటే ఆత్మాశ్రయధోరణికి లోనై తను రాసినదంతా అద్భుతమేనని పొంగిపోతాడా?

## కవిత్వరచన - పలురీతులు

కవిత్వం రాయడంలో ఒక్కొక్కరిది ఒక పంథా. అయితే స్థూలంగా రెండు విధాలు..

1. త్రుటిలో రాయడం

2. కొన్నిరోజుల/వారాల తరబడి రాయడం.

ఈ రెండు పద్ధతుల్లోనూ - కవిత పూర్తయాక మార్పుచేర్పులు ఉండవచ్చు, లేకపోవచ్చు. జపనీస్‌కవులు ఉన్న ఫళాన కవిత్వరచన జరగాలంటారు. రసమయఘడియల్లో ఆలస్యం పనికిరాదంటారు. స్ఫురణ, రచన ఏకకాలంలో జరగాలంటే మాత్రం చాలా సాధన అవసరం. ఎటువంటి సాధన? అన్న విషయంలో భిన్నాభిప్రాయాలు ఉండవచ్చు యవ్వనంలో కవితావేశం బలంగా ఉండటం సాధారణమైన విషయం... కాబట్టి తొలినాళ్ళ కవిత్వాలు ఎక్కువగా మొదటి పంథాకు చెందుతాయి... తర్వాత కవిపరిపక్వమయే కొద్దీ అంతవరకూ పరిపాలించిన కవితావేశం లుప్తమై పోవచ్చు. పోతే అనుభవవైశాల్యం తోడుగా నిలవవచ్చు. అప్పుడు కవి ఎంచుకునే పంథా రెండవది. తొలినాళ్ళ కవి, దర్శనం ద్వారా అనుభవగర్భాన్ని తాకలేదని కాదు. తదుపరి కవి అనుభవ విస్తృతి వల్ల తీక్షతను కోల్పోతాడని కాదు. ఏది ఏమైనా ఒక కవిలో కాలం తెచ్చే మార్పులు అవశ్యం అధ్యయనం చేయవలసిన విషయాలే.. కవులు ఎవరికి వారు తమపై కాలప్రభావాన్ని గహనంగా చింతించి ఒక అంచనాకు రాగలగాలి.

## కవిత్వం జ్ఞాపకముంచుకోవాలి!

అది కవిత్వమైతే జ్ఞాపకముంటుంది-కృష్ణశాస్త్రీయం. అజంతా తన స్వప్న లిపికి ముందుమాటలో జ్ఞాపకదీపం ముందు కూచుని రాశానని చెబుతాడు. రష్యన్ కవులు కవిత్వం కంఠస్తం కావలసిందే అనేవారు. 'మా దేశంలో కాగితానికి కొరత లేదు" జవాబిచ్చేవారు అమెరికన్ విద్యార్థులు, తరచు బ్రాడ్స్కీ ఈ అభిప్రాయాన్ని ఉటంకిస్తే. మన సంప్రదాయంలో జ్ఞాపకశక్తికి ఉన్న ప్రాధాన్యత అందరూ ఎరిగినదే.. అందునా మనకు సాహిత్యం ఆలోచనామృతమాయె. కవిత్వానికి మంచి ధారణ కావలసిందే. పద్యగద్య విభజనరేఖ వెనుక ఈ జ్ఞాపకసూత్రం బలంగా పనిచేస్తుంది. కవిత్వానికి ఒక నిర్దుష్ట రూపం, నియమితాకృతి ఉంది కాబట్టే గుర్తుంచుకోవడం తేలిక. గద్యం ఎంత కవితాత్మకంగా, సంగీతాత్మకంగా ఉన్నా ఈ వాకిట్లో తలబొప్పి కట్టించుకొని బోల్తాపడవలసిందే. వచనానికి, కవిత్వానికి గల తేడా తెలుసు కాబట్టే తదుపరి తాళ్ళపాక కవులు శుభ్రంగా వచనాలు రాసుకొన్నారు. అవి ఎంత కవితాత్మకంగా, సంగీతాత్మకంగా ఉన్నా వాటిని బుద్ధున్న వాడు సంకీర్తనలు అనడు. ఈ

పిడకలవేటను అవతలకు నెడితే, కవిత్వాన్ని జ్ఞాపకముంచుకోవడం కవికెంతో మేలు చేస్తుంది. కవి భిన్న కాలాల్లో, భిన్న పరిస్థితుల్లో తన కవితను మననం చేసుకుని, అర్థగమనాన్ని ఆచూకీ తీసి, దానికి ఒక స్థిర రూపాన్ని సంతరించి పెడతాడు. అప్పుడే కవిత్వం వచన శృంఖలాల నుండి బయట పడినట్టు. ఇకపోతే, ప్రపంచంలో చాలా మంది గొప్పకవులకు తమ కవిత్వాలు నిండు వృద్ధాప్యంలో కూడా గుర్తుండటం గమనార్హం.

## కవిత్వం - మానసికావస్థలు

తరచు కొందరు కూడబలుక్కుని మేము ఈ వాద కవులం ఆ వాద కవులం అని వాదులాడుకోవటం పరిపాటి. కవిత్వ ఘడియల్లో కవి మానసికస్థితి ఏమిటి? అప్పుడు అతనిలో మిగిలిన పైపై వాదాల ప్రాబల్యమెంత? కవినామధేయుడు జీవితంలో కొన్ని సమయాల్లోనే కవి. మిగిలిన కాలమంతా సాదాసీదా మనిషే. ఆ ప్రత్యేక క్షణాల్లో అతని మనసు లోనయ్యే అవస్థలేమిటి? అది ఇంకా పరిమిత వాదాలు, ఆలోచనల్లో పడి కొట్టుమిట్టాడుతుందా? (అలాంటప్పుడు కవిత్వం హుళక్కి!) అన్నీ అవతలకు నెట్టి, అనంతమైన స్వేచ్ఛను అనుభవిస్తోందా? ఆ స్వేచ్ఛానందంలో లేదా దుఃఖంలో నాలుగుమాటలు రాల్చగలుగుతోందా?

కవితను రాసింది తనే ఐనా తను కాదు. తన స్వరం తనది కాదు. (దీన్నే Octavio Paz, Other voice గా నుడివి వున్నాడు). ఉత్సవ మూర్తిని మోసే ఏనుగు ఉత్సవమూర్తి కానట్టు. ఉత్సవకోలాహలం కొలదిక్షణాలే...! అది ముగిశాక అది మామూలు గడ్డితినే ఏనుగే. అలాగే కవి కూడా. మరి తనది కాని కవితను కవి ఎలా మెరుగులు దిద్దగలడు?

అమెరికన్ కవి Wallace Stevens తనలోని స్త్రీ కవిత్వం రాస్తోంది.. తను కాదనేవాడు. ఈ భావన మనకు కొత్త కాదు. కాళిదాసాదుల సరస్వతి ఇదే భావనను మరింత ఉజ్వలంగా తెలుపుతోంది. పోతన కూడా "పలికించెడు వాడు" తనకు భిన్నుడనే విన్నవించుకున్నాడు. ఎవరు ఏ విధంగా పేర్కొన్నా సారాంశం ఒక్కటే. సృజనాత్మక ఘడియల్లో కలం పట్టిన కవి, రోజువారీ గొడవల్లో తేలిపోయే వ్యక్తి ఒకరు కారు. పైకి విరోధాభాసలా కనిపించినా, ఇది పచ్చినిజం. కాబట్టి కొన్ని సార్లు తన కవిత్వం తనకే మింగుడు పడకపోవటం అనుభవంలోని విషయమే. కొన్నిసార్లు ఆ క్షణాల్లో తను రాసినది తనకే పూర్తిగా అంతు బట్టకపోయినా అందులో పెద్ద ఆశ్చర్యం లేదు. ఇన్ని భ్రమ ప్రమాదాలకు లోనయ్యే అవకాశాలు మెండుగా వున్నాయి కాబట్టే "సుకవితా యద్యస్తి రాజ్యేన కిమ్?' ' అని ఏనాడో వాక్రుచ్చాడు భర్తృహరి!!

## కవి తన కవిత్వానికి తొలి పాఠకుడు...

కవి ఆత్మాశ్రయత్వంలో పడి కొట్టుకుపోతే తన కవిత్వంలోని దోషాలను గుర్తించలేడు. ఒకరు ఎత్తి చూపినా గ్రహించలేడు. విమర్శ తనునుంచే మొదలు కావాలి. తాను రాసిన కవితలను ప్రపంచంలో పేరొందిన కవితలతో పోల్చుకొని చూడాలి. అంతేకాదు తొలినాళ్ళలో రాసిన

కవితలకన్నా తను గొప్పగా/చెత్తగా రాస్తున్నాడో బేరీజు వేసుకోవాలి. ఒక్కోసారి తాను కవిత్వం ఇంకా రాయవలసిన అవసరం ఉందా లేదా అని ఆత్మ పరిశీలన చేసుకోవడం ఆవశ్యకమవుతుంది. ఎడ తెగకుండా ఉత్పత్తి చేయడానికి కవిత్వం కుటీర పరిశ్రమ కాదు. కవిత్వం రాయలేనప్పుడు హాయిగా ఆపివేయడం ఉత్తమం, క్షేమం కూడా. కవి రాసిన ప్రతి అక్షరం కవిత్వ గౌరవాన్ని ఇనుమడింపచేయాలి.

## కవిత్వం కాలక్షేపం కాదు

ఉబుసుపోక రాతలు కవిత్వాలు కావు. సంఘటనలకు "స్పందించి" రాయడం కవిత్వం కావడం అరుదు. అవధానిలా "మెయిన్‌వేయిపద్యములు" శుద్ధ వేస్టు. దీర్ఘంగా రాయడం నేరం. పళ్ళు తోముకోవడం, నాలుక గీచుకోవడం... ఈ జాబితాలోకి కవిత్వం రాయడం చేర్చిన వాడు అధముడు. సంకలనాలు తేవడం వ్యసనం కారాదు. ఇలా ఎన్ని కవిత్వాలు వెలిగించినా చివరకు మిగిలేవి - చక్కని కవితలు అర డజను. కవిత్వం రాయడంలో బలవంతం ఏమీలేదు. వమనం, వామాచారం కానే కాదు. ఉద్యమం, విప్లవం గురించి ఈ శతాబ్దంలో ఎంత తక్కువ మాట్లాడుకుంటే అంతమంచిది. ప్రగల్భాలు, ప్రపంచరాజకీయాలు, అనంత రానంతరాల్లో మునిగితేలేవారు వేరే ప్రక్రియల్లో వేలూనితే మహాబాగు. జలుబైనా, జ్వరమైనా తనదాకా వస్తేనే తెలిసేది. కడుపులో లేనిది కావలింతల్లోకి రాదు... కవిత్వంలోకి అంతకన్నా రాదు. గాయం మీద టించరులా ఎద మండినపుడు... వసంతపుష్పాలతో మనసు నిండినపుడు ప్రవహించేది కవిత్వం..." కాదేది కవితకనర్హం" అన్నవాడే "అవునవును శిల్పమనర్ఘం" అన్న విషయం మరువరాదు.

## ఛందో బందోబస్తులు

అభివ్యక్తికి అడ్డురానంతవరకు ఛందస్సును ఆడిపోసుకోరాదు. చారిత్రకంగా ఆంధ్రకవులు ఎన్నుకున్న ఛందస్సులు ప్రపంచంలో మరే భాషా కవి కనీ వినీ ఎరుగనంత కష్టమైనవి. మనవాటితో పోలిస్తే పాశ్చాత్యులవి బహుతేలిక. అందుకే ఈనాటికి ఆంగ్లంలో, ఇతర ఐరోపా భాషల్లో... కొంచెం అటూఇటుగా ఏదో ఒక **rhyme scheme** లో కవిత్వశకటం నడవడం కనిపిస్తుంది. **Auden** లాంటి ఆధునికులు ఛందస్సుకు పెద్ద పీట వేశారు. **Robert Frost - free verse** ను నెట్‌లేకుండా టెన్నిస్ ఆడటమని ఎగతాళి చేసేవాడు. మన భాషలో మాత్రాబద్ధ ఛందస్సుల గతులు గ్రహించడం సులువు. ముత్యాలసరాలు ముచ్చటైనవే.. ఛందస్సును తలకెత్తుకోకపోయినా కనీసం మన భాషకు ఏది అందమో కాదో పసిగట్టగల భాషాపాటవం లేకపోతే భరించడం బహుకష్టం.. ఛందస్సులోని గుణమల్లా కవిత్వాభివ్యక్తికి మార్గాంతరాన్ని సూచించడమే అంటాడు ఆడెన్. పలువురు కవులు ఆయన అభిప్రాయాన్ని గౌరవించారు. అందుకే త్వరపడి దేన్నీ తృణీకరించవద్దు. ప్రయోగ ప్రియత్వం, స్వతంత్ర ఆలోచన ఏదో ఒక దశలో అందిపుచ్చుకోవాలి. చారిత్రకదృష్టి అలవడితే గాని రూపం విషయంలో సందేహాలు పటాపంచలు కావు.

సుందరయ్య గ్రంథాలయ సంఘ
AC No. 83777

## దీర్ఘకవితలు, వెతలు

చాలా కాలం నుండి మనజాతినిన పట్టిపీడిస్తున్న మాయారోగం పాండిత్య ప్రదర్శన (pedantism). (మనస్తత్వశాస్త్ర రీత్యా ఇదేమంత మంచిది కాదు.. అక్కరకు రాని anancasms, obsessions తో అలమటించడం తప్ప.) అవధానాల్లో కనిపించేది, ఆశుకవిత్వాల్లో వినిపించేది... నానా వాదకవిత్వాల్లో దర్శనమిచ్చేది ఇదే వారసత్వమే. జన్యుపరంగా సంక్రమించినట్టుందీ వ్యాధి.. దీనికి ఇటీవలి వికటరూపం... దీర్ఘకవిత... తిమ్మమ్మ మర్రిమానులా మొదలూ చివరా తెలియకుండా పాకి అయోమయాన్ని ప్రోది చేయడంతో దీని కథ ముగుస్తుంది. దీర్ఘకవితలు రాసే సత్తా ఏ పాజ్, నెరుడా, శ్రీశ్రీలాంటి మహాకవుల్లో కనిపిస్తుంది.. అయినా దీర్ఘకవిత self contradictory అని కొట్టిపారేస్తాడు Edgar Allan Poe. అది అలా వుండనిస్తే, దీర్ఘ కవితను రాయవలసింది భాష మీద, భావం మీద అనితర సాధ్యమైన ప్రభుత్వం నెరపగల మహాకవులు గాని, నాలుగు వాక్యాలు మూర్తంగా, స్పష్టంగా రాయలేని దద్దమ్మలు కాదు. చేతికందినవన్నీ పడవేస్తే తయారయ్యేది కవిత్వం కాదు... అరవ్వాడి కలగాపులగపు సాంబారు.

## చివరి మాటలు

నీవు రాసిన కవితలు ఒక నలభై యాభై నీ చేతిలో ఉన్నాయను కొందాం. అప్పుడు నీవు చేయవలసిందల్లా వాటిలో శ్రేష్ఠము, సౌష్ఠవమైన కొన్ని కవితలను ఏరగలగాలి. అలా ఎంపిక చేసిన కవితల్లో బావున్న కవితలు ఎందుకు బావున్నాయో నీకు తెలిసి తీరాలి. వంద మైళ్ళ దారిలో తరచూ ప్రయాణించే వారికి ఏ మలుపు, ఏ సొరంగం ఎక్కడ వస్తుందో సాకల్యంగా తెలుసు. అదే రకంగా నిరంతర మననాభ్యాసం వల్ల నీ కవిత్వంలోని లోతుపాతులు, లోటుపాట్లు నీవు కూలంకషంగా తెలుసుకోగలుగుతావు. అదృష్టవశాత్తు దీనికి దగ్గరి దారి లేదు. కవిదాటు, గొర్రెదాటు ఎన్నడూ ఒకటి కావు...

103

# టర్నరు - నేను

ఇసుకతిన్నెల మీద ఉరకలేస్తూ వస్తున్న సముద్రాన్ని తొలిసారి చూడటం. మైపాడులో.. తుఫాను వచ్చేలా వుంది. పూర్తిగా చీకటిపడి చుక్కలు మెరుస్తున్నాయి. ఎదురయిన బెస్తని సముద్రంలోకి వెళదాం, పడవ కట్టమని అభ్యర్థించడం, నాతో వచ్చిన అందరూ నన్ను వెర్రివాడి కింద జమకట్టడం.. మెరుపుకాంతిలో విరుచుకుపడిన అలను చూసి భ్రమన్పడిపోవడం నాకు బాగా గుర్తున్నాయి. ఆ తర్వాత మద్రాసులో, మలేసియాలో, బొంబాయిలో, కోవాలంలో పలుచోట్ల సముద్రాన్ని సందర్శిస్తూనే వున్నాను. దాన్ని నేను గుర్తుపట్టడమే గాని, అది నన్ను పట్టించుకొన్న పాపాన పోలేదు. పాదాల కింద ఇసుకను పెళ్లగించుకుపోతుంటే మాత్రం.... నన్ను పలుకరించడమే కాకుండా.. నాతో పరాచికాలాడుతుంది అని తెలియని సాంత్వన పొందేవాణ్ణి. నా వయస్సు పెరుగుతున్నదే గాని దీని ఉత్సాహంలో వీసమెత్తు మార్పు లేదు. దీనికి బాల్యమా? యవ్వనమా? అంతుపట్టని దూరాల వరకు విస్తరించి విహ్వలతకు గురి చేస్తుంది.

2

నా కవిత్వంలో సముద్ర ప్రస్తావన అధికమని చురుకైన విమర్శకుడు ఎత్తిచూపే దాకా నేను గమనించలేదు. నిదానంగా ఆలోచిస్తే, సముద్రంలోకి నేను జొరబడ్డానో, నాలోకి సముద్రం అడుగుపెట్టిందో చెప్పడం కష్టం.. దాహం తీరని కవికి, తీర్చుకోలేని కడలికి విడదీయరాని అనుబంధమే ఉంది. కవి అంగుష్ఠ మాత్రమైన జీవితాన్ని ఏదో ఒకనాడు చాలించి బలిష్టమైన సముద్రంగా రూపుదాలుస్తాడు.... భావాల నురగలతో.... ఊహల అలలతో.... అగాధంలో అర్థ రత్నాలను దాచుకొని.. అందుకే సముద్రం పట్ల కవికి అంత ఆకర్షణ.

3

నానా శాస్త్రాధ్యయనాలతో ఆలోచనలు మెలికలు పడి, ఆర్తుడనై సంజీవదేవ్ ఇల్లు చేరుకొనేవాడిని. ఆయనను నిత్యయవ్వనుడిగా చూడాలని నా కోరిక. ఆరుపదులు దాటిన వయసులో ఆయన తన రంగుల ప్రపంచంలో రాయంచలా తేలియాడుతుండేవారు. అల్ప, అనల్ప విషయాలు చర్చించి.. భారమెక్కిన మనసుకు మందులా ఏదో ఒక చిత్రాన్ని బహూకరించేవారు. కొంత కాలం కుంచె చేతబట్టి రంగులతో కాగితాలను ఖరాబు చేశాను కాబట్టి వాటి విలువ హృదయానికి లలితంగా అవగతమయేది. టర్నరును ప్రస్తావించింది ఆయనే. చిత్రకళను, సాహిత్యాన్ని సమన్వయపరిచింది ఆయన కాక మరెవరు? అభిద, లక్షణ, వ్యంజనలను చిత్రకళపరంగా సారూప్య, వైరూప్య, నైరూప్యాలుగా వ్యాఖ్యానించవచ్చని ఆయన నిష్కర్ష. ఉన్నది ఉన్నట్టు చెప్పడం అభిద (denotation).

చూసినది చూసినట్టు గీయడం సారూప్యం (representation). అలా కాకుండా కొంతమార్చి చెప్పడం లక్షణ. (connotation). కొంత మార్చి గీయడం వైరూప్యం (distortion) సూచనప్రాయంగా చెప్పడం వ్యంజన (suggestion), గీయడం నైరూప్యం (abstraction). టర్నరు గీసిన వర్ణాకాశాలను ఆయన కొనియాడటం నాకు బాగా గుర్తే. సముద్రాన్ని చిత్రించడంలో ఆయన మెలకువ కూడా నేను మరచిపోలేనిది.

## 4

మన ప్రాచీన సాహిత్యంలో కవి సమయాల్లాగా, చిత్రకళలో కూడా 'చిత్రసమయాలు' ఉండేవి. దేన్ని పడితే దాన్ని చిత్రించరాదు రాజదర్పాన్నో రీవినో ప్రదర్శించే చిత్రాలకు గిరాకి. లేదా మతపరమైన చిత్రాలకు మంచి ఆదరణ. ప్రాచీన మానవుడు స్వేచ్ఛగా గుహల్లో చిత్రించిన అద్భుత చిత్రాలను మినహాయిస్తే. నాగరికత (?) నేర్పిన చిత్రకారుడు తిరిగి బందీ ఐనాడు తన సోదర కవిలాగే.

బిర్రబిగుసుకుపోయిన సాహిత్యానికి ఒక దశలో జవజీవాలు లభించినట్టే, 19వ శతాబ్దిలో చిత్రకళలో ఉత్సాహవంతులు బయల్దేరి... పాతభావనా కుడ్యాలను బద్దలుకొట్టి చిత్రకళకు స్వేచ్ఛను ప్రసాదించారు. వీరిని impressionists అని యాదృచ్ఛికంగా పిలవడం జరిగింది. స్టూడియోలను వదిలి జనసామాన్యాన్ని విశాల ప్రకృతిని తమ చిత్రాల్లో ప్రవేశపెట్టారు వీరందరూ. వీరి కార్యరంగం పారిస్‌నగరం. తెలుగు కవిత్వానికి భావకవులు చేసిన మేలు లాంటిదే ఇంప్రెషనిస్టులు చిత్రకళకు చేసిన ఉపకారం. ఇద్దరిలో సమాన గుణం దృశ్యాన్ని / భావాన్ని మనసుకు హత్తుకుపోయేలా చేయడం.

రాజులను, వారి ఉంపుడు గత్తెలను, రాజప్రాసాదాలను, ప్రహరీలను చిత్రించడం మాని అనంతవైవిధ్యం గల జీవితం నుండి, ప్రకృతి నుండి వస్తువులు స్వీకరించి తమదైన అద్భుతశైలిలో చిత్రించడం మొదలుపెట్టారు. వీరికి దృశ్యానుభవం ప్రధానం దాన్ని వీక్షకుడిలో కలిగించడం వీరి ఉద్దేశం. భావకవులకు ఇతఃపూర్వమే, రాజప్రసాదాలను వదిలి తెలుగుకవిత్వం విశాలప్రపంచంలోకి ప్రవేశించడానికి కారణభూతుడైన గురజాడలా - టర్నర్ ఊహించనలవిగాని కళాతత్వాన్ని ఒడిసిపట్టుకొని త్వరితగతిన చిత్రప్రపంచంలో మెరుగులు దిద్దుకొన్నాడు

## 5

'ప్రకృతి వీక్షణం కళను ప్రక్షాళిస్తుంది!' అని టర్నరు ఉవాచ దేన్ని లెక్క చేయకపోవడం, కఠోర సాధనలో, వర్ణధ్యానంలో మునిగితేలడం అతనికి పరిపాటి. వర్ణానుభవాన్ని ఆకళించుకొన్నాడు. అంతటితో ఆగలేదు. దానికి కాంతిని సంతరించిపెట్టాడు రంగులో, వెలుతురులో ఉద్వేగాలను జాగృతం చేయగల అద్భుతమేదో దాగుందని కనుగొన్నాడు కాబట్టే అతని చిత్రాలు వర్ణవైవిధ్యంతో,

కాంతి వైభవంతో అలరారుతుంటాయి. సున్నితమైన కవితాత్మ అన్ని చిత్రాల్లో పరచుకొని ఉంటుంది. కళారహస్యాలను తెలుసుకోవాలని వచ్చే ఔత్సాహికులకు ఒక పట్టాన కొరుకుడు పడే వాడు కాడు. అటువంటి రహస్యం ఏమీలేదు. కష్టించడమే కళా రహస్యం అని మొహం చాటేసేవాడు. ఒకసారి సముద్ర తుఫాను సరిగా చూడాలన్న దృఢనిశ్చయంతో, ఓడ సరంగుసాయంతో, ఒక స్తంభానికి తన్ను తాను కట్టివేయించుకొంటాడు. తుఫాను మొదలయింది. తాటి ప్రమాణంలో అలలు ఎగసిపడుతున్నాయి. ఇవేవీ టర్నర్ వర్ణదీక్షను సడలించలేకపోయాయి. సముద్రం శాంతించే దాకా అలాగే బంధనాల్లో గడిపాడు.

సముద్రం మనలోకి అడుగుపెట్టాలంటే ఆ పాటి సాహసం అవసరమేమో.

## 6

పికాసో నాకు ఒక పట్టాన నచ్చడు. బొత్తిగా నన్ను కదిలించని చిత్రం అతని గుయెర్నికా. కవిత్వంలోనైనా, చిత్రకళలోనైనా రూపమర్యాదను విచ్ఛిన్నం చేసే విశృంఖలతను నేను మెచ్చలేను. ఒకవేళ అవి కళాకృతులే అని అంగీకరించవలసి వచ్చినా, ఖచ్చితంగా అవి ప్రథమ శ్రేణికి చెందినవైతే కాదు. ప్రయోగ వైచిత్రి మైకంలా కమ్మినవాడు, బుద్ధినే పూర్తిగా నమ్మినవాడు, అచేతనకు ఆత్మను తెగనమ్మినవాడు.... ఒకే పడవలో ప్రయాణిస్తుంటారు. పోతే అది గమ్యంలేని ప్రయాణం.... రూపం గూర్చి గొప్ప చర్చ అవసరం లేదు. తెల్లారగట్ట దారి వెంబడి విరబూసిన గడ్డి చేమంతులు.. మంచులో తడిచిన మల్లెలు.. రాత్రి తళుకుమనే తారలు.... చంద్రకళలు, సూర్యబింబం.... ఇవన్నీ రూపం గురించి నీ అవగాహనను బలపరిచేవే! టర్నర్ లాంటి మహాచిత్రకారునికి తెలియని రూపరహస్యాలు లేవు. కాబట్టే అతను అవిరామంగా గీసిన వేలాది చిత్రాలు వేటికవే భిన్నంగా ఎందరినో ఆకట్టుకొంటూనే ఉన్నాయి. తమాషా ఏమంటే టర్నర్ తన తరం వారికి అర్థం కావు అనుకొన్న చిత్రాలను అసలు బయటపెట్టకపోవడం. జన బాహుళ్యం, విమర్శక గణాల అభిరుచి ఏ పాటిదో, అంతటి లోతైన చిత్రకారుడు ఎరుగకపోతేనే ఆశ్చర్యం!! అతని అసంఖ్యాక చిత్రాల్లో తరచూ ప్రత్యక్షమయ్యేది విచిత్రకాంతులతో, వింతవర్ణాలతో తరంగితమయే సముద్రం !!!

## 7

ఇంత దూరం వచ్చాక టర్నర్‌కు నాకు నడుమ ఉన్నది సముద్రం అని చెప్పనవసరం లేదు! ప్రతి ఇద్దరి మధ్యా ఉండేది సముద్రమేనని నా నమ్మకం. మన జీవితం బహుక్లుప్తం. బొట్టుబొట్టుగా రాలి వాన వెలిసినట్టు.... ఏదో ఒకనాడు తెలి మబ్బులా మనం అదృశ్యమైపోతే మిగిలేది.. ఆ చుక్కల సారాంశం.. అంతులేని అర్ణవమే... వర్ణ రహస్యాలు ఎరిగిన టర్నర్ అనంతంగా వెలిగే అర్ణవమే....

## విచిత్రాశ్వికుడు

అన్నీ మింగిన సముద్రం
అలల చేతులతో-
పొట్ట సవరించుకొంటే
ఒడ్డున ఒంటరి కుక్క
ఎవరిని పిలుస్తుంది?
హోరున కురిసే తుపాను వర్షం
పొగ చిమ్ముతు
వంతెనపై పరిగెత్తే రైలు
నదిలో జాలరి పడవ
ఎవరిని ఆకర్షిస్తుంది?
తెరచాటున థేమ్సు నది
మెరిసే తన
శరీరకాంతులను
కెరటాలుగ
ఎవరికి అర్పిస్తుంది?
చంద్రుని కాటేసే ఉప్పెన
అందరిలో భయోద్వేగం
గ్లాసులలో వంపి
నీ ముందుకు -
ఎవరు తెస్తారు?
సుడిగాలీ, అవలాంచీ

**107** టర్నరు - నేను

*తెరచాపా, పొగమంచూ*
*నీలాకాశం, ఓడస్తంభం*
*కేకలతో క్రేళ్లురికే నీళ్లు*
*ఎవరిని తలచుకొంటాయి?*

*రంగుల కళ్లెం గుప్పెట్లో*
*భయానక సౌంద*
*ర్యాన్నారాధించే టర్నర్*
*సముద్ర హృద*
*యాన్నెరిగిన విచిత్రాశ్వికుడు!*

*(బ్రిటిష్ చిత్రకారుడు టర్నర్ చిత్రించిన ఝంఝా కల్లోలిత సాగర తరంగాల భయంకర సౌందర్యాన్ని ప్రతిఫలించే చిత్రమైన కవిత 'విచిత్రాశ్వికుడు' - ఇస్మాయిల్)*

# Hibiscus on the Lake

వేల్చేరు నారాయణరావు గారి అనువాదాలను తరచి తరచి చదివాక మొత్తానికి వీరు ఏమి తేల్చేరు?? అన్న ప్రశ్న తలెత్తక మానదు. మందారం తేలలేదు.. సరికదా అర్థం లేని అనువాద పంకిలంలో కూరుకుపోయి గుర్తుపట్టలేనంతగా మారిపోయింది. తెలుగునాట కవులకు, విమర్శకులకు ఆపై అనువాదకులకు కొదవలేదు. బొడ్డూడని అర్భకుడితో మొదలుకొని ఏదో కొంచెం డొక్కశుద్ధి కలదనుకొనే అసహాయ శూరుల దాకా ప్రతి ఒక్కరు తగుదునమ్మా అని కవిత్వం, విమర్శ అనువాదాల్లో తలదూర్చడం. అలవాటులేని ఔపోసనం కావడం వల్ల మీసాలు తెగకాల్చుకొని బయటపడటం పరిపాటిగా మారిపోయింది. ఆ దిశలో మరో ముందడుగు ఈ అనువాదసంకలనం.. నాకు చూడగా అనువాదకుడికి తనకంటూ కవిత్వంలో ఒక అభిరుచి లేకపోవడం.. ప్రధాన లోపం

(దీనికి కారణం అనువాదకుడిలో కవిత్వతత్వవివేచన శూన్యం కావడమే!) అంతా వచనం రాసి అదే కవిత్వం అనుకొనే నూతనకవి అమాయకదశను దాటలేని ఈ ముక్కస్య ముక్క అనువాదాలు.. చాలా చోట్ల మిగుల వినోదాన్ని కలిగిస్తాయి, కొండొకచో పగలబడి నవ్విస్తాయి. నర్సు చేసిన ఆపరేషన్‌లా చాలా చోట్ల ప్రమాదకరంగా తయారయింది ఈ అనువాద ప్రహసనం.

అర్హతలేని అనువాదకులకు, వీర్యం లేని విమర్శకులకు మన సాహిత్యరంగం ఎందుకు ఆటపట్టు అవుతుందో అర్థం కాని విషయం. అనువాదకుడు ఆంధ్రాంగ్ల భాషల్లో స్వయానా కవికాకపోవడం అనువాదాల నాణ్యతను ఘోరంగా దెబ్బతీసింది. సాధారణంగా అనువాదకుడు కవి కాకపోయినా తనకంటూ ఒక స్వంత అభిరుచి ఏర్పరచుకోవడం వల్ల ఈ లోపాన్ని అధిగమించవచ్చు ఏ మాత్రం అభిరుచి లేక, ఏది కవిత్వం అన్న కనీస పరిజ్ఞానం లేకుండా కార్యరంగంలోకి కాలూనితే ఏం జరగాలో అదే జరిగింది - రసాభాస, తైల నష్టం..

అనువాదకుడు భాషేతరులకు ఏ అభిప్రాయం కలిగించదలచుకొన్నారు?? తెలుగుకవులు ఆశుకవిత్వకేసరులని చాటడమా?? లేదా శుష్క నినాద ప్రాయులనా?? రూపం గూర్చి ఓనమాలు తెలియని సామాన్యులనా?? గద్యపద్య విభజన ఎరుగని అర్భకులనా?? వంటబట్టని అధివాస్తవికతను పట్టుకొని అంటకాగుతున్న అరాచకులనా?? వాదాలరొంపిలో కూలబడి లేవలేని సోమరులనా?? అనువాదానికి నడుం బిగించే ముందు ఈ ప్రశ్నలకు అనువాదకుడు సమాధానాలు చెప్పగలిగే స్థితిలో వుంటే విషయం ఇక్కడ దాకా వచ్చేది కాదు.

ఆంగ్లంలో ఏది కవిత్వం అవుతుందో అనువాదకుడి ఊహకైనా అందలేదు. కవిత్వానువాదం కేవల గద్య సృజన కాదు. ముమ్మూర్తులా మూలాన్ని పట్టుకురాలేకపోయినా, అనువాదం కవిత్వం అయితీరాలి. మక్కికి మక్కీ పదాలు పేర్చుకొంటూ పోవడం అనువాదం కాదు (మరి, కవిత్వం అంతకాన్నా కాదు) కవిలోని భావతీవ్రత అనువాదకుడిలో కనిపించకపోతే అనువాదాల్లో కనిపించేది

భావపరమైన ప్రబల నత్తి లేదా నుడికారపరమైన నుసిదగ్గు. అలాగని ప్రతికవి రాసిన ప్రతి కవితను అనువదించలేము. ఒక్కోసారి, మూలంలోని గొప్ప కవితలను అనువదించకుండా వదిలివేసేది అందుకే. విపరీతమైన సంగీతగుణమున్న కవితలను (ఉదా: శ్రీశ్రీ కవితా ఓ కవితా!)తొలినాళ్ళ అనువాదకులు పరిహరించడం మంచిది. కొంచెం చేయితిరిగాక వాటిమీద దృష్టి పెట్టవచ్చు. ఏ కవితలను ఎంపిక చేసుకోవాలి అన్న విషయంలో అనువాదకుడు తప్పుదారిలో పడ్డారు.. క్లుప్తంగా, స్పష్టంగా ఉన్న కవితలను ఎంపిక చేసుకోలేదు. ఉదా వీరు ఎంపిక చేసుకొన్న శ్రీశ్రీ కవితలు, జయభేరి, కవితా ఓ కవితా, చేదుపాట, నిజంగానే, జగన్నాథ రథచక్రాలు మరికొన్ని. ఇవన్నీ తిరుగులేని శ్రీశ్రీ శబ్దాధిపత్యానికి మేలిగుర్తులు. వీటిని అనువాదంలో ఒదిగించడం అందరివల్ల అయ్యే పని కాదు. భావాలపోకడ, శబ్దశక్తి ఎరిగిన ఎడ్గార్ ఎలాన్‌పో లాంటి కవి అవసరమవుతాడు!! కవిత్వానికి టీకా తాత్పర్య స్థాయికి దిగిపోరాదు అనువాదం. గుడ్డిలో మెల్ల అద్దైనా బావుండు.. అంతకన్నా అధ్వాన్నం, గద్యస్థాయి దాటని వాక్యాలని అక్కడక్కడ విరిచి, అనువాదంలో అది కవిత్వమని భ్రమింపచేయడం - ఇంతకన్నా హాస్యాస్పదం మరేదీ లేదు.

జయభేరిని తీసుకొంటే

*నేను సైతం ప్రపంచాగ్నికి సమిధనొక్కటి ఆహుతినిచ్చాను*

**even I / added / a piece of wood / to the fire of world**

కట్టెలు, బొగ్గుల స్థాయికి దిగజారింది అయ్యవారి అనువాదం!!

*"ఔను నిజం, ఔను నిజం*

*ఔను నిజం, నీవన్నది*

*నీవన్నది, నీవన్నది*

*నీవన్నది, నిజం, నిజం!*

*లేదు సుఖం, లేదు సుఖం*

*లేదు సుఖం జగత్తులో*

*బ్రదుకు వృధా చదువు వృధా*

*కవిత వృధా వృధా వృధా"*

**It's true**

**what you said is true**

**It's true**

no happiness

in this world

life s a waste

ఇకపోతే ఇస్మాయిల్ పదచిత్రాలకు, నండూరి ఎంకి పాటలకు ఇదే గతి పట్టింది. అనువాద రథచక్రాల క్రింద పడినలిగిన పద్యాలే ఎక్కువ. Hibiscus on the lake చదివి తీరవలసిన పుస్తకం! అనువాదం ఎలా చేయకూడదు అన్న దానికి పార్శ్యగ్రంథంగా ఉపయోగించవచ్చు.

# అనువాదంలో 'పద్యసమాధి'

శబ్దగుణమున్న కవిత్వాలను అనువాదంలోకి తీసుకురావడం కష్టమే. పోనీ నిశ్శబ్ద పదచిత్రాలను పట్టుకురావడంలో పాటవాన్ని ప్రదర్శిస్తున్నారా? అంటే అదీ లేదు. నిజం చెప్పాలంటే పదచిత్రాలతో కూడిన కవిత్వాలను అనువదించడం అంత తేలిక పని కాదు. ఉపరితలాన్ని తాకి ఆగిపోయే వారే అధికులు. పదచిత్రాలు కల్పనాశక్తి ఉన్న వారికే లొంగుతాయి. అనువాద విమర్శకు ముందు ఇస్మాయిల్ గారి పద్యాన్ని పరిశీలిద్దాం.

**పద్యసమాధి**

*పద్యాన్ని లోతుగా తవ్వుతున్నాడు కవి.*

*టన్నుల కొద్దీ మన్ను కింద*

*టన్నుల కొద్దీ మనస్సు కింద*

*కప్పబడివుంది పద్యం.*

*ఇంత లోతుగా దీన్ని*

*ఎవరు పాతేశారో తెలీదు.*

*దివారాత్రాలు తవ్వి*

*శవపేటికను వెలికి తీయాలి.*

*ప్రాణవాయువు తగిల్తే*

*పరవాలేదు బతకొచ్చు.*

*పద్యాన్ని లోతుగా తవ్వి*

*ప్రేతపేటికని తెరిచాక*

*ప్రతిసారీ అందులోంచి*

*బతికొచ్చే శవం తనే.*

*(రాత్రి వచ్చిన రహస్యపు వాన - ఇస్మాయిల్)*

పద్యసమాధినందుకోవడానికి మన గురువుగారి ద్రవిడ ప్రాణాయామాన్ని గమనిద్దాం.

**The Buried Poem**

The poet digs deep for the poem
it's buried under tons of mud
tons of mind
it's buried in so deep
it'will take days and nights
to pull the coffin out
It will live
if there's a little breath left
maybe
But every time he digs up the coffin
the body that comes out of it alive
is himself

(Hibiscus on the lake - Velcheru Narayana Rao)

పేరాగా రాస్తే, అతుకుల గద్యం ఈ అనువాదం అని తెలుసుకోవడానికి అట్టే సమయం పట్టదు. రసవివేచన లేనివారు రాసిన తాత్పర్యంలా ఆకట్టుకోదు. దీన్ని అనువాదం అనడం గాడిదను పంచకళ్యాణి అనడం రెండూ ఒకటే. ఏది ఏమైనా ఏకంగా పద్యసమాధి కట్టించారు అనువాదకులు!

తా. *The poet digs deep for the poem, it's buried under tons of mud, tons of mind it's buried in so deep. It will take days and nights to pull the coffin out. It will live if there's a little breath left, maybe. But every time he digs up the coffin, the body that comes out of it alive is him self.*

మూలాన్ని, అనువాదాన్ని పరిశీలిద్దాం.

పద్యసమాధి - The Buried Poem

"పద్యసమాధి"లోని వ్యంగ్యం The Buried Poem లో లేదు. పద్యానికి సమాధి అన్న ఏకైక అర్థాన్ని స్ఫురింపచేస్తుంది కాని, అంతకు మించి లోతులకు వెళ్ళదు. పూర్తి భౌతికస్థాయిలో

ఆగిపోతుంది. ఆంగ్లభాషా పరిమితులు అని పెదవి విరవవచ్చు; కాపురం చేసే కళ కాలు తొక్కినప్పుడే తెలిసినట్టు, పేరు చూడగానే మునుముందు అనువాదంలో ఏమి జరగబోతుందో ఊహించడం పెద్ద కష్టం కాదు.

పద్యాన్ని లోతుగా తవ్వుతున్నాడు కవి.

The poet digs deep for the poem

నిశ్శబ్ద కవిత్వాన్ని అర్థం చేసుకోవడానికి వలసిన యమనియమాలు ఎటూ లేవు. కావున, తొలివాక్యంలోనే ఆసనభంగం.. కవితవ్వుతుంది పద్యాన్ని, పద్యం కోసం తవ్వుతున్నారని నారాయణతీర్థులకు ఎవరు సెలవిచ్చారు?? (అంతరాత్మ ప్రబోధం కాదుగదా!?) సాధారణ అకడమిక్ దృష్టికి అందేంత తేలిక కవిత కాదిది. కాబట్టి ప్రాణాయామానికి ముందే పడిపోవడంలో పెద్ద వింతేమీ లేదు, కవితా విప్లవ స్వరూప స్వభావాలు ఎరిగిన పుంభావ సరస్వతులకు.

ఈ కవితలో పదునాలుగు పంక్తులు:

మొదటి పంక్తిలో పద్యాన్ని తవ్వే కవి ప్రదర్శితం (అసలు కీలకమంతా ఇక్కడే వుంది, కాబట్టి యథాతథంగా పునరుక్తి 11వ పంక్తిలో). తర్వాత తొమ్మిది పంక్తులు పద్యస్వభావం వర్ణితం. చివరి నాలుగు లైన్లలో వెంటనే మళ్ళీ కవి ప్రత్యక్షం.

ప్రేతపేటికని తెరిచాక

ప్రతిసారీ అందులోంచి

బ్రతికొచ్చే శవం తనే.

వాక్యాల వరుస క్రమంలో విశ్లేషిద్దాం.

పద్యాన్ని లోతుగా తవ్వుతున్నాడు కవి

1. The poet digs deep for the poem

1. పూర్తిగా పప్పులో కాలేశారు; ఆదిలోనే హంసపాదు.

టన్నుల కొద్దీ మన్ను కింద

టన్నుల కొద్దీ మనస్సు కింద

కప్పబడివుంది పద్యం.

2. it's buried under tons of mind

3. tons of mind

4. it's buried in so deep

2. it's అవసరమా? mud? మన్నుకు, బురదకు తేడా తెలియదా?

3. and ఎక్కడికి వెళ్ళింది? tons of mind ఏమిటి? mind అంటే బుద్ధి; కవిత్వంలో అది అవసరం లేదు (అనువాదంలో కూడా అవసరం లేదని సోపపత్తికంగా తెలుస్తోంది); ఇక్కడ will అంటే మనసు; where there is will there is a way – మనసుంటే మార్గముండదాలోని మనసు!! బుద్ధికాదు.

4. మళ్ళీ it's; మళ్ళీ buried: పాతేయడానికి కప్పడానికి తేడా లేదా? (లేనట్టే ఉంది అనువాదకుని ప్రణాళికలో!)

దివారాత్రాలు తవ్వి

శవపేటికను వెలికి తీయాలి.

5. it'will take days and nights

6. to pull the coffin out

5, 6 కాలమూ పని లెక్కల్లోని వాక్యంలా అఘోరించింది;

ఇందులో కవిత్వానికి అక్కరకొచ్చే అంశముందా??

ప్రాణవాయువు తగిలితే

పరవాలేదు బతకొచ్చు.

7. It will live

8. if there's a little breath left

9. maybe

it will live. it భూతంలా వెంటాడుతుంది అనువాదకుణ్ణి!

if there is a little breath left అని ఎవరు చెప్పారు?

may be

7, 8, 9 మళ్ళీ తప్పుడు అనువాదం, ప్రాణవాయువు సోకితే బ్రతుకుతుంది అంతేగాని, కొస

ఊపిరి మిగిలుంటే జీవిస్తుంది అనికాదు కవిహృదయం!!

పద్యాన్ని లోతుగా తవ్వి
ప్రేతపేటికని తెరిచాక
ప్రతిసారీ అందులోంచి
బ్రతికొచ్చే శవం తనే.

10. But every time he digs up the coffin

11. the body that comes of it alive

12. is him self

10 మళ్ళీ అదే గొడవ; విపర్యయ చిత్తవృత్తి, విలోమచింతన. కవి చెప్పేది "పద్యాన్ని లోతుగా తవ్వి" శవపేటిక (coffin) ను కాదు! !

11, 12 ముక్కస్య ముక్క అనువాదం భేష్ !

ఇదొక్క అనువాదాన్ని చదివి ఈ పుస్తకాన్ని గిరవాటు వేయవచ్చు, అనువాదంలో elementary స్కూల్‌స్థాయి ఇది. మూలంలో కవి 1, (10-14) పంక్తుల్లో కవి గూర్చి చెప్పాడు; మిగిలిన వాటిల్లో పద్యం గూర్చి (ఇంత లోతుగా దీన్ని ఎవరు పాతేశారో తెలియదు, పద్యాన్ని లోతుగా తవ్వి) వాక్యాలు అనువాదంలో జారుకొన్నాయి. పోనీ అది అలా ఉండనిస్తే it ప్రయోగం ఈ అనువాదంలో ఎన్ని సార్లు జరిగింది? ఎందుకు జరిగింది? if లు, but లు ఎందుకొచ్చాయి, మూలంలో వీటి ఆనవాళ్ళు ఎక్కడైనా వున్నాయా? వీలయినంత వరకు తేటతెల్లమయే దానిని పరిహరించగలగాలి, అదీ కవిత్వమంటే, ఎడా పెడా it లు వేదజల్లడం కాదు.

పద్యసమాధిలో కవి చెప్పదలచుకొంది పద్యానికి, కవికి మధ్య అభేదాన్ని, అది పద్యసమాధి ద్వారానే సాధ్యం అని సూచనప్రాయంగా చెబుతున్నారు. సమాధి అంటే కేవలం భౌతికమైన సమాధి కాదు, భావ సమాధి. మనకు శబ్దాలంకారాలను ఆంగ్లంలో పట్టుకొచ్చే చేవలేదు. మూలంలోని పదచిత్రాలను నిదానంగా జీర్ణించుకొని, పర భాషలో నిర్మించే సాధనలేదు. విప్లవాలు, వీరంగాలు, అహమహమిక, అసమీక్ష్యకారిత్వం.. అదలా ఉండనిస్తే..

పద్యాన్ని తవ్వడమంటే తన్ను తాను తవ్వుకోవడమే.. అందుకు టన్నులకొద్దీ మన్నుతోపాటు, టన్నులకొద్దీ మనసు కూడా చోటు చేసుకొంది. తన్ను తాను తెలియనేరని కవి బ్రతికినా బ్రతకనట్టే. కానీ, ఆత్మజ్ఞానం అంత సులభం కాదు! (అనువాదకుడి దయవల్ల అది తెలుస్తూనే వుంది). ఇంకా అర్థం కాని వారికోసం 'కుండీలో మర్రిచెట్టు'పీఠికలోని ఇస్మాయిల్‌గారి మాటలను ఉట్టంకిస్తాను.

"కవులూ కళాకారులైతే తమ అంతరంగాల్లోకి సొరంగాలు తవ్వుకుంటూ పోతారు. లోనికి తవ్వగా తవ్వగా తను తనకి తగలక పోతాడా?"

"పద్యమంటే తనే, కవీ కవిత్వం వేరు కాదు. కవితలో తప్పించి కవికి వేరే అస్తిత్వం లేదు. పద్యం రచించి దాన్ని అద్దంలా మెరుగు పెట్టాకే అందులో తన మొహం చూసుకొని గుర్తిస్తాడు కవి."

మూలంలో మంచి లఘువు బిగువు ఉన్న పద్యం. ఆంధ్రకవిత్వానికి సహజమైన అక్షరమైత్రి, లయలతో అలరారుతున్నది. మరి, ఆంగ్లంలో దాని ఛాయలేమైనా కనిపించాయా?? జర్మన్ మహాకవులు గోథే, రిల్కేలను పాడిపాడి ఆంగ్ల వాక్యాల్లోకి అనువాదంచేస్తే ఎలా ఉంటుంది? ఇరుభాషలు తెలిసినవారు ఒప్పుకొంటారా? స్పానిష్కవులు నెరుడా, బోర్హెస్‌లు free- verse లో రాసినా, అనువాదకులు నడకను మార్చి ఇష్టారాజ్యంగా వర్తిల్లితే ఎవరైనా హర్షిస్తారా? కాబట్టే వీరికి ఎన్నో అనువాదాలున్నా Stephen Mitchel, Alastair Reid ల అనువాదాలకు అంత విలువ!

అనువాదకునిది ఒక రకంగా కత్తిమీద సాము. డిగ్రీల పాండిత్యం వల్ల ఒరిగేదేమీ లేదు; కావలసిందల్లా హెచ్చుస్థాయిలో commonsense, వెరసి కవిత్వ వివేచన. కవిత్వాలు, అనువాదాలు బుద్ధికి సంబంధించినవి కావు అన్న ఇంగితం కలగనంత వరకు ఇలా ఎందుకూ కొరగాని, వాసనలేని పూలు పిచ్చిగా పూస్తూనే ఉంటాయి!

**మురళికి**

# భరించలేని 'విశ్వంభర'

అస్సామీ నటి, గాయని శ్రీమతి రుణుదేవి ఆహ్వానం మీద వారింట ఒక పదిరోజులున్నాను. వచ్చిపోయే కళాకారులతో, సందర్శకులతో ఇల్లంతా సందడిగా ఉంది. బెంగాలీ సంగీత సంప్రదాయానికి చెందిన ప్రసిద్ధ గాయకుడు, హర్‌ధన్‌దాస్ బావుల్ గాన కచేరి; అందరూ పరవశులై పోయారు. బావుల్ అస్సామీ కవి హీరేన్ భట్టాచార్యను కలుద్దామన్నారు. మా చర్చ గానంనుంచి సాహిత్యంవైపు మళ్ళింది. రుణుదేవి స్వయాన రచయిత్రి కూడా కావడంతోటి స్వారస్యం ఎరిగినదే. "అస్సామీలో అకవుల పరిస్థితి ఏమిటి"? అని ప్రశ్నించాను. వారు మొహామొహాలు చూసుకున్నారు. నేను చెప్పాను "తెలుగులో పురస్కారాలు, ప్రభుత్వ గౌరవాలన్నీ అకవులకే. సాహిత్యం కన్నా రాజకీయాలు లావు. కవిత్వంలో ఓనమాలు తెలియని వారు, పుంఖానుపుంఖాలుగా రచించడమే గాక నానా సన్మానాలు కూడా పొందుతారు. వారి రచనలే ప్రపంచమంతా అనువాదాల్లో చదువుతుంది. వారి చుట్టూ చేరిన వందిమాగధులు ఆ పుస్తకాల్నే కీర్తిస్తూ పరిశోధనా (?) వ్యాసాలు, సిద్ధాంతాలు వెలయిస్తారు. తెలుగునాట సాహిత్యం డ్రైనేజి స్థాయిలో ఉంది". వారందరూ నమ్మలేనట్లు నావైపు చూశారు. 'ఒక్క ఉదాహరణ చూపగలరా'? అన్నారు ముక్తకంఠంతో. నేను తడుముకోకుండా 'డా.సి. నారాయణరెడ్డి' అని తాగుతున్న లాల్‌సా పక్కనపెట్టి, అతను రచించిన కావ్యం (?), 'విశ్వంభర' పొందిన అవార్డుల చిట్టా బయటపెట్టాను. "జ్ఞానపీఠ్ అవార్డు కూడానా"? అని ముక్కున వేలేసుకున్నారు. 'నోబెల్ కమిటీలో తెలుగు రాజకీయం నడిచే పక్షంలో అది కూడా దఖలు పడేది' అన్నాను నవ్వుతూ. 'మీ విమర్శకులకు సిగ్గూ, ఎగ్గూ లేవా'? స్వయానా కవి ఐన అంజన్ ఠాకూర్ ఆవేశంగా అడిగారు. "విమర్శకులను ఆడిపోసుకొని లాభంలేదు. ఆంధ్రజాతిని నపుంసకత్వం పట్టి పీడిస్తోంది. హార్మోను లోపాలతో బాధపడుతోంది' – అని సాలోచనగా 'యూనివర్శిటి కవులు, విమర్శకులతో భ్రష్టుపట్టిపోయింది సాహిత్యం. వీరు కలం పట్టరాదని ప్రభుత్వం శాసనంచేస్తే పరిస్థితులు బాగు పడవచ్చు" నంటే అందరూ నవ్వుకున్నారు. అస్సాంనుండి Hyderabad చేరిన రాత్రే రచయిత్రి వీరలక్ష్మి గారు ఇస్మాయిల్ మరణవార్తను వినిపించారు. విని హతాశుడనైపోయాను. online తెలుగు సాహిత్య పత్రిక 'ఈమాట' సంపాదకులు ఏమైనా రాయమన్నారు. ఏమీ రాయడానికి మనసు పుట్టలేదు. 'గోపి, సినారె, శివారెడ్డి' గార్ల కవిత్వాలను విశ్లేషించి కవిత్వ భ్రమలను పటాపంచలు చేయమని లోగడ వారు కోరి ఉన్నారు. ఇండియా రాగానే గోపి పుస్తకాలను విశాలాంధ్రలో తిరగేశాను. శుద్ధవచనం, కొత్తగా రాస్తున్న కవులకన్నా కడు అధ్వాన్నం. నానీలు, బనియన్‌లు, చెడ్డీలు అని ఏవో అధమస్థాయి రాతలు, మళ్ళీ వాటిమీద విమర్శలు, పరామర్శలు. నాలుగు వాక్యాలు concrete గా రాయలేని వాడు కూడా తెలుగునాట కొత్త కొత్త ప్రక్రియలు ప్రవేశపెట్టడము, మళ్ళీ దానికి ఒక ఫాలోయింగ్. హాస్యాస్పదం అనిపించింది. రౌతు మెత్తనయితే గుర్రం మూడుకాళ్ళ మీద నడిచిందట. ఇదంతా కొరడా ఝుళిపించే విమర్శకుడు లేకపోవడం వల్ల పుట్టిన తెగులు.

అదలా ఉండనిస్తే, తెలుగునాట చెత్త కవిత్వాలకు ఆద్యుడు, అన్ని పత్రికల్లో అంతటా తానై ప్రభవిస్తూ, గద్యానికి, పద్యానికి - రెంటికీ చెడ్డరేవడి, సినిమా పాటల సినారె కవిత్వ భేషజాన్ని ఖరాకండిగా నిరూపించే ముందు.. ఆయన విశ్వంభర కావ్యానికి రాసుకున్న ప్రస్తావన, పరిచయ వాక్యాలను పరిశీలిద్దాం.

"కొంతకాలం నా పేరు చెబితే కర్పూర వసంతరాయలు కావ్యం గుబాళించేది. ఈ కావ్యం వెలువడిన తరువాత ఎందరో సహృదయులు నన్ను విశ్వంభర కవిగా సంభావించారు." మంచిదే, అయ్యవారికి తమ రచనల మీద ఘనమైన అభిప్రాయమే ఉంది!! "కవిగా నా స్థానాన్ని మరింతగా సార్థకం చేసిన కావ్యం విశ్వంభర. ఈ కావ్యం అందుకున్న అవార్డులు అభినందనలూ ఎన్నెన్నో!" ఇందులో కవిత్వముందని, దానివల్ల లౌకికలాభం కలిగిందని ఆచార్యుల అభిభాషణ. అంతటితో ఆగలేదు! "విద్యాలయాలు ఎం.ఏ. స్థాయిలో దీన్ని పాఠ్యగ్రంథంగా నిర్ణయించాయి. దీనిపై ఎం.ఫిల్, పిహెచ్.డి పట్టాల కోసం పరిశోధనలు జరిగాయి". ఇలాంటి ప్రహసనాలు చూసి విసిగిపోయి కాబోలు మహాకవి ఇస్మాయిల్ విశ్వ విద్యాలయాల్లో తెలుగు విభాగాన్ని ఎత్తివేయాలనేవారు. "ఎందరో ప్రముఖ విమర్శకులు లోతైన వ్యాసాలు రాసి ప్రకటించారు. అంతేకాకుండా ఇతర భాషల్లో కూడా దీని అనువాదాలు వెలువడ్డాయి!" అది ధీమా అంటే. ఇన్ని జరిగాక, విశ్వంభర మహాకావ్యం కాకుండా పోతుందా? ఇన్ని ప్రత్యేకతలు గల ఈ కావ్యం గూర్చి నాలుగు మాటలు ఆయన నోటినుండే వింటే, పుణ్యానికి పుణ్యం పురుషార్థానికి పురుషార్థం!

"ఈ కావ్యానికి నాయకుడు మానవుడు. రంగస్థలం విశాల విశ్వంభర. ఇతివృత్తం-తేదీలతో నిమిత్తంలేని, పేర్లతో అగత్యం లేని మనిషి కథ". చాలా ప్రణాళికే ఉంది! ఉన్నట్టుండి కావ్యం కాస్త కథలోకి దూకడం గమనిస్తాం. అప్పుడే ఐపోలేదు కావ్యప్రస్తావన. తరించండి! "ఈ కథకు నేపథ్యం ప్రకృతి. మనిషి ధరించే వివిధ భూమికలకు మూలధాతువులు మనశ్శక్తులు" Psychology దాకా వచ్చింది వ్యవహారం. ఇంకా చాలలేదు అన్నట్టు "అలెగ్జాండర్, క్రీస్తు, అశోకుడు, సోక్రటీస్, బుద్ధుడు, లింకన్, లెనిన్, మార్క్స్, గాంధీ – ఇలా ఇలా ఎన్నెన్ని రూపాలో మనిషికి" గ్రీసు, ప్రాచీన భారతం, మొన్నటి రష్యా, అమెరికాల నుంచి 'రెండు బేకులు బేకి, మూడు సాకులు సాకి' అందినకాడికి అందరినీ లాక్కొచ్చారు బరిలోకి. మళ్ళీ కార్ల్‌గస్టఫ్ యూంగ్‌లా, మనస్తత్వజ్ఞుని స్వరంలో "కామం, క్రోధం, లోభం, మదం, ఆత్మశోధనం, ప్రకృతి శక్తుల వశీకరణం – ఇలా ఇలా ఎన్నెన్ని విభిన్న ప్రవృత్తుల్లో మనిషికి". ఈ list లోకి 'వచన కవిత్వ రచనం' చేర్చి ఉంటే మరింత సంపూర్ణం, సార్థకమయ్యేది. మళ్ళీ కావ్యం గుర్తు కొచ్చినట్టుంది. "ఆదిమ దశనుంచి ఆధునిక దశ వరకు మనిషి చేసిన ప్రస్థానాలు ఈ కావ్యంలోని ప్రకరణాలు". చెప్పదలచుకొన్నది ఏమిటి? ప్రాక్ చరిత్రా? మానవశాస్త్రమా? మనో విజ్ఞానమా? అంతా అయోమయం. అపర సంజీవదేవ్‌లా "మనిషి సాధన – కళాత్మకం, వైజ్ఞానికం, ఆధ్యాత్మికం. ఈ సాధనలో అడుగడుగునా ఎదురుదెబ్బలు. క్షతుడైనా మనిషి తిరోగతుడు కాలేదు". (నేటి కవిత్వ పాఠకుడిలా!) మొత్తానికి ఈయన ఉద్దేశం ఏమిటి? ఇంత చిన్న ప్రస్తావనలో ఇన్ని గొంతులా? ఇన్ని సంగతులా? స్పృహ ఉండే భాషను వాడుతున్నారా? లేదా సినిమా

పాటల తీరులో దూడలనే వదిలేస్తున్నారా? "విశ్వంభర కావ్యరచనకు పూర్వం నాలో గీసుకున్న రేఖాచిత్రమిది. వచన కవితలో ఒక సమగ్రకావ్యం వ్రాయాలనే నా ఆకాంక్ష ఇలా రూపొందింది" శుభం. ఖచ్చితంగా వందపేజీల్లో విస్తరించిన భావం/కవిత్వం ఆనవాలు నేను పట్టలేను. ఏ చారిత్రక నవలో, వ్యాసమో కావలసినది మనపాలిట ఇలా అఘోరించిందన్నమాట. ఇంకా విలువైన మాటలు మిగిలి ఉన్నాయి. "విశ్వ మానవేతిహాసాన్నీ, అవధిలేని మనిషి మానసకోశాన్ని అవగాహన చేసుకున్న సహృదయులకు ఈ కావ్యం సంతృప్తిని కలిగిస్తుందని నా విశ్వాసం". ఏ అర్థపుష్టి లేకుండా, ఇవన్నీ సినిమా డైలాగుల్లా ఉన్నాయి గాని, కావ్యప్రస్తావనలా లేవు. 'క్షతుడైనా మనిషి తిరోగతుడు కాడు' - ఆయన మాటలే ఔదలదాల్చి 'కావ్యం'లోకి ప్రవేశించ బోయేముందు-

ఐదు ప్రకరణాల కావ్య ప్రణాళిక ఇది :-

1. మనిషి పుట్టుక, స్త్రీరాక, ఆడమ్ ఈవ్‌ల కథ, గుహల్లో నదీతీరాల్లో ఆదిమ మానవుడి జీవితం (20 పేజీలు)

2. లలిత కళల పుట్టుక (సంగీతం, నాట్యం, కవిత్వం, చిత్రలేఖనం, శిల్పం) (14 పేజీలు)

3. మనసు గురించి తలపోత (10 పేజీలు); బుద్ధుడు, అలెగ్జాండర్, అశోకుడు, సోక్రటీస్, క్రీస్తుల చిత్రణ (18 పేజీలు)

4. మనిషి ప్రస్థానాలు (22 పేజీలు)

5. లింకన్, మార్క్స్, లెనిన్, గాంధీల చరిత్ర, మనిషీ మనసూ అని ఉడుకు సోది (16 పేజీలు)

వందపుటల్లో కాగడా వేసి చూసినా కవిత్వం జాడ కనిపించదు. మూర్తంగా (concrete) రాయడం రాదు. కవికి కావలసిన పదజాలం (diction) బొత్తిగాలేదు. విశేషణాల వాడుకలో ఏ మాత్రం ప్రావీణ్యంలేదు. సర్వత్రా, ఎటుచూసినా అతివిస్తరణ. క్లుప్తత, సంక్షిప్తత కలికానికి కూడా కానరావు. అంతా సినిమా పాటల ఫక్కీ. గొట్టుమాటలు, గొడ్డు ప్రయోగాలు, పత్రికాభాష, హీనవచనం. అం అంటే ఆంధ్రానికి అసహజమైన అంత్యప్రాసలు; ఈ పుస్తకంలో ఇది గుణమని చూపించడానికి ఏమీ మిగలలేదు.

ఇంతటి అధమ రచన ఆయన ప్రస్తావనలో పేర్కొన్నట్లు, నానా గౌరవాలు పొందింది అంటే మన కవిత్వ వ్యవసాయంలో కలుపు ఎంత బలంగా వేళ్లూనికొని ఉందో అర్థమవుతోంది. భారతీయ భాషల్లో, ఈ పరిస్థితి ఎప్పుడూ, ఎవరూ చూడలేదు. చూడలేరు. హీనరచనను మురికి కాలువలో పారేయక జ్ఞానపీఠాలెక్కించిన సాహిత్య సిద్ధాంతులను ఉప్పులో ఊరవేసినా పాపం లేదు. ఈ రచనా డిగ్రీ, పీజీ విద్యార్థులు పఠించేది? ఈ చెత్త సరుకా అనువాదం పేరిట ప్రపంచమంతా వ్యాపించి తెనుగు కవిత్వానికి ప్రాతినిధ్యం వహించేది? గొప్ప రచనల విషయంలో ఎంత ఎక్కువ గొప్ప లేదా ఎంత తక్కువ గొప్ప అని భేదాభిప్రాయాలు ఉండవచ్చు. అధమాతి అధమ రచనను పండితుడు, కవి అనే వాడు కాలిగోటితో కూడా తాకడు. అందులో అభిప్రాయ భేదానికి తావులేదు. రాజకీయాలతో

భ్రష్టుపట్టిన తెలుగు సాహిత్యానికి స్పష్టత చేకూర్చడం తక్షణావసరం. ఇక 'కావ్యం'లోకి ప్రవేశిద్దాం.

నేను పుట్టకముందే

నెత్తిమీద నీలితెర

కాళ్ళకింద ధూళిపొర

అంత్యప్రాసల ఢమఢమలు మొదలవుతున్నాయని 2,3 వాక్యాల్లో సూచన, తెర, పొర అంటూ

ఈ పొరలో జడమౌనం

ఒళ్ళు విరుచుకున్నప్పుడు

రెక్కలు, డెక్కలు, మొరలు, కోరలు

దిక్కుల డెక్కల్లో, తీంఢ్రించాయి.

మౌనం ఒళ్ళువిరుచుకోవడం, దిక్కులడొక్కలు ఇవన్నీ concrete expressions కావు. అతిమానవీకరణం (personification) కవిత్వానికి హానిచేస్తుంది. 'నేను పుట్టకముందు'– ఇక మబ్బులు, నక్షత్రాలు, ఉషస్సులు, వెన్నెల, వెదుళ్ళు, కొండరాళ్ళు, నెమళ్ళు, కలకంఠాలు.... సరస్సులు, సముద్రాలు అన్నీ ప్రత్యక్షమవుతాయి; అతి విస్తరణ దోషం!!

... ఎంతగా మబ్బులెదురు చూశాయో

చూపుల సోపానాలపై సాగి వచ్చి

తమను పిండుకునే ఆ తపన ఏదని

...ఉషస్సులెంతగా

ఉద్వేగ పడ్డాయో

విచ్చుకున్న కంటికడలిలో

పిచ్చిగా నురగలెత్తే విముక్తాత్మలేవని

...ఎంత ఉబలాటమో నెమళ్ళకు

ఏ అడుగులైనా తమ పదలయలను ఏరుకోవాలని

...పొంగిపొంగి సముద్రాలు

నింగి తండ్రిని అర్థించేవేమో

చూపుల సోపానాలు, కంటికడలి, పదలయలను ఏరుకోవడమూ ఇవేవీ concrete expressions

కావు. కానీ అలా రాయడమే కవిత్వం అనుకుంటున్నట్టుగా ఉంది. సినిమా పాటల్లో ఓనమాలు రాని ప్రేక్షకులతో ఈలలు, చప్పట్లు వేయించడానికి కూడా పనికిరాని సరుకు ఇది. తిరుపతి నుండి రైల్లో వస్తుంటే గుడ్డి బిచ్చగాళ్ళు అడుక్కుతింటూ ఉంటారు, ఏవో పాటలుపాడి. వాళ్ళ దృష్టిలో వకారం గ్రాంధికం. ఎకారం గ్రామ్యం. కాబట్టి తాము సలక్షణంగా పాడుతున్నాము అనుకుంటారు, అటుదిటు మార్చి 'ఏడుకొండల స్వామీ వెక్కడున్నావయ్యా' అంటూ. చూపుల సోపానాలు, కంటికడలి ఆ బాపతే. పైన పేర్కొన్నట్లు సినిమా పాటలక్కూడా పనికిరాని సరుకు. బహు సకృతుగా ఎక్కడో ఒకసారి ఫర్వాలేదు గాని, పుస్తకం నిండా అవేఐతే కవికి కవిత్వం గూర్చి ఏమీ తెలియదు అన్న సత్యాన్ని బయటపెడతాయి. కవిత్వం photography కాదు, సకల జీవ, నిర్జీవరాశులను పట్టుకొచ్చి ప్రదర్శించేందుకు. చిత్రకళలా వలసినవి మాత్రమే తగు వర్ణాలతో చూపించాలి.

నూరుపుటల్లో ఇదే ధోరణి. కవిత్వం అనదగ్గ ఒక్క concrete expression కన్నుపొడుచుకున్నా కనిపించదు.

ప్రాక్ స్త్రీ గురించి రాస్తూ–

ఆ చూపు
చీకట్లను కోసుకొస్తున్నది
పట్టుకోనా *గుండెగుప్పిట్లో*
ఆ నవ్వు
పున్నమలను మోసుకొస్తున్నది
దింపుకోనా దేహదేహళిలో
ఆ స్పర్శ వర్షించిన అనుభూతి
అగాధ సుప్తసాగరాల తరంగోద్ధతి
ఆ పిలుపు అనువదించిన ఆర్ద్రగీతి
హృదయద్వయ సమలయల ఆవిష్కృతి..

ఇలా అంతూపొంతూ లేని మాటల ఊకదంపుడు. feminist కవయిత్రులు చాలానయం.

పై ఆరువాక్యాల్లో కనిపించే లోపాలు మళ్ళీ చెప్పబూనటం చర్విత చర్వణం అవుతుంది. చివరి నాలుగు పాదాలు చదివి 'విశ్వంభర'ను విసిరి కొట్టవచ్చు. అంత్యప్రాసకోసం నానాప్రయాస. అగాధ సుప్తసాగరాలు, హృదయద్వయ సమలయలు, తరంగోద్ధతి, ఆర్ద్రగీతి.. ఏమిటిదంతా?? కవిత్వమే?? వాడి వాడి నీరసించిన విశేషణాలు, గొడ్డు ప్రయోగాలు.. ఏది కవిత్వం కాదు అన్నదానికి ప్రబల

ఉదాహరణగా నిలబడుతుంది విశ్వంభర. (బడాయి కాకపోతే, ఏదో ఒక సంస్కృతం పేరును ఎంచుకొని, పుటల నిండా ఇలాంటి చెత్తను నింపడం. కవిత్వ భేషజం అంటే ఇదే.)

*అప్పుడు మాకులేదీ అనుభవ ముద్ర*

*అదొక జాగ్రన్నిద్ర*

*అప్పుడేదీ ఈ రసాందోళన*

*అదొక జడచేతన*

అనుభవ ముద్ర, జాగ్రన్నిద్ర.. రసాందోళన, జడచేతన.. ఇలా అరిగిపోయిన పదబంధాలను వాడడు కవి అన్నవాడు. టీనేజీ కుర్రవాడు కూడా ఇన్ని తప్పులు చేయడు కవితా రచనలో!

*'మిత్రమా*

*నీరాకతో ధాత్రి నవచైతన్య గాత్రి*

*అప్పుడా!*

*నీ రేఖతో ప్రకృతి రూపెత్తిన ద్యుతి'*

ఇదంతా ప్రాసలకొచ్చిన గొడవ, భావాలు లేనప్పుడు, అలవాటుచొప్పున రాసేయడమే (కాలకృత్యాలు తీర్చుకున్నట్టు)

'నా ఘోష విన్నదా అంబరం

ఔనన్నదా దిక్కు హరాంతరం

పొడుచుకొచ్చింది అదే భానుబింబం

పొంగుతున్న ఆశాపూర్ణ కుంభం'

ఓరియంటల్ స్కూల్‌లో భాష పట్టుబడని ఐదోతరగతి బాలుడు కూడా ఇలాంటి కవిత్వాలు కలలో కూడా రాయడు.

గ్రహాభ్రమణాల మధ్య

కాదన్నది ఎలుగెత్తి జీవనది

కాదన్నది పువ్వుల్ని పుక్కిలిస్తూ

కదిలివచ్చే వసంత సంజీవనీ హ్రాది

ఇలా పువ్వుల్నీ, నిప్పుల్నీ పుక్కిలిస్తూనే ఉంటాడు కవి ఐదు ప్రకరణాల్లో. పారకుడేమో

"ఆత్మరక్షణ నేర్చుకున్న

ఆది పారమిది

మృత్యుహత్యకు వేసుకున్న

మూలపీఠమిది." అని వాపోతూ ఉంటాడు.

ఏ పుటను తిప్పినా ఇదేగొడవ! అర్థం పర్థంలేని వాక్యాలు అంత్యప్రాసలతో తయారు.. లేదంటే పిచ్చి ప్రయోగాలు 'అంబరాన్ని పిడికిలించుకుని' అంటూ.

మిగిలిన నాలుగు ప్రకరణాల్లోను ఇదే గొడవ; మరింత తారాస్థాయిలో! చివరిగా మన తెలుగు కవిత్వంలో సింగిరెడ్డి నారాయణ రెడ్డి స్థానం?? ఆయన మాటల్లోనే– (వెర్రిప్రాసలూ, చెత్తపదాలతో)

"ఇంతకూ నేనెవణ్ణి

ఏ మింటి ఇంటివాణ్ణి

ఏ కాలం చంటివాణ్ణి

వెర్రెత్తిన ఏ శక్తి

విసిరేసిన కందుకాన్ని

ఎందుకిలా దొర్లుతున్నాను

ఈ పొరలను ఒంటికి చుట్టుకొని

ఎందుకిలా నిలువెత్తుగా పొర్లుతున్నాను

ఎవరదీ వెన్నంటి వస్తున్నది?

(విమర్శకుడికి తప్ప మరెవ్వరికి ఆ సాహసం ఉండదు).

**చివరి మాటలు:**

'వచన కవితలో ఒక సమగ్ర కావ్యం వ్రాయాలనే ఆకాంక్ష ఇలా రూపొందింది'. ఎలా రూపొందిందో గమనించాం. సుబ్బిగాడి పెళ్ళి అప్పిగాడి చావుకొచ్చిందని, ఈ అధమకావ్యం పాఠకుల తలకు చుట్టుకుంది. వీరి దృష్టిలో వచన కవిత అంటే ఏమిటి? పద్యకవిత కానిది; ఛందోబంధనాలే లేనిది. పద్యంలో, ఛందోబందోబస్తుల్లో కవిత్వం ఉంటుందన్న పూచీలేదు; అలాగే వచనంలో కవిత్వం నిలుస్తున్న గారంటీ అసలు లేదు. సమస్య ఎక్కడుందంటే కవిత్వావగాహన లేని వీరి బుర్రల్లో.. నీవు రాసేది గద్యమైనా, పద్యమైనా అది కవిత్వమై తీరాలి. గద్యం లేదా పద్యం ఏవీ కవిత్వానికి పర్యాయపదాలు కావు.

సమగ్ర కావ్యం అంటే?? దాని పరిమితి ఏమి? వందపేజీలనా??

" The longer poem is to the short what a symphony of Beethoven is to prelude of Chopin. The difference is not only of length: it is range and complexity" - (A.S. Cairncross, Longer poems, old and new).

దీర్ఘతే కాదు దాన్ని మించిన కొలమానాలున్నాయి.. విస్తృతి, జటిలతలాంటివి! జాగ్రత్తగా గమనిస్తే దాదాపు ఇదే ఇతివృత్తంలో వచ్చిన నూరులైన్ల 'దేశచరిత్రలు (శ్రీశ్రీ)' వందపుటల 'విశ్వంభర' కన్నా విస్తృతిలో, జటిలతలో గొప్పది. అందునా అది అచ్చమైన కవిత్వం. దీనిలా దిక్కుమాలిన వచనం కాదు. దీర్ఘకవితలు, సమగ్ర కావ్యాలు అందరూ వేలిడవలసినవి కాదు. ముందు దోషరహితంగా నిక్కమైన కవిత్వం రాసి ఉండాలి. (అది ఇతర భాషల్లోకి బహుళానువాదాలు పొందకపోయినా, పలువురికి పాఠ్యగ్రంథంగా నిర్ణయించకపోయినా వచ్చిన నష్టం లేదు.) కవిత్వం రాయడం వేరు, అంత్యప్రాసల ఢమఢమలు..సంధిబంధాలు, జటిలసమాసాలు, అతిమానవీకరణాలు.. 'నహినహి రక్షతి డుకృఞ్ కరణే' విశ్వవిద్యాలయాల్లో, ఎవార్డు కమిటీల్లో విద్యాగంధమంటని వెంకటేశాలున్నంత కాలం... ఇలాంటి 'కావ్యాలు' ఇబ్బడిముబ్బడిగా వచ్చి పడుతూనే ఉంటాయి! ఇలా 'జ్ఞానోదయమైన గాడిదలు ఓనమాలు తెలియకున్నా' కవిత్వం పేరిట ఓండ్ర పెడుతూనే ఉంటాయి.

# కవిత్వమంటే...

## Jorge Luis Borges (1899-1986)

*20వ శతాబ్దపు ధ్రువతార. కథలు, కవిత్వాలు, వ్యాసాలు, సమీక్షలు-సకల ప్రక్రియల్లో తనదైన ముద్రవేసిన వాడు. అరవైల నాటికి కనుచూపు పూర్తిగా కోల్పోయిన కారణంగా మూడు దశాబ్దాల శేష జీవితాన్ని మొత్తం కవిత్వానికి వెచ్చించాడు. జ్ఞాపకశక్తి అపారం. ఉపన్యాసాల్లో నానా భాషల కవిత్వాలను మంచినీళ్ళప్రాయంగా ప్రస్తావించే వాడు. హోమర్, ఆంగ్లోశాక్సన్ కవిత్వాలన్న అమిత ప్రీతి. నవలకు ఇవి చివరి రోజులు అని జోస్యం చెప్పాడు. కథ, కవిత్వం మళ్ళీ కలిసి పోవాలని ఉబలాట పడ్డాడు. ఇతిహాస రచనకు ఉపక్రమించమని హితవు పలికాడు. భారతీయ తాత్విక సంప్రదాయాన్ని మిగుల ప్రస్తుతించాడు. లోతులు ముట్టినవాడు కాబట్టే ఎన్నడూ అహంకరించలేదు.. అణువణువు వినయం తొణికిసలాడుతుంది.. ఇతని గురించి ఒక్కమాటలో చెప్పాలంటే - ఋషితుల్యుడు.*

★★★

డెబ్బై ఏళ్ళు మీద పడుతున్నాయి. నా జీవితంలో అధికభాగాన్ని సాహిత్యానికే వెచ్చించాను. అయినా, కేవలం నా సందేహాలనే మీ ముందుంచుతాను..

★★★

ఆలంకారికుల రచనా వ్యాసంగాలు, ఆకాశం వైపు కన్నెత్తి చూడని ఖగోళ శాస్త్రజ్ఞుల అధ్యయనాన్ని తలపించి చెడ్డ ఇబ్బందిని కలిగిస్తాయి. నిజానికి కవిత్వమంటే ఉద్వేగం, ఆనందం.. అలా కాకుండా వీరు కవిత్వాన్ని పెద్ద పనిగా చిత్రీకరిస్తారు.

★★★

నా చిన్ననాడు.. మా నాన్న కీట్స్‌ని గానం చేస్తుంటే - విని కవిత్వంలోని అసలైన ఉద్రేకాన్ని అనుభవించాను. కవిత్వం, భాష - భావాలనే కాకుండా ఉద్వేగాన్ని, ఆనందాన్ని వెల్లడిస్తాయి, అన్న విషయం నాకు అవగతమైన పిదప ఆ పదాలు నాకు అర్థమైనాయి అని నేననుకోను.. నాకేదో ఐపోతుంది అనిపించింది - కేవలం బుద్ధికి కాదు.. శరీరం.. రక్తం నా సమస్తానికి..

★★★

పుస్తకం పూజింప దగ్గ వస్తువు కాదు.. అది సౌందర్యానికి తగు సందర్భం..

★★★

కవిత్వాన్ని నిర్వచించవలసివస్తే మాత్రం కొంచెం తడబడతాను. ఇదమిత్థంగా చెప్పలేను. "కళాత్మకంగా పొందించిన శబ్దాల ద్వారా సౌందర్యాన్ని వ్యక్తం చేయడమే కవిత్వం." ఈ నిర్వచనం ఏ నిఘంటువుకో, పాఠ్యపుస్తకాలకో సరిపోతుందని మనందరికీ తెలుసు. అంతకన్నా ముఖ్యమైంది ఏదో వుంది. అది మనల్ని కవిత్వం రాయడానికి ప్రేరేపిస్తుంది. అంతేకాదు కవిత్వాన్ని ఆనందింపజేస్తుంది.. దాని గూర్చి అంతా తెలుసు అనుకొనేలా చేస్తుంది.. మనకు కవిత్వం ఇదని తెలుసు. మనకెంత భేషుగ్గా తెలుసంటే దాన్ని వేరే పదాల్లో నిర్వచించలేనంతగా! అదెలా అంటే.. కాఫీ రుచి, ఎరుపు లేదా పసుప్పచ్చరంగు, కోపం, ప్రేమ, ద్వేషం, సూర్యోదయం.. అస్తమయం, దేశాభిమానం - వేరు పదాల్లో నిర్వచించలేనట్టే.. ఇవన్నీ మనలో ఎంత లోతుగా నాటుకున్నాయంటే వీటిని మనమందరం పంచుకొనే ఉమ్మడి చిహ్నాల ద్వారా వ్యక్తం చేయగలం.. అప్పుడు మనకు వేరే పదాల అవసరం ఏముంటుంది??

★★★

సూటిగా చెప్పిన దాని కన్నా సూచనప్రాయంగా వెల్లడించినది బాగా తలకెక్కుతుంది.. సూటివాక్యాలను స్వీకరించదు మనసు.. ఎమర్సన్ ఏమన్నాడు? "వాదాలతో ఎవరినీ ఒప్పించలేవు" వాదాన్ని తిరగా బోర్లా వేసి, పరిశీలించి తిరిగి వాటికి విరుద్ధంగా వెళతాము. అలాకాకుండా మామూలు మాటలు, సూచనగా చెప్పినవి మరింత సులువుగా మనసుకు పడతాయి. విట్మన్ ఎన్నడో అన్నాడు.. శుష్కవాదాల కన్నా - రాత్రి వీచే గాలి, పెద్దగా ప్రకాశించే తారలు మన చిత్తాన్ని తేలికగా ఆకట్టుకొంటాయి..

★★★

ఒక పర్షియన్‌కవి చంద్రబింబాన్ని కాలదర్పణం అంటాడు.. చంద్రబింబం, దర్పణం అవునో కాదో ఎవరికీ పట్టదు.. కారణం కవిత్వం ఉద్దేశించేది మన కల్పనను!!

★★★

తెలుసుకోవడం ఏమంత గొప్ప సంగతి కాదు.

★★★

గతంలో కవి కథ చెప్పాడు.. గానం చేశాడు. ఐతే శ్రోతలు ఆ రెండూ వేరు అనుకోలేదు. ఒక నాణేనికి రెండు వైపులుగా భావించి ఉండవచ్చు.. ఇంకా ముందుకు పోయి రెండూ ఒకటే అనుకొని ఉంటారు. కథాగమనం, కవితాగానం మళ్ళీ ఒక్కటవ్వాలని నా కోరిక..

★★★

చారిత్రక స్పృహ ఎక్కువై నానా అవస్థలు పడుతున్నాం మనం.. వెనుకటి తరాల వారిలా ఒక ప్రాచీన గ్రంథాన్ని పరామర్శించ లేకపోతున్నాము. ఎంతసేపు పరిస్థితుల గూర్చి విచారిస్తాము. ఒక

ప్రాచీన కవి ఒక మాటన్నాడు అంటే, ఆ రోజుల్లో అలా ఎందుకు అన్నాడని ఆలోచిస్తాము. ఇలాగే కొట్టుకుపోతుంటే ఏదో ఒకనాడు మనలా చీటికి మాటికి చరిత్రను తరచి చూడని కాలం వస్తుంది. అప్పుడు వారు సౌందర్యం చుట్టూ వున్న పరిస్థితులను ఏ మాత్రం లెక్కచేయరు. వారి దృష్టి సంపూర్తిగా సౌందర్యం మీదే లగ్నమవుతుంది. బహుశా కవులు.. వారి జీవితచరిత్రలను ఎవరూ పట్టించుకోరు.. ఇది ఒకందుకు మన మంచికే.. ఇలా ఆలోచించే జాతులున్నాయి.. ఉదాహరణకు భారతీయులకు చారిత్రక స్పృహ ఉందనుకోను.. ఇది కలం పట్టిన ఐరోపా చరిత్ర కారులకు కంటిలో నలుసైంది. భారతీయులు తత్వాన్ని సమకాలికంగా భావిస్తున్నారు. ఇంకోలా చెప్పాలంటే వారి ఆసక్తి కేవలం తత్వం మీద - అంతేగాని వెనుకటి కాలపరిస్థితుల మీద కాదు. ఫలానా తాత్వికుడి గురువెవరు? ఎవరు ముందు? ఎవరు వెనుక? ఎవరి మీద ఎవరి ప్రభావం? ఇటువంటి వాటికి చిల్లిగవ్వ పాటి విలువ ఇవ్వలేదు.. నిగూఢ విశ్వమ్మీద వారికి అమితశ్రద్ధ.. అంతే. రాగల కాలంలో (మరెంతో దూరం లేదు) అందరూ సౌందర్యాన్ని పట్టించుకొంటారు. దాని చుట్టూ ఉన్న పరిస్థితులను కాదు. అప్పుడు గొప్ప కావ్యాలకు మరింత గొప్ప అనువాదాలు వస్తాయి. ఇవన్నీ నెరవేరాలని మనసారా కోరుకోవడంలో తప్పులేదు.

★★★

పదాలు ఇంద్రజాలంలా మొదలైనాయి. కవిత్వం వల్ల అవి మళ్ళీ ఇంద్రజాలానికి (అంటే వాటి మూలానికి) చేరతాయి..

★★★

పదాలు మూర్తాలు (concrete); అమూర్తాలు (abstract) కావు. మూర్తం అంటే కవిత్వమనే అర్థం. Thunder అంటే ఉరుము - మనకు తెలిసిందే. AngloSaxon ఉరుము దేవుడు Thunor. వారి భాషలో punor అంటే ఉరుముకు, దేవుడికి సమానంగా వర్తిస్తుంది. అప్పటి వారిని - ఈ పదం ఉరుమును సూచిస్తుందా లేదా దేవుడినా అంటే.. అంత సూక్ష్మంగా వారు ఆలోచించలేక పోవచ్చు - దానికి కారణం ఆ పదం రెంటినీ సూచిస్తుంది, రెండు అర్థాల్లో దేనికి కట్టుబడకుండా. వారు thunder అన్న పదాన్ని విన్నప్పుడు.. అన్నప్పుడు ఏకకాలంలో వారికి ఆకాశంలో ఉరుముధ్వని, వెనువెంటనే వచ్చే మెరుపుతో పాటు దేవుడి ఆలోచన కూడా వచ్చేది. పదాల్లో ఇంద్రజాలం ఉంది. వాటికి ఒకే ఒక అర్థం ఉండేది కాదు.

★★★

సంతోషం కన్నా ప్రేమ ముఖ్యం. ప్రేమ కన్నా వివేకం ప్రధానం.

★★★

నా అనుమానం మనం కవిత్వానికి ఏదో ఒక అర్థాన్ని జతచేస్తాము. కవిత్వం పూర్తిగా అర్థం కాక మునుపే దాని సౌందర్యాన్ని అనుభవిస్తాం. ఒకే అర్థానికి కట్టుబడనవసరం లేదు. ఒక అర్థాన్ని గ్రహించకముందే మనం కవిత్వాన్ని అనుభూతి చెందుతున్నాం.

★★★

నిరాడంబరం.. అలంకారం.. రెండు రకాల కవితాశైలులు ఉన్నాయని జనాభిప్రాయం.. కానీ ఇదేమంత ప్రధానం కాదు. కవిత ఎంత సజీవం లేదా నిర్జీవం అన్నది నాకు ముఖ్యం. అది అలంకారం కానీ, నిరాడంబరం కానీ.. నిరలంకాలరశైలిలోనూ గొప్ప కవిత్వం ఉది. ఆ మాటకొస్తే నాకు ఇదే అమితంగా నచ్చుతుంది.

★★★

Geneva రోజులను గుర్తు తెచ్చుకొంటే - నేనప్పుడు చాలా దిగులుపడే యువకుణ్ణి. నా కనిపిస్తుంది, దిగులూ విచారం అంటే యువకులకు ఎందుకో తగని మక్కువ. విచారంగా ఉండటానికి వారు చేయగలిగినదంతా చేస్తారు. చివరికి దాన్ని సాధిస్తారు కూడా. నేనప్పుడు ఆనందంతో త్రుళ్ళిపడే రచయితను కలిశాను. 1916లో అనుకుంటా - నేను Walt Whitman సమక్షంలో వున్నది. తక్షణం నా విచారం నన్ను సిగ్గుపడేలా చేసింది. నా విచారాన్ని పెంచు కోవడానికి, మీదుమిక్కిలి Dostoevsky ని చదివినందుకు, ఆ క్షణం నేను సిగ్గుతో చితికిపోయాను.

★★★

నా భావనలో మనుషులు-జ్ఞానఖనులు కానవసరం లేదు. విధేయత, ధైర్యం, విధికి వెరవని మగతనం-నిండిన వారు నాకు ఎక్కడా కనిపించలేదు. ఎంతోకాలం గడిచాక Norse గాథల్లో, AngloSaxon కవిత్వాల్లో, యవ్వనకాలం నుండి వెతుకుతున్న దాన్ని చివరికి పట్టగలిగాను. ప్రాచీనాంగ్లం నాకు కర్కశంగా అనిపించింది. కానీ ఆ కఠినత్వంలోనే ఒకరకమైన లావణ్యం కనిపించింది.. లోతు అనుభూతి అగుపించింది (ఐతే పెద్ద ఆలోచన లేదు). కవిత్వంలో అనుభూతి చాలు.. నీకు అనుభూతి కలిగిందా.. మరి అది చాలు..

★★★

తొలినాళ్ళలో నేను వచనకవిత్వం (free verse) ఛందస్సులో రాయడం కన్నా చాలా తేలిక అనుకొనేవాడిని. నేనివాళ నిశ్చితంగా చెప్పగలను పద్యాలు రాయడం కన్నా వచనకవిత్వం చాలా కష్టం. నిరూపణ - ఒకవేళ కావాలనుకొంటే - సాహిత్యం పద్యాలతోనే మొదలయింది. నా వివరణ - ఒకసారి ఒక మూస ఏర్పడ్డాక యతిప్రాసగణాలతో కూడిన మూస - నీవు చేయవలసిందల్లా దాన్ని పునః పునః వాడటమే.. గద్యాన్ని రాయదలచుకుంటే (గద్యం చాలా ఆలస్యంగా వచ్చింది) నీకు కావలసినది R.L. Stevenson చెప్పినట్టు సూక్ష్మమైన నమూనా.. చెవి ఒక దానికి అలవాటు పడింది. కానీ దానికది లభించదు. మరేదో దొరుకుతుంది.. అది వైఫల్యం కావచ్చు.. సంతృప్తి కావచ్చు. Walt Whitman

లా జాగ్రత్త వహించగలను అనుకొంటే తప్ప వచనకవిత్వం మిక్కిలి కష్టం. నా యాత్ర చివరి మజిలీకి చేరువలో.. ఇన్నాళ్ళకీ నాకనిపిస్తుంది - ఛందోబద్ధంగా రాయడం చాలా తేలిక. ఇందులో ఇంకో సౌలభ్యం.. సౌకర్యం ఏమంటే ఒక పాదాన్ని ఎంపిక చేసుకొంటే చాలు; ఒక వృత్తాన్ని / ప్రాసను ఎంపిక చేసుకొన్నట్టే. ప్రాస / వృత్తాలు పరిమితమే, కాబట్టి నీ పని బహుసులువవుతుంది..

★★★

నేను ఏదైనా రాస్తున్నప్పుడు, అర్థం చేసుకోవడానికి అసలు ప్రయత్నించను. రచయిత చేసే పనులకు తెలివితేటలతో పెద్ద పనిలేదు. ఆధునిక సాహిత్య పాపాల్లో అన్నిటికన్నా చెడ్డది - రచయిత తన్ను తాను మరచిపోలేకపోవడం. ఫ్రెంచి సాహిత్యాన్నే తీసుకుందాం.. నిస్సందేహంగా ప్రపంచసాహిత్యాల్లో అది గొప్పదే. కానీ, నాకనిపిస్తుంది ఫ్రెంచి రచయితకు ఆత్మ విస్మృతి లేదు. తన్ను తాను మరచిపోలేడు.. రాయడానికి ముందే, తన్ను తాను నిర్వచించుకొంటూ, ఒక పెద్ద దండకం చదువుతాడు. ఫలానా పట్టణంలో, ఫలానా చోట - ఒక కాథలిక్కుగా జన్మించి, సోషలిజం వంటబట్టించుకొన్న వాడు ఏమి రాస్తాడు? లేదా రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత మనం ఎలా రాస్తాము? ఇలాంటి భ్రమప్రమాదాల్లో చిక్కుకున్న వారు ప్రపంచవ్యాప్తంగా అనేకులు!

★★★

నేను రాస్తున్నప్పుడు (నాది గొప్ప ఉదాహరణ కాకపోవచ్చు) నన్ను, నా పరిస్థితులను నేను పూర్తిగా మరచిపోతాను. దక్షిణ అమెరికా రచయితలా కనిపించడానికి (గతంలోలా) ఎట్టి ప్రయత్నం చేయను. నా కలను ఉన్నదున్నట్టు వెల్లడించాలని ప్రయత్నిస్తాను. నా స్వప్నం మసకగా ఉంటే (నా విషయంలో అది నిజం కూడా) దాన్ని మెరుగులు దిద్దాలని ఏ మాత్రం ప్రయత్నించను. దాన్ని కనీసం అర్థం కూడా చేసుకోను. అలా కెలికిన రాతల్లో - పాఠకులు ఎన్నో లోతైన అర్థాలు కనుక్కోవడం, నా వరకు, చాలా ఆశ్చర్యంగానే ఉంటుంది. వారికి కృతజ్ఞుణ్ణి కూడా. రచన ఒక తరహా సహకార పద్ధతి. ఇందులో, తన వంతు పని నిర్వహించి పాఠకుడు దాన్ని మరింత అర్థసంపన్నం చేస్తాడు.

***(This Craft of Verse అన్న ఉపన్యాస సంకలనం నుండి సంగ్రహితం)***

# అనువాదం - ఆత్మశోధన

## Alastair Reid (1931)

*20వ శతాబ్దపు గొప్ప అనువాదకుల్లో అగ్రగణ్యులు. ప్రత్యేకించి స్పానిష్ కవితానువాదాలకు ప్రసిద్ధి గాంచాడు. నెరుడా అంతటివాడు ఇతని పుట్టినరోజును ఘనంగా జరిపాడు అంటే అర్థం చేసుకోవచ్చు. అలాగే బోర్హెస్ ఈతని ఎడింబరో నివాసానికి విచ్చేసే ప్రధాన అతిథి. కీర్తిశేషులైన ఈ ఇద్దరు మహాకవులను ఆంగ్లం లోకి దించి తద్వారా ప్రపంచానికి పరిచయం చేసింది ఇతనే. డెబ్భై నిండినా అనువాద ప్రపంచంలో నిత్యవసంతుడు. అనువాదంలో ఇతని అనుభవాలు, భావాలు అవశ్యం పఠనీయం.*

★★★

మాటలకందని ప్రాథమికానుభవాన్ని అనువదించడమే రచన, కాబట్టి రచయిత, అనువాదకుడు చేస్తున్నదొకటే. ఆత్మశోధన ప్రక్రియ - భాషా రహస్యాలను పట్టుకొని అర్థాన్ని ఆవిష్కరించడమే; కానీ, కొంచెం తేడా ఉంది.. రచయిత కావడానికి ఒక దివ్యాంశ అవసరం కావచ్చు. సఫల అనువాదకుడు కావాలంటే మాత్రం నీవు సన్యాసివైనా కావాలి లేదా మూఢమతివైనా; సన్యాసి లక్షణాలు పుణికిపుచ్చుకొన్న మూఢమతివైతే మరీ మంచిది.

★★★

విదేశీయుడు ఒక ప్రాంతానికి, ప్రజలకు ఎంతగా అలవాటు పడినా అతడు దాటలేని ఒక పొలిమేర వుంది - దానికి ఆవల అతను ఆ ప్రాంతానికి చెందలేడు. అతని వేళ్ళు అక్కడ లేవు, అంటే అక్కడ అతనికంటూ బాల్యంగానీ, గతం గానీ లేవు.

★★★

అజ్ఞాతంగా మిగిలిపోవడంలోనే అనువాదకుడి ప్రజ్ఞ దాగుంది. గుర్తుపట్టక పోవడంలోనే వుంది అసలు విజయం. ఇది ఈ భాషలోనిది కాదు. పరాయి భాషలోంచి బలవంతంగా జొప్పించారు అనిపించరాదు. మూలాన్ని ఒక రూపం, శైలిలోకి పొందించి మరో భాషలోకి సహజంగా రూపాంతరం చెందించడంలోనే ఉంది పనితనమంతా. ప్రతి అనువాదానికి స్పానిష్‌మీద నాకున్న పట్టు మీద కాకుండా ఆంగ్లం మీద నాకున్న అధికారం మీద నేను ఎక్కువ ఆధారపడతాను.

★★★

ఇంగ్లండ్‌లో స్కాట్లు రెండు భాషలు మాట్లాడగలరు. చిన్నపిల్లలం, మైదానాల్లో మా భాషలోనే మాట్లాడుకొనే వారం. బడిలోకి అడుగుపెట్టగానే మేము, పెత్తందారీ భాష - ఇంగ్లీష్ మాట్లాడాలని

తెలిసేది. మా భాష మాట్లాడితే నవ్వుతాలుగా ఉండేదీ అందరికీ. ఇంగ్లీష్‌లో మాట్లాడితే సరిగ్గా మాట్లాడినట్టు. స్కాట్‌లో మాట్లాడితే సరిగా మాట్లాడనట్టు అన్న మాట. భారతదేశంలో కూడా ఇదే పరిస్థితి ఉంది. అందుకే అక్కడ చాలా మంది గొప్పరచయితలు పుట్టుకొచ్చారు. విజయం సాధించాలంటే పెత్తనం సాగిస్తున్న జాతి భాషను వారికన్నా బాగా మాట్లాడి చూపించాలి.

★★★

స్పానిష్‌లో మునిగి పోవడానికి కారణం మానసికం. ఆంగ్లం పదిభాషల్లో ఒకటి. కానీ స్పానిష్ అలా కాదు.. అది భావోద్వేగ పూర్ణం.. అది అణగారిన ఆత్మకు విమోచన ప్రసాదించి హాయి గొలుపుతుంది. ఇంగ్లీషులో కోప్పడవలసి వస్తే బిర్రబిగుసుకుపోయి, నిటారుగా నిలుక్కుపోతాను. అదే స్పానిష్ అయితే కాళ్ళూ చేతులూ ఆడిస్తూ, మాటలను గుప్పిస్తూ ఉన్న ఫలాన ఊగిపోతాను. పూర్తి విమోచనం అన్నమాట.

★★★

కాబట్టి స్పానిష్ నుండి ఆంగ్లంలోకి అనువదించడంలో కొన్ని చిక్కులు ఉన్నాయి. ఇందులో సరిగా ఇమడని మానసిక వృత్తులను పట్టుకురావలసి ఉంటుంది. అక్కడే అనువాదకుడి ప్రతిభ బయటపడేది. ఆంగ్లేయులు అలా మాట్లాడరు. కానీ, ఆ పని అనువాదకుడు చేయగలడు.

★★★

ఇతర భాషలు నేర్చుకొనే కొద్దీ మాతృభాషలో పట్టు విపరీతంగా పెరిగిపోతుంది. మరొకభాషలో బ్రతకడం అంటే, మరొక వ్యక్తిత్వాన్ని సమకూర్చుకోవడం. నేను నేర్చుకొన్న స్పానిష్‌కు - చిన్న శిశువులా, ఒక సందర్భం ఉండేది కాదు; కారణం నాకు ఆ భాషలో గతం లేదు.

★★★

మూలంలోని శబ్ద గతులను అనుకరించగలమే గాని, ఉన్నది ఉన్నట్టు తీసుకురాలేము; మూలాన్ని చదివి పాఠకుడు ఏ అనుభూతికి లోనవుతాడో అనువాదాన్ని చదివి అతను అదే అనుభూతికి లోనయ్యేలా చేయవచ్చు.

★★★

అనువాదానికి ఉద్వేగం అవసరం. నేను అనువాదం చేసే పుస్తకాన్ని చదివినంత తీవ్రంగా మరే పుస్తకాన్ని చదివి ఎరుగను. దాని గురించి నీకు సర్వము, సమస్తమూ తెలియాలి.. దాని ముందు, వెనుకా దాని అంతరంగపు లోతుల దాకా..

# అనుభవాలూ-జ్ఞాపకాలూనూ

శ్రీ పాదవారి ఆఖరి రచన ఇదే అవడం మూలాన, దీనికో ప్రత్యేకత ఉంది.

శ్రీ పాదవారు, ఈ పుస్తకంలో తానుకలిసిన వ్యక్తులు, తిరిగిన ప్రదేశాలు, పొందిన అనుభవాలు తనదైన శైలిలో హృదయానికి హత్తుకొనేలా చెప్పారు. అంతేకాదు, ఆయన వాదనాపటిమ, స్పష్టమైన అభిప్రాయ ప్రకటన, ఆంధ్రత్వం మీద ప్రేమ . . . పుస్తకమంతా పరచుకొని ఆహ్లాదం కలిగిస్తాయి. వచనశైలిలో, punctuation, paragraphing లో ఆయన ప్రవేశపెట్టిన పద్ధతులు, హృద్యంగా దర్శనమిస్తాయీ పుస్తకంలో.

పద్యం, వచనం, వీటి మధ్యనున్న సంబంధం, ప్రస్తుతకాలానికి అన్వయించే తీరు, సమ్మోహ పరుస్తాయి పాఠకున్ని.

అంతేకాదు, ఫ్రెంచి సింబలిస్టులు సైతం, సంగీతగుణం. కవిత్వానికి ఏదో కిరీటం పెడుతుంది. అని అయోమయం సృష్టించారు. కవిత్వంలో సంగీతానికి పెద్దపీటవేశారు. శ్రీపాదవారు తమ భావనాశక్తితో, సంగీతం, కవిత్వం మధ్యభేదాన్ని స్పష్టంగా పేర్కొని, సంగీతగుణం వల్ల కవిత్వానికి కొత్తగా ఒరిగేదేమీ లేదు అని తేల్చారు.

ఆంధ్ర దేశమంతటా పర్యటించి, అన్ని ప్రాంతాల పలుకుబడులు, నుడికారాలు చెవులారావిని పంచ ప్రాణాలు పొంది, పూర్ణ ఆంధ్రున్నయ్యానని ఉద్వేగంగా చెబుతారు శ్రీపాద.

భుక్తికి, కళాసృష్టికి మధ్య సంఘర్షణ, ఆయన తపన చివరివరకూ కనిపిస్తాయి. వీలునామాలేఖలో ఆయన దైన్యం.. హృదయాన్ని కదిలిస్తుంది !

కాశీనాథుని, కొమఱ్ఱాజు, వావిళ్ళవారు ముఖ్యంగా దర్శనమిస్తారు వీరి స్వభావాలు, వ్యవహారజ్ఞత పుస్తకం పరిధిలో ఆసక్తికరంగా వర్ణించి, వీరి రూపుకట్టించారు శ్రీపాద.

ఆయన చేసిన ప్రయాణాలు, రైలు పరిచయాలు, ఆయన పొందిన గౌరవాదరాలు, కష్టనిష్ఠూరాలు, కడుసూక్ష్మంగా వివరించబడ్డాయి.

అవధానాలన్నా, పద్యరచనన్నా ఆయనకున్న ఏవగింపు సకారణంగా తెలుసుకోగలం ఈ పుస్తకంలో. అలాగే రాయప్రోలు సుబ్బారావుగారితో ఆయన చేసిన వాదాలను బట్టి, గాంధీ, ఖద్దరు పట్ల ఆయనకున్న వ్యతిరేకత కూడా స్పష్టమే.

ఆర్షధర్మమన్నా, భారతీయ దర్శనమన్నా ఆయనకు అనురక్తి. అంతేకాదు యూరోపియన్ కార్యసరళికూడ ఆయనకిష్టమే అని తెలుస్తుంది. ఆధునిక శాస్త్రజ్ఞానమంటే, ఆయనకు సానుభూతి లేదేమోననిపిస్తుంది. ఆయన విదేశీయుల రోదసీ యానాలను విమర్శించిన తీరునుచూస్తే. కానీ ఆర్ష సంప్రదాయం మీద ఇష్టం వారిచే అలా రాయించేందేమో. ఆయన సంప్రదాయంలో అనంతమైన విషయాలనెన్నో ఎదిరించి నిలిచారన్న విషయం మనకుతెలుసు. ఆయన వ్యక్తిత్వంలో కొద్దిగా వైరుధ్యం ఆధునిక శాస్త్ర విజ్ఞానం విషయంతో.

మొత్తానికి గొప్పకథకుడిగా, తెలుగు సాహిత్యం మీద, తనదైన స్వీయ వ్యక్తిత్వ ముద్రవేసిన వారు శ్రీపాద. ఆయన మరణించినా ఆయన 'అనుభవాలూ-జ్ఞాపకాలూ' తెలుగువారిని వదలవు.

**21.09.93**

# మహాకవి మరణం

ఒక మహావృక్షచ్ఛాయలో సేద తీరానని ఆయన మరణించాక గాని నాకు అవగతం కాలేదు. గత మూడేళ్ళుగా నా ఆలోచనలు, ఊహలు కలబోసుకొన్నది ఆయనతోనే. సాహిత్యరంగంలో నా ఏకైక మిత్రుణ్ణి కోల్పోయాను. ఎందరితో పరిచయాలైనా అందరితో అన్నీ పంచుకోలేము.

నా రచనా వ్యాసంగం ఆయనకు సాకల్యంగా తెలుసు. నేను చేపట్టిన విమర్శ, అనువాదాలు ఆయన సాకూతంగా గమనిస్తూనే ఉన్నారు. చాలా పుస్తకాలు కలిసి చదివే వారం. "exhaust ఐపోతాం, కొన్ని కవితలు చదివే సరికి" అని Borges ను ఆయన చాలా ఇష్టపడే వాడు.

'ఏమి సమీక్షలు, ఏమి scholarship" – Newyork review of books ను మిగుల ప్రశంసించేవారు. సోమవారం సాహిత్య పేజీలను అసహ్యించుకొనే వారు, అర్హత లేని రాతలంటూ.

ప్రాచీన కవిత్వాల ప్రసక్తి వస్తే - తెలుగుకవి మత్తేభ శార్దూలాలకు బలైపోయాడు. ఆటవెలది, సీసం హాయిగా ఉంటాయి. సంస్కృత వృత్తాలు artificial. మన భాషకు అవి సహజం కాదని - ఆయన నిశ్చితాభిప్రాయం. కవాఫి, నెరుడాలను కూడా ఆయన బాగా అభిమానించేవాడు. బ్రాడ్స్కీ, మొంటాలే కవిత్వాల పట్ల పెద్ద ఆసక్తి కనబరచే వారు కాదు. కారణం ఆయనకు కవిత్వంలో ప్రసాదగుణం ఇష్టమనుకొంటాను. abstraction కవిత్వానికి హాని చేస్తుందని ఆయనకు గట్టి నమ్మకం. చివరి రోజుల్లో ఆయన ప్రీతితో పఠిస్తూ వచ్చినవి - జయదేవుని అష్టపదులు, శ్రీకృష్ణ కర్ణామృతం, కాళిదాసు మేఘసందేశం.

అనువాదాలను ఒక పట్టాన ఒప్పుకోరు. ఒకసారి మాటల్లో 'నీ కవిత్వాలకు నీవు చేసుకొన్న అనువాదాలు బాగా వచ్చాయి. కానీ, నీవు చేసిన శ్రీశ్రీ అనువాదాలు కంప్యూటర్ చేసినట్లున్నాయి అని పెదవి విరిచారు. నిక్కచ్చిగా ఉండేవారు అభిప్రాయాల విషయంలో. వేల్చేరు నారాయణరావు అనువాదాలన్నా, చేరా సాహిత్య విమర్శ అన్నా ఆయనకు పరమ ఏవగింపు. scrap అంటూ ఉండేవారు. 'చీరకు, కవిత్వానికి తేడా తెలియని విమర్శకులు' అని వారినుద్దేశించి చెప్పిన మాటలే. అంతేగాక, 'వారిద్దరికీ కవిత్వావగాహన లేదు; సాహిత్యంలో అభిరుచి అంటావా? అదీ శూన్యం కాబట్టి వారెన్నటికీ సీరియస్ కవిత్వాన్ని అర్థం చేసుకోలేరు. నా కవిత్వం వారికి అర్థమవుతుందని నేనెప్పుడూ అనుకోను'. డి. కేశవరావు గారి మీద సదభిప్రాయం ఉండేది. ఆయన అనువాదాలను అమెరికాలో ప్రచురించడానికిగల మార్గాలను అన్వేషించమనేవారు.

కులమతాల ఇరుకుదారులను ఆయన ఏనాడో త్యజించారు (కులాలు, మతాలు కవిత్వంలోకి రావడాన్ని భరించలేకపోయేవారు). మతం విషయంలో ఆయనెంతో ఉదారుడు. చాదస్తం ఆయనలో ఏ కోశానా లేదు. అంగుళమంగుళం ఆధునికుడు. గొప్ప హాస్యప్రియత్వం ఉండేది. శ్రీనాథుడు పాకనాటి వాడయితే నేను వలసపాకనాటివాడిని అని నవ్వేవారు. లచ్చిరాజు వీధిలోని పాతిల్లు

వదిలేశాక ఆయన వలసపాకలో చాలాకాలం ఉన్నారు. నాకింకా ఇప్పటికీ ఆయన కాకినాడలోనే ఏదో ఒక వీధిలో- చంద్రకాంతిలో తాడిచెట్ల నీడలను తదేక దృష్టితో పరిశీలిస్తూ ఉంటారనిపిస్తుంది. వెంటనే, కనిపించేదే వాస్తవమనే వారంటే మొంటాలేలా అసహ్యించుకుంటాను.

'సినారె కవిత్వం రాస్తాడా ?? నాకు తెలియదు'. ఆయనకు అధమంగా రాసేవారి మీద జాలి ఉండేది కాదు. సినారెను కవిరాక్షసునిగా పరిగణించాలనేవారు. (కారణం పాఠకులను పీడించడమే ఆయన చేసిన పాపం) ఎదుటి వారిని అంచనా వేయడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య. శ్రీ శ్రీ, శేషేంద్ర-పెద్ద ఆత్మస్తుతి పరులు, ఉట్టి boasting అన్న ఏహ్యాభావం వారిలో ఉండేది. ఇక గోపీ కవిత్వాలను అధమాతి అధమం అని ఈసడించుకోవడం నా ఎరుకలోనిదే. (కారణం ఎవరైనా concrete గా రాయకపోతే ఆయనకు వళ్ళు మంట.) శివారెడ్డి స్నేహశీలి అని పొగిడినా, ఆయన కవిత్వాన్ని ఎన్నడూ మెచ్చుకోలేదు.

కమ్యూనిస్టులు, మార్క్సిస్టులు, మరి కొందరు కవులు అరబ్ నియంతల్ని వెనకేసుకు రావడాన్ని, వారి అమెరికా వ్యతిరేకతను బాగా ఎద్దేవా చేసేవారు. ఆయనకు ఏదైనా నచ్చకపోతే, పాడుగా వుంది అనడం అలవాటు. జయప్రభ కొత్త పుస్తకం ఎలావుంది అంటే ఇదే సమాధానం వచ్చింది. వేల్చేరు వారి Hibiscus on the lake ఎలా వుంది అన్న దానికి కూడా పై సమాధానమే. పోతే ఆయనకు విన్నకోట రవిశంకర్ అంటే చాలా అభిమానం. అలాగే చక్కగా రాసే చాలామంది యువకవులన్నా కూడా!

విమర్శకునికి, అనువాదకునికి నిజాయితీ చాలా అవసరం అని ఒక వ్యాసంలో రాస్తే 'చాలా correct' అనడం నాకు గుర్తుంది. వర్తమాన సాహిత్యం మీద నా విమర్శలను మొత్తం చదివి 'చక్కగా ఉన్నాయి. ఇక్కడి వాళ్ళకు తెలిసేదెలా?? ఇక్కడికి పత్రికలకు పంపండి' అని సలహా. నా విమర్శలు కఠినంగా ఉన్నాయని అందరూ వాపోతున్నారు అంటే 'విమర్శ నిక్కచ్చిగా ఉండవలసిందే, ఎవరినీ spare చెయ్యకండి' దృఢంగా పలికేది ఆయన గొంతు.

"మన వారు ఉట్టి అరసికులు. కవులకు ఆదరణ లేదు. అవధానాలకు, దసరా పద్యాలకు మాత్రం భారీగా చదివించుకొంటారు"; జనాల అజ్ఞానం మీద విసుగు, చిరాకు. దీనికి తోడు "పుస్తకాల షాపులు మన పుస్తకాలను ప్రదర్శించరు, మరి ఎవరిని చేరతాయి ఈ రాతలు" అన్న సంశయం. ఆయన కవిత్వాలకు ఫ్రెంచి అనువాదాలు వచ్చినప్పుడు చాలా ఆనందంగా నాకు ఉత్తరం రాశారు.

చివరి రోజుల్లో ఆయన ఆరోగ్యం సరిగా ఉండేది కాదు. దానికి తోడు ఇల్లు మారవలసి వచ్చింది, చాలాసార్లు. సకాలంలో ఫోన్ రాలేదు. ఆ మధ్య ఆరోగ్యం కుదుట పడ్డాక, ఆయన రాసిన ఉత్తరం నెమ్మదిగా వచ్చి చేరింది. నేను ఎలాగు ఇంటికి వెళుతున్నాను కదా అని బదులు ఇవ్వలేదు. వినీల్ ఆయన కవిత్వాన్ని internet లో పెట్టిన విషయం ఆయనకు తెలిసిందో లేదో !! నేను ఇండియా బయల్దేర బోయేముందు కూడా ఆయన 'పద్య సమాధి' కవితను, వేల్చేరు వారు అనువాదంలో ఎంతగా పాడు చేశారో విమర్శిస్తూ ఒక వ్యాసం రాశాను. 'పద్యానికి, కవికి అభేదం ఉంది' అంటూ. ఏ


మాత్రం ఊహించలేక పోయాను, నిజమైన 'పద్య సమాధి'లో గులాబి రేకులు చల్లవలసి వస్తుందని. స్మైల్ గారు వెంటవుండి దుఃఖోపశమనం కలిగించారు. కడకు, మహాకవి తల్లి సమాధి పక్కనే విశ్రమించారు.

ఆయనతో అనుబంధాన్ని గుర్తుకు తెచ్చుకోవాలన్నా భయం నాకు, ఆ దుఃఖంలోపడి సుడిలో ఇరుక్కున్న ఆకునైపోతానేమోనని. అంతేకాక, బోర్జెస్‌లా ఆయన దుఃఖాన్ని, దిగులును కుర్రతనపు వికారాలుగా కొట్టివేసేవాడు. అనవరతం ఆనందాన్నే కొనియాడారు తన కవితల్లో. కావున, ఆయన అంతిమయాత్రలో కంటికొసన అశ్రుబిందు మెరవకుండా జాగ్రత్త పడ్డాను. అయినా హృదయానికి తెలుస్తూనే వుంది.. జరగరానిది జరిగిపోయిందని.. గోదావరిలో ఒక పాయ ఇంకిపోయిందని.. ఆయన లేని కాకినాడ  సముద్రహీన.. నన్నాకర్షించదు.

ఆయన సాహిత్య శకటాన్ని ఎక్కడ ఆపారో దాన్ని అక్కడి నుండి కొనసాగించడం తదుపరి కర్తవ్యం. భుజానికెత్తుకోవలసిన. ఇంకొక పని-ఆయన ఎంతో ప్రేమతో, ఓపికతో నెరవేర్చినదే - ఎందరో సదాబాలకుల రాకకు అనుకూలంగా దారిని సుగమం చేయడం. ఆ క్రమంలో ఇది మొదలు!!

**24.12.03**

సుందరయ్య గ్రంథాలయ సంఘ
A C. No 83777
హైదరాబాద్-500 044.



భూషణ్ రచనలు

కవిత్వం : నిశ్శబ్దంలో నీ నవ్వులు
చెల్లెలి గీతాలు

విమర్శ : నేటి కాలపు కవిత్వం తీరుతెన్నులు

కథలు : సముద్రం

అనువాదాలు : నీ చేయి నా చేతిలో

మూర్తం(concrete)గా రాయడం చేతగాక, ప్రక్రియా భేదం ఎరుగక, వస్తువు ఎంపికలోనూ తప్పటడుగులు వేసే మన కవుల స్థాయి ఏపాటిది? కవిత్వావగాహన ఏమాత్రం? ఇటీవల వచ్చిన కవిత్వాల సమీక్ష; మన కవులు పగటి వేషగాళ్ళా? కవిత్వ వివేచనలో సింబాలిస్టులకన్నా శ్రీపాద నయమా?

కొత్త కవులకు కొన్ని సంగతులు: కవిత్వమంటే ఏమిటి? వచనం నుండి కవిత్వాన్ని వేరుచేసే లక్షణాలు; కవి ఏమి చదవాలి? ఎటువంటి అనుభవాలు పొందాలి? ప్రేమకు, కవిత్వానికి గల సంబంధం? దీర్ఘ నిరీక్షణ, తీవ్ర ఘనీభవనం కవిత్వానికి ప్రాణమా? మన కవులెవరూ ఆధునికులు కారా? post modernలకో నూలుపోగు.

అనువాదంలో మెలకువలు: ఏది మంచి అనువాదం? అనువాదంలో చూడవలసిన నాలుగు లక్షణాలు? అందరినీ మించిన అనువాదకుడు ఆదిభట్లా?

విమర్శాదర్శం: నేటి విమర్శకుల్లో ఏమి లోపించింది? విమర్శ వృక్షం కాసినవన్నీ కుక్కమూతి పిందెలేనా? విమర్శ అంటే నంగి చేష్టలు, నత్తి మాటలేనా? పట్టుమని పది భాషల్లో కవిత్వాలను, విమర్శలను సరిగా చదివి సార సంగ్రహణ చేసి సమన్వయ దృష్టి పొందకుండానే విమర్శకులవుతారా?

సినారె 'విశ్వంభర' అధమ రచనా? జయప్రభ కవితల్లో పది శాతం కూడా కవిత్వం కాదా? అఫ్సర్, మహెజబీన్‌లకు కవిత్వం రాయడం ఆక్సిడెంటా? వేల్చేరువారి అనువాదాలది ఎలిమెంటరీ స్కూలు స్థాయా?

ప్రపంచవ్యాప్తంగా వచ్చిన సాహిత్య పరిణామాలతో వర్తమాన కవిత్వాన్ని అనుసంధానిస్తూ - నిర్భయంగా, నిష్కర్షగా నేటి కాలపు కవిత్వం తీరుతెన్నులను కూలంకషంగా విచారించి, విమర్శించి, మార్గదర్శకత్వం వహించే మేటి రచన!